తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో

రసవృత్తి - వాక్యలయ

డా॥ పి.ఎల్.ఎన్. ప్రసాద్

నాగలక్ష్మీ పబ్లిషర్స్
వరంగల్

TALLAPAKA ANNAMACHARYULA
SRINGARA SANKEERTANALLO

RASAVRITTI - VAKYALAYA

by

Dr. P.L.N. PRASAD

First Edition: August, 2007

Copies: 1000

© Author

Price: Rs. 200/-

తిరుమల తిరుపతి దేవస్థానము వారి
ఆర్థిక సహాయముతో ముద్రించబడినది.

Published by:

NAGALAKSHMI PUBLISHERS
405, Sai Towers, Matwada
WARANGAL - 506 002 (A.P.)
Phone: 0870 - 2501637

For copies:

Smt. P. NAGALAKSHMI
405, Sai Towers, Matwada
WARANGAL - 506 002 (A.P.)
Phone: 0870 - 2501637

Printed at

Ashoka Krishna Offset Printers
Warangal
Phone: 0870-2427404

నా జీవిత కావ్యాన్నీ

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో

రసవృత్తి - వాక్యలయ

పరిశోధనా ఫలాన్ని

శ్రీ చరణాలకు

సమర్పిస్తున్నాను

P.V.R.K. PRASAD, I.A.S., (Retd.)
HONORARY ADVISOR
TIRUMALA TIRUPATI DEVASTHANAMS
BALAJI BHAVAN, HIMAYATH NAGAR
HYDERABAD

Date: 07-08-2007

ఆశీర్వచనం

తాళ్ళపాక అన్నమాచార్యులపై పరిశోధన చేయడమంటే, ఆ వేంకటేశ్వర స్వామిపై తపస్సు చేయడమే. ఆ వేంకటేశ్వరుడి లీలలను, అనంతకోటి భక్తి భావ సుమాల్లో పరిమళించిన ఆ స్వామి మాహాత్మ్యాన్ని స్మరించి, పరిశోధన చేయడం ఒక సాహసం. అది చి॥ ప్రసాద్‌కు లభించిన ఒక అపూర్వ వరం.

నేను తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న రోజుల్లో తాళ్ళపాక అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా అనేక సంగీత, సాహిత్య కార్యక్రమాలను ప్రారంభించాను. ముఖ్యంగా పరిశోధనా రంగానికి శ్రీకారం చుట్టాను. ఆ రోజుల్లో ఇంకా అన్నమయ్య సంకీర్తనలు పండితుల చేత పరిష్కరించబడుతూ సంపుటాలుగా ముద్రించబడుతున్నాయి. నా తలపుల్లోని అన్నమయ్యపై పరిశోధనా వ్యాసంగం అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా విశ్వవిద్యాలయాల సహకారంతో అద్భుతంగా ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు తొలినాళ్ళలోనే పరిశోధన చేసి Ph.D. డిగ్రీ పొందిన పరిశోధకుల్లో డా॥ మేడసాని మోహన్ (తాళ్ళపాక అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్) ప్రభృతుల్లో చి॥ ప్రసాద్ కూడా ఉన్నాడు.

నవ విధ భక్తి సంప్రదాయాలు, పంచవిధ భక్తి రూపాలు ఉన్నా అన్నమయ్య నాయికల్లో వారి స్థితి, అనుభవం, జీవ సంస్కారాన్ని బట్టి వారి భక్తి సహస్ర విధాలుగా అభివ్యక్తమయింది. అత్యంత సామాన్యమైన గొల్లెతల నుండి అలమేలు మంగ వరకు ఎందరో నాయికలు ఈ సంకీర్తనల్లో ఎంతో విలక్షణంగా కనిపిస్తారు. ఈ భావ వైవిధ్యాన్నంతటినీ "రసవృత్తి-వాక్యలయ" అనే క్రొత్త పరిశోధనా రీతిలో చి॥ ప్రసాద్ అధ్యయనం చేయడం, Ph.D. డిగ్రీని కాకతీయ విశ్వవిద్యాలయం ద్వారా పొందటం ఎంతో ప్రశంసనీయం.

అన్ని మంత్రములు ఆవహించిన శ్రీ వేంకటేశు మంత్రాలైన అన్నమయ్య సంకీర్తనలని చి॥ ప్రసాద్ నిరంతరం స్మరిస్తూ, అన్వేషిస్తూ, పరిశోధిస్తూ ఆ స్వామి పాదాలకు అంకితమవ్వాలని ఆ శ్రీ వేంకటేశ్వరుడి కరుణా కటాక్షం పొందాలని ఆశీర్వదిస్తున్నాను.

పి వి ఆర్ కె ప్రసాద్
7/8/07

డా॥ జి. వెంకటరత్నం
M.A., M.Litt., Ph.D.
తెలుగుశాఖాధ్యక్షులు (రిటైర్డ్)
సి.కె.యం. పి.జి. కళాశాల, వరంగల్

మంగళ శాసనము

చిరంజీవి ప్రసాద్ నాకు మొదటి పరిశోధక విద్యార్థి. ఆయన ఎన్నుకున్న అంశం ఆనాడు పరిశోధనారంగంలో సాగుతున్న అంశాలకు కొంత భిన్నంగా ఉంటుంది. "అన్నమయ్య శృంగార సంకీర్తనలు - రసవృత్తి - వాక్యలయ" ఇది పరిశోధనాంశం.

మానవుని సమగ్ర అనుభవాల సమాహారమే సాహిత్యం. ఈ చరాచార జగత్తులో వేరు వేరుగా కొలది కొలదిగా కనిపించే జీవన విధానాలే, సాహితీక్షేత్రంలో వేవేల రూపాకృతుల్లో ప్రకాశితమై, ఏకరూపంగా భాసిల్లుతుంటాయి.

అన్నమయ్య సృష్టించిన పదకవితా సామ్రాజ్యంలో ఆనాటి సమాజంలోని పాత్రలు అనేకం కనిపిస్తాయి. అవన్నీ నిత్య జీవితంలో జీవం పోసుకున్న వ్యక్తులకు ప్రతిరూపాలు. గొల్లపడతులు మొదలు యశోదా రుక్మిణుల వరకు గల స్త్రీ పాత్రలు, అక్షరజ్ఞానం లేని సాధారణ భక్తుల నుండి తాత్వికులు, ఋషుల వరకు గల ఎందరో భక్తులు మనకు దర్శనమిస్తారు.

పాత్రలు ఎవరైనా, వారి చిత్తవృత్తులు, మనస్తత్వాలు, హావభావాలు ఎటువంటి వైనా, వారి అంతరాంతరాళాల్లో నిగూఢంగా నిబిడీకృతమై ఉండే భక్తి భావ సందర్శనమే మధురభక్తి. అదే అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో అభివ్యక్తమయింది.

ఆయా పాత్రలు, వారి వారి స్థాయిని బట్టి పొందిన అనుభూతులు, అనుభవాలు వేవేల సందర్శనారూపాలు. వీటి అభివ్యక్తీకరణకు అన్నమయ్య ఎన్నుకొన్న ప్రక్రియ పదకవిత. కవితా ప్రక్రియల్లో అప్పటికిది నవ్యం. అందుకే ఆయన పదకవితా పితామహుడయ్యాడు. విభిన్న పాత్రల వ్యక్తిత్వాలు మనస్తత్వాలు, అంతరంగంలోని హావభావాలు, భక్తి ప్రపత్తులు పద కవితలో వ్యక్తమైన తీరు, వాక్యలయ విన్యాసాల ద్వారా విశ్లేషించే విధానం కూడా ఆనాటికి సాహిత్య పరిశోధనారంగంలో కొంత నవ్యతా లక్షణాలను పులుముకొన్నదే.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో నాయికానాయకుల అంగిక వాచకాది అభినయం ద్వారా అభివ్యక్తమయ్యే సంభోగ శృంగార లక్షణాలు (సురతచిహ్నాలు, శృంగార విందులు, ఉపచార పూజలు మొదలైనవి) అభివ్యక్తమైన తీరు, అదే విధంగా వివిధ విప్రలంభ శృంగార లక్షణాలు అభిలాష, ఉద్వేగాది దశవిధావస్థల విన్యాసం, అలంకార శాస్త్ర మర్యాదలకనుగుణంగా సమన్వయపరుస్తూ సాగిన సిద్ధాంత వ్యాసమిది. ఆయా పాత్రల చిత్తవృత్తులు రసస్థాయిని చేరినప్పుడు వాక్యలయ ద్వారా వాటి అభివ్యక్తిని విశ్లేషించి నిరూపించడం కూడా ఈ సిద్ధాంత వ్యాస లక్ష్యమే.

అన్నమయ్య శృంగార సంకీర్తనలు మృధుమధురమై, రసస్ఫోరకమై, లయాత్మకమై భాసిల్లుతుంటాయి.

అర్థవృత్తులు, రీతుల ద్వారా వ్యక్తమయ్యే రసభావ వ్యక్తీకరణమే ఇక్కడ రసవృత్తిగా చెప్పడం జరిగింది.

సమాహితమైన అక్షరాల ఉచ్చారణలోని ఒకగతి విశేషం, వానిలో ఏకాగ్ర వ్యాప్తిని రూపించే ఒకానొక ధర్మం ఛందస్సుగా భావింపబడుతున్నది. ఆధర్మమే "ఋతము"గా వ్యవహరింపబడింది. దీన్నే ఆంగ్లంలో రిథమ్" అంటున్నారు. దీన్నే సామాన్యార్థంలో మనం వాక్యలయగా భావిస్తున్నాము.

ఉదా: అలరులు గురియగ నాడెనదె
అలకల కులుకుల అలమేలుమంగ
. . . .
కందువ చిరువేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల అలమేలు మంగ

ఈ శృంగార సంకీర్తనం లయాత్మకం. విషయం అలమేలుమంగ ఆట పాటలు. లక్ష్యం తిరువేంకటపతిని ఆకర్షించడం. ఇక్కడ శృంగార నాయిక అయిన అలమేలుమంగ అభినయాత్మకమైన వాక్యలయ ద్వారా శృంగార రసభావాలు అభీవ్యక్తీకరించడం జరిగింది. ఇలా శృంగారనాయిక ప్రదర్శించే విరహం, లజ్జ, క్రోధం, అలుక, మోహం, రతిప్రీతి మొదలైన హావ భావాలన్నీ అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో అభివ్యక్తమైన తీరు మధరాతి మధురం, అనుభవైకవేద్యం. అదే విధంగా నాయకా ప్రస్థానంలో శ్రీవారి దక్షణ నాయకాలక్షణం, అనురాగం, మోహం, వినయం మొదలైన శృంగార రస భావ వ్యక్తీకరణ జరిగిన విధానం కూడా ఈ గ్రంథంలో చర్చించి నిరూపించడం జరిగింది.

అన్నమయ్య భాష - వాక్యనిర్మాణం. ఆయన శృంగార సంకీర్తనల్లో లయాత్మకమై పలు విన్యాసాల్లో కనిపిస్తుంది.

పైన చూపిన ఉదాహరణ "అలరులు గురియగ ఆడినది అలకల కులుకుల అలమేలుమంగ" అనే ఈ వాక్యంలో కర్త అలమేలుమంగ వాక్యం చివరకు వచ్చింది. ఈ కీర్తనలోని అన్ని వాక్యాల్లోను ఇలాగే ఉంది. అయితే అలమేలుమంగ శృంగార రసభావాలు ముందుగానే అభివ్యక్తం కావడం ఇందులోని విశేషం.

నెనిచినగాని మరి నవ్వరాదు
పెనుగులాడినగాని ప్రియము లేదు
సరసమాడినగాని చవిపుట్టదు
మెరవులేకున్నగాని ఇంపుగాదు

అనే విధంగా సాగిన ఈ కీర్తన వాక్య నిర్మాణంలో క్రియ చివరకు వచ్చింది. కర్త ఈ వాక్యాల్లో లేకపోయినా, కర్మద్యోతకమౌతూనే ఉంది. నాయిక ఆంగిక విన్యాసంలో లయ కనిపిస్తుంది. నవ్వు, సిగ్గు, పంతం, కాక, తమి మొదలైన పదాలన్నీ ఇక్కడ నాయిక తీరని కోరికలను వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి వాక్య విన్యాసాలు అన్నమయ్య కీర్తనల్లో బహుముఖాలుగా విస్తరించి ఉండడం మనం గమనించవచ్చును.

పద విన్యాసం:

పొంకముగా నెవ్వతెతో పొందు సేసి వచ్చితివో
జంకెన చూపుల నీకె సాధించీని.

శ్రీవారు ఎవరితోనో పొందు చేసి వచ్చాడు. ఆ లక్షణాలు ఆయనలో కనిపిస్తున్నాయి. ఎందుకని, అది పొంకమైనపొందు? దానికి ప్రతిస్పందన అమ్మవారిలో కనిపిస్తున్నది. ఎలా? జంకెన చూపుల సాధించడం. ఇక్కడ జంకెన చూపుల్లో అమ్మవారి విరహం కోపం అభివ్యక్తమౌతున్నది. ఆ చూపుల తీవ్రత మాటల కందని మధురక్రోధం. అది అనుభవైక వేద్యం.

కడలేని యేరైనా ఁగట్టివేయవచ్చుగాని
వడి నాస మూట గట్ట వచ్చునటవె

అంతులేని ప్రవాహ వేగంతో పారే ఏరుకైనా అడ్డుకట్ట వేయవచ్చు నేమో గాని, విరహతాపం ఆపలేనిది, ఓపలేనిది. అని చెప్పే సందర్భంలో అన్నమయ్య

ప్రయోగించిన పదబంధం "ఆస మూటగట్టుట" అనిర్వచనీయమైన విరహతాపాన్ని అభివ్యక్తం చేస్తున్నది. "ఆస" Abstract. దాన్ని మూటగట్టటమేంటి? అయినా ఈ పదబంధం నాయిక ఆపలేని విరహతాపాన్ని వ్యక్తీకరిస్తున్నది. అది మాటలకందని మధుర వేదన.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో మనకు రకరకాల నాయికలు ప్రత్యక్షమౌతుంటారు. ఆయా పాత్రలకు, ప్రాంతాలకు, తగిన పదప్రయోగాలు, మాండలికాలు, పలుకుబళ్ళు, సామెతలు ఈయన కీర్తనల్లో కోకొల్లలుగా కనిపిస్తాయి. స్థాలీపులాకంగా పైన ఒకటి రెండు మాత్రమే ఉదహరించడం జరిగింది.

ఈ కీర్తనల్లో వచ్చే పాత్రలు (నాయిక నాయకలు) రసస్థితికి లోనైనప్పుడు ప్రదర్శించే హావభావాలు, ఆంగికవాచకాది విన్యాసాల ద్వారా అభివ్యక్తమైన తీరును తీవ్రతను సమన్వయ పూర్వకంగా నిరూపించడం, అందుకు సాధనంగా అమరిన వాక్యలయ విన్యాసాలను సోదాహరణంగా చూపడం అనే కోణాల నుండి అన్నమయ్య శృంగార సంకీర్తనలను అధ్యయనం చేయడమే ఈ సిద్ధాంత వ్యాసంలోని ముఖ్యోద్దేశం.

చిరంజీవి ప్రసాద్ ఈ సిద్ధాంత వ్యాస పథ నిర్దేశంలో తన పరిధి పరిమితులకు లోబడి దీనికి అక్షరరూపం కల్పించి, దశకం దాటిపోయింది. శ్రీవారి కరుణా కటాక్షాల వలన ఇప్పటికైనా ఇది గ్రంధరూపం దాల్చి అందరకూ అందుబాటులోనికి రావడం ఎంతైనా ముదావహం. ఇంతటితో తన పరిశోధనావ్యాసంగాన్ని ఆపక ఇంకా ఇలాంటి గ్రంధాలెన్నో వెలయించాలని ఆశిస్తూ, నిండుగుండె ఆశీస్సులనందిస్తున్నాను. సదా శ్రీవారి మంగళ మహాశ్రీలు నిండుగా ఉండుగాక.

"మంగళమ్ మహత్"

అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలలోని
భక్తి జ్ఞాన వైరాగ్య భావనలను,
జీవాత్మ పరమాత్మల తాదాత్మ్య భావాన్ని
పరిశోధన చేసి ఆవిష్కరించిన
డా॥ పి.ఎల్.ఎన్ ప్రసాద్ కు
ఆశీర్వచనాలు -

బాపు · రమణ

ఉపోద్ఘాతము

'పాఠ్యే గేయేచ మధురమ్' అని రామాయణాన్ని వాల్మీకి మహర్షి వర్ణించాడు. చదువుకోవడానికీ, పాడుకోవడానికీ మధురంగా ఉండేది రామాయణమన్నమాట. ఈ రెండు లక్షణాలూ కలిగిన కావ్యం కాబట్టే రామాయణం ఆలోచనామృతంగానూ, ఆపాత మధురంగానూ నిలిచి జాతి జీవన ధర్మాన్ని అవగాహన చేసుకునే వేళ జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తున్నది. అన్నమయ్య సంకీర్తనల్లోనూ ఇవే లక్షణాలు రూపుదిద్దుకుని తెలుగువారి నోట అయిదు శతాబ్దాలుగా జీవించి, శ్రీ వేంకటేశు మంత్రాలుగా ప్రతిధ్వనిస్తున్నాయి.

"జో అచ్యుతానంద జోజో ముకుందా", "చందమామ రావే, జాబిల్లిరావే" అంటూ పాడని తెలుగు తల్లి లేదంటే అతిశయోక్తి కాదేమో. మరే ఇతర వాగ్గేయకారుల రచనలు ఇంత విస్తృతమైన పరిధిలో వ్యాప్తిని పొంది, ప్రజల నాలుకలపై ధ్వనించ లేదంటే ఆశ్చర్యం లేదు. పండిత పామర రంజకంగా, సంగీత సాహిత్య నృత్య కళల సమ్యక్స్వరూపంగా, భావామృత ధారలుగా జాతిపై ఈ సంకీర్తనలు వర్షించటమే దీనికి ప్రధాన కారణం.

పొత్తపినాటిలో అంటే కడప జిల్లా రాజంపేట తాలూకా సిద్ధవటం మండలాల భూభాగంలో తాళ్ళపాక గ్రామం అన్నమయ్య జన్మక్షేత్రం. నందవరీక బ్రాహ్మణుడు, ఋగ్వేది, అశ్వలాయన సూత్రుడు, భారద్వాజస గోత్రుడు అయిన నారాయణసూరికి, అతని ధర్మపత్ని లక్కమాంబకు శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో బిరుదు గజ్జియల ముప్పిడి కఠారమైన నందకాంశతో వైశాఖమాసం విశాఖా నక్షత్రంతో అన్నమయ్య జన్మించాడు. ఈయన జన్మ సంవత్సరం క్రీ.శ. 1424, దివ్యధామం చేరిన వత్సరం క్రీ.శ. 1503గా డా॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు నిర్ణయించారు. డా. వేటూరి ఆనందమూర్తి గారు తగిన ఆధారాలతో దీనిని బలపరిచారు. అయితే శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు మరికొన్ని ఆధారాలతో అన్నమయ్య జననం క్రీ.శ. 1408 అని నిరూపించారు.

అన్నమయ్య అనునిత్యం పని పాటల్లో ఆట పాటల్లో హరినామాన్ని పాడుతూ, జపిస్తూ చిన్ననాడే తిరిగాడు. కసవు కోసి తెమ్మంటే, వేలు కోసుకున్నాడు. ఆ చిందిన రక్తంలో ఏ రక్త బంధం స్ఫురించిందో. మరే పిలుపు వినిపించిందో, శ్రీవారి భక్త బృందంతో తిరుపతికి ప్రయాణం కట్టాడు. మోకాళ్ళ ముడుపు వద్ద చెప్పుల కాళ్ళతో నడిచి, అలిసి పోయి రాతి బండమీద నిద్ర పోగా, అలమేలుమంగ ప్రత్యక్షమై అలుపు తీర్చి వెళ్ళిపోయిందట. ఆమె ఇచ్చిన ప్రసాదం మూలంగా ఇతడు సంగీత సాహిత్య పారీణుడై అలమేలు మంగపై శతకం ఆశువుగా చెప్పాడు. తరువాత శ్రీవారి దర్శనం చేసుకుని పాపనాశనంలో అవగాహనుడై శ్రీ వేంకటేశ్వరునిపై శతకం చెప్పాడు. స్వామి దర్శనానికి పోగా తలుపులు బిగించి ఉండటంతో ఇంతకు ముందే చెప్పిన శతకంలో పద్యాలు మళ్ళీ చదువగా తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయట. అర్చకులాశ్చర్యపోతారు. స్వామివారి ముత్యాల పేరు అన్నమయ్యపై పడింది. అక్కడి వైఖానసార్చకులు ఆశ్చర్యంతో అన్నమయ్యను స్వామి అపరావతారంగా కీర్తిస్తారు. ఆ వెనుక ఘన విష్ణు యతి అన్నమయ్యను శంఖ చక్రాంకితుడిని చేసి, పంచ సంస్కారాలు కావించి, శరణాగతి ధర్మాన్ని బోధించి, వైష్ణవుడిగా మార్చాడు. ఆ తరువాత తల్లి అన్నమయ్యను వెతుక్కుంటూ వచ్చి ఇంటికి తీసుకుపోతుంది. యుక్త వయస్కుడు కాగానే తల్లి తండ్రులు తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరు కన్యలతో అన్నమయ్య వివాహం జరిపిస్తారు. ఆదివణ్ శఠగోపయతి వద్ద సకల వేదాంత పఠనం పూర్తి చేసుకుంటాడు అన్నమయ్య. శ్రీ వేంకటేశ్వరునిపై పద రచన చేస్తూ అన్నమయ్య ప్రసిద్ధికెక్కాడు. ఇతని బాల్య మిత్రుడు సాళువ నరసింహ రాయలు పెనుగొండలో రాజ్యం చేస్తూ ఉండి, ఇతనిని పిలిపించి, శృంగార పదాలు పాడించుకుని, మురిసిపోయి తన పైన సైతం ఇలాంటి పదాలు చెప్పమని వేడుకొనగా అన్నమయ్య తిరస్కరించాడు. హరినామ స్మరణలో నానిన నాలుక నరాంకితం కాలేదని గట్టిగా చెబుతాడు. దానితో అలిగి రాజు అన్నమయ్యని శృంఖలాబద్ధుడిని చేస్తాడు.

ఆకటి వేళల నలపైన వేళల
తేకువ హరినామమే దిక్కు మరి లేదు (5-100.)

అన్న పదం చెప్పగానే సంకెళ్ళు ఊడిపోగా, అతని మహిమను గుర్తించి పాదాక్రాంతుడవుతాడు రాజు. అన్నమయ్య తిరుమలకు తరలి అక్కడ దినానికొక్క పదం చెబుతూ శ్రీ వేంకటేశ్వరుని అర్చించేవాడు.

అన్నమాచార్యుడు 32 వేల పదాలు రచించినట్లు తెలుస్తున్నది. అవి శృంగార సంకీర్తనలు. అధ్యాత్మ సంకీర్తనలు అని రెండు విధాలు. "సంకీర్తనాచార్యుడనీ" "పద కవితా పితామహుడనీ" ఈయనకు బిరుదులున్నాయి. శృంగార మంజరి, అలమేలుమంగపై చెప్పిన శతకం ప్రకటితం. మరికొన్ని శతకాలు ద్విపద రామాయణం, వేంకటాచల మాహాత్మ్యం, సంకీర్తన లక్షణం (సంస్కృతం) దొరకటం లేదు. ఈ సంకీర్తన లక్షణాన్ని ఈయన మనుమడు చిన తిరుమలాచార్యుడు తెలుగులోకి అనువదించాడు. అన్నమయ్య సంకీర్తనలు తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంకీర్తన భండారంలో భద్ర పరుచబడినాయి.

అన్నమయ్య కవిత్వం మధుర భక్తి రసామృతం. జన వ్యవహారం లోని పలుకుబళ్ళు, మాండలికాలు. సామెతలు, వాడుక భాష, పద బంధాలు సంగీత సాహిత్య రూపకమైన మధురభక్తితో పునీతం చేసి, వేల తెలుగు పలుకు బళ్ళను జొప్పించి, మహోదాత్త భావవాహినులుగా తీర్చిదిద్ది పద కవితా పితామహుడైనాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

అన్నమయ్య సంకీర్తనలు మానవుడి జీవితంలోని సహజత్వానికి ప్రతీకలు. జీవితపు విలువలని యధాతథంగా అన్నమయ్య అనుభవించి అభివ్యక్తీకరించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో సమాజంలోని అన్ని వర్గాలవారూ కనిపిస్తారు. వారి భక్తి కూడా మధురంగానే వారి చిత్త వృత్తిని, సంస్కారాన్ని, ప్రవృత్తిని అనుసరించి అభివ్యక్తం అయింది. స్థాయి ఏదైనా, అభివ్యక్తి ఎలా ఉన్నా భక్తి మాత్రం అచంచలం. స్థితి, సమయం, ప్రదేశం ఆత్మార్పణకు అడ్డంకులు కావనే మనః ప్రవృత్తి ఈ అభివ్యక్తిలో కనిపిస్తుంది. నిత్య జీవితంలో తాను దర్శించిన ఈ భావ వైవిధ్యాన్ని ప్రజల భాషలో అందించిన ప్రజాకవి అన్నమయ్య.

అన్నమయ్య శృంగార సంకీర్తనలు అనంతమైన భావ వైవిధ్యానికీ, అనంత కోటి భక్తి భావనలకు ప్రతీకలు. ఎన్ని రూపాల్లో ఆ ఆనంద నిలయవాసుడిని దర్శిస్తే ఆ స్వామి సగుణుడై అన్ని రూపాలూ ధరించి భక్తులకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాడు. శ్రీవారి దివ్య రూపాన్ని భిన్నమైన వ్యక్తులు భిన్న చిత్త వృత్తుల్లో భిన్న ప్రవృత్తుల్లో సంభావించి తరిస్తున్నారు. ఈ భక్తుల భక్తి భావనలు వారి చిత్తగతిని, సంస్కారాన్ని, ప్రవృత్తిని అనుసరించి అనంతమైన వైవిధ్యంతో అభివ్యక్తం

అవుతున్నాయి. ఈ భిన్నమైన భక్తుల సంస్కారాల, చిత్త వృత్తుల, ప్రవృత్తుల్లో సమాంతరంగా భాసించే ఏకభావం అయిన మధుర భక్తి భావనలను సమగ్రంగా పరిశీలించినప్పుడే భక్త జన హృదయుడైన ఆ బ్రహ్మాండ నాయకుడి దర్శనం కలిగే అవకాశం ఉన్నది. ఇది ఒక సాధనా మార్గం. ఇది ఒక మహా ప్రస్థానం.

మానవుడు నిత్య జీవితంలో అనుభవించే రస భావావేశాల, అహంకార మమకారాల ముసుగులో నుండే ప్రతి అనుభూతిని, తజ్జనిత జ్ఞానంతో భగవంతుడినీ కూడా సంభావిస్తున్నాడు. కాబట్టి వివిధ అవస్థల్లో భిన్న వ్యక్తుల చిత్తగతులను ప్రవృత్తులను వాటిని అభివ్యక్తీకరించే వాక్య నిర్మాణాలనూ సమగ్రంగా పరిశోధించడం అవసరం.

మానవుడు రస స్థితికి లోనయినప్పుడు తన చిత్తాన్నీ, సంస్కారాన్నీ, ప్రవృత్తినీ సహజంగానే ప్రదర్శిస్తాడు. ఈ అభివ్యక్తిని పరిశీలించాలంటే అతడి ఆంగిక వాచికాది విన్యాసాలను, అతడి వాక్య నిర్మాణంలో రూపుకట్టి, చిత్త నిరూపకాలయిన రస నిరూపక వృత్తులను పరిశీలించటం అవసరం.

విశ్వ చైతన్య స్పందనా ప్రతిరూపం అయిన ఋతం వక్త చిత్తగతి లోని నియత స్పందనలో లయగా భాసించి వాక్య నిర్మాణంలో అభివ్యక్తం అవుతుంది. ఈ లయ విన్యాసాలను విచిత్ర గతులను అధ్యయనం చేసినప్పుడే వక్త సంస్కారం, ప్రవృత్తి నిరూపణ కాగలవు. చిత్త నిరూపణకు రస నిరూపక వృత్తులను, సంస్కార ప్రవృత్తుల నిరూపణకు వాక్య నిర్మాణంలోని లయను సాధనాలుగా ఈ సిద్ధాంత వ్యాసంలో స్వీకరించడం జరిగింది. ద్రష్టలు, దృక్పథాలు వేరయినా "దర్శనం" ఒక్కటే అనే విశ్వజనీన సత్యాన్ని మరోసారి మరో కొత్త కోణం నుండి అధ్యయనం చేయటం గ్రంథ లక్ష్యం.

డా॥ పి.ఎల్.ఎన్. ప్రసాద్

కృతజ్ఞతలు

మానవుడి ఆనందాన్ని అభివ్యక్తీకరించడానికి భాషకున్న పరిధి చాలా చిన్నది. దానిని ఇంకా చిన్న పదం కృతజ్ఞతలో నింపి చెప్పటం సంప్రదాయమే అయినా, ఎంతో అసంతృప్తిగానూ ఇంకెంతో చెప్పాలనీ హృదయం కొట్టుకుంటున్నది.

శ్రీవారి కరుణా కటాక్ష వీక్షణంతోనే ఈ గ్రంథం జన్మించింది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు దయతో నాకు స్కాలర్ షిప్ అనుగ్రహించి పరిశోధన చేయడానికి సహకరించారు. ఈ గ్రంథం ముద్రించడానికి ఇరువదివేల రూపాయిల శ్రీవారి ధనాన్ని అనుగ్రహించారు. వారికి కృతజ్ఞతలతో నా గ్రంథం 50 ప్రతులను సమర్పించుకుంటున్నాను. ఈ గ్రంథ ప్రచురణ అనంతరం వచ్చే విమర్శలకు, చట్టరీత్యా తీసుకునే చర్యలకు నేనే బాధ్యత వహిస్తానని తిరుమల తిరుపతి దేవస్థానం వారికి తెలియజేస్తున్నాను.

ఈ "అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో రసవృత్తి - వాక్యలయ" సిద్ధాంత వ్యాసానికి మొదట మౌలిక రూప కల్పన చేసి, రెండు సంవత్సరాలు పర్యవేక్షకులైన కీ॥శే॥ ఆచార్య డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం గారికి, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాదుకు నా కృతజ్ఞతలు.

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఈ పరిశోధనకు ఆనాడు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన కీ॥శే॥ ఆచార్య డా॥ కొత్తపల్లి వీరభద్రరావు గారికి నా కృతజ్ఞతలు.

నా సిద్ధాంత వ్యాసానికి నాతో స్వాధ్యాయం చేస్తూ అక్షర శిల్పియై దీనికి సమగ్రత కల్పించిన సార్థకనాములు పర్యవేక్షకులు డా॥ జి. వేంకటరత్నంగారికి నా కృతజ్ఞతలు.

నా పరిశోధన శీర్షిక చెప్పగానే ఎంతగానో ఆనందించి నన్ను ప్రోత్సహించిన ఆచార్య డా॥ వేటూరి ఆనందమూర్తిగారికి నా కృతజ్ఞతలు.

అన్నమయ్యపై ఆసక్తిని కలుగజేసి, ప్రోత్సహించి ఈ పరిశోధనకు ప్రాణం పోసిన పినతండ్రి శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ I.A.S. (ముఖ్య సలహాదారు. తి.తి.దేవ స్థానం) గారికి నా కృతజ్ఞతలు.

కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాదులో ఇదే శీర్షికతో Ph.D. చేస్తుండగా, ఉదర పోషణార్థం, ఉద్యోగం వలన వరంగల్‌కు రావలసి వచ్చింది. కుంటుపడిన నా పరిశోధనకు ప్రాణం పోసి అదే శీర్షికతో కాకతీయ విశ్వ విద్యాలయంలో పరిశోధనకు అవకాశం ఇచ్చిన కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు నా కృతజ్ఞతలు.

పరిశోధన కుంటుపడిందని విచారిస్తుండగా నన్ను వాత్సల్యంతో ప్రోత్సాహ పరచిన ప్రిన్సిపాల్ శ్రీమతి టి. జయశ్రీ, ఆచార్య డా॥ ఎస్. లక్ష్మణమూర్తి గార్లకు (ఆంగ్లశాఖ కాకతీయ విశ్వవిద్యాలయము) నా కృతజ్ఞతలు.

నాపై భ్రాతృ వాత్సల్యంతో ఈ పరిశోధనకు అవసరమైన సర్వవిషయాలలో ముందుకు నడిపించిన డా॥ హరి శివకుమార్‌గారికి నా కృతజ్ఞతలు.

అడిగిన వెంటనే పరిశోధన చేసుకోవటానికి అనుమతి ఇచ్చిన మా ఆంధ్ర విద్యాభివర్ధనీ జూనియర్ కళాశాల పాలకవర్గానికి నా కృతజ్ఞతలు.

అధికారులైనా ఆత్మీయతతో అన్ని విషయాల్లో అమూల్యమైన సలహాలిచ్చి నన్నెప్పుడూ అన్నివిధాలా ముందుకు నడిపించే డా॥ చందా విజయకుమార్ గారికి (కార్యదర్శి, ఆంధ్ర విద్యాభివర్ధనీ సంఘం) నా కృతజ్ఞతాభివందనాలు

నా తొలి గురువులు తెలుగు సాహిత్యంపై నాకు ఆసక్తిని కలిగించి, నా జీవిత మార్గదర్శకులైన శ్రీ సూర్యనారాయణమూర్తి గారికి నా కృతజ్ఞతలు.

జీవితం అంతా కృషి చేసినా ఋణం తీర్చుకోలేని విధంగా నాకు సర్వ విషయాల్లో గురువై, స్నేహితుడై, సలహాలిస్తూ, మందలిస్తూ వాత్సల్యంతో పరిశోధనలో నన్ను ముందుకు నడిపించిన తోటి తెలుగు ఉపన్యాసకులు శ్రీ వేమూరి శ్రీనివాసమూర్తి గారికి నా కృతజ్ఞతలు.

నా జీవితంలో ప్రతి విషయానికి శుభారంభం చేయించి ముందుకు నడిపించిన మా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ శ్రీ పిరాట్ల బాలసుబ్రహ్మణ్యం గారికి నా కృతజ్ఞతలు.

నా జీవితానికి ఈ పరిశోధనకు స్ఫూర్తిని దీప్తిని కలిగించి ముందుకు నడిపించే మిత్రులు సహోధ్యాపకులు శ్రీ అమరావతి రమేష్‌చంద్ర కుమారవర్మ గారికి నా కృతజ్ఞతలు.

నా గ్రంథ ప్రచురణలో ముద్రా"రాక్షసాల"ను "హరి"యించిన నా సహధ్యాపకులు చి॥ గందె శ్రీనివాస్‌కు, శ్రీ పిన్నింటి కిషన్‌రావు, శ్రీమతి మల్లంపల్లి ఉమకు, ఇంకా నా తోటి సహోధ్యాపకులందరికీ నా ఈ పరిశోధనకు పేరు పేరునా కృతజ్ఞతలు.

పరబ్రహ్మ స్వరూపాన్ని "ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు" అంటూ శివుడిగా, కేశవుడిగా శ్రీ వేంకటేశ్వరుడుగా రమణీయంగా అద్భుత వర్ణాల్లో అందించిన ప్రత్యేకంగా ఆశీర్వచనాలిచ్చిన శ్రీ బాపు, శ్రీ ముళ్ళపూడి వెంకటరమణలకు కృతజ్ఞాతాభి వందనాలు. ప్రత్యేకించి నా కోసమే మొదటిసారిగా హయగ్రీవుడి వర్ణచిత్రాన్ని గీసి అందించిన శ్రీ బాపుగారికి ఋణం ఏమిచ్చి తీర్చుకోను? నా హృదయంలోని హరిభక్తి భావనలే వారికి కృతజ్ఞతలుగా సమర్పిస్తున్నాను.

నాకు దేహాన్ని, జ్ఞానాన్ని ఇచ్చి ఈ గ్రంథానికి, జన్మకు లక్ష్యాన్ని సమగ్రతను కల్పించిన నా తలిదండ్రులు శ్రీమతి పత్రి కృష్ణవేణి, శ్రీగోపాలకృష్ణారావు గారికి నా భక్తి పూర్వకమైన పాదాభివందనాలు.

నాకు ప్రతి విషయములో తోడై నిలిచిన సోదరుడు చి॥ పత్రి వినయకుమార్-చి॥ల॥సౌ॥ ఉమామహేశ్వరిలకు శ్రీవారి మంగళాశాసనాలు.

చిత్తు ప్రతిని వ్రాసి ఇచ్చి నా పరిశోధనకు ప్రేరణను మౌలిక రూపాన్ని ఇచ్చిన చి॥ సుందర్ - చి॥ల॥సౌ॥ పద్మజలకు శ్రీవారి మంగళాశాసనాలు.

ఈ కృషికి ప్రయత్నానికి, ఫలానికి కారణమై మానసిక స్థైర్య ధైర్యాలిచ్చిన నా అర్ధాంగి నాగ'లక్ష్మి'కి శ్రీవారి మంగళాశాసనాలు.

కుమార్తెని, అదృష్టాన్ని, అవకాశాన్ని, అవసరాలను అన్ని వేళలా అందించిన మామగారు శ్రీ తూము అచ్యుతరామారావు, అత్తగారు శ్రీ తూము చూడామణి గారికి నా కృతజ్ఞతలు.

విశ్వచైతన్యంలోని బ్రహ్మజ్ఞానం బ్రహ్మానందంగానే భాసిస్తుంది. అందుకే ఆనందోబ్రహ్మ అన్నారు. ఆ జ్ఞాన పద్మ దేవతామూర్తికి నా వాగర్థాలన్నీ అంకితం చేస్తున్నాను.

ఈ గ్రంథాన్ని సర్వ లక్షణ సుశోభితంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అశోకకృష్ణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ యజమాని శ్రీ నాగుల యుగంధర్ గారికి కృతజ్ఞతలు.

నా ఆలోచన, కృషి ఫలితం సర్వం ఆ శ్రీవారివే. ఈ గ్రంథం ఆ శ్రీ చరణాలకే అర్పిస్తున్నాను.

- డా॥ పి.ఎల్.ఎన్. ప్రసాద్

పేరు : డా॥ పి.ఎల్.ఎన్. ప్రసాద్

తల్లిదండ్రులు : శ్రీమతి కృష్ణవేణి, శ్రీ పత్రి గోపాలకృష్ణరావు

జననం : 8-1-1956

విద్యార్హతలు : M.A. (తెలుగు) 1978 (ఉస్మానియా విశ్వవిద్యాలయం)
M.Phil. (తెలుగు) 1981
"ఉద్యోగపర్వంలో వాక్యలయ" (ఉస్మానియా విశ్వవిద్యాలయం)
Ph.D. (తెలుగు) 1991
"తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో రసవృత్తి - వాక్యలయ" (కాకతీయ విశ్వవిద్యాలయం)

ఉద్యోగ జీవితం : ఆంధ్ర విద్యాభివర్ధనీ జూనియర్ కళాశాలలో ఇరవయినాలుగు సంవత్సరాలుగా ఆంధ్రోపన్యాసకుడిగా సరస్వతీ సేవ.

ఆధ్యాత్మిక జీవితం : సంపాదకుడు 'దివ్యజ్ఞాన దీపిక' : దివ్యజ్ఞాన సమాజ మాసపత్రిక

సాహితీ జీవితం: అనువాదాలు, రచనలు, మీడియా

1. డా॥ అనీబిసెంట్ రచించిన 'A Study in Karma' తెలుగులోకి అనువాదం: 'కర్మాధ్యయనం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
2. డా॥ అనీబిసెంట్ రచించిన 'Theosophic Life'కు తెలుగు అనువాదం: 'దివ్యజ్ఞానోద్దీపిత జీవితం' ప్రచురణ: రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
3. లెడ్‌బీటర్ రచించిన 'A Text Book of Theosophy' కి తెలుగు అనువాదం "దివ్యజ్ఞాన ప్రబోధిని" ప్రచురణ: రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
4. "దివ్యజ్ఞాన బోధామృతం" ప్రచురణ: తెలుగు ఫెడరేషన్ దివ్యజ్ఞాన సమాజం
5. తమాలకృష్ణ గోస్వామి రచించిన ఆంగ్లనాటకం 'Drama of Lord Jagannadha' తెలుగు అనువాదం: "జగన్నాటకం" ఇస్కాన్ (ప్రచురణలో)
6. ఆచార్య చందా కాంతయ్య గారి జీవిత చరిత్ర; ప్రచురణ: ఆంధ్రవిద్యాభివర్ధినీ సంఘం
7. బాపు బాలి చంద్ర బొమ్మలతో తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలపై శీర్షికలు, కథలు, వ్యాసాలు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఉదయం మొదలైన పత్రికల్లో 150కి పైగా వ్యాసాలు, ఆకాశవాణి, టెలివిజన్ ఛానళ్ళలో భిన్న రచనలు.
8. శ్రీ కమలేశ్వర్ రచించిన 'కిత్‌నే పాకిస్తాన్' హిందీ నవలకు తెలుగు అనువాదం: "ఎన్ని యుద్ధాలు" దయావంతితో కలిసి చేసిన హిందీ అనువాద నవల.

విషయసూచిక

1. పదకవిత - పుట్టు పూర్వోత్తరాలు ... 1

2. రసవృత్తి - వాక్యలయ ... 9

3. రసవృత్తి - వాక్యలయ :
అన్నమయ్య సంకీర్తనలకు 'సమన్వయం' ... 19

4. అన్నమయ్య నాయికా ప్రస్థానం ... 51

5. అన్నమయ్య నాయక ప్రస్థానం ... 95

6. అన్నమయ్య సఖీ ప్రస్థానం ... 131

7. వాక్యలయ - భాషాశాస్త్ర రీత్యా పరిశీలన ... 167

8. ఉపసంహారం ... 176

9. అనుబంధం-1 ... 178

10. అనుబంధం-2 ... 180

11. Bibiliography ... 181

పద కవిత - పుట్టు పూర్వోత్తరాలు

1

పద కవిత - పుట్టు పూర్వోత్తరాలు

సృష్ట్యాది నుండి ఎవరు పాడినా ఆ పాటలో సంగీత సాహిత్యాలు కలిసే ప్రవహిస్తున్నాయి. వాక్కును గేయంగా మలిచిన జానపదుల రచనల నుండి స్వర రాగ తాళ లయలతో వివిధ సంగీత సాహిత్య ప్రక్రియలను రూపొందించిన వాగ్గేయకారుల సాహిత్యం వరకు సంగీత సాహిత్యాలు అవినాభావంగా ఉంటూనే, ఒకదాని రక్తిని మరొకటి పెంచాయి.

1.1. పద కవిత - పూర్వపదాలు:

పదాల పుట్టుక ఎక్కడ? ఎప్పుడు? అనే ప్రశ్నలకు స్పష్టమైన ఆధారాలు కనిపించవు. ఆర్తితో భగవంతుడికి ఆత్మార్పణ చేసికొంటూ పాడే చిన్న చిన్న పదాలు అనేక రూపాల్లో అనాదిగా వినిపిస్తున్నాయి. ఇతర భాషల్లో ఉన్నట్లే తెలుగులోనూ అనాదిగా పాటలు రచించిన కవులు, కవయిత్రులు ఎందరో ఉండి ఉంటారనే ఊహ తప్ప, ఉన్నవాటికి కాల ప్రమాణం మనకు తెలియదు.

కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు అన్నమయ్యకు ముందరే పుట్టాయి. అవి గేయ రచనలైనప్పటికీ వాటికి ప్రత్యేకమైన అంగాంగి విభాగం ఉన్నట్టు కనిపించదు. అఖండ గద్య ధారగా మాత్రమే ఇవి నిలిచి ఉన్నాయి. ఆ గానగంధం కూడా మనదాకా రాక ఎప్పుడో అంతరించింది. ప్రాచీన సంగీత లక్షణ గ్రంథాలు చూస్తే ప్రబంధాలనబడే గేయ రచనలు మనదేశంలో అసంఖ్యాకంగా ఉండేవని తెలుస్తుంది. "రాగం", "తాళం", "శబ్దం", "అర్థం", "సందర్భం" మొదలైన వాటిని బట్టి ఆ రచనల్లో ఎన్నో భేదంలేని విభాగాలు అన్నమయ్యకు పూర్వం కనిపిస్తాయి. పదాలు అంటే సుప్రసిద్ధమైన దేశిరాగాలతో, సుగ్రాహ్యమైన లయతో తాళాలలో నిబంధించిన రచనలని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు పేర్కొన్నారు.[1]

పద నిర్వచనాన్ని స్థూలంగా పైవిధంగా చెప్పుకోవచ్చును. కాని అన్నమయ్యకు పూర్వం ఈ పదాల స్వరూప స్వభావాలు ఎలా ఉండేవో తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

1.2. పద కవిత - ఆవిర్భావం:

సాహిత్యాన్ని స్థూలంగా శిష్ట సాహిత్యమూ, శిష్టేతర సాహిత్యమూ అని విభజించుకోవచ్చు. శిష్ట సాహిత్యం కంటే శిష్టేతర సాహిత్యమే ఆదిలో ఆవిర్భవించి వికాసాన్ని పొందింది. కాని శిష్ట సాహిత్యం రాజాదరణకు నోచుకోవడం వలన అధికారం చలాయించింది. శిష్టేతరమూ "జానపదం" అని పిలువబడిన సాహిత్యం ఎంతగా వికసించినా ఆడి పాడుకోవడానికి మాత్రమే ఉపకరించే పదాలుగా వ్యాప్తిని పొందింది. ఈ శిష్టేతర కవితా ప్రవాహం మూడు పాయలుగా ప్రవహిస్తూ వచ్చింది.

మొదటిది. కేవలం జానపద కవిత. ఇది ప్రారంభదశలో మౌఖికంగానే ఉండేది. రెండవది. పాల్కురికి సోమనాథునితో ప్రారంభమైన ద్విపద కవిత. దీనికి మళ్ళీ వ్యాప్తిలో ఉన్న ఏలలు, జోలలు మొదలయిన పదరూపాలే ఆధారం. కాకపోతే సోమనాథుడు ద్విపదని గ్రహించి దానికి కావ్యభాషా ప్రతిపత్తిని కల్పించాడు. మూడవది. తాళ్ళపాక అన్నమాచార్యుడితో ఆరంభమైన సంకీర్తన కవిత. అనాది నుండీ వస్తూ, ఆనాటి సామాన్య ప్రజల్లో ప్రచారంలో ఉన్న జానపద గేయరీతుల్ని గ్రహించి, పద కవితలుగా వెలయించి, పద్య కవితా పీఠం పక్కన "సంకీర్తన" నామకంగా దానికి సరి పీఠం వేసిన ఘనత అన్నమాచార్యుడికే దక్కింది. అంతేగాక "సంకీర్తన లక్షణం" అనే గ్రంథాన్ని సంస్కృత భాషలో రచించి, దీనికి విశిష్టమైన గౌరవ ప్రతిపత్తులను తీసుకొచ్చాడు. ఇది గమనించదగిన విషయం. పద కవిత ఇలా మూడు పాయలుగా ప్రవహించి ఆంధ్రసాహితీ క్షేత్రాన్ని సస్య శ్యామలం చేసింది.

1.3. పద కవిత - నిర్వచనం:

i. సాహిత్య సంబంధి: స్వరతాళ పదాత్మకమైనది "గాంధర్వమనీ" స్వర తాళానుభావకమైన పదమే "వస్తువనీ", అర్థ సహితమైన అక్షరాలతో కూడినది "పదమని" భరతుడు నిర్వచించాడు.[2]

"ఈ పదం నిబద్ధం, అనిబద్ధం అని రెండు విధాలు. అవి మళ్ళీ "అ తాళము", "స తాళము" అనే రెండు భేదాలతో ఉన్నాయని ఆయన వాటిని వివరించాడు."[3]

నియతాక్షర సంబంధం కలిగి ఛందోయతి తోను, తాళం తోను కూడిన పదం నిబద్ధ పదం. యతి పాద నియమాలు లేని అనియతాక్షరమైన పదం అనిబద్ధ పదం."[4]

నిబద్ధ పదాల్లో ప్రధానమైనవి వృత్త పదాలు. ఇవి సమవృత్తాలు, అర్ధ సమవృత్తాలు, విషమ వృత్తాలని మూడు రకాలు. ఉక్త, అత్యుక్త, మధ్య, ప్రతిష్ఠ, గాయత్రి, అనుష్టుప్ మొదలయిన ఇరవయి ఆరు ఛందస్సుల్లో నుండి వృత్తాలను తీసికొని ధ్రువాధ్యాయంలో పదాలుగా భరతుడు లక్షణం చెప్పాడు. "శ్రీ ప్రతిష్ఠ, సుప్రతిష్ఠ, విద్యుద్భ్రాంత" మొదలయినవి రెండు వందల వరకు పదాలను చెప్పి వీటినే ధ్రువపదాలుగా నిర్దేశించాడు. దేశీయ వ్యవహారంలోని దరువు నుండి ధ్రువ పదమనే లక్షణ నామం కాని, ధ్రువ పదం నుండి దరువు అనే వ్యవహారం కాని వచ్చి ఉండవచ్చని ప్రాజ్ఞుల అభిప్రాయం"[5]

1.3. ii. పదం - సంగీత సంబంధి:

సంగీత పరిభాషలో ఈ పదాలకు ప్రబంధాలని పేరు. వీటి లక్షణాలను భరతుడు చెప్పినట్లే మతంగ, శార్ఙ్గదేవులు మొదలు వేంకటముఖి వరకు ఇంచుమించుగా ఒకే విధంగా చెప్పారు.

ఈ ప్రబంధమనే శరీరానికి ఉద్గ్రాహము, మేలాపకము. ధ్రువము, అభోగము అనే నాలుగు అవయవాలుంటాయి. ప్రబంధారంభం ఉద్గ్రాహంతో జరిగి ధ్రువంతో ముగుస్తుంది. మేలాపకం ఉద్గ్రాహ ధ్రువాలను కలుపుతుంది. అభోగము ప్రబంధ రచయిత నామాన్ని కాని, అంకితమిచ్చిన దేవతా నామాన్ని కాని ముద్రగా కలిపిన తుదిభాగం. ఈ ధాతువుల ఏర్పాటును బట్టి ప్రబంధాలు ద్విధాతుకాలు, త్రిధాతుకాలు, చతుర్ధాతుకాలు అని మూడు విధాలు. ఉద్గ్రాహ ధ్రువాలు మాత్రమే ఉండే ప్రబంధాన్ని ద్విధాతుకం అంటారు. త్రిధాతుకంలో ఉద్గ్రాహ అభోగాలు ముద్రతో ఉంటాయి, మేళాపము అంతరి వర్జితం. ఉద్గ్రాహ మేళాపక, ధ్రువ, అభోగాలు, చతుర్ధాతుకంలో ఉంటాయి. స్వరం. బిరుదం, పదం, తేనకం, పాఠం, తాళం అనే ఆరు ప్రబంధానికి అంగాలు. ఈ అంగాలతో రచించిన ప్రబంధాలు సాహిత్య వాసన లేని ప్రత్యేక నాదాత్మకాలు. మరో మూడు విధాలుగా కూడా ఈ ప్రబంధాలను విభజించారు. అళి సంశ్రయాలు, విప్రకీర్ణాలు యేలాదులు

అనే ఎనిమిది మొదటి రకం. వర్ణాదులు ఇరవై నాలుగు రెండవ రకం. శ్రీరంగాదులు ముప్ఫయి ఆరు మూడవ రకం."[6]

1.4. పదాలు - వ్యవహారంలో భేదాలు:

"అసలు తెలుగులో పద్యమంటూ పదమంటూ వేర్పాటే లేదని ఒక విధంగా చెప్పవచ్చును. ఎందుకంటే మనవారి పద్యాలు పదాలు అన్నీ కూడా పాటలే. రచనా రీతిలోని భేదాన్ని బట్టి పదమే పద్యంగా, పద్యమే పదంగా భాసిస్తూ ఉంటుంది. సామాన్యార్థంలో పదాలన్నా, ప్రబంధాలన్నా, ఏలలన్నా పాటలే."[7]

దేశి కవితలో భాగమైన ఈ పదకవితను 'మధుర కవితారీతి' అంటూ లక్షణ దీపికలో పేర్కొన్నారు. నాటకాలంకారాలు, కళికోత్కళికలు, బిరుదావళి, దరువులు, మంగళహారతులు, చందమామ పదాలు మొదలయినవి ఇందులో ఉదాహరించారు."[8]

ఈ ప్రక్రియలన్నిటినీ మధుర కవితగానే పేర్కొంటున్నా అవి పదాలుగానే వ్యవహారంలో ఉన్నాయి. నిజానికి 'పాట పాడు' అనే మాటకు పర్యాయ పదంగా 'పదం పాడు' అనే మాట వ్యాప్తిలో ఉండటం చేత స్థూలంగా ఇవన్నీ పదాలే.

కవికుల గురువయిన కాళిదాసు మేఘదూతంలో 'మద్గోత్రాంకం విరచిత పదం గేయముద్గాతుకామా' అని వివరించారు. అలకా నగరంలో ఉన్న యక్షిణి తన ప్రియుడైన యక్షుడిని గోత్ర నామాలతో సహా గుణ వర్ణన చేసింది. దీనివలన 'గేయము' 'పదము' ఒకటిగానే కాళిదాసు కాలంలో భావించారని మనం అనుకోవచ్చును."[9]

"నన్నయకు పూర్వమున్న పద కవితా స్వరూపం మనకింకా స్పష్టంగా తెలియడం లేదు. తెలుగులో ఉన్న పూర్వపు గేయ రచనలని ఎత్తి చూపినవాడు పాల్కురికి సోమనాథుడు. తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, పర్వతపదాలు, ఆనంద పదాలు, శంకర పదాలు, నివాళి పదాలు, వాలేశు పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు (వీటికి లక్షణం అంతగా తెలియరావడం లేదు) మొదలయిన వాటిని ఆయన పేర్కొన్నాడు."[10]

ఈ పదాలన్నింటి ప్రాథమిక లక్షణం ఒక రకంగా గానయోగ్యత కాబోలనే అభిప్రాయం మనకు స్థిరపడుతుంది. పద్యాలు, పదాలు, కీర్తనలు మొదలయిన

ప్రక్రియలన్నీ అన్నమయ్య నాటికి కలిసిపోయి అవ్యవస్థీకృతంగా ఉన్నాయి. "ప్రాచీనులు ప్రబంధాలనీ, ఏలలనీ పేర్కొన్న పాటలనే తాళ్ళపాక కవులు పదాలన్నారు. వాటినే సంకీర్తనలని వ్యవహరించారు."[11]

తాళ్ళపాక వారి రచనలకు మునుపు ఎలాంటి పాటలు, కీర్తనలు ప్రచారంలో ఉండేవో తెలుసుకోవడానికి ఆధారాలు లేవు.[12] ఆనాటికి గాన యోగ్యత కలిగిన పదము, కీర్తన, కృతి, సంకీర్తన మొదలైనవన్నీ కూడా ఒకదానికొకటి పర్యాయ పదాలుగా వ్యవహారంలో ఉండేవి.

"అనంతర కాలంలో ఈ ప్రక్రియలన్నీ వికాసం పొంది నిజ లక్షణాలతో ప్రకాశించాయి. త్యాగయ్య వంటి వాగ్గేయకారులు రచించిన సంగీత ప్రధానమైన రచనా ప్రక్రియను 'కృతి' అని పిలిచారు. భక్తి ప్రధానంగా ఉండి, సాహిత్యపు రుచి తెలిసే రామదాసు పాటల వంటి రచనలను "కీర్తనలు" అని పిలిచారు. సంగీత సాహిత్యాల కంటే అభినయానికి ప్రాముఖ్యం ఎక్కువ ఇచ్చిన నృత్య ప్రధాన రచనలను జావళీలు అని పిలిచారు."[13]

అన్నమయ్యకు పూర్వం శృంగార సంకీర్తనలు, శృంగార పదాలు, ఆధ్యాత్మిక సంకీర్తనలు, ఆధ్యాత్మిక పదాలు అని కలగాపులగంగా వ్యవహరించారు. తరువాత కాలానికి (ఇంచుమించుగా క్షేత్రయ్య కాలానికి) శృంగార పదమే పదమనీ, ఆధ్యాత్మిక విషయం గల రచనలన్నీ సంకీర్తలనీ, కీర్తనలనీ, గీతాలనీ, కృతులనీ రూఢికెక్కాయి.[14]

1.5. పదం - అన్నమయ్య సృష్టించిన సంకీర్తన:

పదానికి అనేకార్థాలు వ్యవహారంలో ఉన్నప్పటికీ, అన్నమయ్య తన రచనలని సంకీర్తనలుగా చెప్పుకుంటూ, 'సంకీర్తననామక పద సంప్రదాయాన్ని' సృష్టించాడు. ఏ ప్రక్రియకైనా లక్షణ గ్రంథం నిర్మించబడినప్పుడే దానికి సాహిత్యంలో విశిష్టమైన గౌరవం ఏర్పడుతుంది. అన్నమయ్య సంకీర్తననామక పద సంప్రదాయానికి సంస్కృతంలో లక్షణ గ్రంథం వ్రాసి దాని స్థానాన్ని సుస్థిరం చేశాడు.

నన్నయ ఆంధ్రమహాభారతం వ్రాసేనాటికి తెలుగు భాష వ్యవస్థీకృతం కాలేదు. అందుకే ఆయన ముందుగా తెలుగు భాషకు "ఆంధ్ర శబ్ద చింతామణి" అనే లక్షణ గ్రంథం వ్రాసి భాషను వ్యవస్థీకృతం చేశాక భారతాన్ని రచించాడు. ఇంచుమించుగా ఇదే పని అన్నమయ్య పద కవితకు చేశాడు. అనేక సంగీత

సాహిత్య ప్రక్రియలు కలగాపులగంగా కలిసిపోయి ఒకదానికొకటి పర్యాయ పదాలుగా వ్యవహరించబడుతున్న కాలంలో అన్నమయ్య ఈ లక్షణ గ్రంథం సంస్కృతంలో వ్రాశాడు. దీని వలన ఆ నాటికి వ్యవహారంలో ఉన్న పద కవిత అంతా ఒక సమగ్రమైన అవగాహనకు రావడానికి వీలుగా లక్ష్య లక్షణ సమన్వయం చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఆ తరువాత ఆయన సృష్టించిన సంకీర్తననామక పద సంప్రదాయం శాశ్వతంగా నిలబడింది. ఈ లక్షణ గ్రంథాన్ని అన్నమయ్య మనుమడు చినతిరుమలాచార్యుడు తెలుగు చేయటం మన అదృష్టం.

ఆధునికులు ఈ యుగారంభంలో ప్రవేశపెట్టామనుకుంటున్న పాత్రోచిత భాషతో, ముఖ్యంగా మాండలిక పద ప్రయోగాలతో ఈ శృంగార పదాలను అన్నమయ్య రచించాడు. ఈ విధమైన భాష శృంగార పదాలకు అత్యంత అవసరం అని ఆయన నొక్కి మరీ చెప్పాడు.[15]

వృత్త, నిబంధ, అనిబంధ పదాలుగా పద కవితను వివరించి తన లక్షణ గ్రంథంలో లక్ష్యలక్షణ సమన్వాయం చేశాడు అన్నమయ్య.

వృత్త జాతి భేదంతో గల సంకీర్తనల్లో 'దరువులు', 'జక్కుల రేకులు', గొబ్బిళ్ళు, 'భాసుర వాక్యాలు', 'చందమామ పదాలు' మొదలైనవి అన్నమయ్య సంకీర్తనల్లో చాలా ప్రఖ్యాతి వహించాయి. దరువులు, ఏలలు, జయదేవుని అష్టపది పద్ధతిలోని 'పదవిశేషాలు' అన్నమయ్యకు ఎంతో సాహితీ గౌరవాన్ని కలిగించాయి.

వైష్ణవాన్ని, విశిష్టాద్వైతాన్ని, మధుర భక్తిని ఆత్మగా, నాద సుధారసం చిప్పిల్లే సంకీర్తనలను అన్నమయ్య సృష్టించి, సంకీర్తన నామక పద సంప్రదాయాన్ని ప్రపంచానికి అందించాడు.

ఈ పద కవితారీతి అభివ్యక్తం అయ్యేవేళలో ఆంగికాభినయం దేహం. వాచికాభినయం ప్రాణం. నాద సుధారసం ఆత్మ. మధుర భక్తి జీవాత్మ పరమాత్మల తాదాత్మ్య భావాన్ని సూచిస్తున్నది. సంకీర్తననామక పద సంప్రదాయంలో ఈ లక్షణాలన్నీ కలిపి వినూత్న ప్రక్రియగా అన్నమయ్య సృష్టించాడు. ఇది కీర్తన, కృతి, జావళి వంటి సంగీత సాహిత్య ప్రక్రియలకు మౌలిక రూపం. సంగీత సాహిత్య నృత్య కళల సమ్యక్స్వరూపం. శ్రీ వేంకటేశ్వర పాదార్చిత విలక్షణ ప్రసూనం.

పాద సూచికలు:

1. అన్నమాచార్యుల సంకీర్తనలు. తి.తి. ప్రచురణ 4-4-78 పీఠిక. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (తిరుమల తిరుపతి దేవస్థానం)
2. "గాంధర్వం య"న్మయా ప్రోక్తం, స్వరతాళ పదాత్మకమ్
పదం తస్య భవేద్వస్తు స్వర తాళాను భావకమ్
యత్కించి దక్షర కృతం తత్సర్వం పద సంజ్ఞితమ్"
ఆంధ్రవాగ్గేయకార చరిత్రం, పుట. 56, శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు
3. "నిబద్ధం చా నిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్
అ తాళంచ స తాళంచ ద్వి ప్రకారంచ తద్భవేత్
సతాళంచ ధ్రువార్ధేషు నిబద్ధం తచ్చ వైస్మృతమ్"
ఆంధ్రవాగ్గేయ కార చరిత్రం - పుట. 56 శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు
4. నాట్యశాస్త్రము - అధ్యాయం 32. పు. 809 డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు.
5. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము - పుట. 58 శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు
6. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము - పుట. 58 శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు
7. తొలి సంకీర్తన కవులు - పుట. 7 డా॥ వేటూరి ఆనందమూర్తి
8. సింహావలోకనము - పుట. 42 శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి
9. తెలుగులో పద కవిత. త్యాగరాజు : శ్రీ బాలాంత్రపు రజనీ కాంతారావు
10. క్షేత్రయ్య పదాలు పీఠిక. (సంపాదకుడు : శ్రీ విస్సా అప్పారావుగారు)
11. తొలి సంకీర్తన కవులు పు. 9 (డా॥ వేటూరి ఆనందమూర్తి)
12. కర్ణాటక సంగీతంలో అన్నమయ్య స్థానం: 12-5-81, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - శ్రీ మంచాళ జగన్నాథరావు
13. పదములు - క్షేత్రయ్య : భారతి చిత్రభాను ఉగాది 1942-43 శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
14. తొలి సంకీర్తన కవులు - పుట. 6 (డా॥ వేటూరి ఆనందమూర్తి)
15. పదములు శృంగార వధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగాఁ బొంకమెరిగి పలుకగఁ జెల్లున్
పల్లవ నారీ మ్లేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్య నాటకాధిక ఫణితిన్
తెలుగు సంకీర్తన లక్షణము: లక్ష్యలక్షణ సమన్వయము భారతి

రస వృత్తి - వాక్యలయ

2

రసవృత్తి - వాక్యలయ

2.1. రసవృత్తి:

'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః' అని భరతుడు రస నిష్పత్తిని నిర్వచించాడు. అదే విధంగా అనంతర ఆలంకారికులు కూడా రస నిష్పత్తి విషయంలో వారి వారి సిద్ధాంతాలను ప్రతిపాదించారు. విభావానుభావ సంచారీ భావాల మూలంగా రస నిష్పత్తి జరుగుతున్నా, రచనాపరంగా చూసినప్పుడు శబ్ద వృత్తులు, అర్థవృత్తులు, రీతులు మొదలైనవన్నీ కూడా రస నిర్దేశానికి సహకరిస్తాయి.

అన్నమయ్య శృంగార సంకీర్తనలు మృదు మధురమైన, లయాత్మకమైన వాక్య నిర్మాణం కలిగిన పదాలు కాబట్టి అవి అర్థవృత్తులు, రీతులు మొదలైన కవితా గుణాలకు నిలయాలు. అందులన ఆ సంకీర్తనలు ప్రధానంగా వాక్యలయ ఆధారంగా రసభావాదులకు అనుకూలమైన ఆయా పాత్రల చిత్త వృత్తులు, ప్రవృత్తులు, సంస్కారాలను ఏ విధంగా ప్రదర్శిస్తున్నాయో విశ్లేషించడం ప్రస్తుత లక్ష్యం.

అర్థవృత్తులు నాట్యాశ్రయాలు. మరో విధంగా చెప్పాలంటే పాత్రల ఆంగిక విన్యాసాన్ని ఆశ్రయించి రసాన్ని వ్యంజింప చేస్తాయి. అయితే ఈ వృత్తులు అభివ్యక్తీకరించబడటానికి రీతుల సహకారం అవసరం. నిజానికి రీతులను విడచి వృత్తులుండవు. రసస్థాపనకు వృత్తులు ఆంతరంగిక రూపాలైతే. రీతులు బాహ్య స్వరూపాలుగా భాసిస్తుంటాయి. ఈ వృత్తుల సహకారంతో రీతుల ద్వారా వ్యక్తమయ్యే రసభావ అభివ్యక్తీకరణాన్నే ఇక్కడ "రసవృత్తి"గా సంభావించాము.

వివిధ పాత్రల ఆంగిక విన్యాసాల ద్వారా వారి మౌలిక సంస్కారాలను, చిత్తవృత్తులను ప్రవృత్తుల లక్షణాలనూ మనం గుర్తించవచ్చును. దీనికిగాను కవి నిర్మించే లయాత్మకమైన వాక్య నిర్మాణమే మనకాధారమౌతుంది. రసవృత్తిని అనుసరించి ఆయా పాత్రల అంతశ్చైతన్యాన్ని, వాక్యలయని అనుసరించి తత్స్వరూప

స్వభావాలతోబాటు వారి ప్రవృత్తులను, చిత్తవృత్తులను, సంస్కారాలను నిరూపించడమే ఈ గ్రంథ లక్ష్యం.

2.2. వాక్యలయ:

మానవుడిలో అంతర్లీనంగా ప్రవహించే విశ్వచైతన్యం అతడు వివిధ రసభావాలకు లోనయినప్పుడు లయాత్మకంగా వాక్యాశ్రితమై ప్రవహిస్తుంది. ఈ లయవాహిని విన్యాసాలు చిత్ర విచిత్రంగా ఉంటాయి. ఒకే భావం సృష్టిలో ప్రతి మానవుడికి ఒక్కొక్క అనుభవాన్ని ఇస్తుంది. ప్రతి మానవుడు ఒక ప్రత్యేకమైన రసస్థితిని పొందుతున్నప్పుడు దానిని ప్రకటించడంలో తన ప్రవృత్తిని, సంస్కారాన్ని ప్రదర్శిస్తాడు. భిన్న విభిన్నాలైన ప్రవృత్తులు, సంస్కారాలు, చిత్తవృత్తులు కలిగిన వ్యక్తుల్లో ఒకే భావం అనంతమైన రూపాల్లో అభివ్యక్తమౌతుంది. ఒకే భావం సంస్కారాన్ని బట్టి సహస్రాధిక రూపాలు ధరిస్తే దాన్ని అవగాహన చేసికొనడానికి వాక్య నిర్మాణంలోని లయే మనకి ఆధారమౌతుంది.

కావ్య సృష్టికి మూలమైనది ఋతం. అది కవి హృదయ నిష్ఠం. సర్వ వాక్య నిర్మాణానికి మూలం. కవి రసభావావేశాన్ని పొందినప్పుడు ఆ ఋతంలోని చైతన్యం వాక్యరూపంగా ప్రస్ఫుటమౌతుంది. ఆయా రసభావాలశక్తి దీప్తులపైన ఋతాత్మకమైన వాక్య నిర్మాణం ఆధారపడి ఉంటుంది.

వాక్యానికి ఋతం మూలమైతే వాక్యగతికి ఛందస్సు సాధనం. గతిలోని చైతన్యరూపమైన నియత స్పందనను లయగా సంభావించవచ్చును. నిజానికి వాక్యాన్ని జీవింపచేసేది లయ. జీవించడం అంటే అనుభూతిని అభివ్యక్తీకరించడమే. ఋతంభరమైన ప్రాణ చైతన్యం వాక్యంలో లయాన్వితంగానే అభివ్యక్తీకరించ బడుతుంది. గతి బాహ్య చిత్తవృత్తి నిర్దేశకమైతే, లయ ప్రవృత్తి, అంతశ్చైతన్యాల నిరూపకమౌతుంది.

వాక్య నిర్మాణం లోని పదాలు, పదాల్లోని అక్షరాలు, అక్షరాల్లోని స్వర వ్యంజనాలన్నీ కూడా ఛందస్సులో పనిచేసి తీరతాయి. ఈ సర్వాంగాల నడిమి విరామ కాలాల ప్రమాణాలు ఛందో గమనాన్ని నిరూపిస్తాయి. అర్థపరంగా ఛందస్సులో భాసించే ఈ విరామాలు ఛందో ధర్మాన్ని నియమిస్తూ, లయను రూపు దిద్దుతాయి.

వక్త ఉచ్చరించే వాక్యంలో స్ఫుటమయ్యే వర్ణాలే కాక అందులోని విరామం, దాని వలన ఏర్పడే లయాన్వితమైన ప్రవృత్తి, ఆ వాక్యానికి ఒక ఆకృతిని కల్పిస్తుంది. ఇది ఆయా వ్యక్తుల ప్రవృత్తులు, చిత్తవృత్తులు, సంస్కారాలను విశ్లేషించేందుకు ఉపకరిస్తుంది. ఆ ఆకృతిలోని పదాల పొందిక లోని లయే "వాక్యలయ".

2.2.1. లయ - ఉత్పత్తి:

"నాఽ ఛ్ఛందసి వాగుచ్చరతి" అనేది ఆగమ వాక్యం. భరతుడు కూడా ఛందోహీనమైన శబ్దం లేదని శబ్దవర్జితంగా ఛందస్సు ఉండదని పేర్కొన్నాడు.[1]

ఋతంభరమైన (లయాత్మకమైన) అక్షర బంధం 'ఛందం' అని పేర్కొంటూ, సమాహితమైన అక్షరాల ఉచ్చారణలోని ఒక గతి విశేషమును, పూర్వ పరాక్షరాలను ఉత్తరోత్తరాక్షరాలతో యుక్తం చేసి వానిలో ఏకాగ్ర వ్యాప్తిని రూపించే ఒకొనొక ధర్మాన్ని ఛందస్సుగా దర్శించారని, ఆ ధర్మాన్నే యోగభాషలో "ఋతము" అని పిలిచారని డా॥ పాటిబండ మాధవశర్మగారు పేర్కొన్నారు.[2]

భారతీయులు ఋతం అన్నదానినే పాశ్చాత్యులు 'Rhythm' అని పేర్కొన్నారు. ఓమండ్ అనే ఆంగ్ల ఛందోవేత్త Rhythm అనేదాన్ని ఇలా వివరించాడు.

Philosophers have called rhythm as the "Pulse of the Universe." The Greeks said that its sire was God. At all events poetry in common with other arts is wholly and absolutely conditioned by rhythm, this is the breath and law of its being.[3]

దీనిని బట్టి ఋతం లేదా Rhythm విశ్వ చైతన్యానికి మూలాధారమయిదని తెలుస్తున్నది.

విశ్వ చైతన్యానికి మూలాధారమైన ఋతమే సర్వ జగత్తులోని స్పందనకు ప్రేరకం. అనంతమైన విశ్వంలోని చైతన్యం ఆత్మను జాగృతం చేస్తుంది, తద్వారా నాదోత్పత్తి సంభవిస్తుంది. నాదం వలన అక్షరం, అక్షరం చేత పదం, పదం చేత వాక్యం, వాక్యం చేత లోక వ్యవహారం సృష్టించబడటం వలన యావజ్జగత్తు నాదాధీనం అని నిరూపితమౌతున్నది.

ఈ విషయాన్ని నిత్య జీవితంలో శబ్దోచ్చారణలోని నాదం స్ఫుటమైన తరువాతనే అర్థగ్రహణం జరగటం వలన గ్రహించవచ్చును. నాదంలోని లయ

ఉదాత్త, అనుదాత్త స్వరితాలను నియంత్రితం చేస్తుంది. హ్రస్వ, దీర్ఘ, ప్లుతాల పైన శబ్దార్థం, అందులోని లయ వలన తద్వాక్య భావం నిరూపితాలవుతున్నాయి. వేదమంత్రాలన్నీ సుస్వరాలు కావటానికి కారణం ఇదే.

స్వర లయల్లో హెచ్చుతగ్గులు జరిగితే వచ్చే అపార్థాలు మనకు నిత్య జీవితంలోనూ అనుభవైకవేద్యమే. ఈ దృష్టితో సంభావిస్తే ఛందోమయమైన వాక్కుకు ఋతం లేదా Rhythm ఆత్మ. ఛందస్సు గతి. లయ జీవితం. వృత్తి అభినయం. రీతి విన్యాసం. శబ్దార్థాలంకారాలు శోభాతిశయ హేతువులు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నప్పుడు వాక్యంలోని రసాత్మకత ఆనందానుభవ రూపకమైన ఆస్వాదకస్థితి. ఆత్మ చైతన్య రూపమైన ఋతమే ఆనందానుభవాన్ని కల్పించే మౌలిక సంస్కారం. నిజానికి కావ్యానికి, వాక్యానికి రసం, జీవం ఋతమే.

2.2. లయ - నిర్వచనం:

"క్రియానంతర విశ్రాంతి ర్లయః"[4] అని శార్ఙ్గదేవుడు లయను నిర్వచించాడు. ఛందఃపరంగా క్రియ అంటే అక్షరోచ్చారణము. ఉచ్చారణకు కావలసిన కాలం అక్షరోచ్చారణ క్రియతో సమానం కావాలి ఇదే తాళము. ఈ తాళం నడుమ నడిచే కాలమే 'లయ' అని సంగీత రత్నాకరం చెబుతున్నది.[5]

పై నిర్వచనంలోని తాత్పర్యమే పాశ్చాత్యుల అభిప్రాయంలో కూడా కనిపిస్తుంది.

Metrical effect produced in verse, prose, music or motion by the relation in quality stereo time or energy between the syllables, words, notes or movements that succeed each other.[6]

'పద్యంలోని కాని, గద్యంలో కాని, సంగీతంలోని కాని, గతిలో కాని, ఊనిలో కాని, అక్షరాల పదాల మధ్య నియంత్రితమైన విరామంలో కాని నియమితమైన నడకలో కాని ఈ లయ భాసిస్తుందని' ఈ నిర్వచనం తాత్పర్యంగా భావించవచ్చును.

ఈ లయ ప్రళయ ప్రభంజనంలోను, పిల్లగాలిలోను, పసిపాప రోదనంలోను, రైలింజను చప్పుడులోను, కొండపడుచు కూనిరాగాల్లోను, చరాచర జగత్తంతా అభివ్యాప్తమై ఉంటుంది.

2.2.3. లయ - పాశ్చాత్య దృక్పథం:

"Rhythm comes from a Greek word meaning flow. And, as one of the most celebrated of 'Heraclitus aphorisms remind us, 'All things flow', Rhythm is all around us, natural and man made. Tides ebb and flow, the moon wayes and wanes, spring, Summer, Autumn, Winter flow in a regular order. Night succeeds day. With in our bodies heart, lung and work rhythmatically."[7]

The textures of expectations, satisfactions, disappointments, surprises, which the sequences of syllables bring about is rhythm. And the sound of words come to its full power only through rhythm.[8]

విశ్వ చైతన్య రూపమై ప్రకృతిలో ప్రవహించే లయను గ్రీకులు గత్యర్థం (flow) గా సూచించారు.

ఎగసిపడే కెరటాల్లోను, ఎగిరే పక్షుల్లో, ఋతుక్రమంలోను, సూర్యోదయ సూర్యాస్తమయాల్లోను, సకల జీవరాశుల్లోను, చివరికి మనిషి గుండె చప్పుడులో కూడా ఈ లయను మనం చూడవచ్చని నిర్వచించారు.

ఐ.ఏ. రిచర్డ్స్ జీవితంలోని లయని వ్యాఖ్యానిస్తూ మానవుడు జీవితంలో పొందే ఆశలు, నిరాశలు, అనుభవాలు, అనుభూతుల అమరికలోనే లయ ఇమిడి ఉన్నదని, తత్ప్రకటనలోని శబ్దాలకు నిజమైన అర్థం ఈ లయ ద్వారానే ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

2.2.4. లయ స్వరూప స్వభావాలు - పాశ్చాత్య సిద్ధాంతాలు:

లయ స్వరూప స్వభావాలను వివరిస్తూ పాశ్చాత్య ఛందోవేత్తల అభిప్రాయాల్లో ప్రధానమైన నాలుగింటిని నార్టన్ టెంపెస్ట్ ఇలా వివరించారు.

1. The 'Quantivists' believe that speech rhythm is based on the relationship of syllabic quantities i.e., that the time durations of certain syllables are long and of others short by nature or position and that although stress may be super imposed. English verse is primarily based on a regular recurrance and pattern formation of these quantities.[9]

క్వాంటి విస్టులు (పరిమాణవాదులు) 'గురు లఘువుల పరిమాణాన్ని అనుసరించి లయ అమరుతుందని' అన్నారు. అంటే గణంలోని గురు లఘువుల దైర్ఘ్యత మీద లయ ఆధారపడి ఉన్నదని భావించవచ్చును.

ఇందులో రెండు చికాకులున్నాయి. మొదటిది. గురు లఘువులు సందర్భాన్ని అనుసరించి మారిపోతూ ఉంటాయి. ఈ సందర్భాన్ని అర్థం చేసికొనకపోతే వ్యతిరేకమైన అర్థం స్ఫురించే ప్రమాదం ఉన్నది. రెండవది. దీర్ఘాక్షరం (long syllable) ఎంత దీర్ఘంగా ఉన్నదో సందర్భాన్ని అనుసరించి కాని చెప్పలేము. 'అమ్మా' అనే పిలుపు పసిబాలుడి పిలుపు కావచ్చును. మృత్యు ముఖంలోని ప్రాణభయార్తుడిది కూడా కావచ్చును. స్వర దీర్ఘతను అనుసరించి లయ మారుతూ ఉంటుంది.

2. The Manifestation of rhythm in music and verse is the same and obeys common laws. They agree with the 'Quantivists' that the duration is the primary element of rhythm but direct their attention to duration of feet rather than of syllables. Like bars in music, feet in verse are to be equal in duration and syllable grouping is to be effected accordingly.[10]

సిడ్నీ లేనియర్ చేత ప్రతిపాదించబడిన ఈ అభిప్రాయం ఇంచుమించుగా పరిమాణవాదుల అభిప్రాయంతో ఏకీభవిస్తుంది. కాని సిడ్నీ లేనియర్ "సంగీతంలోను, కవిత్వంలోను, ముఖ్యంగా పద్య రచనలో లయ అంతర్లీనమై ఉంటుందని, సంగీత సాహిత్యాల మౌలికమైన లక్షణం లయ" అనీ అభిప్రాయపడ్డాడు. గురు లఘువుల స్వరూపంపై కాక, (Syllable) గణ విభజనను బట్టి గణంలోని గురు లఘువుల పొందికను అనుసరించి లయ రూపు దిద్దుకుంటుందని భావించాడు.

పద్యరచనలో భావానికి అనుగుణంగా గురు లఘువులు కాకుండా ఒక్కొక్క గణమే ప్రాధాన్యం వహించడం విశేషం.

3. 'Sectionalist's theory differs fundamentally from those described above. It is usually associated with "Edwin Guest" who abondons scansion by feet and substitutes a division by sections similar to that obtaining in Old English Literature verse. The sections are determined by the Stress.[11]

సెక్షనలిస్టుల సిద్ధాంతకర్త ఎడ్విన్ గెస్ట్ గణ విభజనతో నిమిత్తం లేకుండా ఊనిక (Stress) ను అనుసరించి లయ సాధించబడుతుందని అన్నారు. అంతేకాక పదాలు కూడా ఆవృతి చెందటం విశేషం.

వృత్త్యనుప్రాసతో కూడిన రచనను దీనికి ఉదాహరణగా తీసుకొనవచ్చును.

సిద్ధాంతపరమైన ఈ వాదాల్లోనే గాక మరికొన్ని విధాలుగా కూడా లయను పరిశీలించవచ్చని టెంపెస్ట్ అభిప్రాయ పడ్డారు.

4. ". . . .etc., It is very doubtful whether this series can be recognised as being rhythmatical. It can be organised as rhythmical by the mind, but the result will be entirely subjective, it will not be influenced in any way by the series.[12]

ఈ నిర్వచనం వస్త్వాశ్రితమైన లయను సూచిస్తున్నది. ఇంతవరకు ఆత్మాశ్రితమైన లయ చర్చించబడింది. వస్తుగతమైన ఈ లయ దర్శించేవారి దృక్పథం మీద ఆధారపడి కనిపిస్తుంది. లయను చూడగలిగితే ఉంటుంది. లేకపోతే లేదు. గడియారం సవ్వడిలో లయను చూడగలగటం ఆత్మాశ్రయత్వాన్ని సూచిస్తున్నా, ఈ లయ భౌతికంగా వస్తువును ఆశ్రయించి ఉండటం వలన వస్త్వాశ్రయ లయగా భావించక తప్పదు.

పాశ్చాత్యుల సిద్ధాంతాల్లో కొన్ని ఈ విధంగా లయను స్థూలంగా దర్శింపచేస్తున్నాయి.

2.2.5. వాక్యలయ స్థానాల నిర్ధారణ:

ప్రాచ్య పాశ్చాత్య నిర్వచనాలననుసరించి లయ స్వరూపం స్థూలంగా ఇంతవరకు నిర్ధారించడం జరిగింది. వాక్య నిర్మాణంలోని లయని నిర్ధారించడానికి లయ స్థానాలను కొన్నింటిని నిర్దేశించుకుని, తద్వారా భిన్న వ్యక్తుల చిత్త వృత్తులను, ప్రవృత్తులను పరిశీలించటం ప్రస్తుత లక్ష్యం.

1. **గురు లఘువుల దైర్ఘ్యత:** సందర్భాన్ని అనుసరించి పదంలో గురు లఘువుల్లో దేనికి ఎంత దైర్ఘ్యత ఉన్నదో, దేనికి ప్రాధాన్యం అధికమో గుర్తించి తద్వారా భావ నిరూపణ.

2. గురు లఘువుల కూర్పు: గురు లఘువులను కూర్చటం వలన పదం సృష్టించబడి, వాక్యంలోని ప్రతి పదానికి ప్రాధాన్యం కనిపించటం, తద్వారా భావ నిరూపణ. సన్నివేశంలోను చిత్తవృత్తిలోను వేగం, ఆవేశం దీని వలన స్ఫురిస్తాయి.

3. ఊనిక: వాక్యంలోని ఏ పదంపైన, వర్ణం పైన ఊనిక ఉన్నదో గుర్తించి తద్వారా భావ నిరూపణ.

4. నియమితమైన నడక: వాక్యంలో పద నిర్మాణ క్రమం పాటించబడి నిర్ణీత స్థానంలో విరిగి, ఒక గతిని సూచిస్తుంది. తద్వారా భావ నిరూపణ.

5. నియంత్రితమైన విరామం: పదానికి పదానికి, వాక్యానికి వాక్యానికి మధ్య ఉండే విరామం వలన అర్థ స్ఫురణలో ఏర్పడే వైచిత్రి నిరూపణ.

6. సమతుల్యత: వాక్యంలో పూర్వ ఉత్తర భాగాలుగా సమానంగా పదాలు విరగడం. అందులో భావానికి అనుకూలంగా సమానమైన బరువుతో పదాలు ప్రయోగించబడి ఒక సమతుల్యతని ఆ పదాలు స్ఫురింపచేయడం, తద్వారా భావ నిరూపణ.

7. ప్రశ్నార్థక వాక్య లయ: సందేహార్థకంలో మాత్రమే ఉపయోగించే ప్రశ్నను భిన్న చిత్తవృత్తుల భావాల నిరూపణకు ప్రయోగించటం, తద్వారా భాసించే అర్థ వైచిత్రి.

8. పదాల పునరుక్తి: పదాలు పునరుక్తితో ప్రయోగించబడినప్పుడు వక్తల చిత్తవృత్తిలోని భావ వైవిధ్య నిరూపణ.

9. విశేష పదాలు: అవ్యయాలు, కొసమెరుపుతో నిశ్చయాత్మకతను సూచించే విశేష పదాలు అనేకం భాషలో కనిపిస్తాయి. "చెల్లు, గాక, వచ్చు, కాని, తగు" వంటి పదాలను భిన్న అర్థాలను స్ఫురింప చేయడానికి, వక్త చిత్త వృత్తిని ప్రవృత్తిని రూపు కట్టించడానికి లయాత్మకంగా కవి ప్రయోగించటం జరుగుతుంది. ఆయా పదాలు వాక్యంలో ప్రయోగించబడిన తీరే వాక్యలయ.

10. పద నిర్మాణం: ఉద్దిష్టార్థ బోధకు పద రచనలో పద నిర్మాణ క్రమం పాటించబడి ప్రాధాన్యాన్ని స్ఫురింప చేయటం.

లయ ఈ రూపాల్లోనే కాక అనంతమైన రూపాల్లో అభివ్యక్తం అవుతుంది. ఈ సిద్ధాంత వ్యాసంలో భిన్న వ్యక్తుల సంస్కారాలను, ప్రవృత్తులను చిత్తవృత్తులను విశ్లేషించడానికి పైన వివరించిన నిర్దేశించిన, విధంగా వాక్యలయని సాధనంగా స్వీకరించటం జరిగింది.

పాద సూచికలు:

1. ఛందోహీన న శబ్దోஉస్తి
   నచ్ఛందః శబ్ద వర్జితమ్
   ఏవం తూభయ సంయోగో
   నాట్య స్యోద్యోతకః స్మృతః (నాట్య శాస్త్రం)
   డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు అధ్యాయం. 14
2. ఆంధ్ర మహాభారతము ఛందః శిల్పము - డా॥ పాటిబండ మాధవశర్మ
3. A Study of Metre - T. S. Omond P. 6
4. సంగీత రత్నాకరం - శార్ఙదేవుడు
5. "తాళాంత రాళ వర్తియః కాలఽలో సాలయ నామకః (దుత మధ్య విలంబాశ్చ భవేయు స్త్రివిధాలయః (సంగీత రత్నాకరం) శార్ఙజ దేవుడు)
6. Oxford Dictionary
7. Practical English Prosody : Bernard Black Stone P. 1
8. Principles of Literary Criticism : I.A. Richards P. 137
9. The Rhythm of English Prose : P. 4 Norton R. Tempest
10. The Rhythm of English Prose : P. 4 Norton R. Tempest
11. The Rhythm of English Prose : P. 5 Norton R. Tempest
12. The Rhythm of English Prose : P. 5 Norton R. Tempest

రస వృత్తి - వాక్యలయ :

అన్నమయ్య సంకీర్తనలకు 'సమన్వయం'

3

రసవృత్తి - వాక్యలయ: అన్నమయ్య సంకీర్తనలకు 'సమన్వయం'

రస నిర్దేశానికి లేదా రస ప్రకటనకు యోగ్యమైనవి వృత్తులు. నాట్యాశ్రయాలైన కైశికి, ఆరభటి, సాత్త్వతి అనే వృత్తులు ఈ రస నిర్దేశానికి దోహదకారులు. రీతులు రచనాశ్రయాలు. రసాన్ని వ్యంజింప చేయడానికి వృత్తులకు ఇవి సహకరిస్తాయి. పాత్రల ఆంగిక విన్యాసం ద్వారా వృత్తులు, వాచికాభినయం ద్వారా రీతులు రస స్ఫూర్తికి సహకరిస్తాయి. వృత్తులు అర్థాశ్రయాలు. అంటే రసానుకూల నాయికా నాయక వ్యాపారాలు లేదా రసానుకూల వస్తువులు. కాబట్టి వీటిని సాక్షాత్తు రసోపస్కారాలుగా పేర్కొన్నారు. రీతులు వృత్తులను వ్యక్తం చేయడం వలన ఇవి కూడా పరంపరగా రసోపస్కారాలు.[1]

భరతుడి మతంలో కైశికి, ఆరభటి, సాత్వతి మూడే అర్థవృత్తులు. ఇక్కడ అర్థం అంటే రసము లేదా రసానుకూల విషయము.[2]

ఇవి గాక శబ్దవృత్తులు కూడా రసోపస్కారాలే. ఇందులో కైశికి, అక్కడక్కడా సాత్త్వతి, క్వాచిత్కంగా ఆరభటి వృత్తులు కనిపిస్తాయి. అందుకనే ఇక్కడ లక్ష్య లక్షణ నిరూపణ అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో ప్రధానంకాగా, ఆ మూడు శబ్ద అర్థ వృత్తులను, తదనుకూలమైన రీతులను మాత్రమే స్వీకరించడం జరిగింది.

1. కైశికీ వృత్తి:

శృంగార రసానికి అనుకూలమైన నాయికా నాయకుల వ్యాపారాలు, మలయానిలం, పండు వెన్నెల, పుష్పోద్యానవనాలు మొదలైన కోమలమైన భావ వర్ణనంతో కూడినది కైశికీ వృత్తి.[3] కోమల భావాన్ని ధ్వనింపచేసే కరుణ రసం కూడా ఈ వృత్తిలో చక్కగా భాసిస్తుంది. ఇటువంటి శృంగార కరుణ రసాలు కైశికీ వృత్తిలో అభివ్యక్తం కావటానికి కోమల పదరచనా భరితమైన వైదర్భీ రీతి అవసరం. అన్నమయ్య శృంగార సంకీర్తనలన్నీ ఈ కోవకు చెందినవే.

రాగం: శంకరాభరణం

అలరులు గురియగ నాడెనదే
అలకల గులుకుల నలమేలుమంగ ॥పల్లవి॥

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెర మఱగున నాడెనదే
వరసగ పూర్వదు వాళపు తిరుపుల
హరి కరిగింపుచు నలమేలు మంగ ॥అలరు॥

మట్టపు మలపుల మట్టెల కెలకుల
తట్టెడి నడపుల దాటినదే
పెట్టిన వజ్రపు డెందపు దళుకులు
అట్టిటు చిమ్ముచు నలమేలు మంగ ॥అలరు॥

చిందుల పాటలు శిరిపొలయాటలు
అందెల మ్రోతల నాడెనదే
కందువ తిరువేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేలుమంగ ॥అలరు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం12, పుట17, సంకీర్తన 24)

ఈ సంకీర్తనలో నాయిక (అలమేలుమంగ) అభినయం ద్వారా తన కోమలమైన శృంగార భావాన్ని వ్యక్తీకరిస్తున్నది. నాయిక ప్రదర్శిస్తున్న అప్పటి నాట్యం కైశికీ వృత్తి. అలమేలు మంగ ఇద్దరు చెలులు తెర పట్టుకోగా, ఆ అరతెర మరగున జడను తిప్పుతూ, అలరులు కురుస్తుండగా, అరవిరి సొబగులతో రమణీయంగా మనకు దర్శనమిస్తుంది. "తెర అలమేలు మంగ నడుము దగ్గరకు దిగిపోగానే ఆమె శరీరంపై భాగంలోని ఒయ్యారాలు, అందచందాలు కనబడేలా నాట్యం చేస్తుంది.[4]

అరవిరి సొబగుల్లో, దువాళపు తిరుపుల్లో, మేని విరుపుల్లో తన అందాన్ని కామ జనక కళాస్థానాలను ఎంతో చాతుర్యంగా తన అభినయం ద్వారా సూచిస్తున్నది. ఈ అభినయం ద్వారా హరిని కరిగించాలనే ఆమె చిత్తవృత్తి కనిపిస్తుంది.

రెండవ చరణంలో లయాత్మకమైన పద విన్యాసం ద్వారా నాట్యంలో వేగం పెరిగింది. "మట్టపు మలపుల్లో, మట్టెల సవ్వడిలో, వజ్రపు తళుకులను అట్టిటు చిమ్మడంలోని" ధ్వనుల్లో శ్రీవారి హృదయాన్ని ఝల్లుమనిపించాలనే కాంక్ష ధ్వనిస్తుంది.

నాట్య భంగిమలు, ముద్రలు, చేష్టల్లో ఆమె తన కోరికను ఇంత వరకు వ్యక్త పరిచింది. వ్యంగ్యంగా ఇంత వరకూ వ్యక్తమయిన కోరికను వాచ్యం చేస్తూ చిందుల పాటల్లో, పొలయాటల్లో, అందెల మ్రోతల్లో రత్యాహ్వానాన్ని సూచిస్తూ ఆమె శృంగార రసభావశబలతని రూపు కట్టించింది.

అరచాటు అందాలు చూపించి, ఆ తరువాత నాట్య విన్యాసంలో సౌందర్యపు తళుకులను చూపించి, గుండె ఝల్లుమనిపించి, పాటలు పాడి, అందెల మ్రోతలతో రత్యాహ్వానాన్ని సూచిస్తున్నదా నాయిక. ఈమె తన సౌందర్యాన్ని కోరికను వ్యక్తం చేయడంలో ఈ విధమైన పరిణామ క్రమాన్ని పాటించింది. పై ఆంగిక విన్యాసాన్ని మట్టెల అందెల సవ్వడులను, పాటలను సూచించే వాక్య నిర్మాణం మృదు మధుర పదాలతో కూడిన వైదర్భీ రీతిలో సాగింది. లయాత్మకమైన ఈ చరణాల్లోను, ప్రదర్శించిన నాట్యంలోను ఆమె హరిని కరిగించాలనే కోరికని, రత్యాహ్వానాన్ని, మధుర భక్తిని మనం దర్శించవచ్చును.

ఈ లయాత్మకత నాట్య విన్యాసంలోను పదాల నడకలో కనిపిస్తుంది. పల్లవి నుంచి రెండు చరణాలు అయిపోయే దాకా ఒకటి రెండు తప్ప అన్ని అక్షరాలు లఘువులే. ప్రతి సొగసును వర్ణించే ప్రతి చిన్న పదం ఎక్కడికక్కడ విరిగిపోతూ వాక్యానికి, నాట్యానికి గమనాన్ని నిరూపిస్తుంది. హ్రస్వాక్షరాల మధ్య విరామం తగ్గి ఏర్పడిన లయ వలన పద గతిలో, నాట్య గమనంలో వేగం స్ఫురిస్తుంది.

ఈ విధంగా ఈ సంకీర్తనలోని లఘ్వక్షర పద రచన, "దాటినదే", "ఆడెనదే" అనే చోట్ల పదాన్ని విరిచి, పాటించిన సమయ పరిణామం వల్ల సాధించిన లయ ద్వారా ఆ నాయిక చిత్తవృత్తిలోని ఉద్వేగాన్ని, కోరికను అన్నమయ్య వ్యంజింపచేశాడు.

2. ఆరభటీ వృత్తి:

ఉద్ధతార్థంలో హృదయోద్రేకాన్ని లేక చిత్త దీప్తిని కలిగించే యుద్ధాది ఘట్టాల వర్ణన ఆరభటీ వృత్తి. ఈ భావాలను వ్యక్తం చేసే పదరీతి గౌడి. ఇది

పరుషాక్షర పద రచనతో కూడి దీర్ఘ సమాస భూయిష్ఠంగా వుంటుంది. రౌద్ర బీభత్స రసాల వ్యక్తీకరణలో ఆరభటీ వృత్తి, గౌడీ రీతుల్లో నిర్మించబడిన వాక్యం రమ్యంగా రూపుదిద్దుకొంటుంది.

అన్నమయ్య రచనల్లో ఈ విధమైన సంకీర్తనలు అరుదుగా కనిపిస్తాయి. వీర, రౌద్ర, భయానక బీభత్స రసాల్లో నృసింహుని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

రాగం: సారంగనాట

శరణని బ్రదుకరో జనులార
గరిమ మెరసె నిదె కనక సింహము ॥పల్లవి॥

అహరహమును బ్రహ్లాదుడు దొరకొని
బహువిధముల హరిమహిమలు వొగడగ
కహకహ హిరణ్యకసిపుడు నగిహరి
సహజమేది యని చఱచె గంభము॥శరణని॥

అటమరి పెట పెటమని బేంట్లెగసి
చిటచిట రవములఁ జిరుత పొగలెగిసి
తట తట మనుచు తరలి వ్రయ్యలై
పట పట మనుచును పగిలెఁ గంభము ॥శరణని॥

బెడిదపు చూపుల మిడుగురులెగయగ
పుడమి యదర నూర్పులు చెలగ
గడ గడఁ వడఁకి దిక్తటములల్లాడఁగ
వెడలెఁ గంభమున విజయ సింహము ॥శరణని॥

నగవుల సుడివడె నభోంతరంబులు
పొగలెగసెను పెనుబొమ ముళ్ళ
పగటు నార్పులను పగిలెను గొండలు
వెగటున వెడలెను వీర సింహము ॥శరణని॥

తెఱచిన నోరఁ బ్రతిధ్వను లెసఁగగ
కఱకు గతుల చుక్కలు చెదర

నెఱి హుంకృతులను నిఖిలము బెదరంగ
వెఱ చఱవఁ గెరలె విమల సింహము ॥శరణని॥

పటు విహారముల బ్రహ్మాండ మగల
గుట గుట రవళి నాకులు వొగడ
నిటల నేత్రమున నెఱ మంట లడర
పటు గతి మెరసెను భయద సింహము ॥శరణని॥

పెద పెద కోఱల పిడుగులు రాలగ
తుద నఖముల నెత్తురు దొరుగ
గుదికొను కసరుల కులగిరి లూఁటాడ
వుదయించె నదివో వుగ్ర సింహము ॥శరణని॥

అట్టహాసమున నసురులు వారఁగ
ముట్టి వాయువులు మొగ తిరుగ
దట్టములై జలధరములు ముసరఁగ
దిట్టయై వెడలె ధీర సింహము ॥శరణని॥

జలధులు గలఁగెను జడిసె లోకములు
తలఁకె సప్త పాతాళములు
పులికి పడదొడఁగె నూర్ధ్వ లోకములు
కొలువున నిలిచెను ఘోర సింహము ॥శరణని॥

అచ్చట హిరణ్యు నదరంట బట్టి
యిచ్చల దొడపై నిడి చించి
కుచ్చి వాని పేగులు జంద్యములుగ
ఎచ్చి వేసుకొనె విష్ణు సింహము ॥శరణని॥

పొగడిరి దివిజుల భువనములు వెలసె
వగయుడిగి చెలగె బ్రహ్లాదుడు
మిగులు శాంతమున మించె శ్రీ వేంకట
నగమున నహోబల నారసింహము ॥శరణని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మికసంకీర్తనలు; సంపుటి 3, సంకీర్తన239, పుట 100)

పగిలిన స్తంభంలో నుంచి విజయసింహం, వీరసింహం, విమలసింహం, భయదసింహం ఎలా వెడలిందో ఎలా కెరలిందో ఎలా మెరిసిందో వర్ణించాడు అన్నమయ్య. ధీరసింహం ఘోరసింహం కావడాన్ని వర్ణించాడు.[5]

ఇందులో రస పరిపుష్టికి పాటించిన పరిణామక్రమం గమనార్హం. భావాల గాఢత ఎలా తీవ్రమైందో వర్ణించి, వీరం, రౌద్రమై తరువాత క్రమానుగతంగా భీభత్సంగా పరిణమించడం ఇందులో సహజంగా వర్ణించబడింది.

'పట పటమని బేట్లెగయ'డంలో చిటచిట రవాల చిరుత పొగలెగయడంలో తటతటమని తరలి, పట పటమని స్తంభం వ్రక్కలు కావడంలో ఒక భయానక దృశ్యం మనకు కనిపిస్తుంది. ఇక్కడ అన్నమయ్య ధ్వన్యనుకరణ శబ్దాల నుపయోగించి లయాత్మకమైన ఆ వాక్యంలో భయానక రసాన్ని రూపు కట్టించాడు.

బెడిదపు చూపుల మిణుగురులు ఎగురుతుండగా, పుడమి అదురుతుండగా, దిక్తటాలు అల్లల్లాడి పోతుండగా విజయసింహం పగిలిన ఆ స్తంభంలో నుండి వెలువడింది. ఇక్కడ అన్నమయ్య కూర్చిన పై పదాల పొందికలో భావ చిత్రాలేర్పడి ఆ విజయసింహ స్వరూపం మన కట్టెదుట నిలుస్తుంది.

నృసింహుని నవ్వులతో నభోంతరాళాలు సుడి పడ్డాయి. పెనుబొమ ముళ్ళ మధ్య పొగలెగసినాయి. సింహనాదాలతో కొండలు పగిలాయి. ఆవిర్భవించిన విజయ సింహం వీర రూపాన్ని దాల్చింది. వీర రసాన్ని వ్యక్తం చేసే ఆరభటీ వృత్తి నృసింహుని ఆంగిక విన్యాసం నవ్వులు చేష్టల్లో రూపు కడుతుంది.

తెఱచిన నృసింహుని నోటినుండి హుంకారాలు వస్తున్నాయి. ప్రతి ధ్వనులు వాటినుండి వినవస్తున్నాయి. పద ఘట్టనలకు చుక్కలు బెదురుతున్నాయి. ప్రపంచం భీతిల్లింది. విమలసింహం కెరలింది. ప్రపంచం భీతిల్లినా ఆ భయద రూపం దుష్టులకే పరిమితం అని చెప్పటానికి కాబోలు లేదా పక్కన ప్రహ్లాదుడు కనిపించాడు కాబోలు ఆ వీరసింహం విమలమయింది.

భయంకరమైన పద ఘట్టనలకు బ్రహ్మాండం బ్రద్దలౌతుండగా, చూపులు విస్ఫులింగాలను విరజిమ్ముతుండగా భయంకర రూపాన్ని దాల్చిన భయదసింహాన్ని చూచి దేవతలు కూడా వెరగంది, గాద్గదిక కంఠం (గుటగుట రవళి)తో పొగిడారట.

ఇక్కడ 'పటు విహారముల', 'గుటగుట రవళి', 'నిటల నేత్రము'. 'పటుగతి' మొదలయిన శబ్దాల కూర్పు అందులోని లయద్వారా అన్నమయ్య నృసింహుని భయంకర రూపాన్ని రూపు కట్టించాడు. అంతేకాదు, ఆ రూపాన్ని చూసి దేవతలే బెదిరారంటే మానవ మాత్రులం మనమెంత? అనే భావాన్ని "గుట గుట రవళి" అనే పదాల కూర్పులో వ్యక్తీకరించాడు.

శాత్రవ సంహారం జరిగింది. హిరణ్యకశిపుడు నిలువుగా చీలిపోయాడు. భయదసింహం ఉగ్రనరసింహం అయింది. భయానక రసం బీభత్సంగా రూపుదిద్దుకుంది. నృసింహుని "పెదపెద" కోఱలనుండి పిడుగులు రాలుతుండగా, గోళ్ళనుండి కారే నెత్తుటి ప్రవాహాలు బీభత్సంగా చూపరులను జలదరింప చేస్తున్నాయి. కులగిరులు సింహనాదాలకు అదిరిపోతున్నాయి. నృసింహుని ఈ ఉగ్రత్వం యొక్క ప్రతిరూపాలు "పెద పెద" కోఱలు, గోళ్ళ నుండి కారే నెత్తుటి ప్రవాహాలు, సింహనాదాలు, ఇవే ఆరభటీ రూపాలు.

ఉగ్రనరసింహుని అట్టహాసంతో అసురులు పారిపోయారు. గాలి సుడివడింది. మబ్బులు ముసురుకున్నాయి. ప్రకృతి చీకాకు పడింది. హిరణ్యకశిపుడి వధతో నృసింహుడు ధీరుడైనాడు. ఆ ధీరసింహం ఆకృతిలోని తీవ్రత, వేడిమి, ప్రకృతి బీభత్సం, నృసింహుని అట్టహాసాలే ఆరభటీ వృత్తి. ఇది వ్యక్తం కాబడిన వాక్యలయలో గౌడీ రీతి వ్యక్తం అవుతున్నది.

విజయసింహం వీరమై, భక్తులకు విమలమై, దుష్టులకు భయదమై, సంహారవేళ ఉగ్రమై, అనంతరం ధీరమై, ఆ భయానక బీభత్స దృశ్యంలో కొలువుదీర్చిన ఘోర సింహంగా దర్శనమిస్తున్నది. ఈ పరిణామ క్రమంలో వీర రౌద్ర భయానక బీభత్సరసాలు కనిపిస్తాయి.

అన్నమయ్య వాక్య నిర్మాణ చాతుర్యం ఈ సంకీర్తనలో కనిపిస్తుంది. రౌద్ర, బీభత్స, భయానక రసాల వర్ణనకు సాంప్రదాయికంగా అత్యంత కఠిన సంస్కృత పదాలు, దీర్ఘసమాసాలు ప్రయోగించడం పరిపాటి. అలంకార శాస్త్రం కూడా దీన్నే సూచిస్తుంది. కాని అన్నమయ్య లఘ్వక్షర ప్రధానమైన రచనలో అచ్చతెలుగు పదాల కూర్పులో పరిణామక్రమాన్ని పాటించి పదగమనంలో ఒక విధమైన వేగాన్ని తీసుకు వచ్చాడు. అనుకరణ శబ్దాలు, లఘూచ్చారణలు, లఘువుకు

లఘువుకు మధ్య ఉండే నియంత్రితమైన విరామం వలన లయ ఊపందుకుని, భయంకర దృశ్యాన్ని మనకట్టెదుట నిలుపుతుంది. ఇది సంప్రదాయానికి భిన్నం, అపూర్వం. అన్నమయ్య స్వీయ దర్శనారూపం.

3. సాత్త్వతీ వృత్తి:

వీర శృంగారానుకూలమైన వస్తు వర్ణన సాత్త్వతీ వృత్తి. ఈ వర్ణనకు అవసరమైన పద నిర్మాణానికి అనుకూలమైనది పాంచాలీ రీతి. కొంత పరుష పద రచన, కొంత లలిత పద రచన దీనిలో కనిపిస్తాయి.[6]

రాగం: శుద్ధ వసంతం

అలమేలు మంగ యీకె ఆనుక వద్ద నుండది
చెలరేగి కందువలు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

తరుణి దేహమే నీకు తగు దివ్య రథము
గరుడ ధ్వజంబాపె కప్పు పయ్యెద
తురగములు రతుల దోలెడు కోరికలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥అలమేలు॥

దిండు కల పిఱుదులు తేఱు బండికండ్లు
అండనే పువ్వులు గుత్తులాపె చన్నులు
కొండ వంటి శృంగారము కోపున గల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా ॥అలమేలు॥

వెలది కంఠము నీకు విజయ శంఖమదిగో
నిలువెల్లా సాధనాలు నీకు నాపె
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరును గూడితిరి
పలు విజయముల నిట్టే పరగవయ్యా ॥అలమేలు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం8, పుట54, సంకీర్తన 90)

స్వామి వారి విజయ రహస్యాన్ని, వారి ఆయుధసామగ్రి పటిమని అన్నమయ్య ఈ సంకీర్తనలో వివరిస్తున్నాడు.

యుద్ధసామగ్రిలో మూలమైనది రథం. శక్తిని చాటడానికి ప్రతీక ధ్వజం. గమనానికి అవసరమైనవి తురగాలు. రథ గమనాన్ని నిరూపించేవి రథ చక్రాలు. విజయ సాధనకు అవసరమైనవి శస్త్రాస్త్రాలు, పటిమ గల ధనుస్సు. విజయాన్ని దశదిశలా చాటి చెప్పేది శంఖము. వీర రసానుకూలమైన ఈ ప్రతీకలన్నీ శృంగార రస ప్రతీకల్లో నిక్షిప్తం చేసి లయాత్మకమైన వాక్య నిర్మాణంలో రెంటి గమనాన్ని ఒకేసారి నిరూపించాడు అన్నమయ్య.

"శ్రీవారిని నాయిక దేహమే రథంగా, పయ్యెదే ధ్వజంగా, కోరికలే గుఱ్ఱాలుగా, అతివ పిరుదులే రథ చక్రాలుగా, కొండవంటి శృంగారాన్ని ధనుస్సుగా సంధించి, చన్నుల మన్మథ బాణాలను లక్షించి, వనిత కంఠమనే విజయ శంఖాన్ని పూరించి వలపులపై విజయాన్ని అందుకో స్వామీ" అంటున్నాడు సఖీ రూపంలో అన్నమయ్య.

నాయిక దేహం, పయ్యెద, కోరికలు, పిఱుదులు, స్థనాలు, కంఠం ఈ అవయవాల సొబగుల్లో రథం విజయ ధ్వజం, గుఱ్ఱాలు, శస్త్రాస్త్రాలు శంఖం మొదలయిన యుద్ధ సాధానాలను రూపించడం వలన జరిగే వీర శృంగార రసాభివ్యక్తే సాత్త్వతీ వృత్తి.

లయాత్మకమైన వాక్య నిర్మాణంలో పదరచనలో రతి గమనం, యుద్ధ గమనం పరిణామ క్రమాన్ని సూచిస్తూ కనిపిస్తుంది. వీర శృంగార రసానుకూలమైన వస్తు వర్ణనలో ఈ వాక్య నిర్మాణంలో పాంచాలీ రీతి కనిపిస్తుంది. వీర శృంగారాల వర్ణన పాంచాలీ రీతిలో ఉండాలి. కొంత కఠిన పద రచన కొంత మృదు పద రచనతో కూడినది పాంచాలి. అయితే ఇక్కడ యుద్ధ పరికరాలను శృంగారానికి అనుకూలంగా రూపించడం మాత్రమే జరిగింది. ఇందులో శృంగారానికున్న ప్రాముఖ్యం వీరానికి కనిపించదు. అందుకే ఇక్కడ మృదు పదాలతోనే రచన సాగింది. వస్తువులు వీర రసానుకూలంగా కూడా కనిపించడం వలన దీనిని సాత్త్వతీ వృత్తి అని భావించవచ్చును.

వీర శృంగార రస ప్రతీకలు రెండూ ఒకే వాక్యంలో ఇమిడిపోవటం వలన లయ రెంటి గమనాన్ని ఒకేసారి నిర్దేశిస్తున్నది. మొదటి చరణంలో శృంగార

ప్రతీకని ముందు పెట్టి "దేహమే" రథమనడంలో "మే" అనే అక్షరం మీద ఉండే ఊనిక ద్వారా ఆ వస్తువుల ప్రాముఖ్యాన్ని అన్నమయ్య నొక్కి చెబుతున్నాడు.

రెండవ చరణంలోని 'అండనే' అనే పదం అన్నమయ్య విశిష్టార్థంలో ప్రయోగించాడు. పువ్వుల గుత్తులు, మదనాస్త్రాలు, చన్నులు మదనోద్దీపకాలు. అవి 'అండనే' ఉన్నాయని వాటి సామీప్యాన్ని సూచించి జరగబోయే కొండ వంటి శృంగారాన్ని వ్యంజింపచేశాడు. బిందు పూర్వక 'డకా'రాన్ని ఈ అర్థబోధకు సంకేతంగా ఉపయోగించాడు. "నిండుకొని దిక్కులెల్లా నీవే గెలవయ్యా" అనే వాక్యం ద్వారా సంపూర్ణ శృంగార రసావిష్కరణం జరుగుతున్నది.

మూడవ చరణంలోని పాదాంతంలో దీర్ఘాక్షరం ధ్వని గర్భితంగా ప్రయోగించబడింది. ప్రతిపాదంలోను వీర రసాన్ని స్ఫురింప చేసే ప్రతి శృంగార ప్రతీక లఘువుతో అంతమయింది. పయ్యెద, కోరికలు, చన్నులు, సొబగు. అదే విధంగా "విజయ శంఖము" అని అంతం చేసినా పైరీతికి భిన్నం అయ్యేది కాదు. కాని 'శంఖం' తరువాత "అదిగో" అంటూ అవధారణార్థంలో పాదాంతంలో గురువు ప్రయోగించబడింది. ఈ వాక్యలయలో నాయిక హృదయంలో శ్రీవారు వలపులపై సాధించే విజయం భావ చిత్రంగా రూపుదిద్దుకోడం కనిపిస్తుంది. అవధారణార్థకంలోని లయ వలన ఆ దృశ్యం మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

వివిధ రసవృత్తుల్లో అన్నమయ్య శృంగార సంకీర్తనలు ఎంత రసవంతంగా రచింపబడినాయో ఇంతవరకు వివరించడం జరిగింది. నాయికా నాయకుల వ్యాపారంలోని ఆంగికాభినయం వలన వృత్తులు, వాచికాభినయం వలన రీతులు ఈ విధంగా రసాన్ని రూపు కట్టిస్తాయని ఇంతవరకూ నిరూపించబడింది. అయితే ఈ వృత్తుల ద్వారా, వాక్యలయ సాధనంగా భిన్నమైన ప్రవృత్తులను, చిత్తవృత్తులను, సంస్కారాలను వివేచించాలంటే అన్నమయ్య తన శృంగార సంకీర్తనల్లో కావించిన రసపోషణను అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది. పాత్రల చిత్తవృత్తిని నిరూపిస్తూ, అంతశ్చైతన్యాన్ని సూచిస్తూ అన్నమయ్య కావించిన రసావిష్కారాన్ని సంభోగ, విప్రలంభ శృంగార వర్ణన ద్వారా దిఙ్మాత్రంగా పరిశీలించబోతున్నాము.

2.4. అన్నమయ్య శృంగార రస పోషణ:

సంభోగ శృంగారం. విప్రలంభ శృంగారం అని శృంగార రసం ప్రధానంగా రెండు విధాలు. సంభోగ శృంగారం కేవలం సురత రూపంలోనే కాక దర్శనం,

ఆలింగనం, చుంబనం మొదలైన విధాలుగా ఉన్నా వీటన్నింటిని కలిపి సంభోగ శృంగారమన్నారు. విప్రలంభ శృంగారంలో పది అవస్థలుంటాయని అలంకార శాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి.

అన్నమయ్య సంకీర్తనల్లోని శృంగారం భగవద్విషయకం కాబట్టి దివ్యం. ఈ ప్రవృత్తికి ఆలంబనం, భగవంతుడు. ఆతని దివ్య చరితలే విభావాలు. భగవద్దర్శనం చిత్త వృత్తి స్థాయి. అదే భగవద్రతి. మధుర భక్తి సిద్ధాంతానికి ఈ అనుభూతే జీవం. నాయికా నాయకుల పరస్పర శృంగార విలాసాలు జీవాత్మ పరమాత్మల తాదాత్మ్యాన్ని సూచిస్తాయి. ఇది సంభోగ శృంగారం అయినా విప్రలంభ శృంగారం అయినా మౌలిక రూపం భగవద్రతియే.

1. సంభోగ శృంగారం:

"విలాసినోః సంయుక్తయోః దర్శన స్పర్శనాదిః సంభోగః" అని మన అలంకార శాస్త్రవేత్తలు విలాసవంతులైన వారి కలయిక. పరస్పర దర్శన స్పర్శనాదికము సంభోగ శృంగారంగా వర్ణించారు.

శ్రీవారి దివ్య శృంగారాన్ని దివ్య చక్షువులతోనే దర్శించి, రమణీయంగా తన శృంగార సంకీర్తనల్లో అన్నమయ్య పొందుపరిచాడు.

1.1. సురత చిహ్నాలు : సంభోగ శృంగారం:

సురత చిహ్నాలు స్పష్టంగా తెలుస్తున్నా సిగ్గుతో కల్లబొల్లి మాటలతో బుకాయించే స్వామి వారిని, శ్రీదేవిని చూసి సఖులు ఈ విధంగా పరిహాసం చేస్తున్నారు.

రాగం: నాగవరాళి

ఎవ్వరు నెరఁగరంటా యేల బొంకేరు
నవ్వేరు మిమ్ముఁ జూచి నలినాక్షులెల్లను ॥పల్లవి॥

చెలియ నుదుటి మీఁది చిన్నారి కస్తూరి బొట్టు
చెలువు మీరఁగ నీ చెక్కుల నంటె

నిలువు నామము నీది నెలఁత నుదుట నంటె
తలకొన్న గురుతులు తారుమారులాయను ॥ఎవ్వ॥

కాంత కన్నులఁ బెట్టిన కాటుకెల్లా నీ మోవి
వింత బాగులై నేఁడు వెలశున్నది
రంతుల నీ బాహుపురి రమణి సందిటఁ జిక్కె
యింతలోనె మీ చేఁత లివ్వ లవ్వ లాయను ॥ఎవ్వ॥

సతి నలమేల్మంగ చరణముల లత్తుక
సొరిది నీ పురమునఁ జూపట్టెను
గరిమ శ్రీ వేంకటేశ కౌస్తుభ మింతికి సొమ్మై
దొరసె మీ వలపుల తోడు నీడలాయను ॥ఎవ్వ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18, పుట319,సంకీర్తన 47)

శ్రీవారి గురుతులు సతి మేను పైన, సతి మంగళ చిహ్నాలు స్వామి వారిపైన అంటితే "నవ్వేరు మిమ్ము చూచి నలినాక్షులెల్లను" అని పరిహాసంగా అంటాడు అన్నమయ్య.

చెలియ నుదుటి పైన చిన్నారి కస్తూరి బొట్టు స్వామి చెక్కులనంటి ముద్రగా భాసించింది. శ్రీవారి తిరునామము చెలి నుదుట అంకితమై వింత శోభ కలిగించింది. కాంత కన్నుల కాటుక నీ మోవిని అంటి వింతకాంతులు చిమ్మింది. శ్రీ సతి పాదాల లత్తుక స్వామి వక్షస్థలంపై ముద్రవేసింది. ఈ సురత చిహ్నాలు మంగళ చిహ్నాలుగానూ, దివ్య చిహ్నాలుగానూ భాసించి వారికి కొత్త అందాలు కలిగించాయి.

పల్లవిలోని "ఎవ్వరు నెరఁగరంటా యేల బొంకేరు? అనే ప్రశ్నార్థక వాక్యంలోని లయలో వినిపించే వ్యంగ్యమే శ్రీవారి సంభోగ శృంగారాన్ని నిరూపిస్తున్నది.

మొదటి చరణంలో 'చెలువు మీరగ' అనే పదం ముందు ప్రయోగించబడి ఆ తరువాత "చెక్కుల నంటి" అనడంతో రమణి అందం శ్రీవారిలో మరింతగా ప్రకాశించింది.

రెండవ చరణంలో 'కాటుకెల్లా' అనే పదంలోని దీర్ఘాక్షరంలోని ఊనిక గమ్మత్తైనది. 'ఆమె సమస్తం నీ మోవిలోనే కరిగింది' అనే అర్థాన్ని ఆ దీర్ఘాక్షరం స్ఫురింప చేసింది. 'ఆ కాటుక వింత బాగులై వెలిశుంది' అంటాడు అన్నమయ్య. కరగడం 'కాటుక'కి 'నాయిక'కి ఇక్కడ సమాన ధర్మమన్నమాట.

మూడవ చరణం మూడవ పాదంలో "ఇంతికి సొమ్మై దొరసె" అనే పదం విరుపులో ధ్వని కనిపిస్తుంది. ఆవిడే సిరి. ఆ సిరికి స్వామి కౌస్తుభం సొమ్ము అయిందట. అక్కడి దీర్ఘాక్షరం వలన మరో అర్థం స్ఫురిస్తుంది. "శ్రీ వేంకటేశ కౌస్తుభం సిరికి సొమ్మైంది. సిరికి స్వామియే అభరణం. సిరిని తాల్చినవాడు సిరికే అభరణమైనాడు." ఈ వాక్యాల్లోని లయ వలన ఇంత మనోహరమైన అర్థం సంభోగ శృంగారంలో వ్యంజింపబడింది. సురత చిహ్నాలు పట్టిస్తున్నా బొంకుతూ పరిహాసాలాడే శ్రీవారి శ్రీదేవి చిత్తాలే కైశికీ వృత్తి. తత్స్వభావ నిరూపక పదరచన వైదర్భీరీతి. వాక్యలయలో పైభావాలు నిరూపించబడి మధుర భక్తి స్థాపితమయింది.

1.2. శ్రీవారి శృంగారపు విందులు : సంభోగ శృంగారం:

శ్రీవారి శృంగారపు విందులను పలురుచుల రీతులను అన్నమయ్య ఇలా విపులంగా వర్ణిస్తున్నాడు.

రాగం: దేసాళం

ఇట్టి విందు గంటివా నీ వెక్కడనైనా
అట్టె ఆకె పొత్తున నీ వారగించవయ్యా ॥పల్లవి॥

కలికి కెమ్మోవి తీపు కమ్మని తేనెల విందు
చలువ చూపులు నీకుఁ జక్కెర విందు
సెలవి లే నవ్వులే చిలుపాల తోడి విందు
అలమేలు మంగ సేసీ నారగించవయ్యా ॥ఇట్టి॥

కాంత గోరిన చెనకులు కారపుఁ గూరల విందు
పంతపు మాటలే ఆవ పచ్చడి విందు
వింత బొమ్మ జంకెనలే వేఁడి పడిదాల విందు
అంత సేసీ నీ దేవి యారగించవయ్యా ॥ఇట్టి॥

ఇట్టడి సమరతి యారడి తరితీపు విందు
గట్టి సిగ్గు పెరుగు మీఁగడల విందు
గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీ వేంకటేశ
అట్టె నీ తనివి దీర నారగించవయ్యా ॥ఇట్టి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం21,పుట353, సంకీర్తన529)

కలికి కెమ్మోవి కమ్మ తేనెల విందు చేస్తే చలువ చూపులు చక్కెర విందట. చెక్కిళ్ళ నవ్వులు 'చిలుపాలతో విందు కాగా, కాంత కొనగోరి చెనకులు కారపు కూరల విందు చేస్తున్నాయి. పంతపు మాటలు ఆవ పచ్చడి విందై స్వామికి ఘాటెక్కిస్తే వింత బొమ్మ జంకెనలు వేడి పడిదాల విందై రుచులు చేస్తున్నాయట. సమ రతులు తరి తీపుల విందైతే, గట్టి సిగ్గు "పెరుగు మీగడల విందు"గా అమృతం ఒలికిస్తున్నాయి. గుట్టుతో మన్నించావు ఇంక తనివి తీరా ఆస్వాదించమంటున్నదా నాయిక.

పల్లవిలో "ఇట్టి విందు గంటివా నీవెక్కడనైనా" అనే ప్రశ్నార్థక లయలోనే లోకోత్తర చమత్కారం 'ఇక్కడే ఉన్నది సుమా' ! అనే సూచనగా కనిపిస్తుంది.

ప్రతి చరణంలో వాక్యంలోని మొదటి పదంలో ఉపమేయం. రెండవ పదంలో ఉపమానం నిండి రూపకంలో వాక్యం నిర్మించబడింది. మొదట చరణంలోని మూడవ పాదంలో "సెలవి లే నవ్వులే" పదంలోని రెండు గురువుల లయలో 'ఊనికలో స్థిరత్వం, నిశ్చయం' స్వామిని కవ్వించే విన్యాసం వ్యక్తం అవుతున్నాయి. రెండవ పదం "చిలుపాలతోడి విందు" లఘువుతో అంతం అయి, ఆ వాక్యభావం ఆమె చిత్తగతిలోని "నా విన్యాసమే నీకు విందని స్వామికి నిలువెల్లా విందై రుచులు కలిగించాలనే నిశ్చయాన్ని సూచిస్తున్నది.

"సెలవి లే నవ్వులే", "పంతపు మాటలే", "వింత బొమ్మ జంకెనలే" అనే పదాల్లోని దీర్ఘాక్షరాలు కేంద్రస్థానం అదేనని స్వామికి విందుచేసి చవులూరించగల సమర్థత ఇక్కడే ఉన్నదని ఋజువు చేస్తున్నాయి. పదం అక్కడ విరిగి లయ ద్వారా ఈ భావం భాసిస్తున్నది. వాక్యంలోని రెండు పదాల మధ్యన ఉన్న అన్వయం ఉపమేయంలోని సౌందర్యాన్ని, ఉపమానంలోని రుచిని నిరూపిస్తున్నది. ఈ వాక్యలయ ఆమె చిత్తగతిలోని మధురభక్తిని ఆత్మార్పణను సూచిస్తున్నది.

1.3. శ్రీవారి ఉపచార పూజలు : సంభోగ శృంగారం:

శ్రీవారికి నాయిక ఉపచార పూజలన్నీ సంభోగ శృంగారంలోనే భాసిస్తున్నాయి.

రాగం: దేసాళం

ఇంతి వుపచార పూజ యిందే కలిగె నీకు
వంతులఁ జేకొని నీవు వరమియ్యవయ్యా ॥పల్లవి॥

అంగన నిన్నుఁ జూచుటే ఆవాహనము, ఆకెకు
అంగవించి నీవు మతి హత్తినదే ఆసనము,
సంగతి నీపై చింతే సదా ధ్యానము సుమ్మీ
అంగపుఁ జెక్కు చెమట లర్ఘ్య పాద్యాదులు ॥ఇంతి॥

సరుసఁ గన్నీళ్లే ఆచమనము జలకము
అరవిరి పయ్యెదయు అంగవస్త్రము
నిరతి మైకమ్మఁ దావి నీకు నిచ్చిన గంధాలు
పరగిన పులకలే పలు పూజలు ॥ఇంతి॥

దొమ్మి వూర్పు విరహాగ్ని దూపము దీపము నాయ,
సొమ్ములే మై మెఱుఁగులు సోలి వీఁగేవే దండాలు
నమ్మిక శ్రీ వేంకటేశ నైవేద్యమాయ మోవి
కమ్మరఁ గాఁగిటి నవ్వే కప్పురపు విడేలు ॥ఇంతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం22,పుట78, సంకీర్తన 116)

ఈ సంకీర్తనలో స్వామి పూజా విధానమంతా ఒక క్రమంలో కనిపిస్తుంది. ఈ క్రమం సంభోగ శృంగార క్రమానికి అన్వయం చేయడం అపురూపమైన విశేషం. శృంగారంలో పరాకాష్ఠ, భక్తితో శ్రీవారితో తాదాత్మ్యం రెండూ ఒక్క దానిలో పర్యవసించడం మధుర భక్తికి మధురమైన ప్రతీకగా భాసిస్తుంది.

నాయిక నిన్ను తలచటమే "ఆవాహన"ము. నిన్ను మతి హత్తినదే "ఆసనము". అంగన చెక్కు చెమటలు నీకు "అర్ఘ్యపాద్యాదులు". ఆనంద బాష్పాలే

నీకు "ఆచమన జలకం." ఆమె అరవిరి పయ్యద నీకర్పించిన 'అంగవస్త్రం'. ఈ ఉపచార పూజల్లో ఇంత వరకు స్వామిని దరిచేర్చుకున్న శృంగారం అంతా కనిపిస్తుంది.

శ్రీవారితో సంభోగం భక్తికి పరాకాష్టగా వర్ణించటం గమనార్హమైన విషయం. "నిరతి మైకమ్ము తావి" నీకిచ్చిన గంధం. ఆ పారవశ్యంలో రేగిన పులకలే పలు పూజలు. ఊర్పు విరహాగ్ని ధూపము. సోలి కన్నులు మూతబడి వీగడం తాదాత్మ్యతను సూచించే దండ ప్రణామం. తుదిలో నైవేద్యంగా తన 'మోవి' నిచ్చి నిలువెల్లా పూజా విధానానికి ప్రతీకయై, ద్రవ్యమై, అలంకారమై, ప్రసాదమై నాయిక శోభిల్లింది.

వాక్యంలోని రెండు పదాల్లో మొదటి పదంలోని దీర్ఘం రెండవ పదాంతంలోని లఘువుని నియమిస్తూ నిశ్చయత్వాన్ని స్ఫురింప చేస్తుంది. "నిన్ను చూచుటే ఆవాహనము" అనడంలో చూపులకు స్థిరత్వాన్ని ఆవాహనకు ఆకర్షణని బలాన్ని మొదటి పదాంతంలోని గురువు కల్పించింది.

ఇలాగే ప్రతి చరణంలోని ప్రతి పాదంలోని మొదటి పదం గురువయి ప్రతిపాదానికి పదం విరిగి రెండవపదాన్ని నియమిస్తుంది. ఆమె సేవలు అవస్థా భేదాలే. అన్వయ క్రమంలో రతికి ఉపచార పూజలకు ప్రతీకలుగా ఈ వాక్యలయే సూచిస్తుంది. మధుర భక్తిలోని స్థాయిని సూచిస్తుంది. ఆమె చిత్తగతిలోని భగవద్రతిని తాదాత్మ్య భావాన్ని సూచిస్తుంది.

1.4. ఉపరతి సంభోగ శృంగారం:

అన్నమయ్య శృంగార వర్ణనలో ఉపమాలంకారాన్ని విశేషంగా ప్రయోగించాడు. ప్రకృతి ధర్మాన్ని త్రోసి రాజని ఈ సంకీర్తనలో అన్నమయ్య ఉపరతిని అందంగా వర్ణించాడు.

రాగం: **ముఖారి**

పాయపు రమణుఁడ నీ పంత మింక నెట్లనో
ఆయములే విపరీత మాయఁబో నేఁడు ॥పల్లవి॥

వుపమించఁ జందురుఁడు వుదయమైతే భూమి
తపిఇంచి చీఁకట్లు తలఁగుఁ గాని

కపురు నా తురుము చీఁకటి నీ మోము శశి
వుపరి సురతమున నోడించె నేఁడు ॥పాయపు॥

అలరి కొండల మీఁద నంబరపు మేఘములు
గాలికి వాలి నిండాఁ గప్పుఁ గాని
నీల మేఘము వంటి నీపై నా కుచగిరు
లోలి నుపరతి యందు నొగి వాలె నేఁడు ॥పాయపు॥

తేరి మీఁద మదనుఁడు తెలివొందుఁ గాని యందు
నేరుపు శ్రీ వేంకటేశ నీ నాయందు
బీరపు మరుని మీఁద పిరిఁది తేరు వారె
ఆరి తేరి రతి వింతలాయఁబో నేఁడు ॥పాయపు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం24,పుట99, సంకీర్తన 148)

చంద్రోదయంతో భూమిపై చీకట్లు తొలగటం సహజ ధర్మం. ఇది సహజ రతి బింబం. ఉపరతిని సూచిస్తూ అన్నమయ్య నాయిక పెన్నెరి వేణి చీకట్లు శ్రీవారి వదన చంద్రుని వెన్నెలలను గెలిచాయని రమణీయంగా ఉపమాలంకారంలో నాయిక విజయాన్ని సూచిస్తున్నాడు.

కొండలపైన మేఘాలు విహరించటం సహజం. ఇది సహజ రతిబింబం. కాని నీల మేఘునిపై కుచగిరులు వాలి ఉపరతిని తేలించాయట.

ప్రతి పాదంలోను మొదటి చరణంలో కార్యకారణ సంబంధం కనిపిస్తుంది. రెండు పాదాల్లో సహజత్వం నిరూపించి "కాని" అనే పదం ద్వారా మూడు నాలుగు పాదాల్లోని విశేషానికి ప్రాతిపదిక కల్పిస్తున్నాడు అన్నమయ్య. మూడు నాలుగు పాదాల్లోని విశేషం మొదటి రెండు పాదాల్లోని సామాన్యాన్ని ధిక్కరిస్తుంది. మొదటి రెండు పాదాల నడక నియంత్రితంగా సాగి భావం సంపూర్ణమయి అక్కడ విరుగుతున్నది. దీనికి 'కాని' అనే పదం వారధిలా నిలబడి మూడు నాలుగు పాదాల నడక గతికి అన్వయం చేసి ఒక సమతుల్య స్థితి (Balance)ని సాధిస్తున్నది.

స్వామితో ఉపరతిలో పైచేయి తానే అయి స్వామిని కరిగించాలనే కోరిక, మన్మథుడిని పరాభవించి విజయం సాధించామనే తృప్తి, తాదాత్మ్యస్థితి వాక్యలయ ద్వారా అభివ్యక్తమౌతుంది.

2. విప్రలంభ శృంగారం:

"కారణ విశేషేణ తయోర్విశ్లేషో విప్రలమ్భః[7]

ప్రత్యేకమైన కారణం చేత నాయికా నాయకులకు కలిగిన ఎడబాటును విప్రలంభంగా ఆలంకారికులు పేర్కొన్నారు.

"విప్రలమ్భే చాభిలాష చిన్తా స్మృతి గుణ కీర్తనోద్వేగ ప్రలాపోన్మాద వ్యాధి జడతా నిధనాది దశావస్థా భవన్తి"[8]

విప్రలంభ శృంగారంలో అభిలాష, చింత, స్మృతి, గుణ కీర్తనం, ఉద్వేగం, ప్రలాపం, ఉన్మాదం, వ్యాధి, జడత అనే పది అవస్థలున్నాయి.

ప్రస్తుత పరిశీలనలో, శ్రీవారి నాయికలకెవరికీ అమంగళమైన ఈ పదవ అవస్థ 'మరణం' సంప్రాప్తించలేదు కాబట్టి దానిని వివరించడం లేదు.

1. **అభిలాష:** "తత్ర సంగమేచ్ఛాభిలాషః[9]

నాయిక విరహంతో తపించిపోతూ కలయికని సంగమాన్ని కోరుకునే స్థితి అభిలాష.

నాయికా విరహంతో తపించిపోతూ సంగమేచ్ఛతో పలవరించే వేంకటపతిని అన్నమయ్య ఇలా వర్ణిస్తున్నాడు.

రాగం: సామంతం

నీరు వట్టు గొన్నవేళ నేయి మందవునా
కూరిమి మమ్మిద్దరినిఁ గూరుచరే చెలులు ॥పల్లవి॥

నెఁలత చెక్కులే నాకు నిలువుటద్దములు
అలరుల తావి వూర్పు లాల వట్టాలు
సెలవుల నగవులే చేతికిచ్చే కప్పురాలు
చలి మందు లిఁక నన్నిఁ జాలునే నాకు ॥నీరు॥

వనిత మాటలే నాకు వలరాచ మంత్రాలు
నినుపుఁ జెమటలే పన్నీటి సోనలు
ఘనమైన సరసాలే గంధపుఁ కస్తూరి పూత
యెనలేని వుపచారా లివియేలే నాకు ॥నీరు॥

సతి తోడి పానుపే చంద్రకాంతపు వేది
యితవుగఁ గూడించితి రిందరూ మమ్ము
రతుల శ్రీ వేంకటాద్రి రాయడు నేనిదివో
మితి మీర నూఁచకురే మేలాయఁ బనులు ॥నీరు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం20, పుట5, సంకీర్తన 7)

శ్రీవారికి భూషణాలంకారాలతో పని లేదు. స్తోత్ర పాఠాలు మంత్ర పూజల ఊసక్కరలేదు. సుందరి వదనారవిందమనే అద్దంలో సౌందర్యాన్ని తనివి తీరా చూసుకుంటాడట. ఆమె ఊర్పులే వింజామరలు. నవ్వులే కప్పురాలు. చలి మందులవసరమే లేదు. వనిత మాటలు వల రాచ మంత్రాలై ఆయనను ఎక్కడున్నా పట్టి కట్టి తెస్తాయి కాబోలు. అభిమానపు ఊహలే ఆవాహన. ఆ స్వామికి చెలి నిలువునా కారే చెమటలే పన్నీటి సోనలు. ఘనమైన సరసాలే గంధపు కస్తూరి పూతలు. ఆమె సాన్నిధ్యం సకలశాస్త్రోక్త పూజలందుకున్నంత ఆనందం కలిగిస్తుందని పలవరిస్తున్నాడు. దాహం వేస్తుంటే "నేయి మందవుతుందా" దప్పి తీర్చే చెలిని చెంత చేర్చమని అభిలాషతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడా అలమేలుమంగా పతి.

ఈ సంకీర్తనలో చెలి అవస్థా భేదాలు, సేవలు శ్రీవారి పూజా విధాన క్రమానికి అన్వయం చేయడం మనం గమనించవచ్చును. ఆమె నిలువునా తనకు అలంకార్యం. తనకు వేరే అలంకారాలతో పని లేదనే భావన నాయకుడిలో కనిపిస్తుంది.

పల్లవిలో వ్యతిరేకార్థంలో ప్రయోగించబడిన ప్రశ్నలోని లయ ద్వారా శ్రీవారు ఉపచారాలను నిషేధిస్తున్నట్లు స్ఫురిస్తుంది. మరో విశేషాన్ని పదగతిలో విశేషాన్ని అన్నమయ్య పొందు పరిచాడు. వరుసగా రెండు అక్షరాలు ఒక ఊనికని స్ఫురింపచేస్తాయి. గురు లఘువులు రెండేసి చొప్పున పల్లవిలోని మొదటి పాదం నిర్మించబడింది. "నీరు వట్టు గొన్న వేళ నేయి మందవునా" అనే పదాలు ఆయన హృదయగతిలోని ఆవేశాన్ని సూచిస్తున్నాయి. ధృతగతిలో ఈ పాదం సృష్టించబడింది.

మూడు చరణాల్లోని మూడు పాదాల్లోను నాయిక విన్యాసాలకు ప్రతీకల్లోని దీర్ఘాక్షరాలు "చెక్కులే", "నగవులే", "మాటలే", "చెమటలే", "సరసాలే", "పానుపే"

అన్నవి విశిష్టార్థంలో ప్రయోగించబడినాయి. ఇవే శ్రీవారి దాహాన్ని తీర్చడానికి తృప్తిని కలిగించడానికి 'సమర్థవంతమైనవి' అనే అర్థాన్ని నిశ్చయంగా రూపింప చేయడానికి పైపదాల్లో దీర్ఘాక్షరం ప్రయుక్తమైంది.

మొదటి రెండు చరణాల్లోని "నన్నీ జాలునే, వుపచారాలివియేలే" పదాల్లోని దీర్ఘాక్షరాలు ఉపచారాలని నిషేధిస్తున్నాయి. నాయిక పొందే సమస్త ఉపచారాలు శాస్త్రోక్త పూజలుగా భావిస్తూ, ఈ పైపై ఉపచారాలు మాని, ఆమెను త్వరగా తీసుకురమ్మని శ్రీవారు విరహంతో వేగిపోతున్నారు.

పదాల నడకల్లో, గురు లఘువుల క్రమంలో, ఊనికలో, వాక్యలయ మనకు వేంకటాద్రిరాయుడి చిత్తగతిని అధ్యయనం చేయటానికీ విధంగా సహకరిస్తున్నది.

2. చింత: "సందర్శన సంతోషయోః ప్రకార జిజ్ఞాసా చిన్తా"[10]

సందర్శనాన్ని సంతోషాన్ని పొందిన జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం చింత. పొందబోయే ఆనందానికి ముందే తనువు మరచిన ఒక నాయిక తలపుల్లో శ్రీవారి చింతనలు ఇలా వ్యక్తం అవుతున్నాయి.

రాగం: భైరవి

చిత్తగించ వయ్యా నీ సింగారపు దేవులను
హత్తి కరుణించ రాదా ఆస పడీని ॥పల్లవి॥

నిండారాఁ దనమీఁద నీవు బత్తి గలవని
యండ నున్న చెలి తోడ నాన తిచ్చీని
పండఁ బడి నీ వుండిన పర పిది తనదని
వెండియును తన పెనువేలఁ జూపీని ॥చిత్త॥

చనవున నిద్దరికి సమద్రిష్టాయని
తనపొరుగాపె తోడ తలపోసీని
ననిచిన యట్టి ప్రాణనాథుడవు నీవని
వొనర జే కానికలు వొడబెట్టి పంపీని ॥చిత్త॥

బెట్టి నీ నోరను తన పేరు నుడిగేవని
చుట్టపు వనిత తోఁ బొంచు లాలించీని
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి మగువను
గుట్టు తోడఁ దనకు నిన్నే గురిసేసీని ॥చిత్త॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం18,పుట305,సంకీర్తన 456)

ఆ 'సింగారపు దేవి' తన మీద 'నిండారా నీవు బత్తి' కలవాడివని పక్కనున్న చెలితో గర్వంగా చెప్పుకుంటున్నది.

నీవు తనతో సుఖించిన "పరపిది తనదే" అని అతిశయంగా చెప్పుకొని 'తన పెనువేల చూపు'తున్నది. ఇది గతంలో పొందిన సుఖానికి, తాను ఇంకా అదే చోటున స్వామితో రతిలో తేలి పోతాననే ఊహలతో పరవశించే నాయిక ప్రవృత్తికి ఇది ప్రతీక.

ఈ నాయిక స్వామిపైన ఆశలు, చేష్టలు, తలపోతలు, ఒడినింపి పంపిన కానుక ఆంగిక విన్యాసం ద్వారా ఆమె చిత్తవృత్తి వ్యక్తం అవుతున్నది. చెలితో పలికిన పలుకుల్లో పరుపును వేలితో చూపించి 'తాము సుఖించే నెలవిది' అని మురిసి పోయే మనసు, 'ఇద్దరికి సరి' అని సంతోషించే బేలతనం, దృష్టిదోష నివారణార్థం చెలికి ఒడినిండా కానుక పెట్టి పంపే 'ముగ్ధత్వం', నోరారా తన పేరును పిలిచావని చెప్పుకుని పరవశించే 'మధురభక్తి' ఆమె చిత్తవృత్తి వాక్యలయలో కనిపిస్తాయి.

మూడు చరణాల్లోని మొదటి పాదాల్లోను స్వామికి నాయికపై కల అనురాగాన్ని పాదాంతంలోని లఘువు ద్వారా సూచించి, విరామం తరువాత కొనసాగే వాక్యాంతంలోని దీర్ఘాక్షరం ద్వారా నిశ్చయత్వాన్ని స్థిర పరుస్తున్నాడు. అన్నమయ్య 'గురి సేసీని" పెనువేల చూపీని, 'వొడి బెట్టి పంపీని' పదాల్లోని లయ ఆమె చిత్తంలోని ఆశలకు, శ్రీవారి అనుగ్రహాన్ని మధరభక్తిని సూచిస్తున్నది.

3. **స్మృతి:** "ప్రియాశ్రిత చేష్టాద్యుద్భోతిత సంస్కార జన్యం జ్ఞానం స్మృతి"[11]

ప్రియునితో తాననుభవించిన ప్రియా సంబంధ – వ్యాపారమును జ్ఞాపకం చేసుకోవడం స్మృతిః

శ్రీవారి కోసం చింతిస్తూ ఆయన కారుణ్యపు చూపే కైవల్యంగా కలవరిస్తూ కరిగిపోయే నాయిక స్మృతులు అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా వర్ణించబడినాయి.

రాగం: శ్రీరాగం

ఎంత నా సుద్దులు చెప్పీ నిందరితోను
కొంతైనా తన పాదపు గోరఁ బోలఁ గలనా ॥పల్లవి॥

తన మన్ననే నా చక్కఁదనము గల ఫలము
ననిచిన తన పొందే నా భాగ్యము
పెనఁగేటి తన రతి పెంపే నా సంపద
యని చెప్పరే చెలులు యతనితోను ॥ఎంత॥

కరుణించి తాఁ జూచుటే కలది నా సింగారము
సరుగఁ దాఁబైకొనుటే సామ్రాజ్యము
పరగఁ దా మెచ్చుటే నా పాయపు గరగరిక
గరిమఁ దెలుపరే యీ కతలు విభునికి ॥ఎంత॥

కొలువులోఁ దా నవ్వుటే గుట్టు నా పెద్దరికము
కలసే తన కాఁగిలే కాణాచి మేలు
యెలమి శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
చెలఁగి యీ విన్నపము సేయరే తనకు ॥ఎంత॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం23, పుట59,సంకీర్తన75)

ఈ నాయిక స్వామి కరుణాంతరంగాన్ని, ఆయన ఘనతను వేనోళ్ల కొనియాడుతున్నది. “నేనే పాటి దానను? నా సుద్దు చెప్పి, మురిసి పోయాడు నా పతి కాలి గోరుకైనా తగిన దానినా, నా చక్కదనానికి కల ఫలము తన మనసే మన్నన. ఆయన ప్రేమ పొందటమే భాగ్యము. రీతుల పెంపే సంపద. ఆయన చూపే సింగారము. పైకొనడమే సామ్రాజ్యము. ‘కొలువు లోపలి పతి నవ్వులే నా పెద్దరికానికి ప్రతీకలు’. ‘కౌగిలే కాణాచి’ ” అంటూ ఆ నాయిక స్వామి తోడి ప్రతి అనుభూతిని స్మృతులను స్మరిస్తున్నది.

పల్లవిలోని సంబుద్ధ్యంత ప్రశ్న "తన పాదపు గోర బోలగలనా?"లో పాదాంతంలో ప్రయోగించిన గురువు ఆమె వినయాన్ని సూచిస్తున్నది.

ప్రతి పాదంలోను మొదటి పదంలో శ్రీవారి కరుణను సూచించే పదాలన్నీ గురువులే. ఆమె సర్వస్వం స్వామి కరుణే అనే భావం ఆ దీర్ఘాక్షరం వలన వ్యంజింపబడుతున్నది. ఆమె చిత్తవృత్తిలోని వినయాన్ని మధుర భక్తిని సూచిస్తున్నది.

4. గుణ కీర్తనము: "విరహే కాన్తా విషయక ప్రశంసా ప్రతి పాదనం గుణకీర్తనం తద్యథా"[12]

వియోగంలోని కాంతను గూర్చి కాని కాంతుని గూర్చి కాని ప్రశంసించటం గుణకీర్తనం.

శ్రీవారి గుణాలు ఎన్నని పొగిడేము, ఎన్నని వివరించేము. స్మరించి పులకించి పోతూ గుణకీర్తనం చేస్తున్నదీ నాయిక.

రాగం: **హిందోళ వసంతం**

ఏమని చెప్పుదునే వీఁ డెమ్మెకాఁడు
చేముట్టి వేఁడు కొనీనే చెలిమికాఁడు ॥పల్లవి॥

చలపాది సరసాల జాజర కాఁడు
వలపులు చల్లీఁ బెక్కు వలపుఁ కాడు
తలఁపించీఁ దన పొందు దాయగాఁడు
వెలయించీ నన్ను నింత వేడుక కాఁడు ॥ఏమని॥

బచ్చన పరాకుల పంతగాఁడు
కొచ్చి కొచ్చి చెనకీని కోడెకాఁడు
అచ్చుగా నా సురలంటీ నా సోదకాఁడు
యిచ్చటనే కాచుకున్నాఁ డెలయింపుకాఁడు ॥ఏమని॥

వద్ద నుండే యెలయించీ వన్నెకాఁడు
అద్దుకొనీఁ గాఁగిట నందగాఁడు

వొద్దికై శ్రీ వేంకటేశుఁ డుబ్బరి కాదు
పెద్దరికపు లాబాల బేరగాడు ॥ఏమని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం18,పుట71,సంకీర్తన 105)

ఈ చెలిమి కాని వేడుకలెన్ని చెప్పనే. చేయి పట్టి వేడుకుంటాడు. చలపాది సరసాలాడే జాజర కాడు. వలపుల మత్తు మందు చల్లే వలపుగాడు. తన పొందులే నిరంతరం తపింప చేసే దాయగాడు. పరాకులు చేసే పంతగాడు. కొచ్చి కొచ్చి పచ్చిగా చెనకే కోడె వయసుకాడు, అంగాల పులకింప చేసే ఆసోదకాడు. కౌగిట చేర్చే అందగాడు. ఆ శ్రీ వెంకటేశుడు ఉబ్బరికాడు. పెద్దరికపు లాభాల బేరగాడు అంటూ స్వామిని గుణకీర్తనం చేస్తున్నదా నాయిక.

శ్రీవారి బహు రూపాలు భిన్న విభిన్నమైన చేష్టల్లో వ్యక్తం అయినాయి. చలపాది సరసాల్లో, వలపులు జల్లడంలో, తలపింప చేయడంలో పరాకులు చిత్తగించడంలో, కొచ్చి కొచ్చి చెనకడంలో, సౌందర్యాలను శోధించడంలో చెంత చేరి మురిపించడంలో, కౌగిట కరిగించడంలో ఈ రూపాలు వ్యక్తం అయినాయి. ఒక్కొక్క భక్తుడని ఒక్కొక్క రీతిలో, రూపంలో కరుణించే భక్త సులభుడుగా స్వామి ఈ సంకీర్తనలో సాక్షాత్కారిస్తారు.

పద రచనలో ప్రతి పాదంలోను అర్థం సంపూర్ణం అయి నడక నియమిత మవుతున్నది. వాక్యంలో పూర్వ పదంలో శ్రీవారి గుణ నిరూపకమైన క్రియా పదాల్లో దీర్ఘం 'చల్లీ', 'చెనకీ', 'నాసరులంటీ', 'తలపించీ', 'వెలయించీ', నాయిక చిత్తవృత్తిలోని ఆనందాన్ని నిరూపిస్తూ గుణకీర్తనానికి ప్రతీక అవుతున్నది. 'ఏమని చెప్పుదనే' అని పల్లవిలో అనడం ద్వారా స్వామి సమక్షంలో లేదని సఖితో నాయిక స్వామిని గుణకీర్తనం చేస్తున్నదని తెలుస్తుంది.

5. ఉద్వేగం: 'కామ క్లేశ జనిత సకల విషయ హేయతా జ్ఞాన ముద్వేగః యధా"[13]

సకల విషయాలు హేయములు. త్యజింపదగినవి అని మదనుని బాధ చేత కలిగిన బుద్ధి ఉద్వేగము.

శ్రీవారికై విరహంతో నిలువెల్లా దహించబడుతూ కుంగే నాయికకు సర్వ విషయాల పట్ల వైముఖ్యం కలుగుతున్నదట. సుఖాన్నిచ్చే ఏ వస్తువూ ఏ మాత్రం

సౌఖ్యం కలిగించక పోవటంతో పాటు మరింత బాధించటంతో అవన్నీ త్యజింప దగినవనే భావనతో ఉద్వేగాన్ని పొందిన నాయికని అన్నమయ్య ఇలా వర్ణిస్తున్నాడు.

రాగం: హిందోళం

ఏవీ (దీ?) నీ యందుఁ జూపు ఇందులో నొకటైన
అదిగొని నిన్ను మెచ్చే నప్పుడే నేను ॥పల్లవి॥

తప్పక వలపులెల్ల తలకెక్కినప్పుడు
కప్పురమే నోటికి కారమై తోఁచు
వుప్పటిల్లు మదనాగ్ని వొడల రేఁగినపుడు
అప్పటి పన్నీరు వుడుకై తోఁచును ॥ఏవీ॥

కందువైన కాంక్షలు కన్నులఁ దొట్టినప్పుడు
గందమే బాసటయై కమ్ముకొనును
మందలించి తమకము మనసు నిండినప్పుడు
విందుల నమృతమైనా వెగటై తోచును ॥ఏవీ॥

చిగిరింపుఁ చింత చేయి చెక్కిట మోపినపుడు
మొగిఁ గొప్పువిరులెల్లా మొనలై నిక్కు
నిగిడి శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగిన నగవులెల్లా ననుపులై మించును ॥ఏవీ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు;సంపుటం23,పుట17,సంకీర్తన284)

'మా చెలి పొందే అవస్థల్లో ఒక్కటైనా నీలో ఉన్నదా? చూపితే అప్పుడే మెచ్చగలము' అంటూ నాయిక విరహాతిశయాన్ని సూచిస్తూ చెలులు స్వామిని పరిహాసం చేస్తున్నారు.

వలపులు తలపులకెక్కినప్పుడు కప్పురమే కారమై భగ్గుమంటున్నది. మదనాగ్ని దహిస్తుంటే చల్లని పన్నీరే చెలికి ఉడుకై తోచింది. కాంక్షలు కళ్ళలో నిండినప్పుడు గంధమే దుస్సహమవుతున్నది. తమకంతో మనస్సు నిండినప్పుడు విందుల అమృతం కూడా ఆ నాయికకు వెగటై తోస్తున్నది.

పల్లవిలోని ప్రశ్నార్థక వాక్యం "ఏవీ నీ యందు జూపు ఇందులో నొక్కటైన" లయలో శ్రీవారికి ఇంతటి విరహాతిశయం లేదనే నిషేధం, పరిహాసం చెలుల పలుకుల్లో వినిపిస్తుంది.

పల్లవిలో ప్రాస భంగమైనట్లు కనిపిస్తుంది. (ఇది అనుమానమే) కాని మూడు పాదాల్లోను ప్రతి చరణంలోను ప్రాస పాటించబడింది. రెండు చరణాల్లోను మొదటి, మూడు పాదాలు విరహాధిక్యాన్ని సూచించడానికి, విరహం అధికమైతే ఏమవుతుందో తెలియజేయడానికి ఆలోచనకు అవకాశం ఇవ్వడానికి లఘువుతో అంతమయి విరామం కొద్దిగా పాటించబడింది. ఔత్సుక్యాన్ని ఇది పెంచుతున్నది. తరువాత పాదంలో సౌఖ్యప్రదమైన వస్తువులు సుఖాన్నివ్వటం లేదనే భావం వ్యంజింపచేయటానికి కప్పుర"మే", గంధ"మే", అమృత"మై"నా పదాల్లోని దీర్ఘాక్షరాలు ప్రయోగించబడినాయి. ఈ వాక్యాలలోని లయలో నాయిక చిత్తవృత్తిలోని విరహం ఉద్వేగం భాసిస్తాయి.

6. **ప్రలాపం:** ప్రియాశ్రిత కాల్పనిక వ్యవహారంః ప్రలాపః[14]

ప్రేయసీ ప్రియులు విరహంలో ప్రియం సంబంధ వ్యాపారాన్ని ఊహించి తపిస్తూ కలవరించటం ప్రలాపం.

శ్రీవారిని అన్ని దిక్కులా అన్ని వస్తువుల్లోనూ సంభావించే నాయిక ఇలా కలవరిస్తున్నది.

రాగం: రామక్రియ

అదియే కాదా సతత మాతనికి తనకిపుడు
పది యవస్థలఁ బొంగి భ్రమసేఁగాక ॥పల్లవి॥

పతిఁ బాసి విరహమున పానుపే పామనుచు
అతివ యల్లన లేచి ఆవలి కేఁగె
సతి యంతలోఁ గొలన జలకేలి కేఁగి యది
మతిఁ బొంగుజలధనుచు మారుమో మిడియ (యె?)॥అదియే॥

తరుణి తామర యిల్లు తపనమండలమనుచు
అరమరచి కాఁకలనె యలసె నదివో

మరిగి మట్టెల రవము మంత్ర శాస్త్రంబనుచు
వెర వెడలి తనలోనె వెరగందె నదివో ॥అదియే॥

చెలియె దన కుచగిరులు శ్రీ వేంకటాచలపు
నిలువు శిఖరములనుచు నిధుల నిలిచె
వలచి శ్రీ వేంకటేశ్వరుఁ డపుడు గూడఁగా
తలఁపులును దనువులను తారుకాణాయ ॥అదియే॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం24,పుట118,సంకీర్తన176)

దశ విధ విప్రలంభావస్థలు చెలిలో కనిపిస్తున్నాయని చెలులు నాయిక విరహం చూసి విలపిస్తున్నారు.

నాయికకి ఎక్కడ చూసినా ప్రతి వస్తువులోను, ప్రాణిలోను, స్వామి పరివారం స్వామి సంబంధిత ప్రతీకలే కనిపిస్తున్నాయి. కలవరింతలు అధికమైనాయి. ఆమె మెలకువలోనే ప్రలాపిస్తున్నది. తాను పవళించిన పానుపుని చూసి శేషతల్పమని భ్రమించింది. జలకాలాడే వేళ జలం తాకగానే దానిని శ్రీవారికి నెలవైన క్షీర సాగరంగా భావించి కలవరపడింది. తామర పూవును చూడగానే ఇది తపనుడి నెలవని భావించి, సూర్యనారాయణుడిగా సంభావించి 'ఓపలేన'ని కేకలు వేసింది. మట్టెల రవం వినగానే స్వామిని ఆరాధించే మంత్ర శాస్త్ర ధ్వనులని భావించి స్వామి తలపుకు రాగానే నివ్వెర బోయింది. తన కుచగిరులని చూసి వేంకటాచలము నిలువు శిఖరాలని నిలిచిందట ఆ నాయిక. ఇంతటి విరహాతిశయం స్వామిలో కూడా కనరాదని చెలులు విస్తుబోతున్నారు.

ప్రతి చరణంలోను రెండేసి పాదాల్లో అర్థం సంపూర్ణమయి విరిగి నడక నియమితమవుతున్నది. మొదటి చరణంలోని ప్రాసతో ప్రయుక్తమైన "పానుపే పామనచు" పదంలోని దీర్ఘాక్షరం ఆమె ఆందోళనను సూచిస్తున్నది.

రెండవ చరణంలో నాయిక తామరను చూసి, తామర దాచుకున్న సూర్యుని వెలుగులను ఓపలేక సూర్య నారాయణుడని సంభావించి, విరహంతో 'కాకలని' కేకలే వేసింది. ప్రాసతో కూడిన ఈ పదంలో పైభావాన్ని "అదివో" చూడమని ఆ దృశ్యాన్ని భావచిత్రం ద్వారా సూచిస్తున్నాడు. ఆ దీర్ఘాక్షరం అది"వో" ఈ దృశ్యాన్ని

భావచిత్రాన్ని రూపింపచేస్తున్నది. మగువ తన మట్టెల చప్పుడే స్వామిని బంధించే మంత్ర శాస్త్ర ధ్వనులుగా భావించి వెరగందిన తీరు భావ చిత్రాన్ని రూపింప చేస్తున్నది. దీనిని దర్శించటానికి కూడా "అదివో" అని అన్నమయ్య సంబుద్ధ్యంత దీర్ఘాక్షరం ప్రయోగించాడు.

7. **ఉన్మాదం:** "ఔత్సుక్య సంతాపాది కృత మనో విపర్యాస ప్రియాశ్రిత వృధా వ్యాపార ఉన్మాదః[15]

విలంబాన్ని ఓర్చలేక, ఔత్సుక్యం సంతాపం చేత ఏర్పడిన బుద్ధి భ్రంశం వలన కలిగిన ప్రియా సంబంధ వ్యాపారము ఉన్మాదము.

పతి మీది తమకంతో ఆ చెలి సర్వం మరిచింది. భ్రమలతో మరోలోకంలో కనిపించే నాయికని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

రాగం: హిందోళ వసంతం

పతి మీది తమకాన భ్రమసితి వింతే నీవు
అతివరో వెఱపేలే అవే నీవు కావా ॥పల్లవి॥

చందురుఁ డితఁడు గాఁడే సతి నీ నెమ్మోము గాని
పొంది నీ నీడ జలధిఁ బొడ చూపెను
మందా నిలుఁడు గాఁడె మగువ నీ వూర్పు గాని
గంధపుఁ గొండఁ దాఁకి కమ్మరా నేతెంచెను ॥పతి॥

కోవిల కూఁతలు గావె కొమ్మ నీ యెలుఁగు గాని
యీవలఁ బ్రతి ధ్వనులై యెగసె వనానను
పూవుల మొగ్గలు గావె పూఁప నీ చన్నులు గాని
తావుల వసంత మాడఁ దలలెత్తెఁ బొదల ॥పతి॥

చిక్కుల మరుఁడు గాఁడె శ్రీ వేంకటేశుఁడు గాని
తక్కి నీ మనసు చూచి దగ్గరె భావమున
యిక్కువ లంటి కూడతి రిద్దరూఁ బానుపు మీఁద
మొక్కు గాదు మోపు గాని ముంచి నీపై వేసెను ॥పతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం20,పుట33, సంకీర్తన 48)

ఈ నాయిక నీటిలో తన బింబాన్ని చూసి చంద్రుడేమో అని భ్రమ పడింది. తన గంధపు కొండల పరిమళం మోసిన పూర్వని తెలియలేక వెలుపలి గంధపు కొండల పిల్లగాలిలా భ్రాంతి పడిందట. తన విరిసిన చన్నులను పూవుల మొగ్గలుగా సంభావించింది. పతి మీది ఇన్ని భ్రమలతో సృష్టిలోని అందాలన్నీ తనలోనే నింపుకొన్న ఆ అతివ తనలోని ప్రకృతిని వెలుపలి ప్రకృతిగా పొరబడి పతి ఆగమనాన్ని కూడా గుర్తించలేక శ్రీ వేంకటేశుని చిక్కుల మరునిగా భావించి కలిగినదట. ఈ భ్రమలన్నీ చెలి ఉన్మాదాన్ని సూచిస్తున్నాయి.

మొదటి చరణంలో నాయికకు భ్రమ కల్పించిన చందురుడు, నీడ, మలయానిలుడు గంధపు కొండల్లోని 'డ' కారం ఆమె ఆందోళనతో కూడిన చిత్తవృత్తిని సూచిస్తుంది.

ప్రతి చరణంలోను మొదటి మూడు పాదాల్లోని సంబోధనార్థకం లోని దీర్ఘాక్షరం "కాదే"లో ఈ సంకీర్తనకు జీవమైన లయ కనిపిస్తుంది. ఆమె భ్రమలో, ఉన్మాదంలో ఉన్నది. జాలితో అనునయిస్తూ ఆమె భ్రమకు నివ్వెరపోతూ చెలులు ఎలుగెత్తి ఆమె భ్రమలను దూరం చేస్తున్నారు. నీ చెలువమే కాని ప్రకృతి అందాలు "కావే" అంటూ అనునయిస్తున్నారు. ఆమె ఉన్మాదం ఈ దీర్ఘాక్షర రూపంలోని లయలో ప్రతిబింబిస్తున్నది.

8. **వ్యాధి:** "మదన వేదనా సముత్థ సంతాప కార్శ్యాది దోషో వ్యాధిః[16]

మదన బాధ చేత కలిగిన జ్వర కార్శ్యాది దోషము వ్యాధి.

మదనుడు పరివార సమేతంగా నాయికను బాధిస్తున్నాడు. మదన తాపంతో వ్యాధిని నాయిక పొందటం వలన సర్వశక్తులూ ఆమెను వీడాయి. కళలన్నీ ఆమె నుండి తొలగాయి. అప్పుడే ప్రకృతి ఆమె వీడిన అందాలను గ్రహించి శోభిల్లింది.

రాగం: ముఖారి

ఎట్టు గడపీనో దైవ మింతికి నీ గండ మిఁక
ముట్టి వచ్చి ఇరుమేల మోహరించెఁ బనులు ॥పల్లవి॥

జలజాక్షి మోము వాడె చంద్రుఁడు కళలు గూడె
కలికి కన్నులు మూసె కలువలు లాసె
బలువూరుపులు దాఁగె పయ్యరగాలి రేగె
కులుకు మాట లణఁగె కోవిలలు గొణఁగె ॥ఎట్టు॥

చింతఁ జెలిమేను చిక్కె చిగురు కెంజాయ లెక్కె
వింత నవ్వులెల్లాఁ గుంగె వెన్నెలలు పొంగె
దొంతిఁ దురుము విరిసె తుమ్మిద మూఁక మొరసె ॥ఎట్టు॥
మంతనాలు కరవాయ వరుఁడు యెరవాయ

చనుఁగొంగెడలె పంచశరు టెక్కము వెడలె
వెనువెంట బులకించె విరులెల్ల c బొంచె
యెనసి శ్రీ వేంకటేశుఁడింతి నిట్టె కూడఁగాను
నను పిట్టె సేయఁ దమిఁ నచ్చు గనమాయె ॥ఎట్టు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం22,పుట20, సంకీర్తన 29)

జలజాక్షి ముఖము వాడగానే చంద్రుదు కళలను పొందాడు. ఆమె కన్నులను మూయగానే కలువలు కళలాడి వికసించాయి. ఆమె నిట్టూర్పులతో పైరగాలి విజృంభించింది. ఆమెకు మాటలు క్షీణించగానే కోయిలలకు గళం విప్పే ధైర్యం చిక్కింది. చింతలతో చెలిమేను చిక్కగానే చిగురులకు సొగసులు చేరాయి. నాయిక నవ్వులు కుంగాయి. వెన్నెలలు పొంగాయి. ఇంతి కొప్పు విరిసింది. తుమ్మెదల మూకలు మెరిశాయి. పడతికి ముచ్చట్లు కరువయినాయి. మరుడు విజృంభించాడు. నాయిక చన్నులు దీనత్వాన్ని పొందాయి. మదనుడి ధ్వజం నిక్కి చూసింది.

పల్లవిలో మొదటి పాదంలోనే నాయిక చెలులు "ఎట్టుగడపీనో" అనే పదంలోనే నాయిక 'వ్యాధి' రూప విరహం లయాత్మకంగా వ్యక్తం అవుతున్నది.

ప్రతి పాదంలోను నాయిక కళలు కుంగి, ప్రకృతి కళలు నిండటం ప్రాసతో కనిపిస్తుంది. వాడె, కూడె; మూసె, లాసె; దాగె, రేగె; చిక్కె, ఎక్కె; కుంగె, పొంగె; విరిసె, మొరసె; ఇత్యాది పదాల సమానత్వం కళలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. ఆమె హృదయగతిలోని వేదనను నిరూపిస్తున్నాయి.

9. **జడత:** "విరహ వ్యధా మాత్ర వేద్య జీవ నాద స్థానం జడతా"[17]

విరహవేదన చేత సర్వవ్యాపారాలు మాని స్తంభించుట జడత.

రాగం: ఆహిరి

ఆకెకును నీకుఁ బాయని చుట్టరికము గన
చేకొందు విప్పుడే విచ్చేయవయ్యా ॥పల్లవి॥

ధర గొలని తామరలు తపనుఁడుదయంబైన
విరివిఁ జెంగలించి వికసించును
తెరవ ముఖ కమలమైతే నీవు రాకుంటే
వెర వార నాయకుఁడు వికసించదు ॥ఆకె॥

సంతతముఁ గలువ లివి చందురుని రాకలకు
వింతగాఁ బైపేనే వికిసించును
యింతి యీ కనుఁగవ లివియైతే నీ వదన
కాంతి చంద్రుడు రాక కడు విరియపు ॥ఆకె॥

మినుకు మయూరములు మేఘోదయంబైన
తన యిచ్చ వేడుకల తగనాడును
యెనలేని శ్రీ వేంకటేశ యిటువలె నేఁడు
వనితఁ గూడక యున్న వహికెక్కదు ॥ఆకె॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం23,పుట390,సంకీర్తన 584)

తామరలు తపనుడు ఉదయించనిదే వికసింపక పోవటం సహజం. ఈ ప్రకృతి ధర్మాన్ని పురస్కరించుకుని, ఆమె ముఖ కమలం శ్రీవారనే భానుడు లేకపోవటం వలన వికసింపక ముడుచుకుని జడత్వస్థితిని పొందిందని అన్నమయ్య చమత్కరించాడు.

కలువలు చంద్రుని రాకతో వికసిస్తాయి. అదే రీతిగా నాయిక కనుకలువలు స్వామి వదన చంద్రోదయం కాకపోవటం వలన వికసించలేదట. ఇందులో ఆమె వదనంపై స్వామి అనే చంద్రుడి కాంతులు విరిస్తేనే ఆమె కన్నులు కలువలు వికసిస్తాయని, అంతవరకూ ఆమె ఉన్నది జడత్వస్థితిలోనేనని అన్నమయ్య వ్యంగ్యంగా చమత్కరిస్తున్నాడు.

ప్రతి చరణంలోను మొదటి రెండు పాదాల్లో ప్రకృతి ధర్మం వర్ణించబడింది. మూడవ పాదంలో నాయికని సూచించే ప్రతీకలోని లయ వ్యతిరేకార్థంలో విరహాన్ని సూచిస్తున్నది. అయితే, రాకుంటే పదాల్లోని దీర్ఘాక్షరాలు ఈ అర్థాన్ని వ్యంజింప చేసి విరహంలోని తీవ్రతను తెలియజేస్తున్నాయి. వ్యతిరేకార్థంలో నిర్మించిన 'వికసించవు, విరియవు, వహికెక్కదు పదాల్లో ఆమె విరహంలోని జడత్వ స్థితి వ్యక్తం అవుతున్నది.

అమంగళకరమైన పదవ విప్రలంభావస్థ 'మరణం' శ్రీవారి నాయికలకెవరికీ సంప్రాప్తించదు కాబట్టి దానిని వదిలి వేయటం జరిగింది.

ఈ విధంగా సంభోగ విప్రలంభ శృంగారాలు భగవద్విషయంగా వ్యక్తం అయి, మధుర భక్తితో వాక్యలయలో నిండి దార్శనికుల దృక్పథానికి మాత్రమే అందుతూ శృంగార మోక్ష సామ్రాజ్యాలను ఏకకాలంలో అందిస్తున్నది.

పాద సూచికలు:

1. కావ్యాలంకార సంగ్రాహం : సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పు. 170
2. కావ్యాలంకార సంగ్రహం : సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పు. 170
3. కావ్యాలంకార సంగ్రహం : సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పు. 171
4. అలరులు కురియగ నాడినదే : ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 12-5-82 శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావు
5. సమగ్ర ఆంధ్ర సాహిత్యం : ఆరుద్ర పుట. 148
6. కావ్యాలంకార సంగ్రహం : సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
7. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య పుట. 130
8. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య పుట. 131
9. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య పుట. 132
10. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 133
11. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 134
12. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 134
13. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 135
14. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య పుట. 136
15. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 136
16. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య పుట. 138
17. రసమంజరి : వేదం వెంకటరాయశాస్త్రి వ్యాఖ్య (పరిష్కర్త) పుట. 138

అన్నమయ్య నాయికా ప్రస్థానం

4

అన్నమయ్య నాయికా ప్రస్థానం

అన్నమయ్య నాయికా ప్రస్థానం బహు విచిత్రం. లక్షణ శాస్త్రాన్ని అనుసరించి భిన్న అవస్థల్లో కనిపించే నాయికలొకవైపు, ఒకే సంకీర్తనలో అనేక అవస్థల్లో భాసించే నాయికలు మరొకవైపు కనిపిస్తారు. జాతిపరంగా పద్మినీ, హస్తినీ, చిత్రిణీ, శంఖిణీ స్త్రీలతో బాటు మోహినీ రాగిణీలను కూడా అన్నమయ్య పేర్కొన్నాడు.

ఈ పదాల్లోని నాయికల్లో సీతలు, రుక్మిణులు, సత్యభామలు మొదలయిన పురాణ నాయికలు ఆయా గుణ విశేషాలతో కనిపిస్తారు.

అవస్థా భేదాలననుసరించి అనంత కోటి స్వరూపాలు దాల్చిన నాయికల్లో లౌకిక శృంగారం అంతా మూస పోసినట్లు కనిపించినా, పారలౌకిక దృష్టితో సంభావిస్తేనే మధుర భక్తి దర్శనం కలుగుతుంది. ఈ దర్శనానికి నాయికాపరంగా సాగిన ఉపాధి శృంగారం. ద్రష్టకి భగవద్రతిని, జీవాత్మ పరమాత్మల తాదాత్మ్య భావాన్ని స్ఫురింప చేయడానికి ఈ శృంగారం ఒక సాధనం.

ఈ నాయికల మధుర భక్తి భిన్న అవస్థల్లో, విభిన్న చిత్తవృత్తుల్లో, భిన్న సంస్కారాల్లో, అనంతకోటి రూపాల్లో అభివ్యక్తమౌతున్నది. ఈ నాయికల చిత్తవృత్తుల, సంస్కారాల, ప్రవృత్తుల నిరూపణ ద్వారా మధుర భక్తిరూపాన్ని అవగాహన చేసుకోవటానికి వాక్యలయ సాధనంగా ఎలా ఉపకరిస్తుందో అనుశీలించటం ఈ నాయికా ప్రస్థానం లక్ష్యం.

చిత్తవృత్తుల పరంగా ఈ సంకీర్తనలను వివేచించి వారి సంస్కారాలను ప్రవృత్తులను మధుర భక్తిని నిరూపించడం జరుగుతున్నది.

1. క్రోధం:

శ్రీవారి గుట్టు బయట పడింది. అలిగిన నాయిక కోపాన్ని చెలులిలా సూచిస్తున్నారు.

రాగం: శుద్ధ వసంతం

ఆ సుద్దులన్నియు c జెలి నడుగరాదా
సేస వెట్టితివి నీ చేతి దాయ వలపు ॥పల్లవి॥

పొంకముగా నెవ్వతెతో పొందుసేసి వచ్చితివో
జంకెన చూపుల నీకె సాదించీని
లంకెల నప్పటి మరి లచ్చన లేమిగనెనో
మంకువ మోవెంటించితే వొడ్డుకొనీని ॥ఆ సుద్దు॥

మేర మీరి వింత సొమ్ము మేన నీ కెంత వున్నదో
నారు కొన సెలవుల నవ్వు నవ్వీని
పేరుకొని మె వనిత పిలుcగ వినెనో
వూరకే మాటాడcగాc జెవులు మూసుకొనీని ॥ఆ సుద్దు॥

పురము గంద మెవ్వరి వొడల మెత్తినదో
గరిమc గాc గిలించితే కదులోcగీసి
మరిగి శ్రీ వేంకటేశ మనసెట్టు దెలిసెనో
సరుగ నిన్నుc గూడి సన్నసేసీని ॥ఆ సుద్దు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట245, సంకీర్తన 366)

ఎవరితో పొందుల్లో తేలి వచ్చావో స్వామీ ! దేవి నిన్ను "జంకెన చూపులతో సాధిస్తున్నది. నీ వాలకం లక్షణాలు నిన్ను పట్టిచ్చాయి కాబోలు, మోవి తాకబోతే నాయిక ముఖం పక్కకు తిప్పుకుంటున్నది" అంటున్నారు చెలులు.

ఏ పడతి సొమ్ములు, సోకులు నీ పైన కనిపిస్తున్నాయో, ఏ పడతిని నీవు పిలువగా విన్నదో, నీ పిలుపు వినగానే ఈ నాయిక చెవులు మూసుకుంటున్నది. "ఏ పడతిని మేను కందేలా కౌగిలించేవో, ఈ నాయిక కౌగిలించబోతే పెనగి విడిపించుకుంటున్నది" అంటూ నాయిక చేతల్లో వ్యక్తం చేసిన కోపాన్ని చెలులు వ్యాఖ్యానించి చెబుతూ శ్రీవారిని అదలిస్తున్నారు.

పల్లవిలోని ప్రశ్న "ఆ సుద్దులన్నియు చెలి నడుగరాదా?" అనడం లోని లయ లోనే శ్రీవారి చాటు మాటు శృంగారాన్ని అధిక్షేపించడం వినిపిస్తున్నది. ప్రతి

చరణం లోనూ మొదటి మూడు పాదాల్లో శ్రీవారి అన్యకాంతా సంభోగ నిరూపణ జరుగుతున్నది. రెండు నాలుగు పాదాల్లో నాయిక ఆంగిక విన్యాసం ద్వారా ఆమె క్రోధం వ్యక్తమవుతున్నది. మొదటి పాదాంతంలోని గురువు ద్వారా అన్యకాంతా సంభోగాన్ని సందేహంగా కాక నిశ్చయత్వ రూపంలో చెప్పి, రెండవ పాదాంతం లోని లఘువు ద్వారా నాయిక క్రోధానికి సమర్థన జరుగుతున్నది.

ఈ సంకీర్తనలో పాటించిన ప్రాసలో నాయిక చిత్తవృత్తి రూపు కడుతున్నది. జంకెన చూపులు, సెలవుల నవ్వులు, ఇతర చేష్టల ద్వారా కోపాన్ని వ్యక్తం చేసింది. స్వామిని "అడ్డుకొని, చెవులు మూసుకొని, కడు పెనగి ఆయన అన్యకాంతా సంభోగం తనకు కలిగించిన క్రోధాన్ని" వ్యంగ్యంగా సూచించింది. ఈ సంకీర్తన ప్రధానంగా లఘ్వక్షర ప్రధానం. లఘువుల మధ్య విరామం తక్కువ. జంకెనలు, లంకెలు, వుంకువలు, లచ్చనలు, సెలవుల నవ్వులు, సాధింపులు మొదలయిన పద నిర్మాణంలోని లాలిత్యం ఆ వర్ణాల సముదాయంలో స్పష్టమయి, ఆమె చిత్తంలోని దుస్సహమైన ఈర్ష్యతో కూడిన క్రోధాన్ని స్ఫురింపజేస్తున్నది. స్వామి 'తనకొక్కడికే స్వంతం' కావాలనుకునే బేలతనం కనిపిస్తుంది.

2. విరహం:

ఏదయినా సంభవమే కాని విరహబాధని అతిక్రమించడం అసంభవం అంటున్నది నాయిక

రాగం: సౌరాష్ట్రం

ఏమి చెప్పేరే బుద్ధులెందాక జెలు లాల
దోమటి కింతే కలితే తోడితేరే పతిని ॥పల్లవి॥

నెలకొని పారే పాము నిలుపఁ వచ్చుఁ గాక
వలపెందైనా నిలుపఁగ వచ్చునటవె
లరి సూర్యుని c జేత నణఁచఁగ వచ్చుఁ గాక
నలువంక విరహ మణఁచ వచ్చునటవె ॥ఏమి॥

కడలేని యేరైనాఁ గట్టి వేయవచ్చుఁ గాక
వడి నాస మూట గట్టవచ్చు నటవె

సుడివడఁ బౌజు లచ్చుగ నాఁప వచ్చుఁ గాక
అదరిన తమకము లాఁప వచ్చునటవె ॥ఏమి॥

అల సముద్రము దాఁటనైనాను వచ్చుఁ గాక
వలరాజు నాజ్ఞ దాఁట వచ్చు నటవె
యెలమి శ్రీ వెంకటేశుఁడే నలమేలు మంగ ను
కలశ (సె) నితనిఁ బాయఁగా వచ్చు నటవె ॥ఏమి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట284, సంకీర్తన 425)

ఎంతటి బాధనైనా కొంత వరకు ఓర్చుకోవచ్చును. కాని విరహ బాధ ఆపలేనిది, ఓపలేనిది. పారే పాముని ఆపవచ్చునేమోకాని ప్రవహించే వలపును ఆపగలమా? సూర్య గమనాన్ని చేతితో అణిచి వేయవచ్చునేమో కాని వలపుల గమనాన్ని అణచటం సాధ్యమా? కడలేని ఏరును కట్టివేయవచ్చునేమో కాని ఆశలను మూట కట్టడం అసంభవం కదా!! చతురంగ బలాలను ఆపవచ్చేమో కాని తమకాలను జయించడమే కష్టం. సముద్రాన్ని దాటడం సాధ్యమేమో కాని వలరాజు ఆజ్ఞని దాటడం అసంభవం.

"సృష్టిలో అసాధ్యమైన విషయాలన్నింటినీ సాధించవచ్చునేమో కాని విరహ బాధని అధిగమించటం అసంభవం" అని ఆ నాయిక తన విరహబాధని వ్యక్తం చేస్తున్నది.

ప్రతి చరణంలోను ప్రతి పాదాంతం లోను 'వచ్చు' అనే క్రియా రూప పదం కనిపిస్తున్నది. మొదటి పాదంలో ప్రతి పాదించబడిన అసాధ్యమైన విషయాన్ని ఈ "వచ్చు" అనే పదం సమర్థిస్తున్నది. ఇదే పదం రెండవ పాదంలో 'వలపును జయించటం అసంభవం' అనే విషయాన్ని నిర్ధారిస్తున్నది. రెండవ పాదాంతంలో "వచ్చు" పైన "అటవె" అనే ప్రశ్నార్థకంలోని వాక్య లయ ద్వారా అసంభవత్వాన్ని అవలీలగా మార్చి, విరహ బాధను అధికతమమైన, అసాధ్యమైన బాధగా నిరూపించి, తద్వారా ఆమె చిత్తగతిలోని విరహాతిశయాన్ని రూపు కట్టించాడు అన్నమయ్య.

3. సిగ్గు:

నవోఢయై, కొత్త పెళ్ళికూతురై లజ్జా భయాలే ఆభరణాలైన ఒక బేల అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తున్నది.

రాగం: బౌళి

ఎందుకని సిగ్గుపడే వేమే నీవు
కందువ నా పచ్చడము గప్పుకోవే యిపుదు ॥పల్లవి॥

ముదిత జారిన కొప్పు ముడుచుకో గడగితే
వదలి పయ్యెద కానవచ్చె జన్నులు
అది చక్కబెట్టుకొనేనంటా గొంగు బిగించితే
పొదిగి కట్టినయట్టి పోకముడి వీడెను ॥ఎందుకని॥

సరుగ నా వలిపెమే చక్కగట్టుకొనగాను
గరిమ దొడల నిగ్గు గానవచ్చెను
పరగ నందుకు లోగి పాపట దువ్వుకొంటే
కరమూలముల సొంపు గడు బయలాయను॥ఎందుకని॥

చెలరేగి యందుకు నవ్వి చేత విడెమిచ్చితేను
పులకలే నీ మర్మములు దెలిపె
అలమితి నందుకుగా నట్టె శ్రీ వేంకటేశుడ
చెలపల చెమటలు చెమరించె నీకును ॥ఎందుకని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట90,సంకీర్తన 90)

సిగ్గుల మొగ్గ అయిన ఆ నాయికను చూచి పరిహాసంగా తన పచ్చడము కప్పుకోమని చెలి పలుకుతున్నది.

ఆ నాయిక తలపుల్లో మునిగింది కాబోలును, కొప్పు జారింది. జారిన కొప్పును చక్కబెట్టుకోబోతే, చన్నులు పయ్యెద నుండి బయటపడి కాన వచ్చాయి. చన్నుల అందాలను చక్కబెడదామని కొంగు లాగి బిగించి కడితే, మొత్తం అందాలను పోకముడి వీడి తనువుని ప్రదర్శించింది. పోనీ ఆ చీరనే చక్కగా కట్టబోతే, తొడల నిగ్గులు బయట పడినాయి. పాపిడి దువ్వుకోబోతే, కరమూల రుచులు విందులు చేశాయి. ఎంతో నేర్పుగా తన అందాలను దాచుకోబోతున్నట్లు నటిస్తూ మరింత నేర్పుగా ప్రదర్శించే ఆ అతివ చెలరేగి నవ్వి విడెమిచ్చిందట. ఆమె మేని పులకలు ఆ రహస్యాలన్నింటినీ, మర్మాలన్నింటినీ తెలిపినవట.

సిగ్గుల మొగ్గ అయిన ఆ బేల మనస్సును మొదటి చరణంలోని మొదటి పాదంలో శత్రర్థక వర్ణం "ముడుచుకోగడగితే" ఆమె అందాలను దాచే ప్రయత్నాన్ని సూచిస్తూ, ఆమె ఉద్దిష్టార్థం నిజానికి అది కాదని నిరూపిస్తుంది. "తే" అనే వర్ణంలో ప్రయత్నం ఒక అర్థాన్ని, లక్ష్యం మరో భావనను వ్యంజింప చేస్తున్నాయి. ఈమె లక్ష్యం "సౌందర్య ప్రదర్శనే" అనే భావాన్ని 'కానవచ్చె' లోని దీర్ఘాక్షరం నిరూపిస్తున్నది. అందాలని ఎత్తి చూపుతున్నది.

మొదటి చరణం లోని మూడవ పాదంలో చక్కబెట్టుకొనేనం'టా' లోని దీర్ఘాక్షరం అందాన్ని దాచుకోవటానికి చేసే నటనగా కనిపిస్తే, నాల్గవ పాదంలోని 'పోకముడి వీడెను' లోని దీర్ఘాక్షరాలు ప్లుత గతిని పొంది అందాన్ని ప్రదర్శించే రీతిని సూచిస్తున్నాయి.

రెండవ చరణంలో చక్కగట్టుకొన'గా'ను లోని దీర్ఘాక్షరం సౌందర్యానికి అరచాటుగాను, తొడల నిగ్గు చూపటానికి, 'గా'న వచ్చెను లోని దీర్ఘాక్షరం సౌందర్య ప్రదర్శనకుగాను ప్రయుక్తమైనాయి.

మూడవ చరణంలోని మొదటి పాదంలోని చేదర్థకంలో ప్రయోగించబడిన విడెమిచ్చి'తే' పదం ఆమె మనస్సులోని కోరికకు అద్దం పడితే, "పులకలే నీ మర్మములు"లో దీర్ఘాక్షరాలు ఆమె మనస్సులోని కోరికను నిరూపిస్తున్నాయి. పులకలే "నీ మర్మములు" లోని దీర్ఘాక్షరాలు ఆమె మర్మాలకు వ్యంజకాలయినాయి. ఈ వాక్యలయ ద్వారా ఆమె చిత్తవృత్తిలోని సిగ్గు, కోరిక వాచ్యంగా కాక వ్యంగ్యంగా వ్యక్తం చేసే రీతి రమణీయంగా కనిపిస్తుంది.

4. వైరం:

స్వామి నేరాలకు అలిగి సాంత్వనాలకు లొంగక రత్యౌదాసీనాన్ని నటిస్తూ వైరాన్ని ప్రకటిస్తున్న నాయిక అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తుంది.

రాగం: ఆహిరి

చెలులాల వాని సుద్ది చెప్పకురే నా తోడ
పలుకుల వెంగెమేల పగమేలు గాక ॥పల్లవి॥

మనసు రాని చోటికి మంతనాలు గొన్నా
యెనకుల వాదులైన మేలుగాక
చనవు లేని చోటికి సరసాలు గొన్నా
మునుకొన్న అవ్వలిమోములు మేలుగాక ||చెలులాల||

గురుతు మఱచినచో కూటువ మొక్కులు గొన్నా
మెఱయని తెర మాటే మేలుగాక
జఱయుచుండేటి, చోట చనవులు చూపేవీ గొన్నా
కుఱ కుఱ బీరముల గుట్టు మేలుగాక ||చెలులాల||

చిత్తజ కేలి చోటను సిగ్గులును గొన్నా
యెత్తిన దేహ మొప్పించు టెక్కువ గాక
హత్తిన శ్రీ వెంకటేశుడాదరించి నన్ను గూడె
కొత్తగా నన్నియ నియ్యకొంట మేలుగాక ||చెలులాల||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం22, పుట68, సంకీర్తన 101)

నాయిక పట్ల స్వామి చాలా పెద్ద నేరమే చేసినట్లు ఆమె వాలకం, దుఃఖం, రోషం, పరుష వాక్కులు స్పష్టం చేస్తున్నాయి. "వాని సుద్ది" కూడా వినదట. 'పలుకుల వెంగమే' కాదు చివరికి 'పగమేలుగాక' అంటూ స్వామి తన చెంత చేరి ఎంత శృంగారపు టక్కులు చూపినా రత్యోదాసీనాన్ని ప్రకటిస్తున్నదీ నాయిక.

"మనసు లేని చోట మంతనమెందుకు? చనువు లేనపుడు సరసాలెందుకు? సరసాల గురుతులు మరచిన తరువాత "కూటువ మొక్కుల"తో నాకేమిటి పని? ఇంతకన్నా తెరమాటే నయం. నీ ఇష్టం వచ్చినట్టు సంచరించి చనవులు చూపితే మెచ్చను. ఇంతకన్నా గుట్టుగా ఉండటమే నయం" అంటున్నదా నాయిక.

పల్లవిలోనే నాయిక "వాని సుద్ది" కూడా చెప్పవద్దని, ఇంతకన్నా "పగమేల"ని తన వైరాన్ని సూచిస్తున్నది. ప్రతి చరణం లోను రెండు పాదాల్లో అర్థం సంపూర్ణమవుతున్నది. ప్రతి చరణంలోను మొదటి పాదంలోని వాక్యం పూర్వార్థంలో శ్రీవారి నేరాన్ని సూచిస్తూ, ఉత్తరార్థంలో శ్రీవారి నయగారాలను నిరూపించడం జరిగింది. రెండవ పాదంలో 'పగయే మేలనే' భావం స్థాపించబడింది. ఆమె వైరం ఇలా మూడు స్థానాల్లో తార్కికంగా నిరూపించబడింది.

'మనసురాని చోటికి', 'చనవులేని చోటికి', 'గురుతులు మరచినచో', 'జఱయుచుండేటి చోట', 'చిత్తజ కేలి చోట', 'సిగ్గులు గొన్నా' పదాల్లో శ్రీవారి నేర నిరూపణ జరుగుతున్నది. వాక్యం పూర్వ ఉత్తర భాగాల మధ్య భాసించే విరామం శ్రీవారి నేర నిరూపణను వ్యంజింప చేస్తున్నది. "మంతనాలు గొన్నా", "సరసాలు గొన్నా", "కూటువ మొక్కులు గొన్నా", "చనవులు చూపేవీ గొన్నా", "సిగ్గులును గొన్నా" పదాల్లోని పాదాంత దీర్ఘాలు శ్రీవారి ప్రేమలన్నింటినీ నయగారాలుగా టక్కులుగా నిరూపిస్తున్నాయి. ఇంతకంటే విశిష్ట పదం 'గాక' రెండవ నాల్గవ పాదాంతంలో ప్రయోగించబడింది. నిశ్చయార్థకంలో స్వామి ప్రేమలన్నీ 'వ్యర్థం' అనే అర్థంలోను, 'పగయే మేలనే' అర్థం లోను ఈ 'గాక' పదం 'యెనకుల వాదులైన మేలుగాక', 'మునుకొన్న అవ్వలి మోములు మేలు గాక', 'మెఱయని తెఱమాటే మేలు గాక', 'గుట్టు మేలు గాక', పదాల్లో ప్రయుక్తం అయింది. ఈ 'గాక' అనే పదం నిశ్చయాత్మక భావ నిరూపణకు పోతన భాగవతంలో కూడా ప్రయుక్తమయింది.

సీ॥ కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే? పవన గుంభిత
 <u>చర్మభస్త్రిగాక</u>
 వైకుంఠు ఁ బొగడని వక్త్రంబు వక్త్రమే ? ధమ ధమధ్వని
 <u>తోడిఢక్కగాక</u>
 హరి పూజనము లేని హస్తంబు హస్తమే ? తరుశాఖ
 <u>నిర్మితదర్విగాక</u>
 కమలేశుఁ జూడని కన్నులు కన్నులే ? తను కుడ్య జాల
 <u>రంధ్రములుగాక</u>

చక్రి చింత లేని జన్మంబు జన్మమే?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే ?
పాద యుగము తోడి <u>పశువుగాక</u>

పోతనామాత్యుడు శ్రీమద్భాగవతం సప్తమ స్కంధం (అధ్యాయం 5, 170వ పద్యం)

వ్యతిరేక రూపంలో భావాన్ని నిశ్చయాత్మకంగా నిరూపించటం మనకు ఈ పద్యాల్లోని వాక్యలయలోనూ వినిపిస్తుంది.

5. ధిక్కారం:

శ్రీవారిని సఖులు 'అడుగు పెడితే మా సఖి పై ఆన' అంటూ అదిరిస్తూ, బెదిరిస్తూ హితబోధలు చేస్తున్నారు. ఆయనకు మాత్రం ఏ కాస్త అలిగే వీలు లేదని స్పష్టం చేస్తూ నాయిక ధిక్కారాన్ని వ్యంగ్యంగానూ, వాచ్యంగానూ కూడా వ్యక్తం చేస్తున్నారు.

రాగం: వరాళి

అడుగు వెట్టితే నీకాపె మీదాన
తొడిగి కొంగు వట్టితే తోసిపోవజెల్లునా ॥పల్లవి॥

నిద్దిరించే వేళ వచ్చి నీవు లేపగా జెలి
గద్దించి తిట్లు తిట్టి కసరె గాక
కొద్దెరిగి నీ వుండితే కోపగించునా యాపె
అద్దో నీ వింతలోనె మారలుగ జెల్లునా ॥అడుగు॥

చదురంగ మాడే వేళ జాణతనాలాడగాను
తుది నిన్ను జేతబట్టి తోసెగాక
యెదుటనె వోరిచితే నింత సేసునా యాపె
కదిసి నీ విందుకుగా గాంతాళించ జెల్లునా ॥అడుగు॥

పాటలు పాడేటివేళ పైకొని కాగిలించగ
తాటించి తా కొనగోరు దాకించె గాక
యీటున శ్రీ వేంకటేశ యిందు కిట్టె కూడితివి
చీటికి మాటికి నీకు సిగ్గువడ జెల్లునా ॥అడుగు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం16,పుట180,సంకీర్తన 269)

"నిద్దిరించే వేళ వచ్చి నీవు లేపగా చెలి గద్దించి 'తిట్లు తిట్టి కస' రిందే అనుకో!! అయితే మాత్రం కొద్దెరిగి నీ వుండితే కోపగించునా యాపె". అది

తెలుసుకోకపోగా "అద్దో నీ వింతలోనె మారలుగ జెల్లునా"? ఇది చెలి ధిక్కారానికి చిన్న బోయిన శ్రీవారి అలుకలో కూడా తప్పెంచే రీతిని, దానికి ఆశ్చర్యపోయే స్వభావాన్ని "నీవింతలోనె" పదం లోని లఘువు నిరూపిస్తున్నది. ఈ అలుకకు వింత పడుతూ "మారలుగ జెల్లునా" అంటూ ప్రశ్నార్థక రూపంలో ఆయన ప్రతి చర్యను నిషేధిస్తున్నారు చెలులు.

రెండవ పాదంలోని మొదటి చరణంలో శ్రీవారి నేరాన్ని 'జాణతనాలాడ గాను' అంటూ ఆ దీర్ఘాక్షరాలు నిరూపిస్తున్నాయి. 'చతురంగ మాడేవేళ' శ్రీవారి సరసం 'జాణతనం'గా నిరూపించబడింది. చెలి ధిక్కారం రెండవ పాదంలో చేతబట్టి తోయడంలో కనిపిస్తుంది. దీనికి సమర్థన "తోసెకాక" అనే పాదాంత లఘువులో కనిపిస్తుంది. నాల్గవపాదంలో శ్రీవారి అలుకను నిషేధిస్తూ "కాతాళించ జెల్లునా" అంటూ ప్రశ్నార్థక వాక్యలయ రూపంలో చెలులు ఆయనను ఖండిస్తున్నారు.

మూడవ చరణంలో శ్రీవారిపై నేరారోపణ కాస్త తగ్గింది. చెలి పాటలు పాడుతుండగా "కౌగిలించటమే" ఆయన చేసిన నేరం దీనికి ప్రతిచర్యగా కొనగోటితో గిచ్చిందట. దీనికి శ్రీవారు చీటికి మాటికి సిగ్గులు పడటం ఆయన చేసిన మరో నేరం. 'తాకించెగాక' అనే పదంలో లఘువు చెలి చేతను సమర్థిస్తున్నది. సిగ్గులను "సిగ్గుపడ జెల్లునా" లోని ప్రశ్నార్థక లయ శ్రీవారి సిగ్గులను నిషేధిస్తున్నది.

6. గర్వం:

స్వామి అందించిన ప్రేమ చేత అహంకరించి, ఆ గర్వాన్ని వక్రోక్తిగా వ్యక్తం చేసే ఈ నాయిక ప్రేమ 'గర్విత'గా అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తుంది.

రాగం: శ్రీరాగం

కాంత నీవు గలచోట కలిమి గలుగు చోటు
కాంతుని కితరమెల్లా గడగడ చోటు ॥పల్లవి॥

సతి నీ మోవెత్తుటే చంద్రోదయమౌట
అతివ నీ తలవంపు అస్తమానము
మితి నీ చూచిన చూపే మించిన సూర్యోదయము
రతి రెప్ప మూయుటే యా రవి యస్తమానము ॥కాంత॥

పొలతి నీవు నవ్వుటే పున్నమసెను బందుగ
యలసి కోపించుటే యమాస దినము
అలరి మాటాడినదే ఆమని కాలము నీవు
వొలసీ వొల్లమి నుండు టుడి వోవు గాలము ||కాంత||

యింతి నీవు గూడుటే యెన్నిక విరహ వేళ
అంతలో మైమఱచుటే యానందవేళ
పంతపు శ్రీ వేంకటాద్రి పతికి నీ విట్లనే
మంతనాన నుండుంటే మరుజన్మ వేళ ||కాంత||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం24,పుట109,సంకీర్తన 163)

కాంత లేని చోట కాంతునికి చీకటే. స్వామి ప్రేమను సంపూర్తిగా పొందిన ఆ కాంత మోమెత్తితే ఆయనకు చంద్రోదయం. తల వంచితే ఆయనకు అస్తమయం. ఆమె చూస్తే సూర్యోదయం. రెప్పమూస్తే అస్తమయం. నవ్వితే నాయకుడికి పండగట. కోపిస్తే ఆ రోజు ఆయనకు అమావాస్య. మాటాడితే ఆమని కాలం. బిగించి వూరుకుంటే ఎండా కాలమే. ఇన్ని అనుభూతులను ఎన్నో అవస్థా భేదాలతో ఉత్ప్రేక్షలో అనుభవించే ఆ నాయిక ప్రేమ గర్విత. ఒక్కొక హావ భావ చేష్టావిలాసాదుల్లో ఒక్కోరీతిగా ఆ నాయిక శ్రీవారికి దర్శనమిస్తున్నది. ఆమె పొందిన భర్త అనురాగం వక్రోక్తి రూపంలో తెలుపబడింది.

పల్లవిలోనే కాంత నెలకొన్న చోటు ఎంతటి ఆనందాన్ని కలిగించేనో ప్రస్తావించారు చెలులు. పైగా ఆమె విరహంలో స్వామి 'గడగడ' వణికిపోతాడట. ఈ ధ్వన్యనుకరణ శబ్దం శ్రీవారి విరహానికి, విరహంలోని ఆయన బాధకు ప్రతీక. ఆమె చెంత లేకపోతే స్వామి పొందే బాధను వర్ణించి, చెంత ఉంటే పొందే 'కలిమి'ని వర్ణించి పల్లవిలోనే అన్నమయ్య ఆమె ఎంత 'ప్రేమ గర్వితయో' ఎంత గడగడ లాడించగలదో వర్ణించాడు. వ్యక్తం అయ్యే స్వామి మనస్సు ద్వారా వ్యక్తావ్యక్తంగా వ్యంగ్యంగా నిరూపితం అవుతున్న నాయిక ప్రవృత్తి విశిష్టంగా కనిపిస్తుంది.

ప్రతి చరణంలోను ప్రతి పాదంలోను ఆమె ప్రతి ఆంగిక విన్యాసం శ్రీవారికి కలిగించే ఆనందం వర్ణించబడింది. ఏ పాదానికాపాదం సంపూర్ణార్థం కలిగి అక్కడ విరిగి నడక నియమితంగా కనిపిస్తుంది. పాదం పూర్వార్థంలో ఆంగిక

విన్యాసమే ఆనందానికి 'మూలం' అనే అర్థం స్ఫురింప చేయటానికి 'మోవెత్తుటే', 'చూచిన చూపే', 'రెప్ప మూయుటే', 'నవ్వుటే', కోపించు'టే', 'మాటాడిన'దే" 'గూడుటే' మైమఱచు'టే' మంతనాన ఉండు'టే' పదాల్లో దీర్ఘాక్షరాలు ప్రయోగించబడినాయి. ఈ వాక్యలయ ద్వారా ఆమె చిత్తంలో శ్రీవారి ప్రేమను సంపూర్ణంగా పొందిన గర్వం మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

7. ప్రార్థన:

శ్రీవారి చేతలకు అలిగి, ఆయన విరహంలో కూడా ఇలా నిందిస్తూ కూడా, ఆహ్వానిస్తూ ఆయనను ఈ విధంగా ప్రార్థిస్తున్నది.

రాగం: పాడి

మాను మనవే ఇట్టివి మా ఇంటికి రమ్మనవే
తానే యెరుగు నీ మాట తలచుకొమ్మనవే ॥పల్లవి॥

సరవి దప్పిన వేళ సతి తో నవ్వేవాడు
వరుసెరగని వాడె యట్టి పో కూళ
యెర పరికపు పొరుగింతితో నవ్వేవాడు
దొరయైన గానీ వాడే దొడ్డైన కూళ ॥మాను॥

వలవని వనితల వాకిలి దొక్కేవాడు
వలరాచ గురుడైన వాడెపో కూళ
తల వంచిన సతిని తప్పక చూచేవాడు
తొలుత నన్నందు కంటె దొడ్డైన కూళ ॥మాను॥

చిత్తమెరగని యట్టి చెలి జేరి కూకులును
వత్తులునై విరిగిన వాడెపో కూళ
చిత్తగించి నన్ను గూడె శ్రీ వెంకటేశుడే జాణ
తొత్తు వంటి దాకె పో దొడ్డైన కూళ ॥మాను॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం20,పుట28, సంకీర్తన 41)

శ్రీవారి రసికతని చూసి నాయిక ఇలా వ్యంగ్యంగా తన బాధను వ్యక్తం చేస్తున్నది. పొరుగింటి సతితో నవ్వేవాడు దొరైనా దుష్టుడే. వలవని వనితల వాకిలి తొక్కేవాడు రాచ గురువైనా దుష్టుడే. తలవంచిన సతిని తప్పక చూచేవాడు గొప్ప దుష్టుడు. చెలి చిత్త మెరుగక నయగారాలు చూపించే చెలికాడు మరీ పెద్ద దుష్టుడని శ్రీవారి దక్షిణ నాయకత్వాన్ని విమర్శిస్తూ ఆ నాయిక మానవతిగా అన్నమయ్య సంకీర్తనల్లో దర్శనమిస్తున్నది.

పల్లవిలో రెండు పాదాల్లోనూ దీర్ఘాక్షరాలు "మానుమనవే", "మా ఇంటికి రమ్మనవే", "తానే" "తలచుకొమ్మనవే" ఆమె హృదయంలో గల దుఃఖ భారాన్ని విరహ బాధను సూచిస్తున్నాయి.

దుఃఖభారంతో మనస్సు కరిగిపోతున్నా శ్రీవారు చేసిన నేరం, పరకాంతాసక్తి జ్ఞాపకం రాగానే హృదయ గతిలో ఆవేశం అధికమయింది. ఈ భావ నిరూపణకు "వరసెరగని వాడెయట్టి", "యెరపరికపు పొరుగింతి", 'వలవని వనితల వాకిలి', 'వలరాచ గురుడు', 'తల వంచిన సతి' పదాల్లోని అత్యంత స్వల్ప విరామంతో ప్రయోగించబడిన లఘువులు అర్థ వ్యంజకాలుగా ప్రయోగించబడినాయి.

ప్రతి చరణంలోని మొదటి పాదం స్వామి నేరాన్ని సూచిస్తూ రెండవ పాదం ఆయన కూళతనాన్ని సూచిస్తున్నది. ఆయన ఎంత గొప్ప వాడైనా సరే నేరం చేస్తే "కూళ" గానే భావించ వలసివస్తుంది. ఈ భావ నిరూపణకు యట్టిపో, కానీ, వాడే పదాలు ప్రతి పాదంలోనూ ప్రయోగించబడి శ్రీవారి కూళతనాన్ని నిరూపిస్తున్నాయి. ఈ విధంగా గురు లఘువుల అమరికలో స్వల్ప విరామం ఆమె ఆవేశ పూరిత చిత్తగతిని, హృదయ భారాన్ని శ్రీవారి గుణచింతనతో కూడిన ప్రార్థనను నిరూపిస్తున్నది.

పదాల మధ్య స్వల్ప విరామంతో వాక్యాంత లఘువులతో నిశ్చయాత్మకతని సాధించటం ఎందరో మహా కవుల ప్రయోగాల్లో కనిపిస్తుంది.

అగజకు నైనం దగు; నిల
మగు వలకుం దగదు; మాను మత్సర మింకన్
గగన ప్రసూన వాదము
జగతిం బ్రత్యక్షమునకు సరియనఁ దగునే ?

తల చుట్టు వాఱc గన్నులు
గలిగిన, పద్యంబు తప్పు గాదన వశమే?
వలదిచ్చట నీ మాయా
విలసనములు; పనికిరావు, విడువు, మటన్నన్

(ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము, తృతీయ అధ్యాయము)

ధూర్జటి వాక్యంలోని పదాంతాలను లఘువులతో నియమిస్తూ, విరామ రాహిత్యంతో ఆవేశాన్ని, నిశ్చయత్వాన్ని నిరూపించి, నత్కీరుడి చార్వాక, మూర్ఖత్వాలను రూపు కట్టించాడు.

8. దుఃఖం:

శ్రీవారి అన్యకాంతాసక్తికి ఈ నాయిక దుఃఖం పట్టలేక స్వామిని నిందిస్తూ ఇలా అంటున్నది.

రాగం: శ్రీరాగం

వాసికి బతుకు టింతే వనితలైనవారు
పాసిన కూటి కంటే పస్తైనా మేలురా ॥పల్లవి॥

రాకుండే వాడవా రాతిరెల్ల మా ఇంటికి
ఆ కడ నీ కెవతో పై యాడెగాక
నీకు నీ గుణము లేదు నేడిన్నాళ్ళ దాకా
కాకున బడుట కంటే కడనుంటే మేలురా ॥వాసికి॥

కోపగించే వాడవా కొసరి నేనేమన్నా
నీ పాపమెవ్వతో నీకు నేరిపె గాక
యేపున మారు మాటాడ వెన్నడు నేడలిగేవు
తీపులలోన జేదైతే తెగువలె మేలురా ॥వాసికి॥

తలవంచే వాడవా దగ్గరి కాగిలించితే
కులికి యెవ్వతో బాస గొన్నది గాక

బలిమి శ్రీ వేంకటేశ పైకొని నిన్ను గూడితి
కల కాలమును నిన్ను గాచుకున్న మేలురా ॥వాసికి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం20,పుట13, సంకీర్తన 19)

ఈ నాయిక "స్త్రీల బతుకు ఎంత చులకనో" అని వాపోతున్నది. "పాసిన కూడు కంటె పస్తే నయం కదా!! అన్య సంభోగం చేసి వచ్చి నా దగ్గర నయగారాలు చూపేవా? నీకు గుణము లేదు. పైగా కొసరి నేనేమైన అంటే కోపగించే వాడవా? నీకు ఈ విద్య ఏ పడతి నేర్పిందో??" అంటూ స్వామిని ధిక్కరించి పలికి, అలిగి పోయిన స్వామిని తలచి వనితలైన వారి 'బతుకుల వాసి' ఇంతేకదా అని వాపోతున్నది.

పల్లవిలోనే ఈ దుఃఖం 'బతుకుట ఇంతే' అనే పదంలోని దీర్ఘాక్షరంలో దైన్యం, నిస్పృహ కనిపిస్తాయి. "పస్తైనా మేలురా" అనే పదంలోని దీర్ఘాక్షరాలు స్వామిని పాసిన కూడు వంటి పడతుల పొందుకు పోవద్దనే నిషేధం కనిపిస్తుంది. ఆ పొందు నాయికకు కల్పించే వేదనను సూచిస్తుంది. ప్రతి పాదంలోను శ్రీవారి చేష్టలోని మార్పును పరిశీలించి, మునుపటివలె స్వామి లేదని నిర్ధారించి, అనంతర పాదంలో దీనికి కారణం మరో పడతి అయి ఉంటుందని నిశ్చయిస్తున్నదీ నాయిక. 'రాకుండే వాడవా' 'కోపగించే వాడవా', 'తలవంచే వాడవా' – లోని చివరి దీర్ఘాక్షరాలు స్వామి చేతల్లో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపడే ఆమె చిత్తవృత్తిని సూచిస్తున్నాయి. 'నీ కెవతో పై యాడె గాక', 'నీకు నేరిపెగాక', బాసగొన్నది గాక, అనే చోట్ల 'గాక' అనే పదాన్ని, ఆ తరువాత స్వల్ప విరామం, తరువాత 'గా' మీద ఊనిక 'పరసతియే దీనికంతా మూల కారణం' అనే నిశ్చయాన్ని సూచిస్తున్నాయి. 'పస్తైనా మేలురా', 'కడనుంటే మేలురా', 'గాచుకున్నా మేలురా', పదాల్లోని దీర్ఘాక్షరాలు నిస్పృహని, దైన్యాన్ని సూచిస్తున్నాయి.. ఆ దీర్ఘాక్షరాల పైన ప్లుతగతి ఊనిక అర్థస్ఫూర్తిని కలిగిస్తున్నాయి. ఎంత దక్షిణ నాయకత్వం ప్రదర్శించినా స్వామి మంచివాడే. నేరాలన్నిటికీ మూలకారణం మరొక 'జాణ' అని నాయిక వాక్యలయ ద్వారా నిర్ధారిస్తున్నది.

9. ఆశ్చర్యం:

శ్రీవారి కరుణకు సంతోషిస్తూనే ఆశ్చర్యపోతున్నదీ నాయిక.

రాగం: సామంతం

ఏమని భావింతు నిన్ను నెలతని సంతోసింతు
శ్రీమంతుడు నన్ను దిద్దే చేతో యిది ॥పల్లవి॥

కాంతుడు నేనెంతాడినా గక్కదలవు నీవు
యెంత రాతిగుండె వాడవేమి చెప్పేది
శాంతుడవో గట్టువాయి జాణతనమో యిట్టె
మంతు కెక్కించే నా మీది మన్ననో యిది ॥ఏమని॥

దిట్టనై నే జిక్కించితే తెమలవేమిటా-నీవు
యెట్టి చలపాదివాడ వేమి చెప్పేది
గుట్టు నీ కెంత గలదో గుణము చండి పడెనో
గట్టిగా నన్నీడేర్చె కరుణో ఇది ॥ఏమని॥

బిగ్గి నే గాగిలించితే బెగడ వేమిటా నీవు
యెగ్గు లెంతెంచని వాడ వేమి చెప్పేది
సిగ్గరి తనమో నేడు శ్రీ వేంకటేశ నీ నవ్వో
కెగ్గు లేకేలితివి నే కన్న వరమో యిది ॥ఏమని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం8,పుట102, సంకీర్తన 175)

శ్రీవారి కరుణకు పొంగి పోతున్నదీ నాయిక. ఈ సంతోషంలో ప్రధానంగా ఆశ్చర్యమే కనిపిస్తుంది. "నేనెన్ని కాని పలుకులు పలికినా మాటాడవు. నీ వెంత రాతిగుండె కలిగినవాడవో ! ఇది శాంతమో ! జాణ తనమో ! లేదా నా పైని మన్ననో తెలియదు స్వామీ" అంటూ తానెంత కోపించినా మౌనం వహించే ఆయన ప్రవృత్తిని అర్థం చేసుకోలేక విస్తుపోతున్నది.

"నేను దిట్టనే, నిన్ను చిక్కించుకున్నా తెమలని వాడివి. అంతు చిక్కని వాడివి. ఎంత గుట్టు కలిగిన వాడివో. నీ గుణమే రీతిదో లేక నన్ను, నా కోరికను మన్నించిన కరుణో ఇది" అంటూ స్వామి చెంత చేరినా ఆయన చేతలకు నివ్వెర పోతున్నదీ చెలియ.

"బిగ్గరగా కౌగిలించితే చలించని నీవు ఎగ్గులు పట్టని వాడివి. "ఏమని చెప్పేది, స్వామీ నన్ను తప్పు లెంచక ఏలిన నీ వరమే ఇది" అని తృప్తిగా ఆయన మౌనానికి చేతలకు వింత పడుతూ ఆ బ్రహ్మాండ నాయకుని అర్థం చేసుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతూ 'అయినా కరుణించాడు కదా'" అని తృప్తి పడుతున్నది.

పల్లవిలో ఏమని భావింతు? అనే ప్రశ్నార్థక వాక్యలయలోనే ఆమె ఆశ్చర్యం అంతా కనిపిస్తున్నది. నేనెంతాడి'నా', నే జిక్కించి'తే' నే గాగి లించి'తే' పదాల్లోని దీర్ఘాక్షరాల ద్వారా తన చేతలు ఆయనను విసిగించేవనే అర్థం స్ఫురిస్తున్నది. ఈ చేతలకు నొచ్చక మెచ్చే ఆయన గుణాలకు ఈమె పొందే ఆశ్చర్యాన్ని శాంతుడ'వో', జాణతన'మో' మన్న'నో', గుట్టు నీ కెంత కల'దో', నన్నీదే'ర్చ', కరు'ణో' సిగ్గరి తన'మో', న'వ్వో', వర'మో'లోని దీర్ఘాక్షరాలు నిరూపిస్తున్నాయి.

10. వ్యంగ్యం:

నాయకుడి చేతలేమిటో వాచ్యంగా చెప్పకుండా వ్యంగ్యంగా సూచిస్తూ తమ కోపాన్ని మాత్రం వాచ్యంగా హేతుబద్ధంగా నాయికలు నిరూపిస్తున్నారు.

రాగం: ముఖారి

అంత కోపితేనే మమ్ము నట్టె నగుమీ
చెంత నీవు చెనకిన చెనకక మానము ॥పల్లవి॥

వొక్కటంటే రెండనక వుండుదురా యెవ్వరైనా
మక్కువ ముందర చూచి మాటాడరా
యెక్కువైన దొరవైతే యేలుదుగాని భూమెల్ల
చక్కని మా వద్ద నుంటే జరయక మానము ॥అంత॥

మెఱిచిన నుఱుమక మిన్నైన నుండదట
గుఱి నీ చేతలు చూచి కోపము రాదా
నెఱజాణ వైతే నీకు నీవే వుండేవు గాని
నెఱయ సరికి బేశౌ నిలువక మానము ॥అంత॥

మఱికి మఱి వెట్టేది మున్నిటివారి తగవు
నియతి నీవు మెచ్చిన నేను మెచ్చితి

ప్రియుడు శ్రీ వేంకటేశ పెంపున గూడితి నిన్ను
నయమున గుఱుతులు నాటించక మానము ॥అంత॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం24, పుట57, సంకీర్తన 84)

స్వామి వారెందుకో చెలి మీద బాగా అలుక వహించారు. . ఆమె కూడా ఏమీ వెనకడుగు వేయటం లేదు. సరసంలోనూ విరసంలోనూ కూడా సరికి సరేనట. "నీవంత కోపిస్తే కొంత మేమూ చెనకక మానము జాగ్రత్త" అని నాయికలంతా కలిసి అంటున్నారు.

"ఒక్కటంటే రెండనని వాళ్ళెవరయినా ఉంటారా? దొరవై భూమి అంతా ఏలితే ఏలికవు కావచ్చు. మా వద్ద ఇవి చెల్లవు. మెరిస్తే మిన్నైన ఉఱుమకుండా ఉండదు కదా! నీ చేతలకు కోపం రాదా. నీవు నెఱజాణవైతే మేము కూడా సరికి సరే" అనే విషయం గుర్తు పెట్టుకోమంటున్నారు.

ఇది విరసం వ్యవహారం. సరసంలో రసికత తెలిసిన మేము "గుఱుతులు నాటించక మానమని" అంటూ ఆ కాంతలు సరికి సరేయని మరోమారు నిరూపించుకున్నారు. ఇంతకు ఓపితేనే మా వద్దకు రమ్మని వ్యంగ్యంగా సూచిస్తున్నారు. శ్రీవారి నేరాలేమిటో వ్యంగ్యంగా తప్ప వాచ్యంగా తెలియటం లేదు. ఈ సంకీర్తనలో శ్రీవారి నేరాలు వ్యంగ్య రూపం. నాయిక కోపం వాచ్యరూపం.

పల్లవిలోనే తమ చేతలకు "ఓపితేనే" దరి జేరమని నాయికలు అదలిస్తున్నారు. మమ్ము నట్టి నగుమీ" అనే 'ఓపితేనే' పదాల్లోని గురువులు వారి చిత్తవృత్తిలోని వ్యంగ్యానికి నిరూపకమవుతున్నాయి. ఒక్కటం'టే', దొరవై'తే', నెరజాణవై'తే', అనే పదాల్లోని దీర్ఘాక్షరాలు స్వామి నేరం ఏమిటో వ్యంగ్యంగా మాత్రమే సూచిస్తున్నాయి. 'మాటకు మాట', 'చేతకు చేత'గా పలికే నాయికలు తమ చేతలను ప్రకృతి ధర్మంతో సమర్థించుకుంటున్నారు 'మెరిస్తే మిన్నైనా ఉఱుమకుండా ఉంటుందా' అంటూ చమత్కరిస్తున్నారు. తమ ప్రవర్తన అత్యంత సహజం, న్యాయం అని నిరూపించుకోవటానికి రెండనక'వుండేరా' 'మాటాడరా' కోపము 'రాదా' అనే దీర్ఘాక్షరాల్లోని ఊనిక ద్వారా సమర్థించుకుంటున్నారు. 'జరయక మానము, నిలువక మానము, నాటించక మానము' అంటూ పాదాంత లఘువుల ద్వారా నిశ్చయ రూపంలో తమ ప్రవర్తనని సమర్థించుకుంటున్నారు. వ్యంగ్యంగా ఈ నేరారోపణ, ఖండన, సమర్థన వ్యక్తం అవుతున్నాయి.

11. వక్రోక్తి:

నాయిక స్వామిని తన ఇంటికి రమ్మని వక్రోక్తి రూపంలో ఆహ్వానిస్తున్నది.

రాగం: శ్రీరాగం

మరుని నగరి దండ మా యిల్లెఱగవా
విరుల తావులు వెల్ల విరిసేటి చోటు ॥పల్లవి॥

మఱగు మూక చింతల మా యిల్లెఱగవా
గుఱుతైన బంగారు కొండల సంది
మఱపు దెలివి యిక్క మాయిల్లెఱగవా
వెఱవక మదనుడు వేటాడేచోటు ॥మరుని॥

మదనుని వెదసంత మా యిల్లెఱగవా
చెదిరియు చెదరని చిమ్మజీకటి
మదిలోన నీవుండేటి మా యిల్లెఱగవా
కొదలేక మమతలు కొలువుండే చోటు ॥మరుని॥

మరులుమ్మెతల తోట మా యిల్లెఱగవా
తిరు వేంకటగిరి దేవుడ నీవు
మరు ముద్రల వాకిలి మా యిల్లెఱగవా
నిరతము నీ సిరులు నిలచేటి చోటు ॥మరుని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం5,పుట179, సంకీర్తన 262)

మరుని నగర దండే మానిని గృహమట. తన ఇంటికి గుర్తులు చెప్పి మరీ రప్పించుకుంటున్నదీ నాయిక. ఈ గుర్తులు చెప్పటంలోనే వక్రోక్తి అంతా దాగి ఉన్నది. విశేషణాలు రూపకాలు, ఉపమలు మేళవించి ఇంటి గుర్తులు చెబుతున్నదీ అతివ. 'బంగారు కొండల మధ్య సందు', 'వెఱవక మదనుడు వేటాడే చోటు', 'మదనుని వెద సంత', 'చెదిరి చెదరని చీకటి', 'మరులు చిమ్మే ఉమ్మెతల తోట', 'మరు ముద్రల వాకిలి' 'ఆ ఇంటికి గురుతులు'. ఆ నాయిక యవ్వన సిరుల, అవయవ రూపాలే ఆ గుర్తులు. ఇవి రత్యాహ్వానానికి ప్రతీకలుగా కనిపిస్తాయి.

ఇందులో కొంత పచ్చి శృంగారమే కనిపించినప్పటికీ అది నాయిక ప్రవృత్తిని మలిన పరచదనే భావించాలి. సమాజంలోని అట్టడుగున ఉన్న స్త్రీ కూడా భాష, అభివ్యక్తి ఎలా ఉన్నా ప్రవృత్తి మధురభక్తి అత్యంత పవిత్రమనే విషయమే ప్రధానం. ఆ దృష్టితో సంభావిస్తేనే స్వామి కటాక్షానికి సర్వులూ అర్హులేనన్న సత్యం విశదమవుతుంది.

నాయిక వక్రోక్తి పూర్వకంగా తన ఇంటి గురుతులను కామ జనక కళాస్థానాల్లో ప్రతిక్షేపించి తన ఇంటికి రత్యాహ్వాన పూర్వకంగా పై పదాలు పలుకుతున్నది.

ప్రతి చరణంలోనూ మొదటి మూడు పాదాల్లో 'మా యిల్లెఱగవా' అనే ప్రశ్నార్థక వాక్యలయలో వక్రోక్తి వినిపిస్తున్నది. 'నీకు బాగా చిరపరిచితమైనవే ఈ గురుతులన్నీ' అనే సూచన పై పదాల్లో వినిపిస్తుంది. తన దేహంలోని అవయవాలను ఇంటి గురుతులైన పదాల్లోనూ ప్రయోగించి, ఇంటిని, తనను చేరమనే కోరిక ఈ వక్రోక్తిలో వినిపిస్తుంది. ప్రతి గురుతుకు చివర మా 'ఇల్లెఱగవా'లోని దీర్ఘాక్షరం పైని ఊనిక వల్ల ధ్వనించే లయలో "మా ఇల్లు నీకు తెలుసు" అని రమ్మనే ఆహ్వానం వినిపిస్తున్నాయి.

ఊనిక వలన వాక్యంలో లయ ద్వారా విశేషార్థం, రత్యాహ్వానం, ప్రసిద్ధ కవుల కావ్యాలెన్నిటిలోనో మనకు కనిపిస్తాయి.

> పాటున కింతు లోర్తురె? కృపారహితాత్మక ! నీవు త్రోవని
> చ్చోట భవన్నఖాంకురము సోఁకెఁ, గనుంగొను మంచుఁ జూపియ
> ప్పాటల గంధి వేదన నెపంబిడి యేడ్చెఁ గల స్వనంబుతో
> మీటిన విచ్చు గుబ్బ చనుమిట్టల నశ్రులు చిందువందగన్
>
> *(అల్లసాని పెద్దన - మనుచరిత్ర; ద్వి.ఆ. 70 పద్యం)*

వరూధిని చిట్ట చివరి అస్త్రంగా సౌందర్య ప్రదర్శనకు పూనుకున్న ఘట్టమిది. "నీవు త్రోవ నిచ్చోట" అంటూ ప్రవరాఖ్యుడి కొనగోరు ఎక్కడ తగిలిందో చూపిస్తున్నది. 'ఇచ్చోట' అనడంలోని ఊనిక పైని లయలోనే విశేషం, సౌందర్యం ప్రదర్శిత మౌతున్నాయి. 'ఇచ్చోట' అంటూ సౌందర్యపు సిరులను సూచించినా ప్రవరుడు

కదల్లేదు. అందుకే "కనుంగొన మంచు జూపి" అంటూ మళ్ళీ అందాలను విందు చేసింది. ఇంతకీ ఆ అవయవ సంపద అందం అంతా ఊనిక పైని లయలో తప్ప వాచ్యం కావట్లేదు. అదే లయ చమత్కారం.

12. ధ్వని:

ముగ్ధ అయిన ఒక నాయిక తనను ఏలుకొమ్మని శ్రీవారిని ధ్వని పూర్వకంగా ఇలా ప్రార్థిస్తున్నది.

రాగం: భైరవి

ఇట మీది కడమెల్ల నిక నీవు దీర్చవయ్యా
పటుకున జెలి నీకు బాలు వెట్టీ నిదిగో ||పల్లవి||

నెలత మంచము పై కిన్నెర వాయించి వాయించి
తలకొని నీవురాగా దల వంచెను
సొలసి చెలులతోడ సుద్దులు దా చెప్పి చెప్పి
చెలగి నీ మోము చూచి సిగ్గువడీ నిదిగో ||ఇట||

పడతి నీ మీది పాట పాడి పాడి అర్థము నీ
వడిగితే నవ్వలి మోమై నవ్వీని
అడియాలముల రూపు అద్దములో జూచి చూచి
కడు నీవు కొంగు వట్టగా భ్రమసీని ||ఇట||

సతి యేకతాన నుండి జవ్వాది పూసి పూసి
రతి నీవు గూడగా సరస మాడీని
ఇతవైన శ్రీ వేంకటేశ నీ వాపె గూడగా
పతి జూచి యిప్పుడిట్టె ఫక్కున నవ్వీని ||ఇట||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం20, పుట64, సంకీర్తన 95)

ఈ నాయిక స్వామి వచ్చే సమయానికి మనోహరంగా కిన్నెర మీటుతూ అతని ఆగమనంతోనే తలవంచి చెలులతో అతని సుద్దులు చెప్పి సిగ్గుపడి నిలిచిందట. ఆ నాయిక స్వామిపై పాట పాడితే, ఆతడు అర్థమడుగగా, ఆవలి మోమై నవ్విందట.

అటు ఉన్న అద్దములో చూచి స్వామి పైకొంగు పట్టినట్లుగా భ్రమించినదట. సందర్భాన్ని గ్రహించిన చెలులు "యిట మీది కడమెల్లా నికనీవు దీర్చవయ్యా, పటుకున జెలి నీకు బాలు పెట్టెనదిగో" అంటూ నిష్క్రమిస్తున్నారు.

సిగ్గు, వినయంతో ప్రకాశించే ఈ నాయిక ముగ్ధగా స్ఫురించటంలో ప్రత్యేకత ఏమీ లేదు కానీ, చెలులతో స్వామి పై సుద్దులు చెప్పటం, ఆ వెంటనే తాను చెప్పిన ఆ సుద్దులు, "స్వామి చిలిపి చేతలివి సుమా" అని అర్థం వచ్చేలా సిగ్గు పడటం, అన్యాపదేశంగా స్వామిని ఆ అర్థానికి దీటు వచ్చేలా ప్రవర్తించమని హెచ్చరించటమే. దానికి తోడు స్వామిపై పాడిన పాటకు అర్థం ఆయన తెలిసే అడిగాడో లేదో తెలియదు కాని, అటు అద్దం వైపు తిరిగి చేసిన చేష్ట వలన ఏ పాటి రసికుడికైనా తన నామె 'కొంగు పట్టమనే' అంటున్నదని అర్థం కాగలదు. ఇంకా వాచ్యంగా అదే అర్థాన్ని చెబుతూ చెలులు ఇక పై చేయవలసిన పనులు 'సావకాశంగా కానీ స్వామీ' అంటూ తప్పుకుంటున్నారు.

అర నవ్వుతో, నును సిగ్గుతో, కొసరే చేష్టల్లో, ధ్వని గర్భితంగా కోరికని వ్యక్తం చేసి స్వామిని దాసుని చేసింది నాయిక. 'వాయించి, చెప్పి, పాడి, చూచి, పూసి, అనే క్త్వార్థక పదాలు పునరుక్తాలయినాయి. మొదటి పదం క్రియకు రెండవ పదం ధ్వనికి సంకేతం. ఆమె చిత్తవృత్తికి అవి ప్రతిరూపం. మొదటి చరణంలో "తలవంచి", "సిగ్గుపడి" నిలిచిన ఆ నాయికలో ఆ సిగ్గులు ధ్వని గర్భితాలయి లయ ద్వారా సూచించబడుతున్నాయి. ఆ దృశ్యం చూడమని "ఇదిగో" అంటూ అవధారణార్థకంలో దీర్ఘాక్షర రూపంలో ఒక దృశ్యాన్ని చూపిస్తున్నారు చెలులు. ఈ భావ చిత్రం ధ్వనికి ప్రతిరూపం.

రెండవ చరణంలో అవ్వలి మోమై 'నవ్వీని', కొంగు వట్టగా 'భ్రమసీని' పదాల్లోని దీర్ఘాక్షరాలు ఆమె కోరికను ధ్వని రూపాన్ని సూచిస్తున్నాయి. మూడవ చరణంలోని సరసమా'డీ'ని ఫక్కున న'వ్వీ'ని పదాల్లోని దీర్ఘాక్షరాలు కూడా ధ్వనిని సూచిస్తూ ఆమె కోరికను నిరూపిస్తున్నాయి.

13. వితర్కం:

విరహోత్కంఠితయై తపిస్తూ నిలిచిన ఈ నాయిక అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తుంది. ఆమె వితర్కం ప్రకృతి ధర్మంలోను, కార్యకారణ సంబంధం ద్వారాను నిరూపించబడుతున్నది.

రాగం: గుండక్రియ

ఇది దానెఱగడా ఇంపుల నా రమణుడు
హృదయమే యెఱుగును యెంచి చెప్పేదేమే ॥పల్లవి॥

దవ్వు విచారింతురా తమ్ము వలసినవారు
యెవ్వల నుండినా గూడ నెంతురు గాక
దవ్వుల సూర్యునికి ధరణి దామరలకు
యెవ్వరైనా బొందు సేసి యెన ఇంచిర ॥ఇది॥

వెనక ముందెంతురా, వెక్కసపు పొందువారు
యెనలేని సాహసము లెంతురు గాక
వినువీథి జంద్రుడుండ వెస జంద్రకాంతము
లెనసి కరుగుమని ఎవరైనా జెప్పిరా ॥ఇది॥

వొకరి నడుగుదురా వుల్లములు గలసితే
వొకటై రతుల గూడి వుందురు గాక
ప్రకటించి శ్రీ వేంకటపతి దానె నన్ను గూడె
సకలము లోలోనె సంతమవుట గాక ॥ఇది॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం22, పుట67, సంకీర్తన 99)

"ప్రియురాలిని చేరటానికి ప్రియుడికి దూరం ఒక అడ్డమా? ప్రేమించిన వారు దీనిని పాటిస్తారా? తనను చేర రావటానికి స్వామికి దూరమే ఒక కారణమేమో" అని స్వామి మనస్సును శంకిస్తూ, ఇది గణింప వలసిన విషయం కాదంటుంది. తామరలు దూరమని సూర్యుడు ఊరుకుంటున్నాడా? కలువలను చంద్రుడు కలుసుకోవటానికి దూరాన్ని లక్ష్యపెడుతున్నాడా? కాబట్టి మనసున తలిస్తే మరుక్షణమే సన్నిధిని చేరవచ్చని ఈ అతివ తన 'విరహాన్ని' 'శంకాన్విత హృదయాన్ని' వ్యక్తం చేస్తూ విరహోత్కంఠితగా నిలుస్తున్నది. 'తమ పొందులు సహజ సిద్ధమే' అని ప్రకృతిని ప్రమాణంగా చేసుకొని కార్య కారణ సంబంధం ఆధారంగా వితర్క రూపంలో నిరూపిస్తున్నది.

ప్రవాసంలోని స్వామి రాకపోవటానికి 'దూరమే కారణమేమో' అని తర్కించే తీరు పల్లవిలోని 'ఇది దానెఱగడా'? అనే ప్రశ్నార్థక వాక్యంలోనే నిక్షిప్తం అయింది. దవ్వు విచారింతురా, వెనక ముందెంతురా, వొకరి నడుగుదురా, అనే పదాల్లోని దీర్ఘాక్షరాల్లో 'ఎవరినీ అడగరు', 'దవ్వు విచారించరు', 'వెనక ముందెంచరు' అనే వ్యతిరేక రూపలో స్వామి 'తన్నేల' గలడనే భావం వ్యక్తం అవుతున్నది. కమలం, కలువలు ఉదయించటానికి కారణాలైన సూర్య చంద్రోదయాలను తన వలపులలో ప్రతిక్షేపించి కార్యకారణ సంబంధం ద్వారా తన ప్రేమను ఋజువు చేసుకుంటున్నది.

14. ఆత్మార్పణ:

స్వామికి పూర్తిగా ఆత్మార్పణ చేసుకున్న ఈ నాయిక స్వామి ఎవరిపై మోజు పడినా, ఎవరితో నవ్వినా, అరిషడ్వర్గాలకు లోనుకాక సహకరించింది. స్వామి ఆనందమే తన ఆనందం అనే అభేదస్థితిని పొందితేనే ఈ మానసిక స్థితి సాధ్యమవుతుంది.

రాగం: సావేరి

ఎంత నన్ను బొగడేవు యెటువలె బుజ్జగించి
వింత దాననా నీకు వినయపుటాలను ॥పల్లవి॥

కోరికతో మగడు యే కోమలితో నవ్వినాను
నేరము లెంచనిదే నెలత
ఆరజాన తన మేన జీరలు దీయించుకొంటే
గారవించి పచ్చడాన గప్పినదే మగువ ॥ఎంత॥

వేడుక యే సతి మీద విభునికి గలిగినా
తోడుక వచ్చినదే తొయ్యలి
కూడే వేళ యెంతేసి యెక్కుడు ప్రియాలు చెప్పినా
ఆడుకోక వుండినదే అంగన ॥ఎంత॥

పచ్చిగా రమణుడు యే పడతి బెండ్లాడినాను
ఇచ్చకమై యుండినదే ఇంతి

ఇచ్చుట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిచ్చట నా వంటిదే నీకు దేవులు ॥ఎంత॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు;సంపుటం25,పుట78,సంకీర్తన 117)

ఈ నాయిక పతి పట్ల సంపూర్ణానురాగంతో చివరికి సపత్నీ మాత్సర్యాన్ని కూడా మనసులోనైనా తలచని మానిని "ఎందుకు స్వామీ నన్నింత పొగడేవు వింతదాననా నీకు వినయపుటాలను" అని తన గురించి తానే చెప్పుకుంటున్నది.

'కోరికతో మగడు ఏ కోమలితో నవ్వినా నేరాలెంచనిదట ఈ నెలత'. ఏ సతిపై విభుడు ముచ్చట పడినా 'తోడుక' వచ్చినదట ఆ తొయ్యలి చివరికి పచ్చిగా రమణుడు 'యే పడతిని పెండ్లాడినా' ఈ ఇంతి 'ఇచ్చకమై' ఒద్దికతో నిలిచింది. ఇంతకన్న ఉత్తమ స్త్రీ పృథ్విలో కనబడదు. సంపూర్ణంగా స్వామికి ఆత్మార్పణ చేసుకున్న ఈ నాయికలో ఏ విధమైన ఈర్ష్యా ద్వేషాలు కనబడవు.

పల్లవిలోనే వినయాన్ని ప్రకటిస్తూ శ్రీవారి పొగడ్తలకు 'వింత దాననా నీకు వినయపుటాలను' అని నాయిక చెప్పుకుంటున్నది.

ప్రతి చరణంలోను మొదటి మూడు పాదాల్లో శ్రీవారు పరకాంతాసక్తిని చూపడం "యే కోమలితో నవ్వినా" జీరలు దీయించుకొంటే, 'యే సతి మీద విభునికి కలిగినా', 'యెక్కుడు ప్రియాలు చెప్పినా', 'యే సతి బెండ్లాడినా', పదాల్లోని దీర్ఘాక్షరాల ద్వారా స్పష్టమవుతున్నది.

నాయిక ఆత్మార్పణ భావం "నేరము లెంచనిదే", 'పచ్చడాన గప్పినదే', 'తోడుక వచ్చినదే', 'ఆదుకోక వుండినదే', 'ఇచ్చకమై వుండినదే' పదాల్లోని దీర్ఘాక్షరాల లోని ఊనిక ద్వారా వ్యక్తం అవుతున్నది.

15. అధిక్షేపం:

పరకీయలైన ఈ నాయికలు తమను స్వామి ఎలా మురిపించి మరో కాంతలతో విహరించి తన రంగు బయటపడినా ఇంకా కొసరే స్వామిని అధిక్షేపిస్తూ ఇలా అంటున్నారు.

రాగం: గంభీర నాట

ఇంకా మమ్ము జనకేవు యేరా వోరి
కొంకు లేక కొసరేవు కొమ్మల నందరిని ॥పల్లవి॥

గోవుల మరిపినట్టు గొల్లెతల వలపించి
కావరించి తిరిగేవు కానీ కానీరా
వేవేలు యిండ్లు జొచ్చి వెన్న దినే నంటానే
మోవులు జవిగొంటివి ముద్దియ నెల్లను ॥ఇంకా॥

పిల్ల గోవి రాగాలనె పెక్కు మంత్రాలు మంత్రించి
కల్లరి వై తిరిగేవు కానీ కానీరా
చల్ల దుత్తలంటాను చన్నులపై చేయి జాచి
కొల్ల గొంటివి మానము కోమలుల నెల్లలు ॥ఇంకా॥

మదుగుల జొక్కు చల్లి మచ్చిక సేయించుకొని
గడుసరివై తిరిగేవు కానీ కానీరా
నడుము శ్రీ వేంకటేశ నన్ను నిట్టే యేలితివి
తొడిబడ గూడితివి తొయ్యలుల నెల్లను ॥ఇంకా॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం19, పుట52, సంకీర్తన 76)

"గోవులను మరపించినట్టు ఎంత సులభంగా ఈ గొల్లెతలను మరపించావో స్వామీ!! ఎన్ని వేల ఇళ్ళలో ఎందరు ముద్దియల మోవి చవి గొన్నావో, పిల్లనగ్రోవి రాగాల మంత్రాలు పఠించి 'చల్ల దుత్తల కోసం వచ్చాను' అని అంటూ చన్నులపై చేయివేసే నీ చిలిపితనం ఏమని చెప్పేను" అంటూ స్వామిని సాధిస్తున్నారు. 'గోవుల వలె మరపించావనడం'లో దైన్యం, దుఃఖం ధ్వనిస్తున్నది. ఈ కలహాంతరితలు కలహించి, దుఃఖించినా కరుణించి కరిగిస్తున్నాడీ కమలలోచనుడు.

పల్లవిలోనే 'దరిచేరిన' స్వామిని అధిక్షేపించే వైనం ఆయనను "యేరా వోరి" అని సంబోధించే రీతిలోనే వినిపిస్తుంది.

మూడు చరణాల్లోనూ ప్రాస పాటించబడింది. ప్రతి రెండు పాదాలకు అర్థం సంపూర్ణమయి నడకలో సమతుల్యత ఏర్పడుతున్నది. రెండు పాదాల్లో కూడా

మొదటి పాదంలో శ్రీవారి మాయల వర్ణన, రెండవ పాదంలో అధిక్షేపం వినిపిస్తుంది. ప్రతి పాదంలోనూ వాక్యం పూర్వభాగం, ఉత్తర భాగం సగానికి విరిగి లయ నియంత్రితమయింది.

మొదటి చరణంలో మొదటి పాదంలో మొదటి అక్షరంలోనే 'గో'వుల లోని దీర్ఘాక్షరం ప్లుతగతిని పొందింది. తద్వారా బాధ వ్యక్తం అవుతున్నది. "మమ్మల్ని పశువులని మరపించినట్టు మరపించావు స్వామీ" అనే భావంలోని బరువంతా మొదటి అక్షరంలోని ఊనికలోనే కనిపిస్తుంది. నిజానికి వారి హృదయంలోని ఆవేదనకు సంకీర్తనలోని ప్రథమాక్షరమే ప్రతీక. ఇదే విధంగా రెండు మూడు చరణాల్లో కూడా 'పిల్లగోవి రాగాలనే', మచ్చిక 'సేయించుకుని పదాల్లోని ఊనిక ఆమె బాధను వ్యక్తం చేస్తున్నది. 'మమ్మల్ని పశువులను చేశావు'. 'ఎంగిలి చేశావు'. 'మానము కొల్ల గొన్నావు' అనే భావంతో వేదనతో 'కానీ కానీరా' అంటున్నారా నాయికలు. ఆ పదంలోని 'కా' మీద 'రా' మీద ఉన్న ఊనిక వలన స్వామి వారిని లలితంగా అధిక్షేపించే తీరు వ్యక్తం అవుతున్నది. వారి చిత్తగతి నిరూపించబడుతున్నది.

పాదాంతంలోని ఊనిక, ప్లుతగతి వలన బాధ వైచిత్రిని, అర్థస్ఫురణను కలిగించిన తీరు ఇతర వాగ్గేయకారుల్లో ముఖ్యంగా త్యాగరాజులో కనిపిస్తుంది. అయితే ఇక్కడి లయ నిర్దేశించబడటంలో ఒక చిన్న పేచీ ఉంది. సాహిత్య భావాన్ని అనుసరించి రాగం నిర్ణయించబడిన తరువాత, లయ రాగాన్ని అనుసరించి ఉంటుందే తప్ప పదం యొక్క నడకను బట్టి ఉండదు. సాహిత్య ప్రధానమైన పదానికి (అన్నమయ్య కాలానికి) స్వర రాగ తాళ ప్రధానమైన త్యాగరాజు కృతికి ప్రధానమైన తేడా లయ స్థాపనలో ఇదే. ఏది ఏమయినా మౌలికమైన ఆర్తిని ఆవేదనను నిశ్చయించి చెప్పడం కష్ట సాధ్యం కాదు.

రాగం: అభేరి

పల్లవి: *నగుమోము గనలేని నా జాలి దెలిసి*
నను బ్రోవగ రావ ! శ్రీ రఘువర ! నీ

అను పల్లవి: *నగరాజ ధరం నీదు పరివారులెల్ల*
ఒగి బోధన చేసే వారలు కారే
అటులుండుదురే ? నీ

చరణం: ఖగరాజు నీ యానతి వినివేగ చనలేడో (దో?)
గగనాని కిలకు బహుదూరంబని నాడొ
జగమేలె పరమాత్మ ! ఎవరితో మొఱలిడుదు
వగ చూపకు, తాళను, నన్నేలుకోరా త్యాగరాజనుత

(త్యాగరాజ కీర్తనలు, సంఖ్య 112)

పల్లవిలో శ్రీరామచంద్రుని సుందర వదనారవిందం చూడలేని తన స్థితిని చూసి రమ్మనే ప్రార్థన వినిపిస్తుంది.

చరణంలో మొదటి పాదంలో ఒక ప్రశ్న వినిపిస్తుంది. "ఖగరాజు నీ యానతి విని వేగ చన లేదొ?" ఈ వాక్యంలో లయలో కాస్త ఆశ్చర్యం కొంత అధిక్షేపం కూడా ధ్వనిస్తున్నాయి. రెండవ పాదంలోని ప్రశ్న దీనికి మరికొంత బలాన్నిస్తున్నది. "గగనాని కిలకు బహుదూరం బనినాడొ" అనడంలో గరుడుని ఔదాసీన్యం వినిపిస్తుంది. ఇలా కొద్దిగా ఉపేక్షించిన స్వామి గురించి మరొకరితో చెప్పుకునే అవకాశమూ లేదు. అందుకే 'జగమేలే పరమాత్మ' అంటూ దీనంగా ప్రార్థించడం వినిపిస్తుంది. చిత్త నిరూపకాలయిన ఈ రెండు దీర్ఘాక్షరాల్లో పైన ఊనిక ప్లుతగతిని పొంధడం, అఖేరిరాగం తారా స్థాయిని చేరుకోవడం, లయ చిత్త గతిని వ్యంజింపచేయడం కనిపిస్తాయి. 'వగ జూపకు తాళను' అని నొక్కి చెప్పి "నన్నేలు కోరా" అని ఆక్రోశించాడు త్యాగరాజ స్వామి. 'రా' అనే పాదాంత గురువు ప్లుతగతిలో ధ్వనిస్తూ భావావేశాన్ని నిరూపిస్తుంది. రెండు పాదాల్లోని ప్రశ్నలకు తరువాతి రెండు పాదాల్లోని ప్రార్థనం లయతో అన్వయం చెబుతుంది.

16. స్మృతి:

శ్రీవారి శృంగారాన్ని ఎల్ల కాలాలు స్మరిస్తూ పులకించే కాంతలిలా పరవశిస్తున్నారు.

రాగం: సాళంగనాట

ఎక్కడ నున్నా నీకు నే మాయను
పక్కన నవే యిందు భావించుకోవయ్యా ॥పల్లవి॥

అతివలుండిన చోటు అదె నీకు రేపల్లె
అతిశయపు వలపు యమునా నది
రతుల కాగిళ్ళే రాసక్రీడలు నీకు
తతి వచ్చె నిందు నవి తలచుకోవయ్యా ॥ఎక్కడ॥

కొమ్మల పోక ముదులు కొలని దరి కోకలు
కుమ్మరించు మోవి తేనె గొల్ల దోమటి
పమ్మివారితో నవ్వులు పాలు బెరుగువుట్లు
తమ్మి చూపులే రేతిరి తలచుకోవయ్యా ॥ఎక్కడ॥

చెలుల జవ్వనమెల్లా చేరువ బృందావనము
కులుకు జన్నుల పెక్కు గోవర్ధనాలు
కలసితి మా చెలిని గక్కన శ్రీవేంకటేశ
తలపున నికనన్నీ దలచుకోవయ్యా ॥ఎక్కడ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు;సంపుటం21, పుట 67, సంకీర్తన 1000)

అతివలుండేటి ప్రతి చోటు అది రేపల్లెట. ప్రవహించే వలపే యమునా నదియట. రతుల కౌగిళ్ళు రాసక్రీడలట. తలచుకోమని తలపింప చేస్తున్నారు. కాంతలు కొమ్మల పోకముదులు కొలని దరి కోకలట. గొల్లభామల నవ్వులే పాలు పెరుగుల ఉట్లట. సంధించమని ఉవ్విళ్ళూరుతున్నారు ఆ అతివలు. బృందావన వాసీ ! చెలుల యవ్వనమనే బృందానవనంలో స్థిర నివాసమేర్పరచుకో స్వామీ ! "కులుకు చన్నుల గోవర్ధనాలెత్తి కరుణించమంటున్నారు చెలులు. శ్రీవారికి ప్రియా సంబంధమైన వ్యాపారమంతా తమలో నిండి ఉన్నది కాబట్టి తమలో నిండిన ఆ అనురాగాన్ని గుర్తించి ఆదరించమంటున్నారు చెలులు. ఈ స్మృతుల్లో విశేషం శ్రీవారి స్మృతుల్లో తాము తేలియాడటంతో పాటు ఆయనను ఆ స్మృతులు తలచుకొమ్మని, తమలోనే అవన్నీ నిండి ఉన్నాయని ప్రార్థించటం విలక్షణంగా విశిష్టంగా కనిపిస్తుంది.

పల్లవిలోని 'ఎక్కడ నున్నా నీకు నేమాయ' అనే ప్రశ్నలోనే 'మాలోనే' నీకు అత్యంత ప్రీతిపాత్రమైన వాతావరణం అంతా నిండి ఉన్నదనే భావం వినిపిస్తుంది.

మూడు చరణాల్లోనూ ప్రతి పాదం స్వామి ఆనందానికి ఒక ప్రతీకగా నిలిచి సంపూర్ణమైన అర్థంతో కనిపిస్తుంది. వాక్యంలో పూర్వభాగం నాయిక వలపుకు నెలవు, ఉత్తర భాగం శ్రీవారి క్రీడకు తావు. పాదం సగానికి విరిగి నియమితమైన నడకలో లయ కనిపిస్తుంది.

పాదం సగానికి విరిగిన విరుపులోని లయలో ఊనికలో నాయిక వలపులే నీకు ప్రియమైన తావులని నిరూపిస్తున్నారు. 'రేపల్లె', 'యమునానది', 'రాసక్రీడలు', 'కొలనిదరి కోకలు', 'పాలు పెరుగువుట్లు', 'బృందావనము', 'గోవర్ధనం' మొదలైన శ్రీవారి వినోదాలను, ఘనకార్యాలను రూపకాలుగా స్మృతి ప్రేరకాలుగా అన్నమయ్య నాయిక అందాలకు అన్వయించి చెప్పాడు. దీర్ఘాక్షరాలు, ఊనికల వలన స్మృతులు వ్యంజించబడుతున్నాయి.

పాదం సగానికి విరిగి ఆ విరుపులోని వాక్యలయ ద్వారా భావనిరూపణ చేయడం ఇతర వాగ్గేయకారుల్లోనూ పదకర్తల్లోనూ కూడా కనిపిస్తుంది.

పల్లవి: నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి

చరణం: నను బ్రోవమని చెప్పవే నారీ శిరోమణి
జనకుని కూతుర జనని జానకమ్మ ॥నను॥

ప్రక్కన చేరుక చెక్కిలి నొక్కుచు
చక్కన మరుకేళి సొక్కుచుండెడి వేళ

రామదాసు కీర్తనలు సంఖ్య 112

రామదాసు ఈ కీర్తనలో పాదాల్ని లయాత్మకంగా సమభాగాలుగా విరిచాడు. ప్రతిపాదంలోను పూర్వ ఉత్తర భాగాలు సగానికి విరిగి అంతంలో లయాత్మకంగా విరామంతో ప్రయోగించబడినాయి. ఈ వాక్యలయలో రామదాసు ఆర్తి, చిత్తగతి మనకి వినిపిస్తాయి.

17. ధ్యానం:

శ్రీవారిని సదా ధ్యానిస్తూ స్వామికి ప్రియతమమైన విషయాలన్నింటిని, వ్యక్తులనందరిని ధ్యానించి, శ్రీవారికై దీక్షలో ఉన్న ఈ నాయిక అన్నమయ్య సంకీర్తనల్లో భక్తి పారవశ్యంతో ఈ విధంగా కనిపిస్తుంది.

రాగం: శ్రీరాగం

తగిలిన మునులే యాతనికి గందురంటా
మగువ యెవ్వరి తోడ మాటాడదిపుడు ॥పల్లవి॥

అతుల నిరాహారులతనికి బ్రియులట
అతివ నిన్నట నుండి యారగించదు
తతి నడవుల నుండె తపసులే-యతనికి
హితు లంట వనములో నెడయదీ తరుణి ॥తగిలిన॥

తలకొన్న యతనిపై తలపే పరమంటా
చెలియు చెక్కిట నున్న చేయి దియ్యదు
వలనైన యతఁడు దేవతల కొడయడంట
కలికి రేయిం బగలు కనుమియ్యదిపుడు ॥తగిలిన॥

అదరి జలములోన నతండుండునంటా
వడియు జెమట దుడువదు మేనను
కదు మంచి యతండు వేంకటగిరి విభుడంటా
పడతి యాతనినె గుబ్బల నొత్తీ నిపుడు ॥తగిలిన॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం 5, పుట 5, సంకీర్తన 6)

శ్రీవారికి ప్రియమైన నెలవులన్నింటినీ నాయిక ధ్యానిస్తున్నది. నిరాహారంతో స్వామికై తపస్సు చేసే వారే అతనికి ప్రియులని నాయిక విన్నదట. అప్పటి నుండి ఆమె నిరాహారి అయింది. వనంలో ఉండే తాపసులు స్వామికి ప్రియులని విన్నదట. అప్పటి నుండి వనాన్నే ఆమె తన నివాసంగా మార్చుకొన్నదట. స్వామిని సంభావించి, చేయిని చెక్కిట నుండి తీయక తానే శేషతల్పశాయితో సారూప్యం పొందినట్లు భావిస్తున్నది. దేవతలకతడే అండ అని విని అనిమిషత్వాన్ని పొందటానికి రెప్ప మూయదట. ఆతడు 'జల నివాసి' అని విని తన పైకి రాగలడనే కోరికతో మేని జలాన్ని తుడువదట. కొండల రాయుడైన విభుని ఆ నాయిక తన చనుకొండలతో ఒత్తి కరిగించిందట.

సంకీర్తన ఆసాంతం ప్రాసతో నిండి ఉన్నది. ప్రతి చరణంలోను మొదటి పాదంలో స్వామికి ప్రియమైన విషయ ప్రతిపాదన, రెండవ పాదంలో దానితో

సారూప్యతను పొందటానికి నాయిక చేసే ప్రయత్నం కనిపిస్తాయి. రెండు పాదాలకు భావం సంపూర్ణమయి నడక గతి స్ఫురిస్తాయి.

పల్లవిలోనే 'మునులే' అనే పదంలోని దీర్ఘాక్షరంలోని ఊనిక ద్వారా వారు స్వామికి ప్రియమైన వారని నిరూపించబడింది. కార్యకారణ సంబంధం దీనితో ప్రారంభం అవుతుంది.

మొదటి చరణంలోని మొదటి పాదంలో శ్రీవారికి 'నిరాహారులతనికిం' అనే పూర్ణ బిందువు ద్వారా స్వామి ప్రీతి వ్యక్తమవుతున్నది. ఊనిక అక్కడ వినిపిస్తున్నది. మూడవ పాదంలో 'తపసులే' అనే దీర్ఘాక్షరం తాపసులపై స్వామికి మక్కువ ఎక్కువ అనే విషయం స్ఫురిస్తుంది. రెండవ చరణంలోని మొదటి పాదంలోని ' 'చే'యి దియ్యదు', నాల్గవ పాదంలోని 'రే'యింబగలు' పదాల్లోని దీర్ఘాక్షరాలు ఈమె భక్తికి ప్రతీకలు. సంకీర్తన అంతటా పాటించబడిన ప్రాస పదాలను ప్రతి పాదంలోను విరుస్తూ స్వామికి ప్రియతమమైన వస్తువులను, నాయిక భక్తిని నిరూపిస్తున్నాయి.

18. సమానత్వం:

"నీలోనూ నాలోనూ గుణ సామ్యం కనిపించేను స్వామీ. ఈ సమానత్వంలో ఎవరు ఏ కొద్దిగా మిన్నగా భాసించేరో నీవే తెలుపు స్వామీ" అంటూ వేడుకుంటున్నదా నాయిక.

రాగం: ముఖారి

ఔనో కాదో నీ వాన తీవయ్యా
పూని వేరొకటి యిక బోలదయ్యా ॥పల్లవి॥

చంచలము నా చూపు చంచలము నీ గుణము
యెంచె నీవే మనేవో యెరగమయ్యా
మంచి నా గుబ్బలు రాయి మొగి నీ గుండె రాయి
అంచల తోడ నేమి నాడుకొనేవయ్యా ॥ఔనో॥

చిగురు నా యధరము చిగురు నీ చిత్తమిదె
తగె దగదందు నీ కేమి తలవయ్యా

నగవు నా మోమెల్ల నగుబాటు నీ చింత యీ
తగవు చెలుల తోడ తీరి జెప్పవయ్యా ॥ఔనో॥

లేత నాకె కొనగోరు లేత నీ వయసు గడు
యీతలు మోతలు నిక నేలయ్యా
ఘాతల శ్రీవేంకటేశ కదిసి గూడితి నన్ని
యీతల నిద్దరి బావా లేక మాయనయ్యా ॥ఔనో॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం9, పుట21, సంకీర్తన 35)

నా చూపు చంచలము నీ గుణము చంచలము స్వామీ. నా చనుగుబ్బలు రాళ్ళు. నీ గుండె పెద్ద బండ. నా అధరము చిగురు. నీ చిత్తము చిగురు. నీ తీరున నా మోమున ఎప్పుడూ నవ్వులే కదా. నా గోరు లేత 'నీ వయసు లేత' అంటూ ఆ నాయిక సమానత్వాలను నాయకునితో నిరూపిస్తున్నది. ఏదో విధంగా స్వామితో సరి అని అనిపించుకోవాలనే తపన ఆ నాయికలో కనిపిస్తుంది. చిత్తవృత్తులకు ప్రవృత్తులకు ఆంగికకు రూపు రేఖా విలాసాదులకు సామ్యాన్ని తన శ్రీవారికి నాయిక సామ్యం చెబుతున్నది.

ఈ సమానత్వ నిరూపణకు అన్నమయ్య ప్రాసను ప్రధానంగా ప్రయోగించాడు. శ్రీవారి ప్రవృత్తినీ గుణాన్నీ సూచించే లక్షణాలన్నీ నాయిక చేష్టలకు విలాసాలకు అన్వయించాడు. ఈ సమానత్వం మరింత స్పష్టంగా నిరూపించడానికి వాక్యం పూర్వ భాగంలో నాయిక విలాసాలు ఉత్తర భాగంలో శ్రీవారి ప్రవృత్తి రచింపబడినాయి. వాక్యంలో వారి వారి లక్షణాలు పూర్తి కాగానే పదం సగానికి విరిగి గతి స్ఫురిస్తున్నది. భావం సంపూర్ణమవుతున్నది. మనోహరమైన ఈ రూపకంలో రమ్యంగా మనిద్దరకు అభేదమే అంటున్నది.

19. అలుక:

వక్రోక్తిరూపంలో తన అలుకను వ్యక్తం చేస్తూ దుఃఖపడే ఈ మధ్యాధీర అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తుంది.

రాగం: బౌళి

అయ్యో యేమి చూచే వతివ దప్పక యిట్టి
పయ్యద కొం గల్లార్చి పలికించవయ్యా ॥పల్లవి॥

చెక్కుల వెంటగారే చెమట దుడువవయ్యా
యిక్కడ నీకు గైదండ యిచ్చి యలసె
లక్కవలె గరగిన లావణ్యరస మిదో
కక్కసపు గొప్పు మేఘపు జడివానలో ||అయ్యో||

సురటి విసరవయ్యా సుదతి నీ కొప్పు దువ్వి
అరుదుగ నసురుసు రాయ నిదె
పరి పరి జవ్వనము పై బరవశమో
మరు సముకములోని మాటల తేటలో ||అయ్యో||

తమల మొసగవయ్యా తరుణి నీ మేను సోకి
తమక పురతి జొక్కి దప్పి గొనెను
అమరగ శ్రీ వేంకటాద్రీశ యిదియల్లా
గొమరె వయసునను కోరిన కోరికలో ||అయ్యో||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం30,పుట93, సంకీర్తన 139)

స్వామిని చూచి స్పష్టా స్పష్టంగా కోపాన్ని తెలియజెప్పే ఈ నాయిక అలిగి పవళించింది. ఆమెను పలికించమని చెలులు స్వామిని ప్రార్థిస్తున్నారు. బెట్టుతో బిగిసినా, నిలువు నిలువునా స్వామికై కరిగి కురిసి ప్రవహిస్తున్న చెలి అంతరంగాన్ని తెలిసిన చెలులు ఆమెను ప్రసన్నురాలిని చేసుకోమని వేడుకుంటున్నారు. మేఘసదృశమైన కొప్పు కురిసింది కాబోలు, జడివానలు దేహమెల్లా కానవచ్చాయట. విరహాగ్నికి లక్కవంటి లావణ్య రసం కరిగి కురిసింది కాబోలు. నాయిక మనసును తెలియమంటున్నారు చెలులు. చెలి చిత్తాన్ని లావణ్యాన్ని ఒకే క్రియలో ఏకకాలంలో ఉత్ప్రేక్షల్లో పొదగటం అన్నమయ్యకే చెల్లింది.

పల్లవిలోనే సంబుద్ధ్య ప్రేరణతో కూడిన వాక్యం "అయ్యో ! యేమి చూచే" వనడంలోని దీర్ఘాక్షర ప్రయోగంలో చెలుల ప్రేరణ, నాయిక దైన్యం కనిపిస్తాయి. "అయ్యో !" లోని దీర్ఘాక్షరంలోను నాయిక దీనస్థితిని 'యేమి చూచే' వనడంలోను అలుకను ఎరుక పరిచేరీతి మాత్రమే కాక నాయికా సాంత్వనానికి స్వామిని సిద్ధం చేయడం కూడా కనిపిస్తుంది.

నాయికకు సపర్యలు చేయమని చెమట 'తుడవవయ్య', 'సురటివిసరవయ్య', 'తమలమొసగవయ్య' అంటూ ప్రేరణ, హితబోధలు కనిపిస్తాయి. నాయిక అలుక, లావణ్యం కరిగి చెమటలై ప్రవహిస్తున్నాయి. "లావణ్య రసమిదివో" అంటూ ఆత్మగతం అయిన అలుకని దేహగతమైన లావణ్యాన్ని అవస్థారూపంలో స్వేదం ద్వారా పాదాంత దీర్ఘాక్షరం, అవధారణార్థకంలో భావ చిత్రం సృష్టించి నిరూపించాడు అన్నమయ్య.

20. మోహం - రతి ప్రీతి:

నాయిక పట్టరాని మోహం రతి ప్రీతి అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తుంది.

రాగం: ముఖారి

ఆయనాయ నీ కింత యాచారాల గొడవేల
పాయపు మదము నీవు పట్టకుండ గలవా ॥పల్లవి॥

పూచిన తంగేడు వలె బొలతి సింగారించుక
యేచి నిలుచున్నది నీ యెదుటను
చేచేత చెరగు మాసి వుండితే నే మాయ
చూచి చూచి యంటకోరుచుకుండ గలవా ॥ఆయ॥

పచ్చని చిలుక వలె బడతి చదువుకుంటా
మచ్చికలు చూపీ నీ మంచము పొంత
మెచ్చులుగ దడిచెము మీద నుంటే నే మాయ
కిచ్చురేగి ముట్టి తమకించకుండ గలవా ॥ఆయ।

మూసిన ముత్యము వలె ముదిత కాగిట నిల్చి
ఆస కొల్పీ శ్రీ వేంకటాధిప నిన్ను
సేస వెట్టి నాలు నాళ్ళు చేసితే నందుకే మాయ
వాసి తోడ బొంది వలవకుండ గలవా ॥ఆయ।

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం13, పుట40, సంకీర్తన 66)

నాయిక ప్రకృతి ధర్మాన్ని అనుసరించి ముట్టుత యై కనిపిస్తుంది. శ్రీవారికి ఆచారాల పట్టింపు చాలా ఉన్నట్లుంది. "ఆచారాల గొడవెందుకు స్వామీ" పట్టరాని వలపులను, మదమును బంధించగలవా "చెఱగు మాసితే నేమాయ" "సింగారించుక నిలిచిన చెలిని" కరుణించమంటున్నారు చెలులు. పూచిన తంగేడు ఎరుపు వర్ణం ఆమె వర్తమాన శారీరక స్థితిని సూచిస్తున్నది. చెరగు మాసినా ఆత్మార్పణకు లోటు కాదని సఖులు ప్రేరేపిస్తున్నారు. 'పచ్చని చిలుక వలె' అలంకరించుకొని మంచముపై చేరిన పడతిని "దడిచెము" మీద ఉన్నంత మాత్రాన "తమకించక ఓపగలవా" ఇది నీకు సాధ్యమా అంటున్నారు చెలులు. "మూసిన ముత్యం వలె" ఉన్న చెలిని, కౌగిట చేరే చెలిని "ముట్టరానిదని వలచి వలపించక ఉండగలవా" అని ప్రశ్నిస్తున్నారు చెలులు.

ముట్టుత అయిన నాయికని మూసిన ముత్యంగా నిరూపిస్తున్నాడు అన్నమయ్య. ఏ అవస్థలో అయినా ఎటువంటి స్థితిలో అయినా ప్రతివారు స్వామి పూజకు అర్హులేనన్నది మధుర భక్తికి ఈ నాయిక ప్రవృత్తికి తత్త్వంగా కనిపిస్తుంది.

పల్లవిలోనే శ్రీవారి ఆచారాల పట్టింపుని చెలులు 'ఆయనాయ' ఇంక చాలు అనే అర్థంతోను ఆచారాలు కట్టిపెట్టు. పైగా "ప్రాయపు మదాన్ని పట్టకుండగలవా"? అనే ప్రశ్నలోను ఆచార నిషేధం, రతికై ప్రేరణ ఆ లయలో వినిపిస్తాయి. "చెరగు మాసి వుండితే నేమాయ"? "దడిచెము మీద నుంటే నేమాయ" అనే ప్రశ్నల్లో రతికి ఆత్మార్పణకు ఆమె అర్హతలనే నిరూపించారు. 'సింగారించుక నిలుచున్నది'. 'పూచిన తంగేడు వలె', 'పచ్చని చిలుక వలె చెంత చేరినది' అంటూ ఆమె సౌందర్యాన్ని, వ్యంగ్యంగా చేష్టల్లో వ్యక్తం అయ్యే మోహం రతిప్రీతిని వాచ్యం చేస్తున్నారు చెలులు'. "ఆమె సౌందర్యం పట్టరాని కోర్కెలు ఎంత తమకాన్ని, నీలో రేకెత్తిస్తాయో ఓపగలవా పాపం" అంటూ ఎదురు స్వామినే ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రశ్నాన్విత లయలో సౌందర్య నిరూపణ, స్వామిని ప్రేరేపించటం వినిపిస్తాయి. దీనికి పరాకాష్ఠ నాయికని మూసిన ముత్యంగా నిరూపించటంలో కనిపిస్తుంది.

21. స్త్రీ చిత్తవృత్తి - ప్రవృత్తి:

చిత్త వృత్తుల పరంగా నాయికా ప్రస్థానాన్ని వివేచిస్తే అనంత రూపాల్లో అభివ్యక్తం అవటం మనకి కనిపిస్తుంది స్త్రీ మనస్తత్వాన్ని చిత్త వృత్తులను ప్రవృత్తులను విశ్లేషించి అన్నమయ్య ఒక సంకీర్తన రచించాడు.

రాగం: శ్రీరాగం

ఆఁడు వారి గుణమిది యటువంటి దానఁ గాను
నేఁడు నన్నేలుకో వారు నిన్ను దూరఁ జూతురు ॥పల్లవి॥

మట మాయతనమున మగువలు మగవారి
నటకారి తనమున సాధింతురు
తటుకన వలచితేఁ దగిలించుకొని యట్టె
యిటునటు భ్రమయించి యెలయించఁజూతురు ॥ఆడు॥

వేసదావరి వనితలు వెంగెము లప్పటిఁ జూపి
కాసు వీసములకుఁ గాఁ గరఁ గింతురు
ఆసపడి లోనైతే నండ వాయకుండా ఁ జేసి
బాస గొని మోసపుచ్చి పంత మాడఁ జూతురు ॥ఆడు॥

యేతులాఁడి కాంతలు యెందునైనా సందు చూచి
వాత రొట్టుమాట లాడి వంచుకొందురు
యీతల శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చేతఁ జిక్కుకున్న వారు సిగ్గువడఁ జూతురు ॥ఆడు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట135, సంకీర్తన 201)

స్త్రీ సహజ గుణాలు వర్ణిస్తూ, 'తాను అటువంటి దాన్ని కాదనీ, తనలో స్త్రీ సహజమైన అసూయా మాత్సర్యాలేవీ లేవు కాబట్టి తన మంచితనాన్నీ రీతిగా తెలుసుకో'మంటున్నదా నాయిక.

"మగువలు మగవారిని మాయ చేసి సాధిస్తారు. తలచితే భ్రమలు కల్పించి మోసపుచ్చుతారు. చిత్ర విచిత్రపు వేషాలు వేసే వనితలు వ్యంగ్యాలూ, వెటకారాల జాణతనాలాడి ధనం కోసం కరిగిస్తారు. మరికొందరు ఆశ చూపి, వెంట వస్తే పోనీయక, బాసలు చేసి, చేయించుకొని మోసపుచ్చి పంతాలాడుతారు. వగలాడి కాంతలు వీలు చూచి రొష్టు పెట్టే మాటలని పంచుకుంటారు. నా చేత చిక్కి నన్నలరించే నిన్ను చూసి సిగ్గు పడేను. స్వామీ వారి వద్దకు పోకు. కష్టపడకు. నన్ను కష్ట పెట్టకు" అని నాయిక స్త్రీల ప్రవృత్తులను చిత్తవృత్తులను వివరిస్తున్నది.

"సాధింతురు, దూర జూతురు, యెలయించ జూతురు, కరిగింతురు, పంత మూడ జూతురు, పంచుకుందురు" అనే క్రియా పదాల్లో స్త్రీ ప్రవృత్తి వర్ణించబడింది.

ఈ క్రియలకు ముందు 'వలచితే', 'ఆశపడి లోనయితే' అనే పదాలున్నాయి. ఈ రెంటికి తలవంచితే ఎన్ని రకాల మోసాలకు గురి అయ్యే ప్రమాదాలున్నాయో వర్ణించిందా నాయిక. 'మాయ తనం', 'నటకారితనం' 'బాసలు కొనడం, మోస పుచ్చడం', 'కాసుకై వేషాలేయడం', 'రొష్టు మాటలనడం' కాంతల నైజంగా వర్ణించిందా నాయిక. విశేషణ విశేష్యాలతో కూడిన పదాల పొందికలో 'స్త్రీల సహజ గుణాలివి' అని అతి సహజంగా చెబుతూ అంత కంటే సహజంగా తానా కోవకు చెందిన దాన్ని కాదని నిరూపించుకుంటున్నదా నాయిక. క్రియా విశేషణాల్లో పదాల పొందికలో రెండేసి పాదాల్లో ఒక్కొక్క గుణం వర్ణించబడి పదం అక్కడ విరుగుతున్నది. నియమితమైన గతిని సూచిస్తున్నది. ఆ గతిలో స్త్రీ నడత, పదం నడకల గమనం భాసిస్తాయి. అందులోని లయ ప్రవృత్తి నిరూపకం అవుతున్నది.

స్త్రీ ప్రవృత్తిని అన్నమయ్య తన సంకీర్తనల్లో ఎన్నో రూపాల్లో ఎన్నో గతులలో నిరూపించి ప్రపంచానికందించాడు. జీవితంలో కలిగే వివిధాలైన అనుభూతులకు ఒక్కొక్క స్త్రీ ఒక్కొక్క విధంగా స్పందిస్తుంది. ఈ స్పందన సంస్కారాన్ని బట్టి, పాత్రతని బట్టి, గుణాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. స్త్రీ స్వభావంలోని ఓర్పు, క్షమ, నేర్పు, కాఠిన్యం, తాత్కాలికోద్రేకం, చాంచల్యం, వక్రోక్తులు, ఔదార్యాలను అన్నమయ్య తన సంకీర్తనల్లో అత్యంత సహజంగా నిరూపించాడు. ఉద్దిష్టార్థాన్ని వాచ్యంగా కాక వ్యంగ్యంగా చెప్పటం స్త్రీ ప్రవృత్తిలోని విశేషం. అన్నమయ్య పద రచనలో ఈ వైచిత్రి ఎంతో విలక్షణంగా కనిపిస్తుంది. అనుమానం, ఈర్ష్య స్త్రీకి ఆభరణాలు, ఈ లక్షణాలన్నీ కలబోసిన స్త్రీ సహజ ప్రవృత్తి అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చోటు చేసుకుంది.

"గయ్యాళి తనము నాది. కడు శాంతము నీది. ఇయ్యెడ నీ మంచితన మేమని పొగడుదు" అని ఓ ఇల్లాలు పతిని మెచ్చుకుంటున్నది. తాను పరిహాసం చేసి నవ్వినా, నొచ్చుకోక మెచ్చుకున్న పతిని పొగడుతున్నది. తనకు తానే 'గయ్యాళిని' అని చెప్పుకునే ఆ ఇల్లాలు. పాపం ఆ పతి కడు శాంతం వహించక ఇంకేం చేయగలడు, (29వ సంపుట, 328 పుట)

స్త్రీ ప్రవృత్తిని అంచనా వేయటం కష్టం కాబట్టి ఓ ఇల్లాలు ఇలా చెబుతున్నది.

"ఏటికి జింతించేవు యెఱుగవా నా మనసు. చీటికి మాటికి లోలో సిగ్గులు నా సాజము, మొగమాట కలదాన, ముందు ముందే దూరనేర. నగుతానుండేది నా సాజము, తగవు తప్పని దాన, తబ్బిబ్బులకు నోపను, అగపడి మెచ్చు, మెచ్చే దది నా సాజము, వినయము కల దాన, వెంగేలాడగ నేర, ననిచి మాటలాడేది నా సాజము, మనసు నమ్మిన దాన, మర్మము లెత్తగ నోప, చనవులు మెరసేది చక్కని నా సాజము" అంటూ ఆవిడ తన గుణ గణ వర్ణన చేసుకున్నది (24వ సంపుట,464 పుట).

అతి సిగ్గులూ మోహమాటాలూ, నవ్వులూ ఆవిడకి అతి సహజాలట. తబ్బిబ్బుల కోర్చదట. మెచ్చుకుంటుందట, తనను మెచ్చుకోవాలట. వినయం, కలిగిన దాననని, వ్యంగ్యాలు తెలియనే తెలియవనీ మనసులో నమ్మిన తనకు మర్మాలు తెలియవనీ చెప్పుకుంటున్నది.

లోకంలో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా స్త్రీ తను అమాయకురాలిననీ, తనకు, కల్లా కపటం తెలియవనీ చెప్పుకోవటం పరిపాటి. అయితే ఈ విషయాల్నే మహా వ్యంగ్యంగా మరీ వక్రోక్తి రూపంలో చెప్పటమే అన్నమయ్య గడుసుదనం. స్త్రీ స్వభావానికి కేంద్ర స్థానాన్ని అన్నమయ్య ఈ క్రింది సంకీర్తనలో నిశితంగా సూచించాడు.

"ఆశ చూపించి బాసలు గొని కట్టడి చేస్తారు". నవ్వులతో నమ్మికలు పుట్టిస్తారు ఇచ్చకపు సతులు. తరుణుల సహజాలు తలచుకోవోయి అంటున్నదా నాయిక. (24వ సంపుట, 265 పుట).

"చలపాది తనములు సహజము సతులకు", 'కడు గొట్టి తనాలు కలిగి' ఉంటారు. "కొడిమెలు గట్టుదరు, కోపములు చూపుదురు". జాగ్రత్తగా ఉండాలి. 'తడవి నంతటి లోనే తప్పులు పట్టుదరు'. కాపురం చేయటం చాలా కష్టం అంటున్నాడు ఇద్దరు సతులున్న అన్నమయ్య. (25వ సంపుట, 567 పుట).

పతుల మోహింపించేది, పంతములు నెరపేది స్త్రీల సహజ నైజమట. వారు "పిలుతురు, బిగుతురు, ప్రియములు చెప్పుదురు. కలికి కాంతల గుణాలు" ఔరా అంటాడు అన్నమయ్య. ఇక సవతులు ఒకరి నొకరు చూసుకున్నారంటే "సన్నీ

నుప్పతింతురు, సాధింతురు, విన్న కన్న వారితోడ వెంగెములాడుదురు. పన్ని పతిపై బెట్టి పంగింతురు", ముందరికి వస్తే "మూతులు గిరుపుదురు, నిందింతురు, వూరకే నెపాలెంతురు, యెందు మేలు కలిగినా నీసడింతురు. చక్కదనాలీడు సూపు సణుగులు రాలుతురు. ఇవన్నీ స్త్రీలకు సహజ సిద్ధ గుణాలట. (29వ సంపుట, 70 పుట).

"క్షణక్షణముల్ జవరాంధ్ర చిత్తముల్" అన్నట్లు ఈ లక్షణాలన్నీ క్షణికోద్రేకాన్నీ, చాంచల్యాన్నీ సూచించేవే. తమలో ఔన్నత్యాన్ని పరులలో అల్పత్వాన్నీ చూసే ఈర్ష్యాళువులుగా వీరు కనిపిస్తారు. అయితే ఇవన్నీ అందరికీ వర్తిస్తాయని కాదు. కేవలం ప్రవృత్తి సూచకాలు మాత్రమే. "భామలతో బోరగా ఫలమేమి వచ్చె" వారితో పోరు కష్టం. అతి సులభంగా వారు ప్రపంచంలో ఎవరినయినా జయించగలరంటున్నాడు అన్నమయ్య 'సిగ్గులే మూలధనం', 'సిగ్గులే రాజ్యం', 'పంతమే పెట్టని కోట', 'గుట్టుల నవ్వులే చేయని సింగారాలు', 'చలమే ముందరి ఫౌజు', 'ఇంక వారిని నువ్వేం గెలుస్తావు స్వామీ' అంటూ మగవాడి బలహీనతలను, అతడిని కరిగించ గల నేర్పులను స్త్రీలు ఎంత నైపుణ్యంగా సమయాన్ని బట్టి ప్రదర్శిస్తారో అన్నమయ్య విశదీకరించాడు. (27వ సంపుట, 63 పుట).

స్త్రీ సాన్నిహిత్యం చిత్రమైనది. పిలిచిన కొద్దీ బిగువు, బలము కొద్దీ పంతం, చలము కొద్దీ పంతం, సాధింపు, కలసిన కొద్దీ కరగింపు, చనవు కొద్దీ సరసం, వినికి కొద్దీ విన్నపం, తనిసిన కొద్దీ తమకం, వేడుక కొలదీ వేసం, వాడిక కొలదీ వలపు" ఏమని చెప్పాలి స్త్రీ చిత్తవృత్తి అంటాడు అన్నమయ్య (27వ సంపుట, 93 పుట).

"వలచిన కాంతలు వేషాలేమైన వేస్తారట. సలిగె గలుగువారు జంకిస్తారు. వలచిన వారు రవ్వలు సేతురు, బలిమి గలుగువారు పైపైన బెనగుదురు. మనసెనసిన వారు మందె మేళాలు సేతారు. నను పైన వారు చెనక వస్తారు. తనియని వారు సంతతము కొసరుతారు." ఇలా వలచిన వారు ఎన్ని కళలనైనా చూపుతారట. శృంగారం ఒలకబోసే సర్వనాయికా వైలక్షణ్యం ఈ ఒక్క సంకీర్తనలోనే కనిపిస్తుంది. (29వ సంపుట, 16 పుట).

హావ భావ విలాసాలు ఒక్కొక్కరి స్వభావంలో ఒక్కొక్క రకంగా విరబూస్తాయట. "సిగ్గరి కత్తెకు గాని సెలవి నవ్వులు రావు', యెగ్గులాడికి కాని యీసు లేదు, బగ్గెడి దానికి గాని పచ్చి మాటలమరవు, 'పంతపు దానికి గాని

పల్లదములు రావు', 'జంత (గయ్యాళి)కి గాని కదు చలము లేదు', 'నాలి వనితకు కాని ననుపులు దొరకవు, ప్రేలరికి గాని రతి ప్రేమ పుట్టదు', అంటూ ఒక్కొక్క స్త్రీ స్వభావాన్ని పసి కట్టటానికి ఆమె చేష్టలు భాష ఎలా ఉపకరిస్తాయో చెబుతూ, స్త్రీ స్వభావాన్ని సందర్భాన్ని అనుసరించి ఎలా అభివ్యక్తమవుతున్నదో అన్నమయ్య తన సంకీర్తనలో వివరించాడు. (22వ సంపుట, 375 పుట).

స్త్రీకి నేరుపే నిధానమట. ఆ నేర్పును ఎన్ని రకాల ప్రయోగించి మగవాణ్ణి కరగించవచ్చో ఓ పడతి సశాస్త్రీయంగా ఉపదేశిస్తున్నది. వినయాలు చేసి వేడుక పుట్టిస్తే మనసు కరుగుతుందట. మగవాడికి ఇచ్చకాలు నెరపితే అన్నీ సమకూరుతాయి. చెప్పినట్టే చేసి చెంతకు రాకపోతే తమకం రెచ్చిపోతుందట. ఒప్పుగా మాట్లాడి ఒద్దికగా ఉంటే కళలు ఏ మగాడికయినా రేగటం ఖాయం అంటున్నాడు సఖీరూపంలో అన్నమయ్య (29వ సంపుట, 18 పుట).

పురుషుణ్ణి కరిగించటానికి స్త్రీ సరస సల్లాపాలు ఎంత సమ్మోహనకరంగా ఉంటాయో ఉక్కిరి బిక్కిరి చేస్తాయో కొందరు స్త్రీలే ఇలా అంటున్నారు.

'కెలతుము, సొలతుము, కేరటము లాడుదము, వలపులు చల్లుదుము, పిలుతుము, ప్రియములు చెప్పుదుము, సళుపు చూపుల జూచి సరస మాడుదుము, వినయాలు సేతుము, వేడుకతో నవ్వుదుము, చనవున మెరతుము, పెనగుదుము, యెప్పుడైనా గూడుదుము, యెంగిలి మోవి సేతుము, చెప్పుకొందుము నీ పొందు చెలులతో' అంటూ ఆ స్త్రీలు ఇన్ని విద్యలను ఒక్కసారే ప్రదర్శిస్తున్నారు. ఇందులో ఒక్కొక్క విద్య పురుషుణ్ణి ఒక్కొక్క రకంగా రంజింప చేస్తుంది. కామశాస్త్రం మూట గట్టిన వారికి కాని ఈ కామ జనక కళాస్థానాలు, ప్రేరణలు తెలియవు. ఈ సంకీర్తన కామశాస్త్రాన్ని ప్రయోగించే నేర్పును సూచిస్తున్నది. (29వ సంపుట, 16 పుట).

సిగ్గులకు చిరునవ్వులు ప్రతీక, 'యెగ్గులెంచక పోవడం ఇంపుకు ప్రతీక', 'హొగ్గిన రతులకు' ఊరుకోవటమే ప్రతీక. 'చెప్పరాని మాటలకు చేసన్నలే' ప్రతీక 'అణచుకోరాని ఆశలకు' 'ఆయములంటుటే ప్రతీక', చేతికి లోనైనందుకు చెలరేగుటే ప్రతీక. ఎన్నో భావాలను మౌనంగా పలికించిందీ మగువ. స్త్రీని అర్థం చేసుకోవటం ఎంత కష్టమో ఈ సంకీర్తన ఋజువు చేస్తున్నది.

రమణులు తమ చనువులను నెరిపి వన్నెలలను కురిపిస్తున్నారు. లోబరుచుకుని బింకాలు కసరులు ప్రదర్శించటమే స్త్రీకి వన్నెలట.

'కాంతలకు బతులతో గబ్బితనమే వన్నె', 'కొంతపు జూపు తోడి కోపమే వన్నె', 'వంత పట్టేటి మంకుదనపు గుట్టే వన్నె', 'వెలలేని కొసరుల వెంగెపు మాటలే వన్నె', చలి వాసినట్టి రాజసాలే వన్నె', 'వొనగూడిన వేళ వుద్దండాలే వన్నె' ఇన్ని చిన్నెలు వన్నెలు సహజ సిద్ధంగా స్త్రీకి అమరితే ఏ మగవాడు కరిగి పోకుండా నిలవగలడు (27వ సంపుట, 170 పుట).

సతులు తమ జన్మకు సాఫల్యాన్ని భర్త ప్రేమను పొందటంలోనే అనుభవిస్తారని వారి నిర్మల చిత్తాన్ని అన్నమయ్య ఇలా వర్ణిస్తున్నాడు.

"సతికి యవ్వనమే ఫలము, పతి ఆదరించినదే ఫలము, మతికి మంచిగా మాటాడితేనే ఫలము, అతికాంక్షను ఎప్పుడూ పాయక పోవుటే ఫలము. పతి మోము చూచి నవ్వితేనే ఫలము, చనువిచ్చి ఆడే సరసమే ఫలము, మనసు తనివి దీర మర్మములంటుటే ఫలము కనుగొన చూచి కరగుటే ఫలము. ప్రియముతో మేను సోక పెనగినదే ఫలము" అంటూ భర్త అనురాగం పొందటమే స్త్రీకి పెద్ద ఫలంగా నిరూపించాడు అన్నమయ్య (30వ సంపుట, 295 పుట).

ఇంతటి అనంతమైన వైవిధ్యం కలిగిన స్త్రీ చిత్తవృత్తిలో మెదిలే భావాలను కలంలో కురిపించటం సామాన్యమైన విషయం కాదు. ఈ నాయిక లందరిలోనూ ప్రతి ఫలించే రాగద్వేషాలూ, వివిధ రసభావాదుల్లో, భిన్న అవస్థల్లోని వారి వారి చిత్తవృత్తులకు అద్దం పట్టాడు అన్నమయ్య. ఈ నాయికా ప్రస్థానంలో కనిపించే చైతన్యం, పరిణామ లక్షణం. ఆనాటి యుగంలోని స్త్రీని వాస్తవికతతో వర్ణించిన తీరు ప్రబంధయుగంలో ఎక్కడా మనకి కనిపించదు. దీనికి ప్రధాన కారణం అన్నమయ్య నాయికలందరు సజీవ మూర్తులు. శృంగార రసం ఒలికేలా రాజాస్థానాల్లో వెల్లి విరిసిన ప్రబంధ కన్యలెవరూ అన్నమయ్య సంకీర్తనల్లో మచ్చుకైనా కనిపించరు. కృత్రిమత్వం, పరాశ్రయమైన నాయికా వైలక్షణ్యాన్ని మనం అన్నమయ్య సంకీర్తనల్లో లవలేశమైనా చూడం. అన్నమయ్య ప్రతి నాయిక చిత్తశుద్ధితో ఆత్మార్పణ చేసి కొన్నదే. అభిరుచులు, ఆత్మీయతలు, గౌరవాలు, బెదరింపులు, హెచ్చరికలు, సిగ్గులు,

నయగారాలు, ఈర్ష్యలు నిత్యజీవితంలో అనుభవంలోకి వచ్చే ప్రతి అనుభూతిని, తజ్జనిత జ్ఞానాన్ని శృంగార సంకీర్తనల్లో పొదిగాడు. ప్రజాజీవితాన్ని సహజ సుందరమైన నిర్మలభక్తినీ ఈ సంకీర్తనల్లో నిరూపించాడు అన్నమయ్య.

భగవంతుడు నావాడనుకుంటే వచ్చే ఆనందం మరే ఇతర విషయాన్నీ స్వంతం చేసుకోవడంలో లేదు. నాదనుకున్న ప్రతిదాని మీద మనం కొంత హక్కు అధికారం ప్రదర్శిస్తాం. ఇదే ప్రవృత్తి ఈ నాయికలందరి మనసుల్లోను సమాంతరంగా కనిపిస్తుంది. భగవంతుణ్ణి కూడా ఈ అహంకార మమకారాల ముసుగులోంచే చూసి ఆయనతో దోబూచులాడుతూ కలహిస్తూ, కన్నీరు పెడుతూ, కాళ్ళు పట్టుకుంటూ చివరికి దేవుడు నా కొక్కతికే స్వంతం అనుకునే స్థితికి చేరుకున్నారీ నాయికలు.

"అప్పటప్పటికి నేము ఆడేవెల్లా వెంగెములే, తప్పులెల్లా నోరుచుకో దండము నీకు" (22వ సంపుట, 209 పుట) అంటారు. "కావరించి కినుతుము, కలతుము నీ మనసు వేవేలు నోరచుకొమ్ము. వేడు కొనేము (22వ సంపుట, 209 పుట) అంటూ పాదాలపై పడుతున్నారు.

మానవ మనస్తత్వ వైవిధ్య ప్రకటనకు ఇలా అనంత కోటి స్వరూపాలు దాల్చి కనిపించిన నాయికలు వాస్తవానికి ప్రతి భక్తుని హృదయంలో చెలరేగిన భావ వైవిధ్యానికి ప్రతీకలు. ఆత్మార్పణకి, తాదాత్మ్య భావానికి శృంగారాన్ని ఉపాధిగా చేసుకుని అన్నమయ్య మధుర భక్తి సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఈ నాయికల మధుర భక్తి దర్శనం భిన్న అవస్థల్లో, విభిన్న చిత్త వృత్తుల్లో, భిన్న సంస్కారాల్లో అనంత కోటి రూపాల్లో అభివ్యక్తమౌతున్నది. ఈ నాయికల చిత్తవృత్తుల సంస్కారాల ప్రవృత్తుల నిరూపణకు, మధుర భక్తి రూపాన్ని అవగాహన చేసుకోవటానికి, ఈ లౌకిక రూపాల ద్వారా అభివ్యక్తమయ్యే బ్రహ్మాండ నాయకుని మౌలిక రూపాన్ని అనేక వాక్యలయా రూపాల్లో దర్శించటమే ఈ నాయికా ప్రస్థానం ముఖ్య లక్ష్యం.

పాద సూచికలు:

1. త్యాగరాజస్వామి భక్తి కవితా వైభవం: ఆకెళ్ళ అచ్యుతరామ్

అన్నమయ్య నాయక ప్రస్థానం



5

అన్నమయ్య నాయక ప్రస్థానం

జగద్భర్త అయిన ఆ లీలా వినోదుని విచిత్ర వేషగతులను, రూపాలను ఎన్ని విధాల విశ్లేషించినా అవి బహు స్వల్పమే అవుతాయి. మానవ ప్రవృత్తిని ఆధారంగా చేసుకొని అందిన అవస్థా భేదాల్లో ఎవరికీ అందని ఆ ఆనంద నిలయవాసుడి అంతరంగాన్ని దర్శించాలనే అనాదిగా జీవుడి తపన. అవస్థా భేదాన్ని అనుసరించి మారుతూ ఉండే నాయికల చిత్తవృత్తికి అనుగుణంగానే భిన్న రూపాల్లో బ్రహ్మాండ నాయకుడి దర్శనం కూడా సంభావించబడుతున్నది.

శ్రీవారి దివ్య శృంగారం వేల కాంతల మనసుల్లో అనంతకోటి రూపాలు ధరించి సాక్షాత్కరిస్తుంది. నిజానికి వీళ్ళందరూ సాధకులు. సాధనా మార్గాలు సహస్రం. కాంతి కిరణాలు భిన్న వస్తువులపై ప్రతి ఫలించి విభిన్న రూపాలుగా భాసించినా వాటి మౌలిక రూపం ఒక్కటే. అదే విధంగా శ్రీవారిని భిన్న నాయికలు విభిన్న ప్రవృత్తుల్లో దర్శించినప్పటికీ ఆ దర్శనాల మౌలిక స్వరూపం ఒక్కటే.

అన్నమయ్యకు ఆయన వర్ణించిన నాయికలకు భిన్న అవస్థల్లో, అంతరంగంలో శ్రీవారి శృంగార రూపం ఇలా భాసించింది.

1. శ్రీవారి అనురాగం:

సఖి నాయికతో "నీ పతికి నీ మీద ఎంతటి ప్రేమానురాగాలో!!! ఆయన వినయమే దానికి గుర్తని వేంకటపతి ఒద్దికపు చేతలని ఇలా వివరిస్తున్నది.

రాగం: సౌరాష్ట్రం

నీ పతి బత్తి గలడు నే నెఱుఁగుదు
దాపుగ నా మాటలివి తలచుకోవే ॥పల్లవి॥

సరసము లాడుటే జడిగొన్న మోహము
శిరసు వంచుకొనుటే సిగ్గుఁ బాట్లు

గరిమ నవ్వు మిక్కిలి ఘనమైన తరితీపు
సరి చూడవే వలపు జాడలివి ॥నీ పతి॥

చెప్పరాని వినయాలే చిత్తములో అసలు
తప్పక చూచుటే తగులాయములు
వుప్పతిల్లుఁ జెనకులే వుడివోని తమకము
తిప్పరాని కాంక్షలివి తెలుసుకోవే ॥నీ పతి॥

మొగములు చూచుటే ముంచిన ఇచ్చకములు
ఒగి వాయకుండుటే చేపట్టిన పొందు
అగపడి నిన్ను నేలె అదె శ్రీ వేంకటేశుఁడు
మగనికి నీ మర్మము లెంచుకోవే ॥నీ పతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం25,పుట102, సంకీర్తన 152)

శ్రీవారికి తన పైన ఉన్న ప్రేమ ఎంత గాఢమైనదో పదిమందికి చెప్పుకుంటేనే ఏ పడతికైనా పారవశ్యం ఎక్కువ. ఈ సతికి ఆ ప్రియసఖి శ్రీవారి చేష్టల్లోని ఒద్దికపు వినయాన్ని నిరూపించి చెబుతున్నది. శ్రీవారి 'సరసాల్లోని మోహం', 'వంచిన శిరసు'లో తొంగి చూసే సిగ్గులు', 'నవ్వుల్లోని తమకపు వలపుల జాడలు సుమా' అని విశ్లేషించి చెబుతున్నదీ సఖి.

'వినయపు చేతలు' చిత్తాన్ని చూపుతున్నాయి. ఎడతెగని చూపులే ప్రేమకి పరాకాష్ట. 'వుప్పతిల్లే చెనకులే' శ్రీవారి తమకానికి గుర్తులు. 'ఆకాంక్షలు తిప్పగా రానివి, చెప్పగా లేనివి. తెలుసుకోవే' అని ఆ సఖి పరవశింపజేస్తున్నది. 'మొగము చూచుటే ముంచిన ఇచ్చకాలని' తెలుసుకోమని శ్రీవారి మాట, చేత, చూపు, నడక, స్పర్శలను విశ్లేషించి సమస్తం ఆ నాయికపై స్వామికి కల ప్రేమని నిరూపిస్తున్నాయంటుంది సఖి. నిజానికి ఈ సఖి అన్నమయ్యే.

పల్లవిలోని పాదాంత సంబుద్ధ్యంత దీర్ఘం ద్వారా 'తలచుకోవే' పదంతో చెలి నాయికకు నాయకుని చేతల్లోని సతీ ప్రియత్వాన్ని నిరూపిస్తున్నది.

పల్లవిలోని మొదటి పాదంలోనే <u>రెండు</u> <u>లఘువులు</u> స్వామి ప్రేమను నిశ్చయాత్మకంగా నిరూపిస్తూ 'బత్తికలడు', 'నేనెఱుగుదు', అనే పదాల్లో ప్రయోగించబడినాయి.

శ్రీవారి ప్రేమ నిరూపణకు నిశ్చయత్వాన్ని వ్యంజింప చేయటానికి వ్యాఖ్యాన రూపంలో గురువులు 'సరసము లాడుటే', 'శిరసు వంచుకొనుటే', 'చెప్పరాని వినయాలే', 'తప్పక చూచుటే', మొగములు చూచుటే 'ఒగివాయకుండుటే' అనే పదాల్లోని పాదాంత గురువుల్లో సూచించబడినాయి. ఆ తరువాత ఈ ఒక్కొక్క ఆంగిక విన్యాసానికి స్వామి ప్రేమను వ్యంజింప చేస్తూ, పాదాంత లఘువులు 'మోహము', 'సిగ్గుబాట్లు', 'చిత్తములో అసలు', 'తగులాయము', 'తిప్పరాని కాంక్షలు' 'ముంచిన ఇచ్చకాలు' 'చేపట్టిన పొందులు' అనే పదాల్లో ప్రయోగించబడినాయి. ఈ గురు, లఘువుల అమరిక వల్ల ఏర్పడిన వాక్య లయలో శ్రీవారి అనురాగం వ్యక్తం అవుతున్నది.

2. శ్రీవారి సమానత్వం: దక్షిణ నాయకత్వం:

మహాకవుల చేత, విశేషించి భక్త కవులచేత, వివిధ సాహితీ ప్రక్రియల్లో వేనోళ్ళ కొనియాడబడినవాడు, మధుర భక్తి సామ్రాజ్య నాయకుడు అయిన ఆ శ్రీకృష్ణుడికి నాయికల పట్ల కల సమాన అనురాగాలను, ఆయన దక్షిణ నాయకత్వాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

రాగం: రామక్రియ

కన్నదే కంటి గురుతుగా c గైకొనేవు
యిన్నిటాc గలుపుకోలు ఇది నీకే కలదు ॥పల్లవి॥

పొరుగాపె నీతోను పోరచి మాటాడితేను
పరగ నంతలోc గొంగు వట్టేవు నీవు
సరుగ వేరొక సతి సాకిరి చెప్ప వచ్చితే
సరస మాడుతా నాపె చన్నులంటేవు ॥కన్నదే॥

వాడ వనిత నీతోను వట్టి నవ్వు నవ్వితేను
జీడి వలె నంటుకొని చేయి వట్టేవు
ఆడ నుండి వేరొక్కతె పాడి దిద్దవచ్చితేను
మేడెపుc గాcగిట నించి మెచ్చు మెచ్చేవు ॥కన్నదే॥

అంగడి నున్న కాంత అట్టె నిన్ను c జూచితేను
యెంగిలి సేసి మోవి యెలయించేవు
చెంగట నుండి నేను శ్రీ వేంకటేశ్వర నీది
సంగతి గాదంటేను సరిగాc గూడి మొక్కేవు ॥కన్నదే॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం27,పుట108, సంకీర్తన 162)

శ్రీవారికి వలపు గురుతులతో పెద్దగా పట్టింపు లేదు. 'ఊరికే ఏ పడతి యధాలాపంగా చూసినా అది కనుసన్నగా భావించి సిద్ధం అయిపోయే నాయకుడిని ఏమనాలి' అంటూ నిందిస్తున్నదీ నాయిక.

'పొరుగామె కుశలమడిగితే' 'కొంగు' పట్టాడట. మరొకతె సాకిరి చెప్ప వచ్చితే సరసాలాడి 'చన్నులు' పట్టాడట. వాడ వనిత వట్టి నవ్వు నవ్వగానే 'జీడిలా' చేయి పట్టి వదలడట. మరొకతె పాడి కోరి వస్తే "వేడి కౌగిటిలో కరిగించాడట. అంగడిలో ఉన్న కాంత నిన్ను చూడగానే మోవి ఎంగిలి చేసి రుచి చూసేవు. నీ రసికత ఏమని చెప్పాలి స్వామీ" అంటున్నదీ నాయిక.

పల్లవిలో స్వామి నాయిక చేసే ఏ చిన్న చేష్ట అయినా స్నేహానికి గుర్తుగా స్వీకరించి పొందుకు సిద్ధం అయిపోయే స్వభావాన్ని 'కన్నదే' అనే పాదాది క్రియ ద్వారా, ఊనిక ద్వారా అన్నమయ్య స్పష్టం చేశాడు.

ప్రతి చరణంలోను మొదటి పాదంలో నాయిక చేష్ట, రెండవ పాదంలో స్వామి పొందుకు సిద్ధం అయ్యే రీతి వ్యక్తం అవుతున్నాయి. ప్రతి చరణంలోని మొదటి, మూడు పాదాల్లో 'మాటాడితేను', 'చెప్ప వచ్చితే', 'వట్టి నవ్వు నవ్వితే', 'దిద్ద వచ్చితే', 'చూచితే' పదాల్లోని పాదాంత దీర్ఘాక్షరాలు, వాటిపైని ఊనిక, ఆ తరువాత ఏర్పడిన విరామం నాయిక సామాన్యమైన చేష్టలను స్వామి స్నేహానికి పొందుకు గుర్తులుగా స్వీకరించడాన్ని వ్యంజింప చేస్తున్నాయి.

ఈ సంకీర్తనలో ఒక ప్రత్యేక వర్గం కాని కులం కాని కాక, గుణాన్ని బట్టి, భక్తిని బట్టి సర్వులను సమానంగా స్వీకరించే ఆ భగవంతుడి లీలా వినోదం, కరుణాంతరంగం దక్షిణ నాయకుడి రూపంలో వర్ణించబడింది.

3. శ్రీవారి వినయం:

వినయాన్ని అభినయిస్తూ అదలింపులకు గురి అయి కూడా బతిమాలుకునే వేంకటపతి అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా కనిపిస్తాడు.

రాగం: రామక్రియ

వట్టి బాఁతిపడి నీ పై వలపులు చల్లేము గాక
యిట్టయితే మరి యిఁక నేమి చెప్పేదయ్యా ॥పల్లవి॥

కాంతను నా యెదుటనె కాఁగిలించుకొంటివి
పంతములాడఁగ నిఁకఁ బని యేది
వింతలుగా సిగ్గులెల్లా విడిచిన మీఁదట
యెంత కొసరినా నందు నేమి గలదయ్యా ॥వట్టి॥

నా వద్ద నుండి యాకె తో నవ్వులు నవ్వితివి
భావించి చూచిన నిఁకఁ బని యేది
వేవేలకు మతిలోని వెరపు దీరిన మీఁద
చేవ మీరిన సుద్దులు చెప్పఁ జోటేదయ్యా ॥వట్టి॥

చలి వాసి యాకె తోనే సరసములాడితివి
పలుమారుఁ బచ్చిసేయఁ బని యేది
అలమేల్మంగ నైన నన్నట్టె యేలితివి
యెలమి శ్రీ వేంకటేశ యెట్టు మెచ్చేదయ్యా ॥వట్టి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం19, పుట21, సంకీర్తన 30)

“అమాయకులమై నిన్ను వలచేము కాని నీ విద్యలు వినయాలు తేటతెల్లమే స్వామీ ! అంటూ నాయిక పతిని నిందిస్తున్నది. “కాంతను నా ఎదుటనె కౌగిలించుకుంటివి. పైగా సిగ్గు విడిచి కొసరేవు”. నేను పంతమాడితే మాత్రం ప్రయోజనం ఉంటుందా? నా వద్ద నుండి ఆమెతో నవ్వులు నవ్వుతున్నావు. సరసాలన్నీ తీర్చుకుని కారణాలడిగితే వేల సుద్దులు చెప్పే నిన్నేమనాలి స్వామీ” అని బాధపడుతున్నదీ అలమేల్మంగ. ఆమె చింత పడుతున్నా సిగ్గులు మానదు, పర

కాంతల కొంగు పట్టడమూ మానదు, వినయపు సుద్దులకు మాత్రం లోటు రానీయక ఆ బ్రహ్మాండ నాయకుడు అపూర్వంగా దర్శనమిస్తున్నాడు.

పల్లవిలోని మొదటి పాదంలో "నీ మీద భ్రాంతితో ప్రేమతో వలపులు చల్లేము స్వామీ, నీ వరస చూస్తే ఇలా ఉంది" అనే భావంతో పాదాంత దీర్ఘం "ఏమి చెప్పేదయ్యా?" ప్రయోగించబడి నాయిక నిస్పృహను వ్యక్తం చేస్తున్నది.

ప్రతి చరణంలోని మొదటి పాదంలో స్వామి చేష్టా ఖండనకు పాదాంత లఘువు, రెండవ పాదంలో స్వామి చూపే ప్రేమ 'వ్యర్థం' అనే భావ నిరూపణకు ప్రశ్నాన్విత గుర్వక్షరం ప్రయోగించబడినాయి.

'నా యెదుటనె కౌగిలించుకుంటివి', 'విడిచిన మీదట నవ్వులు నవ్వితివి', 'వెరపు దీరిన మీద సరసములాడితివి', పదాల్లో స్వామి అన్యకాంతాసక్తి నిరూపించి ఖండిస్తున్నది. 'పని యేది', 'ఏమిగలదయ్యా', 'చెప్ప జోటేదయ్యా', 'బచ్చి సేయ బని యేది', 'యెట్టు మెచ్చేదయ్యా', అనే ప్రశ్నాన్విత గుర్వక్షర లయలో స్వామి ఎన్ని ప్రేమలు చూపినా 'వ్యర్థం' అనే ఖండన వినిపిస్తుంది.

ఇంతగా తన అన్యకాంతాసక్తి బయట పడుతున్నా స్వామి వినయాన్ని 'పంతాలాడటం'లో, 'కొసరటం'లో, 'భావించి చూడటం'లో, 'సుద్దులు చెప్పటం'లో, 'పలుమారు పచ్చి సేయటం'లో ప్రదర్శిస్తున్నాడు. స్వామి నయగారాలను ఇంతగా కోపించి ఖండించినా తుదకు కరిగిపోయే నాయిక చిత్తవృత్తి, స్వామి భక్త ప్రియత్వంపై పద నిర్మాణ క్రమంలోని వాక్యలయలో వ్యక్తం అవుతున్నాయి.

4. శ్రీవారి మోహం:

ఆపలేని శ్రీవారి మోహాలను అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా వర్ణించాడు.

రాగం: సామంతం

మానరా నవ్వుమానరా వద్దు మానరా
మాతో మానరా యేల మానరా నీవు
మానకుంటే నిన్ను నిందరు వినఁగా
మాటలఁ దిట్టక మానరా ॥పల్లవి॥

వారి వీరి తోడ వాపులు చెప్పంపే
వట్టి దోస మేల కట్టేవురా
తేర కొన నన్నుఁ జూచి వట్టి యాస
దేర నుస్సుర నేఁటికి రా ॥మానరా॥

పోరి పోరి నీవే నిజమరి నంటా
బొంకుచు నన్నేల ముట్టేవురా
కోరి పూరకున్న వారి కింతేసి
కొడిమె లేఁటికి వచ్చీరా ॥మానరా॥

చక్కని వారికి నీ యెదుట నేఁడు
సారె నిలువ రాదటరా
వొక్క మాఁటలోనె నీ వింత గరఁగి
వొళ్ళు చెమరించనేఁటికిరా ॥మానరా॥

చిక్కని చన్నులు నాకుఁ గలిగితే
చింతఁ బొరలఁగ నీ కేలరా
మొక్కలాన నీవు సేసే రోఁతలకు
మొదలనె నాకు సిగ్గవురా ॥మానరా॥

కారణము లేక వూరి వారి తోడ
కాలు దొక్క నేల వచ్చేవురా
నీరు వంక తుంగవంటివాడ వింతే
నీ తోడి పొందుకు నే నోపరా ॥మానరా॥

కూరిమి తోడుత శ్రీ వేంకటేశ్వర
కూడితివి నిన్ను నేమందురా
కోరిన కోరిక లెల్లాఁ దలకూడె
గోర నన్ను నూఁద నేఁటికిరా ॥మానరా॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం 19, పుట 269, సంకీర్తన 403)

శ్రీవారి మోహం కొల్లలుగా ఎల్లలు లేకుండా ఈ సంకీర్తనలో కనిపిస్తున్నది. వావి లేని వారే లేరు. ఏ చెలిని చూచినా ఆశలతో ఉస్సురని నిట్టూర్పులే-నేరాలన్నీ నిరూపించినా "పోరి పోరి నిజమరి నంటూ బొంకుచు నన్నేల ముట్టేవురా" అంటూ శ్రీవారిని మందలిస్తున్నదీ నాయిక. 'చక్కని వారు కనబడితే ఇంత కరిగిపోవాలా'? చిక్కని చన్నులు నా కుంటే 'చింత బొరలగ నీ కేలరా ? 'మొక్కలాన నీవు సేసే రోతలకు మొదలనే నాకు సిగ్గవురా' అంటున్నదీ నాయిక. కారణము లేకనే ఊరి వారితో ఏల ఈ చేష్టలు ? నీరు వంక తుంగ వంటి వాడవు. 'నీ తోడి పొందుకు నేనోపరా కోరిన కోరికలెల్లా తలగూడె' అయినా నీ చేతలకు నేనేమనేను అంటూ శ్రీవారి ఆపలేని మోహాలకు నాయిక వాపోతున్నది.

పల్లవిలోని యమకాలంకారంలో శ్రీవారి మోహాలను నాయిక నిషేధిస్తూ పలికిన పలుకుల్లో ఆర్తిని దీర్ఘాక్షర ప్రధాన వాక్యరూపంలో అన్నమయ్య రచించాడు. ఆమె ఆర్తిలో శ్రీవారి మోహాలు వ్యంగ్యంగా సూచించబడినాయి.

ప్రతి చరణంలోని ప్రతిపాదంలోను ప్రయోగించబడిన దీర్ఘాక్షరాలు "ఏల కట్టేవురా, ఏటికిరా, నన్నేల ముట్టేవుర, ఏటికి వచ్చీరా, నిలవ రాదటరా, చెమరించనేటికిరా, బొరలగ నీకేలరా, నాకు సిగ్గవురా, నేల వచ్చేవురా, నేనోపరా, ఏమందురా, నూద నేటికి రా, ద్వారా నాయిక ఆర్తి, తత్కారణమైన శ్రీవారి ఆపలేని మోహం వ్యక్తం అవుతున్నాయి. ఉస్సురు, బొంకుచు, కొడిమెలు, చింత, కాలు దొక్కి పదాల్లోని లఘువులు శ్రీవారి మోహాన్ని పదాల నడకలో తక్కుతూ తారుతూ నడిచే శ్రీవారి గమనాన్ని నిరూపిస్తాయి.

5. శ్రీవారి వినోదాలు:

జగద్భర్త గొల్లవారితో సరదాలు, సరసాలు జరిపే రమణీయ దృశ్యం, వినోదాల తీరు తెన్నులు ఈ సంకీర్తనలో దర్శనమిస్తుంది.

రాగం: శుద్ధ వసంతం

నడివిడి (వీధి?) మాటలు నాయమా నీకు
పడితెఁడు చల్ల వోసేఁ బెనఁగకు వోయీ ॥పల్లవి॥

గొల్లవారము మా కుల మేమి యడిగేవు
మొల్లమిగా జాణతనములు నేరము
చొల్లెపు జుట్టుల తోడ సుద్దు లెందాఁకా జెప్పేవు
అల్లదె మా ఇల్లు దాయాలాడుదాము రావోయీ ॥నడి॥

దొడ్డివారము మేము దోవేల చూపు మనేవు
వొడ్డారపుఁ జేఁతల కోపము నేము
బిడ్డ నా చేత నున్నది ప్రేమతో నేమి నవ్వేవు
జిడ్డు చేత విడెమిచ్చేఁ జేతువు రావోయీ ॥నడి॥

అలఁగాచే వారము మా యంగా లెంత పొగడేవు
మేలెటిఁగి మెచ్చఁగ నేమీ నెఱఁగము
అలరి శ్రీ వేంకటేశ అలమేల్మంగ పతివి
యేలితివి నన్ను నీడ నిట్టె రావోయీ ॥నడి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు;సంపుటం22,పుట 203, సంకీర్తన 304)

'గొల్లవారము కదా మా కులమేదని జాణ తనం చూపుతూ, 'సుద్దులు చెబుతూ చెంత చేరేవు', 'నడివీధిలో సరసం ఎందుకు స్వామీ? దొడ్డి వారము దోవ చూపుమని నెపంతో దరి చేరుతున్నావా ! బిడ్డ తల్లిని కదా !' విడిదికి వస్తే విడెమిస్తానని' ఆ కాంత నయగారం చూపుతూ పలుకుతున్నది.

శ్రీవారి వినోదాలు వీధిలో సరసాలు పల్లవిలోనే నాయమా నీకు ? అనే గొల్లెతల ప్రశ్నాన్విత వాక్యలయలోనే ధ్వనిస్తున్నాయి. 'బెనగకువోయీ' అంటూ ఆ నాయికలు కూడా ప్రదేశాన్ని మాత్రమే నిషేధిస్తూ అనువైన చోటు ఇంటికే రమ్మంటున్నారు.

'మా కులమేమి యడిగేవు', 'దోవేల చూపు మనేవు, మా యంగాలెంతగా పొగడేవు' అంటూ ప్రశ్నించే నాయికల ప్రశ్నార్థక వాక్య లయలో శ్రీవారి వినోదాలు లీలలు కనిపిస్తున్నాయి. స్వామిని ఎంత ప్రశ్నించినా నాయిక చిత్తవృత్తిలో శృంగార నిషేధం కనిపించదు. పైగా వాచ్యంగానే 'దాయాలాడుదాము' రమ్మని పిలుస్తున్నారు. 'గొల్లవారము అలగాచేవారము, దొడ్డివారము' అని చెప్పుకుంటున్నారు. పైగా

బిడ్డల తల్లులట. శ్రీవారి అనుగ్రహానికి కులము, వయస్సు, స్థితి, సమయము, ప్రదేశము అభ్యంతరాలు కావని, నిర్మల చిత్తవృత్తితో ఎప్పుడు పిలిస్తే ఆ క్షణమే స్వామి కరుణిస్తాడనటానికి ఈ సంకీర్తన ఒక ప్రతీక.

6. శ్రీవారి గుణాలు:

శ్రీవారి గుణ గణ వర్ణన, టక్కరి విద్యలు, నయగారాలు ఎంత వర్ణించినా అన్నమయ్యకు తనివి తీరదు.

(i) శ్రీవారి విద్యలు - గుణ స్వరూప వర్ణన:

శ్రీవారి విద్యలను నేర్పులను ప్రస్తావించి ఆయనను భక్తులు స్వాధీన పరచుకునే పద్ధతులు కూడా అన్నమయ్య వివరించాడు.

రాగం: మాళవిగౌళ

బలిమి యెంత సేసినా బనికి రాదు
అలరఁగ నిచ్చకము లాడవలెఁ గాని ॥పల్లవి॥

అటమటముల వాని నౌఁ గాదన ఁగ రాదు
సటలాడేవాని సాదించరాదు
విట తనముల వాని వేమారు ఁ గొసర రాదు
చిటుకు రంటే సేవ సేయ వలెఁ గాని ॥బలిమి॥

తూటరి విద్యలవాని దూరితేఁ బనికిరాదు
జూటుఁ దనముల వాని సొలయరాదు
మాటకు మాటాడే వాని మారు కొనఁగరాదు
మూట కట్టు వినయాన మొక్కవలెఁ గాని ॥బలిమి॥

పంత గారి వానిని పచ్చిగా నాడఁ గరాదు
అంతరంగమైన వాని నణఁచరాదా
ఇంతలో శ్రీ వేంకటేశ యేలితివి నన్ను మెచ్చి
వింత సేయరాదు నిన్ను వేఁడు కోవలె ఁగాని ॥బలిమి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం23,పుట122, సంకీర్తన 132)

శ్రీవారి గుణాలు ఈ తీరున మరే భక్త కవి వర్ణించలేదేమో. "అటమటముల వాడు', 'సటలాడేవాడు', 'విటతనముల వాడు', 'తుంటరి విద్యల వాడు', 'జూటు దనముల వాడు', 'మాటకు మాటాడే వాడు', 'పంతగారి వాడు', అంతరంగమైన వాడు, ఆ వేంకటేశుడట. చిత్రం ఏమిటంటే ఇన్ని విద్యలు కలవాడు ఆ నాయకుడైతే ప్రతి విద్యకు ఒక్కొక్క సాధనం కూడా చెబుతూ అన్నమయ్య స్వామిని లోబరుచుకునే పద్ధతులు వివరించాడు. "ఔను కాదనక, సాధించక, వేమారు కొసరక, సేవ చేస్తూ, ఉంటే స్వామి లొంగడా. 'దూరి పలుకక, సొలయక, మార్కొనక, వినయాన మొక్కితే కరుణించడా' 'పచ్చిగా పలుకక' ముచ్చటగా మాటాడితే మెచ్చుకోడా. శ్రీవారిని కట్టేయడానికి ఇన్ని ప్రతి క్రియలు చెప్పి, చివరికి అంతరంగమైన వాడే కదా, అణిచి వేయరాదా' అంటాడు అన్నమయ్య. చిత్తశుద్ధి కలిగినవాడి అంతరంగంలో స్వామి ఎప్పుడూ బందీ యే కదా.

పల్లవిలోనే శ్రీవారిని "బలిమితో జయించలేరని ఇచ్చకాలతో ఇట్టే వశం చేసుకోవచ్చని కీలకం చెబుతున్నదా నాయిక. భక్త సులభుడయిన స్వామిని కరిగించగల నేర్పుతో తన్ను నాయికగా ఊహించుకొని, స్వామి తోడి అనుభవాన్ని అభివ్యక్తీకరిస్తున్నాడు అన్నమయ్య. వాక్యలయ ద్వారా అన్నమయ్య హృదయం వ్యంజించబడుతున్నది. స్వామి చూపే విద్యలకు ప్రతి క్రియలు ఊహించి లోబరుచుకునే మార్గాలను అన్నమయ్య సూచించాడు.

ప్రతి చరణంలోను మూడు పాదాల్లో లౌకిక విద్యల ద్వారా, సాధింపుల ద్వారా సాధారణ పతిని లొంగ దీసుకునే పద్ధతుల ద్వారా జగత్పతిని వశపరచుకోవటం 'అసాధ్యం' అంటూ లౌకికమైన పద్ధతులను నిషేధించాడు. త్రికరణశుద్ధిని ధ్వనింప చేస్తూ 'సేవ చేయవలె', 'మొక్కవలె', 'వేడుకొనవలె' అంటూ అప్పుడే వేంకటేశుడు కరుణించగలడంటాడు అన్నమయ్య. ఈ పదాల్లోని వలె పైన కాని స్వల్ప విరామంతో ప్రయోగించబడి నిశ్చయాత్మకతని ధ్వనిస్తున్నది.

శ్రీవారి గుణ స్వరూప వర్ణనకు లఘువులు 'అటమటముల వాని, సటలాడేవాని, విటతనముల వాని, తుంటరి విద్యలవాని, జూటు దనముల వాని, మాటకు మాటాడే వాని, పంతగారి వాని, అంతరంగమైనవాని, ప్రయోగించబడి నిశ్చయత్వాన్ని సూచిస్తున్నాయి. పాదాంత లఘువులు 'ఔగాదనగరాదు'

'సాధించరాదు', 'వేమారు కొసరరాదు', 'దూరితే పనికిరాదు', 'సొలయరాదు', 'మారుగొనకరాదు', 'పచ్చిగా నాడరాదు' పదాల్లో ప్రయోగించబడి ఆ పద్ధతులను నిషేధిస్తూ, నిశ్చయత్వాన్ని సూచిస్తున్నాయి.

ఈ సంకీర్తనకు మొత్తం కీలకం గుర్వక్షర రూపంలో 'అంతరంగమైన వాని నణచరాదా' పదంలో ప్రయోగించబడింది. మొత్తం సంకీర్తన అంతా ప్రతి పద్ధతిని నిషేధిస్తూ 'రాదు' అంటూ పాదాంతంలో ప్రయోగించి ఈ ఒక్క పదంలోనే "అణచరాదా" అని ప్రశ్నిస్తున్నాడు అన్నమయ్య. అంతరంగంలో నిలిపి కొలిచే వాడికి స్వామి బందీయే. ఇన్ని విద్యలు చూపే స్వామిని కట్టివేసే బ్రహ్మవిద్య ఇదే అనే పరమ సత్యాన్ని ఈ దీర్ఘాక్షరగతిలోని లయ వ్యంజింప చేస్తున్నది. ఈ వాక్యంలో శ్రీవారి సగుణ రూపాన్ని కీర్తన అంతా సూచిస్తూ ఆత్మలో సంభావించే నిర్గుణ తత్త్వాన్ని మధుర భక్తిని అన్నమయ్య సూచిస్తున్నాడు. ఆధ్యాత్మిక ప్రస్థాన మార్గం సూచించాడు.

(ii) శ్రీవారి చేష్టలు - గుణ స్వరూప వర్ణన:

శ్రీవారి చేష్టలు అత్యంత విచిత్రమైనవి. వీటికి అర్థం, భాష్యం చెప్పటం అలవి కాని పని అంటాడు అన్నమయ్య.

రాగం: మాళవిగౌళ

పొగడ వసము కాదు పూని యీతని గుణాలు
మొగము చూచి చూచి మొక్కనే నేను ॥పల్లవి॥

వేడుక కత్తెల తోడి వెడ వెడ నవ్వులు
వూడిగాల వారి తోడి వొడఁబాటులు
వాడ వనితల తోడి వరుస జాణతనాలు
యేడ నేర్చుకున్నాఁడే యీతఁడు తాను ॥పొడ॥

కొలువు కాంతల మీది గుది కొన్న చూపులు
వెలయాండ్లతో నాడే వినోదములు
వలచి వచ్చిన యట్టి వారి పొందులు
చలపట్టి యెన్నఁడు సాధించెనే తాను ॥పొడ॥

చేరి వున్నవారి తోడఁ జేసేటి సన్నలు
కోరి యలమేలు మంగ కూటములు
యీ రీతి శ్రీ వేంకటేశుఁ డేలిన నాతో మెచ్చులు
కూరిమి నెట్టు గడించుకొనెనే తాను ॥పొద॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం22,పుట357, సంకీర్తన 535)

ఒక్కొక్కరితో ఒక్కొక్క పద్ధతిలో మెలిగే శ్రీవారి చేష్టలు, గుణాలు ఎంత చెప్పినా తక్కువే. ఒకరి వద్ద చూపిన విద్య మరొకరి వద్ద చూపడు. ఒకరిని లొంగదీసుకునే పద్ధతిని వేరొకరి వద్ద అవలంబించడు. వేడుక కత్తెలతో 'వెదవెద నవ్వులు', 'వూడిగాల వారితో వొడబాటులు', 'వాడ వనితలతో జాణతనాలు', 'కొలువు కాంతలపై గుదికొన్న చూపులు', 'వెలయాండ్లతో వినోదాలు', 'వలచి వచ్చిన వారితో వేడుక పొందులు', 'చేరి ఉన్నవారికి కనుసన్నలు' ఏక కాలంలో ప్రదర్శించాడు. ప్రతి కాంతనీ ఆమె భక్తికి తగ్గట్టు కరుణించే బ్రహ్మాండ నాయకుని చేష్టలు వినోదాలని అన్నమయ్య అనితర సాధ్యంగా వర్ణించాడు.

పల్లవిలోని మొదటి పాదంలోనే స్వామి గుణ వర్ణన చేస్తూ "పొగడవసము కాదు" అంటాడు అన్నమయ్య.

ప్రతి చరణంలోని ప్రతిపాదంలోను వాక్య పూర్వభాగంలో భిన్న నాయికలని, ఉత్తర భాగంలో శ్రీవారి గుణాన్ని వ్యక్తపరిచే భిన్నచేష్టలు అందులోని వైవిధ్యం సూచించబడింది. మొదటి చరణం అంతా ఆందోళనతో కూడిన ఆశ్చర్యం నాయిక చిత్తగతిలో కనిపిస్తుంది. అత్యంత విలక్షణంగా 'దకారం' ఈ భావ వ్యక్తీకరణకు ఉపయోగించబడింది. నాయిక ఆశ్చర్య నిరూపణకు 'నేర్చుకున్నాడే' ఎన్నడు సాధించెనే, ఎట్టు గడించుకొనెనే పదాల్లోని దీర్ఘాక్షరాలు ప్రయోగించబడినాయి. ఈ ఆశ్చర్యంలో స్వామి చేతల్లోని విపరీతం వైవిధ్యం వ్యక్తం అవుతున్నాయి. 'వెద వెద నవ్వుల వొడ బాటులు, జాణతనాలు, గుదికొన్న చూపులు, వినోదములు, పొందులు, జేసేటి సన్నలు, కూటములు మెచ్చులు', పదాల్లోని పాదాంత లఘువులు, విరామరాహిత్యం గుణ నిరూపణలోని నిశ్చయత్వాన్ని సూచిస్తున్నాయి.

(iii) శ్రీవారి వలపులు – గుణ స్వరూప వర్ణన:

శ్రీవారు వలపులను చతురతతో ఎన్ని రీతుల్లో తనను మురిపించాడో తలచుకుంటూ పులకరించి పోతున్నదీ నాయిక.

రాగం: హిందోళ వసంతం

ఏమని చెప్పుదునే వీఁ డెమ్మె కాఁడు
చేముట్టి వేఁడు కొనీనే చెలిమి కాడు ॥పల్లవి॥

చలపాది సరసాల జాజర కాఁడు
వలపులు చల్లీఁ బెక్కువ వలపు కాడు
తలఁపించీఁ దన పొందు దాయగాఁడు
వెలయించీ నన్ను నింత వేడుక కాడు ॥ఏమని॥

బచ్చన పరాకుల పంతగాడు
కొచ్చి కొచ్చి చెనకీని కోడెకాఁడు
అచ్చుగా నా సరులంటీ నా సోదకాఁడు
యిచ్చటనే కాచుకున్నాఁ డెలయింపు కాఁడు ॥ఏమని॥

వద్ద నుండే యెలయించీ వన్నెకాఁడు
అద్దుకొనీఁ గాఁగిట నందగాఁడు
వొద్దికై శ్రీ వేంకటేశుఁ డుబ్బరి కాఁడు
పెద్దరికపు లాబాల బేరగాఁడు ॥ఏమని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు;సంపుటం18,పుట71,సంకీర్తన105)

'శ్రీవారి చతురత ఏమని చెప్పుదునే' అని నాయిక మురిసిపోతున్నది. 'సరసాల జాజరకాడు', 'వలపులు కురిపించే వలపుగాడు,' 'తలపులలోనె తపించి తన పొందును కోరుదాయగాడు, వేడుకలు చేసే వేడుక కాడు, పరాకుల పంతగాడు, మాటి మాటికీ చెనకే కోడెకాడు ఆ వేంకటేశుడు' అని పరవశిస్తున్నదా నాయిక. ఈ సంకీర్తనలో కోటి విద్యలతో కాంతను మురిపిస్తూ శ్రీవారు కనిపిస్తాడు. ఇన్ని విద్యలు, చేతలు, మురిపాలు, సరసాలు చూపి సంభోగాభిలాషను వాచ్యంగా కాక వ్యంగ్యంగా వ్యక్తం చేసేవాడు వగలమారివాడు వేంకటేశుడని అన్నమయ్య ప్రస్తుతిస్తున్నాడు.

సంకీర్తన మొత్తం శ్రీవారి కవ్వింపులు చేష్టలు విద్యలు వర్ణించబడినాయి. మొదటి చరణంలో తమకాన్ని రెచ్చగొట్టే స్వామి వారి సరస శృంగార కళా

చాతుర్యాన్ని సూచించడానికి నాయిక రెచ్చిపోయిన మనసుకు ప్రతీకలుగా 'వలపులు చల్లీ, తలపంచీ, నెలయించీ' పదాల్లో దీర్ఘాక్షరాలు ప్రయుక్తమైనాయి.

ఈ సంకీర్తనలో ప్రతి చరణంలోని ప్రతిపాదం సగానికి విరిగి నడక నియమితమయి సమతుల్యత స్ఫురిస్తున్నది. వాక్య పూర్వభాగంలో శ్రీవారి చేష్టనీ, ఉత్తర భాగంలో విశేషణంతో కూడిన శ్రీవారినీ ప్రస్తావించి, సమతుల్యత ద్వారా పైన చెప్పిన భావానికి పరిపుష్టిని పదానికి ఒక గతిని అన్నమయ్య సాధించాడు.

7. శ్రీవారి ప్రియా సాంత్వనం :

శ్రీవారు రసికత బాగా తెలిసినవారు. నవ్వుతూ చల్లగా మెల్లగా దరిచేరి ఎలాంటి కాంతనైనా ఇట్టే వశం చేసుకుంటారు. ఊరంతా తిరిగి ఇల్లు చేరిన పతిని ఆ సతి ఎంత అదిలించినా నవ్వుతూ దరిచేరి కబుర్లు చెబుతున్నాడా కమలలోచనుడు.

రాగం: నాగవరాళి

ఊరి వారి గుణములు వొద్దీ మాకేల చెప్పేవు
నేరిచిన ట్టాడిగాలు నేఁ జేసేఁ గాక ॥పల్లవి॥

యెవ్వరికైనా ఁ జనవు లిత్తువు నీవు
నవ్వుతాఁ జుట్టరికము నానవేతువు
వువ్విళ్ళూర జేయుదువు వొద్దివారిని
నివ్వటిల్లే నీ కతలు నే మెఱగమా ॥ఊరి॥

పొరుగువారి పొందులు పొగడుదువు
తర మెఱిఁగి సేతువు తరి తీపులు
వొరసి మాఁటలనే నోరూరింతువు
గరిమ నీ వోజలు కన్నవే కావా ॥ఊరి॥

మెత్తు వేమిటికైనా మెలుఁ తలను
హత్తి కౌఁగిలించుకొందు వంతలోననే

యిత్తల శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
పొత్తుల నన్నేలితివి కొత్తలు గావా ॥ఊరి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట196, సంకీర్తన 293)

"ఊరివారి గుణములు వొడ్డి మాకేల చెప్పేవు? నేరిచినట్టూడిగాలు నే జేసేగాక నీ జాణతనం నాకు తెలుసు. 'యెవరికైనా జనవులిత్తువు నీవు, కొంటె చూపులతో నవ్వుతా జుట్టరికము నాన వేతువు' నీ శృంగార చేష్టలతో 'వువ్విళ్ళూర జేయుదువు వొద్దివారిని' నీ స్వభావం నాకు బాగా తెలుసు. 'నివ్వటిల్లే నీ కతలు నే మెఱగమా. చిత్తం కరిగించడానికి పొరుగు వారి పొందులు పొగడుదువు'. 'నా మనసెరిగి తర మెరిగి సేతువు తరి తీపులు', 'నా దరి చేరి వొరసి మాటలనే నోరూరింతువు' నీ కిది న్యాయమా స్వామీ? అంటున్నదా ఇల్లాలు.

ఊరి వారి గుణాలు వర్ణించి చెప్పి, చనువిచ్చి, నవ్వుతూ, మరిపిస్తూ, మైమరిపిస్తూ, వువ్విళ్ళూర చేస్తూ, పొరుగు వారి పొందులు పొగిడి చెబుతూ మాటలతో నోరూరిస్తూ శ్రీవారు చిటికెలో నాయిక కోపం పోగొట్టారు.

పల్లవిలో నాయిక సంబుద్ధ్యంత ప్రశ్నలో వ్యంగ్యం వినిపిస్తున్నది. "ఊరి వారి గుణాలు వర్ణించి చెప్పి, అంతకన్నా ఉన్నంతగా ప్రవర్తించమని వ్యంగ్యంగా ఉపదేశించే స్వామీ ! ఊడిగాలు చేసే మాకేల చెప్పేవు? అంటూ ఆ నాయిక స్వామి సాంత్వన కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నది. ఇందులో మరో వ్యంగ్యం కూడా ధ్వనిస్తున్నది. ఊరివారి గుణాలు చెప్పే ముందర ఊరివారితో నీ ప్రవర్తన, సరసాలు తలచుకో స్వామీ ! అనే భావం కూడా వినిపిస్తున్నది.

మొదటి చరణంలో 'యెవ్వరికైనా', 'నవ్వుతా', 'వువ్విళ్ళూరే', 'నివ్వటిల్లే' పదాల్లోని దీర్ఘాక్షరాల పైన ఉన్న ఊనిక వలన శ్రీవారి చేష్టల్లోని సరస శృంగారాలు స్ఫురిస్తున్నాయి.

8. శ్రీవారి సిగ్గులు – ముఖమాటాలు:

శ్రీవారికి అంతులేనంత మోహమాటమట. ఎలాంటి వారినీ కాదనలేరట. కాదంటే ఎవరి మనసు నొచ్చుకుంటుందో అని పాపం ఆయన ఇబ్బంది పడుతూ

అయినా అందరినీ సమానంగా స్వీకరిస్తారట. పైగా దొంగ సిగ్గులు, సిగ్గులేని చొరవలు, ఒక నాయిక స్వామిని ఇలా అధిక్షేపిస్తున్నది.

రాగం: ముఖారి

కంటి నీ మనసు నేను కడమ లేని వాఁడవు
అంటి ముట్టి పెనఁగేవు అలపులేదెపుడు ॥పల్లవి॥

యెంతయినా మన్నింతువు ఇటు నీకు వలచిన
కాంతలను మొగమాటఁ గాదనఁబోవు
పంతము లైనా నిత్తువు బత్తి సేసిన వారికి
చెంతఁ బెండ్లి కొడుకవై సిగ్గువడ వెపుడు ॥కంటి॥

చెప్పినట్టు సేతువు చెలిమి కత్తెలకును
వుప్పతిల్లు నేస్తమున నోపననవు
కుప్పళింతువు ప్రియము కూటమి గలవారికి
చిప్పిలు మేలు వాఁడవై సిగ్గువడ విపుడు ॥కంటి॥

కందువలఁ గూడుదువు కామించిన మా వంటి
ఇందు ముఖుల మేలాన నీడేర్తువు
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
చెందిన తమకముల సిగ్గుపడ వెపుడు ॥కంటి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట263, సంకీర్తన 393)

'కంటి నీ మనసు కడమ లేని వాడవు, అంటి ముట్టి పెనగేవు అలుపు లేదెపుడు', 'నిను కోరి దరి చేరిన కాంతలను' 'యెంతయినా మన్నింతువు', మొగమాట కాదనబోవు, నీకు సిగ్గన్నది లేదు స్వామీ ! పంతము లైనా నిత్తువు, 'బత్తి సేసిన వారికి చెంత బెండ్లి కొడుకవై సిగ్గువడ వెపుడు' స్నేహానికి శృంగారానికి నువ్విచ్చే విలువ ఎంత గొప్పదో!! "చెప్పినట్టు సేతువు" చెలిమి కత్తెలకును, వుప్పతిల్లు, నేస్తమున నోప ననవు".

స్వామి వారి మొహమాటం, స్నేహం, అలుపు లేని రసికత, సిగ్గెరుగని దక్షిణ నాయకత్వం ఈ సంకీర్తనలో ఎంతో హృద్యంగా కనిపిస్తాయి.

మొదటి చరణం అంతా 'త' కార ప్రాస శ్రీవారి సిగ్గులను ముఖమాటాన్ని వ్యంజింపచేయటానికి ప్రయోగించబడిది. 'యెంతయినా', 'మొగమాట', పంతములైనా, బెండ్లి కొడుకువై, అనే పదాల్లోని దీర్ఘాక్షరాలు, ఊనికలో నొక్కి ప్రయోగించబడి శ్రీవారి అతి సిగ్గులను ముఖమాటాలనూ మనకు చూపుతున్నాయి. ఇలాగే 'చెప్పినట్టు సేతువు' 'నేస్తమున నోపననపు' 'కుప్పళింతువు', 'చిప్పిల మేలు వాడవై సిగ్గు వదవిపుడు' 'కందువల గూడుదువు', ఇం'దుముఖుల మేలాన నీడేర్తువు' పదాల్లోని ఊనిక, దీర్ఘాక్షర రూపం శ్రీవారి ముఖ మాటాన్ని, దొంగ సిగ్గులను వ్యంజింప చేస్తున్నాయి. శ్రీవారి దక్షిణ నాయకత్వాన్ని నిరూపిస్తున్నాయి. శ్రీవారు నాయికను హత్తి కౌగిలిచుకోవటంతో సంకీర్తన ముగుస్తుంది. ఆమె కూడా ఒక్క నిట్టూర్పు విడిచి, ఈ విద్యలు చూడటం 'మాకు కొత్త కాదు కదా' అనుకుంటూ కరిగిపోతున్నది.

9. శ్రీవారి అలుక:

ఒకసారి స్వామివారు ఎందుకో బాగా అలిగారు కాబోలు, ఏడుకొండలూ ఎక్కి కూచున్నారు. శ్రీవారి అలుక, అన్నమయ్య హితబోధ ఈ సంకీర్తనలో ఇలా కనిపిస్తుంది. 'ఏల రట్టు చేసు' కున్నావయ్యా స్వామీ ? 'నీకు నీవే' అంటూ ఆమె తనకు తానే ముందు నిన్నేమయినా అన్నదా? ఏదో కలికి తనంతో కన్నుల జంకించినదే కాని కోపగించిందా 'వలపు చూపమని వడిగా' మాటాడి ఉండవచ్చు కాని నిన్నేమయినా అదలించిందా. 'యింటిలో నీ గుణాలు యెరిగి తానవ్వి' ఉండచ్చు కాని, వ్యంగ్యాలు, వెటకారాలు ఆవిడకు తెలుసునా' అంటూ అన్నీ తెలిసిన కాంతను ఏమీ తెలియని ముద్దరాలిగాను ఆలి చేతిలో అన్ని పరిహాసాలకూ వడి వడి మాటలకూ గురి అయిన స్వామి వారిదే ఆఖరికి తప్పని నిరూపించాడు అన్నమయ్య. పౌరుషానికి పోయి గుట్టు రట్టు చేసుకున్న అమాయకుడుగా కనిపిస్తాడు అలమేలు మంగాపతి.

రాగం: దేసాక్షి

ఏల రట్టు చేసుకొనే విప్పుడు నీకు నీవే
కోలుముందుగా నాపె గుంపించెనా నిన్నును ॥పల్లవి॥

కలికితనాన నిన్ను కన్నుల జంకించెఁ గాక
యెలమిఁ గోపగించెనా యింతి నీపైని
వలపు చూపవలసి వడిగా మాటాడెఁ గాక
అలరి నిన్నేమైనా నదలించెనా ॥ఏల॥

నంటున నీపై బత్తిని నాటఁజూచెఁగాక యింతి
జంటల నీమీఁదఁ బగ సాదించెనా
యింటిలోన నీగుణాలు యెరిఁగి తా నవ్వెఁగాక
వెంటనే వెంగేలు నీపై వెదచల్లెనా ॥ఏల॥

కడుఁ దమకించి నిన్నుఁ గాఁగిలించుకొనెఁ గాక
తొడిఁబడ నిచ్చట నీతోఁ బెనఁగెనా
కడఁగి శ్రీవేంకటేశ కాంత నిట్టె యేలితివి
అడియాలాలకుఁగాక అంటించెనా గురుతు ॥ఏల॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం 16, పుట 1, సంకీర్తన 1)

పల్లవిలోనే ఏల రట్టు చేసుకున్నావనే పదంలోని ప్రశ్నార్థక వాక్య లయలోనే 'శ్రీవారిదే తప్పంతా' అని ఆయన అలుకని నిషేధించాడు అన్నమయ్య.

నాయిక అలుకని సూచించే చేష్ట బాహాటంగానే ప్రతి చరణంలోని మొదటి మూడు పాదాల్లో కనిపిస్తుంది. నాయిక చేష్టని వ్యక్తపరిచే భావం సుస్పష్టమే అయినా వ్యతిరేక భావనకు ఆస్కారం లేదని ఆమె చేష్టకు సమర్థన రెండు నాలుగు పాదాల్లో కనిపిస్తుంది.

'కన్నుల జంకించెగాక', 'వడిగా మాటాడెగాక', 'బత్తి నాట జూచె గాక', 'తానవ్వెగాక', అనే పదాల్లోని పాదాంత లఘువులు ఆమె ఉద్ధతిని నిరూపిస్తూ కూడా ఆ చేష్టలు ఔచిత్యానికి భంగం కలిగించేవి కావని పెద్దగా పట్టించుకోవలసిన విషయం ఏమీ లేదనే సమర్థనని సూచిస్తున్నాయి. 'కోపగించెనా, నదలించెనా, బగ సాధించెనా, వెంగేలు వెదచల్లెనా బెనగెనా' పదాల్లోని పాదాంత దీర్ఘాక్షరాలు ప్రశ్నాన్విత వాక్య లయలో పొదగబడి ఇది 'విరసం' కాదు 'సరసమే' అని ఋజువు చేస్తున్నాయి. 'జంకించె గాక', 'నాట జూచె గాక', 'కౌగిలించె గాక' పదాల్లోని గాక

దాని పైని ప్రశ్న విరామం పాటించబడటంతో లయ రూపు కట్టి శ్రీవారికి నాయిక చర్యలు 'సహజమే' అని హితబోధ చేస్తున్నాయి.

నిశ్చయార్థకానికి భావ స్థిరత్వానికి ఈ 'గాక' అనే పదం పాదాంతంలో ప్రయోగించడం మనకి ఎందరో కవుల కావ్యాల్లో కనిపిస్తుంది.

కల్లరి త్రాఁచు నిప్పుకలు గైకొను కేకి చకోర పాళికిం
జెల్లిన జెల్లుఁగాక సరసీజ బిసంబు లిగుళ్ళు మేసి భా
సిల్లెడు మీ కయో విషము చిల్కఁగ వేడిమి కుల్కఁ బల్కఁగాఁ
జెల్లునె? యో మరాళ పికశేఖరులారా ! వచింపుడింపుగన్

(శ్రీ చేమకూరి వేంకటకవి - విజయం విలాసం, తృతీయాశ్వాసం)

"విషపు త్రాచులను నిప్పులను తిని బ్రతికే నెమళ్ళు చకోరాలు మా చెలిని బాధించాయంటే వాటికి అది సహజం కావచ్చు. కాని తామర తూళ్ళు తిని ప్రకాశించే మరాళ పికశ్రేష్ఠులు కూడా ఇలా ప్రవర్తించటం ఏమీ బాగాలేదని" చెలులు మన్మథ పరివారాన్ని ఉపాలంభిస్తున్నారు. దుర్మార్గులయిన వారు పీడించటం 'ఔచిత్యమే' అనే భావ నిరూపణకు 'గాక' అనే పద ప్రయోగం చేమకూర వేంకటకవి కూడా చేసినట్టు కనిపిస్తుంది.

10. శ్రీవారి సరసం:

శ్రీవారిని అత్యంత అమాయకుడిగా లోకం తెలియని కుఱ్ఱవాడుగా అన్నమయ్య చిత్రించాడు. అప్పటికి గాని ఆయనకు తనివి తీరలేదు.

రాగం: ముఖారి

ఇంతితో సరిఁ బెనఁగే వేమయ్యా
పంతముతో ఆపె నిట్టే పలికించఁ గలవా ॥పల్లవి॥

సెలవిలోనే లోలోన చెలి యట్టె నవ్వఁగాను
యెలమి నీవూ నవ్వే వేమయ్యా
కులికి యిందుకు నాపె కోపగించుకొంటేఁ గన
వెలికి లోనికి వచ్చి వేడు కొనఁ గలవా ॥ఇంతి॥

నిమ్మ పంట గొని యాపె నీ మీఁద వేయఁగాను
యెమ్మెలకు నీవూ వేసే వేమయ్యా
కమ్మి యాపె మేనుఁ దాఁకి కంది నొచ్చితేఁ గనక
దిమ్ముల నీవా నొప్పి తీరుచఁ గఁ గలవా ॥ఇంతి॥

గట్టిగా ఆపె నిన్ను కాఁగిట బిగించఁగాను
యిట్టె నీవూ బిగియించే వేమయ్యా
నెట్టన శ్రీ వేంకటేశ నిన్ను నాపె గూడె నిదే
మెట్టుక యాపెకు నీవు మెప్పించఁ గలవా ॥ఇంతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట 85, సంకీర్తన 126)

ఈ సంకీర్తనలో శృంగారంలో కాస్త అనుపానులు, శృతిమించని రసికతలు శ్రీవారికి అన్నమయ్య నేర్పిస్తున్నాడు. 'అమ్మవారితో సరి బెనగేవేమయ్యా'? 'పంతముతో ఆమె నిట్టే పలికించగలవా ? లోలోన చెలి యట్టె నవ్వి'తే 'నీవూ నవ్వేవేమయ్యా? దీనికి ఆమె కోపగించితే 'వెలికి లోనికి వచ్చి వేడు కోగలవా' అని చెలి రూపంలో అన్నమయ్య ప్రశ్నిస్తున్నాడు. ఆవిడ లోలోన నవ్వుకుంటే శ్రీవారు పరిహాసంగా కూడా ఆవిడని చూసి నవ్వకూడదట. నవ్వితే ఆవిడ అలక తీర్చటం నీ వల్లవుతుందా? ఆలోచించుకోమంటున్నాడు అన్నమయ్య.

'నిమ్మపంట గొని యాపె నీ మీద' వస్తే నీవూ వేసేవేమయ్యా, మోట సరసం పనికి రాదు 'యాపె మేను దాకి కంది నొచ్చితే' 'నీవా నొప్పి తీరుచ గలవా' అంటూ ఆపె నిన్ను కాఁగిట బిగిస్తే 'యిట్టె నీవూ బిగియించే'యడమే? ఆమెకి ఎంత నొప్పి కలిగిందో' అని శృంగారం కాస్త లలితం చేయమని అన్నమయ్య స్వామిని మందలిస్తున్నాడు.

పల్లవిలోనే అన్నమయ్య 'ఇంతితో సరి బెనగే వేమయ్యా' అంటూ శ్రీవారిని సరసం లలితం చేయమనే హితబోధ చేశాడు. 'నీవూ నవ్వేవేమయ్యా', 'వేడుకొనగలవా', 'నీవూ వేసేవేమయ్యా', 'నీవా నొప్పి తీరుచగలవా', 'నీవూ బిగియించేవేమయ్యా' పదాల్లోని ప్రశ్నాన్విత లయలో శ్రీవారిని మందలించటం వినిపిస్తుంది.

'చెలి యట్టె నవ్వగాను' కోపగించుకొంటేగన, నిమ్మపంట నీ మీద వేయగాను, గట్టిగా ఆపె నిన్ను కౌగిట బిగించగాను పదాల్లోని పాదాంత లఘువులు విరామంతో ప్రయోగించబడి, ఆమె చేతలన్నీ సమర్థనీయాలు, సహజాలు, ఔచిత్య వంతాలనే అర్థ స్ఫురణను కలిగిస్తున్నాయి. చెలి గడుసుదనం, అన్నమయ్య కొంటెతనం శ్రీవారి సరసం ఆ ప్రశ్నాన్విత వాక్యలయలో మనోహరంగా వినిపిస్తున్నాయి. ప్రశ్నా రూపం హాస్యానికీ, అధిక్షేపానికీ, వ్యంగ్యానికీ, హితబోధకూ చివరికి శ్రీవారి చేతలను నిషేధించటానికీ కూడా ప్రయుక్తం అవటం విశేషం.

తిక్కన ప్రశ్నను చాలా విలక్షణంగా భిన్న సందర్భాల్లో భిన్న భావాలను స్ఫురింప చేయడానికి ప్రయోగించాడు.

1. క్రోధం: "వేణి వట్టి యీ యేవురుఁ జూడఁగా సభకు నీడ్చి c గులాంగన నిట్లొనర్తురే" ? (ఉద్యోగ పర్వం: 3-110)

2. దుఃఖం: "బడుగయి పాలలో పడిన బల్లి విధంబున నుండకుందునే (ఉద్యోగ పర్వం: 3-135)

3. వ్యంగ్యం: "మును బాస యిచ్చి యెన్నఁడు బొంకం డింతటి మానిసి యలిగిన, గౌంతేయుల కెట్లు బ్రదుకగావచ్చు నవనిన్'? (ఉద్యోగ పర్వం: 2-291)

4. హితబోధ: "మేదిని, బంచి యిచ్చు కంటె c గార్య మెద్ది కలదు? ధర్మ మెద్ది? సముచితం బగు విధమెద్ది? శక్యమెద్ది? (ఉద్యోగ పర్వం: 3-275)

5. స్తుతి: "నీ కర్చన గావింపం జాలువాడు కలcదే యెందున్" (ఉద్యోగ పర్వం: 3-231)

సాధారణంగా ప్రశ్న సందేహార్థకంలో ప్రయుక్తం అవుతుంది. తిక్కన దానితోబాటు ఇంకా అనేక అర్థాల్లోనూ ప్రయోగించి అసంఖ్యాకమైన భావ నిరూపణ కావించాడు. ఒక్కొక్క ప్రశ్నలో ఊనికలో ఒక్కొక్కరి స్వభావం చిత్తవృత్తి ప్రవృత్తి లయాత్మకంగా అభివ్యక్తం అవుతున్నాయి. ప్రశ్నలను ఈ విధంగా ప్రయోగించటం అన్నమయ్య సంకీర్తనల్లో కూడా కనిపిస్తుంది.

11. శ్రీవారి అమాయకత్వం:

శ్రీవారిని లోకం తెలియని బాలుడిలా స్త్రీ ప్రవృత్తిని అర్థం చేసుకోలేని శుద్ధ అమాయకుడిగా వర్ణిస్తే తప్ప అన్నమయ్య అంతరంగం తృప్తి పడలేదు.

రాగం: బౌళి రామక్రియ

ఆపె కు నీకు నే కాక అందవారి కేమి వోదు
కైపు సేసి మిమ్ము నేము కాదనేటి వారమా ||పల్లవి||

పువ్వు బంతిఁ గొని చెలి పూఁచి నిన్ను వేయఁగాను
యెవ్వరి సాకిరి వెట్టి యేమి సేసేవు
జవ్వనికి నీ విచ్చిన చనవింతె కాక అది
చివ్వన నూరివారింత సేయ వచ్చేరా ||ఆపెకు||

చిమ్మి రేగి సతి నిన్నుఁ జిలుక చేఁ దిట్టించఁగ
యిమ్ముల మా మొకములు నీవేమి చూచేవు
సమ్మతించిన మీలోని సరసములింతే కాక
కమ్మర మానుప మాకు కారణము కలదా ||ఆపెకు||

చేతులెత్తి మొక్కి యింతి చెక్కిట జీర దియ్యఁగ
యీతల మాకేల చూపే వేడసుద్దులు
యేతుల శ్రీ వేంకటేశ యెనసె నాపె కాఁగిట
ఘాతగఁ గడవారు నిన్నాఁ గాదానఁ గలరా ||ఆపెకు||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట120, సంకీర్తన 179)

"పువ్వుబంతి గొని చెలి నీ మీద వేసినంత మాత్రాన రవ్వ చేయాలా? 'జవ్వనికి నీ విచ్చిన చను'వని సరిపెట్టుకోవాలి. 'చిమ్మిరేగి' సతి నిన్ను చిలుకతో 'తిట్టించిందే' అనుకో' అయితే మాత్రం అదో నేరం అయినట్లు "యిమ్ముల మా మొకములు నీవేమి చూసేవయ్యా' అంటూ 'మీలో సరసము లింతే కాని మానుప మాకు కారణము కలదా' అంటూ మాకే సంబంధం లేదు ఇది మీ భార్యాభర్తల విషయం" అంటున్నాడు గడుసు అన్నమయ్య.

'చెలి శృంగార చేష్టలన్నీ తానిచ్చిన చనువే' అని సద్దుకు పోవాలిట. ఎవరితో అయినా చెప్పుకుంటే ఊరివారు వింత చూడరా? అని వేళాకోళం చేశాడు. చెలి చిలుకతో తిట్టిస్తే మా ముఖం చూస్తావేం అంటాడు సఖీరూపంలో అన్నమయ్య.

శ్రీవారిని నోట్లో వేలు పెట్టినా కొరకలేనంత అమాయకుడుగా తీర్చిదిద్ది వేళాకోళం చేసి, సలహాలిచ్చి చివరికి నాకే సంబంధం లేదు ఇది మీ స్వంత విషయం అని వినోదిస్తున్నాడు అన్నమయ్య.

సంకీర్తనలోని కవిత్వ శిల్పం అంతా ప్రశ్నాన్విత వాక్యలయలో మనకు కనిపిస్తుంది. నాయిక చేతిలో వ్యంగ్యాలూ వెటకారాల మాటలన్నీ పడి, చిలుక చేత తిట్టించుకుని, బిక్క ముఖం వేసిన శ్రీవారి రూపాన్ని మన కళ్ళ ముందు అన్నమయ్య సాక్షాత్కరింప చేస్తున్నాడు. "యెవ్వని సాకిరి వెట్టి యేమి సేసేవు? చివ్వన నూరి వారింత సేయ వచ్చేరా? యిమ్ముల మా మొకములు నీవేమి చూచేవు? కమ్మర మానుప మాకు కారణము గలదా? యీతల మాకేల చూపే వేద సుద్దులు? అనే ప్రశ్నాన్విత వాక్య లయలో దీనికి ఎవర్నీ ఏమీ అనగలిగే అవకాశం లేదని నిరూపిస్తూ 'జవ్వనికి నీ విచ్చిన చనవింతె కాక', 'సమ్మతించిన మీలో సరసములింతె కాక' అంటూ ఇది నువ్విచ్చిన చనువే కాబట్టి కరుణించమంటున్నాడు అన్నమయ్య. శ్రీవారి కరుణాంతరంగమే ఈ విధంగా నాయిక సరసం, శృతిమించడానికి కారణమనే భావం పైప్రశ్నల్లోని వాక్య లయలో వినిపిస్తుంది.

12. శ్రీవారి రతిప్రీతి:

శ్రీవారు ఒక రోజు చాలా ఉత్సాహంతో ఉన్నారు. ఆ నాయిక సౌందర్యం, భక్తి అటువంటివి కాబోలు శ్రీవారు పట్టరానంత రతిప్రీతితో కనిపిస్తున్నారు.

రాగం: మాళవిగౌళ

చేయి ముట్టి సరసాలు చెల్లవు నేఁడు
ఆయనాయ నింకనేల అటువంటి పనులు ॥పల్లవి॥

చేరి నన్ను నంటకురా చెఱఁగు మాసినదాన
అరసి మాఁట చెప్పరా అల్లంత నుండి
కోరి నీ వేమన్న మాకును నవ్వు రాదురా
ఔరా నీ వేమి సేయుమన్నాఁ జేసెను ॥చేయి॥

మట్టు మీరి రాకురా మంచము పై నున్నదాన
యిట్టె నీ పంపిన విడె మిదె చాలును

దిట్ట నీ జాణతనాలు తెలియవురా మాకు
వెట్టికి నా వీనుల వినేఁ గాని ॥చేయి॥

బలిమి సేయకురా పవళించి వున్నదాన
అలరి నీవు నాకు లోనౌటే చాలు
చెలఁగి కూడితి విట్టె శ్రీ వేంకటేశుఁడు నన్ను
అలుక లిన్నియుఁ దీరె నట్టె కానీరా ॥చేయి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం 20, పుట 7, సంకీర్తన 9)

నాయిక శ్రీవారిని ఎంతో ప్రేమగా వేడుకుంటున్నది. "చేయి ముట్టి సరసాలు చెల్లవు నేడు", అటువంటి పనులకు కాస్త ఆగాలి స్వామీ ! 'నన్నంటకురా చెఱగు మాసినదాన' దగ్గరకు రావద్దు. ముట్టద్దు "అరసి మాట చెప్పరా అల్లంత నుండి" అంటే స్వామి వారు మాట వింటేనా ! మట్టు మీరి రాకురా మంచముపై నున్నదాన" అన్నా ఆయన వినిపించుకునే స్థితిలో ఉన్నట్టు కనిపించదు. అందుకే నాయిక 'అలుక లన్నియు దీరె నట్టె కానీరా' అంటూ కరిగిపోతున్నది. ఆ చెలి భక్తి, రక్తి, శ్రీవారి అనురక్తి అంత తీవ్రతమమైనవి కాబోలును.

శ్రీవారి రతిప్రీతి అంతా నాయిక సంబుద్ధ్యంత పదాల్లో సిగ్గుల్లో, భక్తిలో వ్యక్తం అవుతున్నాయి.

పల్లవిలోనే చేయి ముట్టి సరసాలు చెల్లవు అని నిషేధించి 'నికనేల అటువంటి పనులు' అని నాయిక అడ్డుకుంటున్నది. ప్రతి పాదంలోను రెండేసి చరణాల తరువాత పదం విరిగి నాలుగు చరణాలకూ సమతుల్యత పాటించబడింది. ఈ సమతుల్యతలోని వాక్య లయలో శ్రీవారి చేష్టలు ధ్వనిస్తున్నాయి.

'చేరి నన్ను నంటకురా, అరసి మాట చెప్పరా, మాకు నవ్వు రాదురా', 'మట్టు మీరి రాకురా' 'దిట్ట నీ జాణతనాలు తెలియవురా మాకు' పదాల్లోని దీర్ఘాక్షరాల్లో నాయిక సిగ్గు, 'సంప్రదాయపు కట్టుబాట్లకు తలవొగ్గక పోతే ఎలా' అనే భయం వాచ్యంగా వ్యక్తం అవుతున్నాయి. ధ్వనిరూపంలో శ్రీవారి రతిప్రీతి, మోహం వ్యక్తమవుతున్నాయి. సర్వకాల సర్వావస్థల్లోనూ శ్రీవారి అనుగ్రహానికి 'పాత్రములే' అనే భావాలు స్ఫురింపజేయడమే ప్రధానం.

సుప్రసిద్ధ కవుల కావ్యాల్లో రెండేసి పాదాల తరువాత పదం విరిగి గతి స్ఫురించటం కనిపిస్తుంది. పదాల మధ్య చరణంలోని పాదాల మధ్య సమతుల్యత సాధించడం ద్వారా ఏర్పడిన వాక్యలయ వలన భావ నిరూపణ ఎన్నో సందర్భాల్లో కనిపిస్తుంది.

తల్లి సచ్చిన గాదె తాను దస్సితిని
ఎల్ల వారికి దుఃఖ మిట్టిది కాదె
తల్లి గల్గిన ఏల తపసి కానిచ్చు
తల్లి గల్గిన ఏల తల జడల్గట్టు
తల్లి యున్న విషంబు ద్రావ నేలిచ్చు
తల్లి యుండిన తోళ్ళు దాల్పనే లిచ్చు

(పాల్కురికి సోమనాధుడు - బసవ పురాణం)

పాల్కురికి సోమనాధుడు మాతృహృదయ మనస్తత్వాన్ని రమణీయంగా నిరూపించాడు. మూడు జంటల పాదాల్లోనూ, ప్రశ్నాన్విత లయలో, పదం విరుపులో, రెండు పాదాల అనంతరం విరిగిన విరుపులో మాతృహృదయంలోని ఆవేదన వ్యక్తం అవుతున్నది.

13. శ్రీవారి శపథం:

శ్రీవారు ఒకసారి గొప్ప వ్రత దీక్ష పట్టాడు. నాయికే అలిగిందో లేక ఎడబాటుకు కారణమేదో తెలియదు కాని చెలి ఉంటే తప్ప ఏ అలంకరణలు ముట్టనని భీష్మించుకుని కూర్చున్నాడా కమలలోచనుడు.

రాగం: ఆహిరి

ఇంకా నీ చిత్తము కొలఁ దిన్నియు విన్నవించితి
వంకల ప్రాయము నీకే వ్రతము వట్టినాడే ॥పల్లవి॥

తరుణి కొప్పు విరులు తనమీఁద రాలు దాఁకా
విరులు ముడవనంటా విభుఁడు నేమము సేసె
సురత గంధము మేన చోడు ముట్టిన దాఁకా
గరిమఁ బరిమళాల గంధము మైఁ బూయఁడే ॥ఇంకా॥

పడఁతి నీ వూరుపులు పైఁ బారినందాఁకా
విడిచి మేన సురటి విసరించుకోఁడే
తడిసి నీ చెమటలు తనమీఁద చిందు దాఁకా
యెడసి కేళకూలికి యేఁగఁగ నొల్లఁడే ॥ఇంకా॥

పానుపు పై నీవు గూడి పచ్చి మాట లాడుదాఁకా
మోనమున యెవ్వరితో ముచ్చటలు నాడఁడే
అని శ్రీ వేంకటపతి నట్టె పొందతి గాన
పూనిన పరవశాన వొంటి నింకఁ బాయఁడే ॥ఇంకా॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం12, పుట17, సంకీర్తన 24)

శ్రీవారి శపథం, దీక్ష చాలా గమ్మత్తుగా ఉన్నాయి. 'తరుణి కొప్పు విరులు తమ మీద రాలు దాకా విరులు ముడవ నంటూ' విభుడు నియమం పట్టాడట. "సురత గంధం మేన చోడు ముట్టిన దాకా' అసలు పరిమళ గంధాలే తాల్చడట. పడతి వూరువులు పై బారిన వరకూ 'విడిచిన మేన సురటి విసరించుకోడట' 'తడిసి' ఆమె చెమటలు తన మీద చిందుదాకా 'కేళాకూళికి' వెళ్ళడట. పానుపుపై ఆమె 'పచ్చి మాటలాడుదాకా' యెవ్వరితో ముచ్చటలాడట. ఆమె అనురాగం, శ్రీవారి దీక్ష మరే ఇతర కవుల రచనల్లోను ఇంత వైచిత్రితో కనిపించవు.

పల్లవిలోనే నాయిక లభించేదాక పట్టు విడిచేది లేదని 'నీకే వ్రతము వట్టినాదే' అంటూ సఖి వివరిస్తున్నది.

ప్రతి చరణంలోను మొదటి మూడు పాదాల్లో నాయిక సాంగత్యాన్ని, రెండు నాలుగు పాదాల్లో శ్రీవారి భీషణ శపథాన్ని వివరించటం జరిగింది. ప్రతి రెండు పాదాలకు అర్థం సంపూర్ణమయి పదగతి నియమితమవుతున్నది. 'విరులురాలుదాకా', 'గంధము మేన', 'చోడ ముట్టిదాకా', 'వూరువులు పై బారినందాకా', 'పచ్చి మాటలాడుదాకా' పదాల్లోని నాయిక సాన్నిధ్యం, ఆలింగనం, స్పర్శ, రతి ప్రియభాషణలు ఒక క్రమంలో కనిపిస్తాయి. పాదాంత దీర్ఘంలో నాయిక యొక్క దర్శన స్పర్శ రతి సుఖాదుల వలన పొందే సుఖం అంతా ధ్వనించింది. ఆ సుఖం లేనప్పుడు ప్రియా సంబంధమైన పరిమళ ద్రవ్యాలతో పనిలేదనే నిశ్చయత్వం ప్రతి చరణంలోని రెండు నాలుగు పాదాంతాల ఊనికలో, నడకలో వినిపిస్తున్నది.

14. శ్రీవారి అలంకరణ

నిత్యం అమ్మవారి ధ్యానంలో ఉండే స్వామికి ఆమె సాన్నిధ్యం, ఆమె సర్వస్వమే అలంకరణగా భాసిస్తున్నదట.

రాగం: సామంతం

నీరు వట్టు గొన్న వేళ నేయి మందవునా
కూరిమి మమ్మిద్దరినిఁ గూరుచరే చెలులు ॥పల్లవి॥

నెలత చెక్కులే నాకు నిలువుటద్దములు
అలరుల తావి వూర్పు లాల వట్టాలు
సెలవుల నగవులే చేతి కిచ్చే కప్పురాలు
చలి మందు లిఁక నన్నీఁ జాలునే నాకు ॥నీరు॥

వనిత మాటలే నాకు వలరాచ మంత్రాలు
ననుపుఁ జెమటలే పన్నీటి సోనలు
ఘనమైన సరసాలే గందపుఁ గస్తూరి పూఁత
యెనలేని వపుచారాలివియేలే నాకు ॥నీరు॥

సతి తోడి పానుపే చంద్రకాంతపు వేది
యితవుగఁ గూడించితి రిందరూ మమ్ము
రతుల శ్రీ వేంకటాద్రిరాయుఁడ నే నిది వో
మితిమీర నూఁచకురే మేలాయ బనులు ॥నీరు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం 20, పుట 5, సంకీర్తన 7)

శ్రీవారి సౌందర్యాన్ని ప్రతిఫలించే చెక్కుటద్దాలు చెలిరూపంలో ఎదురుగా ఉంటే అద్దాలతో ఇంక పనేమిటి. ఆమె వూర్పులే వింజామరలు. చెక్కిళ్ళలోని నవ్వులే చేతికిచ్చే కప్పురాలు. చలికిక మందులెందుకు ? శ్రీవారికి మంత్రాలతో ప్రమేయం లేదు. ఆమె మాటే ఆయన పైని మంత్రము. కౌగిళ్ళలోని నిలువున కారే చెమటలే స్వామికి పన్నీటి అభిషేకాలు. ఘనమైన సరసమే గంధపు కస్తూరి పూతలు. ఇంత కంటే ఆయన ఉపచార పూజలింకేమీ కోరడట. అవి ఏమి వశీకరణ మంత్రాలో! అది ఎంతటి 'ఇందిరా' జాలమో.

శ్రీవారి నిత్య పూజా విధానం అంతా ఇందులో కనిపిస్తుంది. అలంకరణ అర్చన కలిసి నిండారిన సంకీర్తన ఇది. ఆ లలన తనను తానే అర్పించుకుంటుండగా ఆమె అందాలు శ్రీవారికి అందాన్ని సమకూర్చడం తోపాటు అర్చనా సామాగ్రిగా కూడా ఉపయోగపడటం విశేషం.

పల్లవిలోని ప్రశ్నార్థక వాక్యలయలోనే దప్పిగొన్న వారికి 'దాహం' తీర్చే పద్ధతి ఆలోచించాలి కాని ఎంత మధురమైనా నేయి సాధనం కాగలదా అంటూ పరిచర్యలన్నీ వ్యర్థాలని, 'చెలిని చెంత చేరిస్తే చింతలన్నీ తీరేనని' స్వామి వాపోతున్నాడు.

చెలి సాన్నిధ్యం సకల ఉపచార పూజలు పొందినంత ఆనందం కలిగింప జేస్తాయని తలచి, పులకరించి పరవశించి పోతున్నాడు వేంకటపతి. ఆ చెలి సాన్నిధ్యం తన కిచ్చే ఆనందాన్ని నొక్కి చెప్పటానికి దీర్ఘాక్షరాలు ఊనిక కనిపిస్తాయి. 'నెలత చెక్కులే, అలరు తావి వూర్పు', 'సెలవుల నగవులే' వనిత మాటలే, నినుపు జెమటలే, ఘనమైన సరసాలే, సతి తోడి పానుపే, పదాల్లోని దీర్ఘాక్షరాలు స్వామి హృదయ గతిలో భాసించే ఉద్వేగం ఆనందం నిరూపిస్తున్నాయి.

15. శ్రీవారి నిత్యానుష్ఠానం:

నిత్యం శ్రీవారు చేసే పూజలు అనుష్ఠానం ఎంత రమ్యమైనవో మనకీ సంకీర్తనలో తెలుస్తుంది.

రాగం: శ్రీరాగం

అడుగవయ్యా వరము లాపె నేమైనా నీవు
బడి బడి నిదివో ప్రత్యక్షమాయ నీకు ॥పల్లవి॥

చెలియ పేరే నీకు సేసే జప మంత్రములు
కలసేటి సన్నలే యంగన్యాసాలు
ములు వాడి కొనగోరి మోపుల్ నానా ముద్రలు
ఫలియించె దపమాపె ప్రత్యక్షమాయ నీకు ॥అడుగ॥

ఆపె పై జల్లే వలపదే తర్పణ జలము
దీపించు నవ్వు పాయస దివ్య హోమము

దాపగు నీ యధారమృతమే మంచి భోజనము
నీ పాల బ్రత్యక్షమాయ నెలత యిదె నీకు ||అడుగ||

పొందుల కాగిటి రతి పురశ్చరణ ఫలము
అంది యాపె చక్కని రూపది యంత్రము
ఇందునె శ్రీ వేంకటేశ ఇటు నన్ను గూడితివి
అందమై ప్రత్యక్షమాయ నప్పటి దానె నీకు ||అడుగ||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట346, సంకీర్తన 518)

శ్రీవారి పూజలు ఫలించాయి. దేవి ప్రత్యక్షం అయింది. స్వామి పూజలన్నీ ఆమెకు ఎంతో సంతోషం కలిగించాయి. దేవి ఉపాసకుల అనుష్ఠానం అంతా ఈ సంకీర్తనలో కనిపిస్తుంది. మంత్రం, అంగన్యాస కరన్యాసాలు, ముద్రలు, తర్పణ జలము, హోమము, భోజనము (నైవేద్యము) పురశ్చరణ ఫలము, యంత్రము ఇవన్నీ దేవీపూజలో అంతర్భాగాలు. ఇందులో ప్రతి ఒక్కటీ శ్రీవారి శృంగార పూజలో శాస్త్రోక్తంగా పర్యవసించటం అపూర్వంగా కనిపిస్తుంది. చెలియ పేరు నిత్యం మంత్రంగా స్వామి జపిస్తున్నాడు. కలిసేటి చేతలే అంగన్యాసకరన్యాసాలు. ముద్రధారణ కూడా దంతక్షత నఖక్షతాలతో సక్రమంగా జరిగిపోయింది. ఇంక ఆ దేవికి ప్రసన్నం కాక తప్పలేదు. ప్రత్యక్షమైన దేవికి విధియుక్తంగా జరగవలసిన హోమాదికాలకు శ్రీవారు లోటు రానిస్తారా. ఆమెపై జల్లే వలపు తర్పణ జలం కాగా దీపించు నవ్వే దివ్య హోమమయింది. మరి దేవికి నైవేద్యమో? అందుకు మాత్రం లోపం ఉంటుందా. అధరామృతానికి మించిన భోజనం!! నైవేద్యం ఆ దేవికి ఎక్కడ దొరుకుతుంది? ఈ పూజల ఫలం అంతా రతిగా భాసిస్తున్నది. సాధకుడైన స్వామికి సిద్ధి కలిగించిందా దేవి. ఆమె చక్కని రూపే యంత్రం కాగా పూజానుష్ఠానం అంతా సక్రమంగా విధియుక్తంగా అన్నమయ్య జరిపించాడు. మధుర భక్తికి ఇది రమ్యమైన రసగుళిక. భక్త సులభుడైన ఆ స్వామి నిత్యం భక్తులనే సంభావిస్తాడనే భావనకు ఈ సంకీర్తన ఒక ప్రతీక.

'చెలియ పేరే', 'సన్నలే', 'వలపదే', 'యధరామృతమే' అంటూ దీర్ఘాక్షర ప్రయోగంతో నిశ్చయాత్మకతని రూపకంలో అన్నమయ్య సృష్టించాడు. సంకీర్తనలో

పదాల మధ్య విరామం ఎక్కడా పాటించబడలేదు. పాదాంత లఘువులు సంకీర్తన అంతా నిండి ఉండటం వలన ఏర్పడిన వాక్యం లోని వేగం వలన పూజా కార్యక్రమంలోను రతి కార్యక్రమంలోను నిండిన ఆవేశాన్ని ఉద్వేగాన్ని స్ఫురింప చేస్తున్నాయి.

పాదాంత లఘువులు, వాక్యాంత లఘువులు నిశ్చయాత్మకతను సాధించటం కోసం ప్రసిద్ధ కవులందరూ తమ కావ్యాల్లో ప్రయోగించారు.

మునికన్యక యఁట ! నేనఁట !
వనమున గాంధర్వమున వివాహంబఁట ! సూ
నుని గనెనఁట ! మఱచితినఁట !
వినఁ గూడునె యిట్టి భంగి విపరీతోక్తుల్

(పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు - శృంగార శాకుంతలం 4-114 అ. పద్యం)

శకుంతలను తిరస్కరించిన ఈ ఘట్టంలోని వాక్య నిర్మాణమే నన్నయ లోనూ కనిపిస్తుంది.

ఏనెట నీవెట సుతుడెట
యేనెన్నడు దొల్లి చూచి యెఱుఁగను నిన్నున్
మానిను లసత్య వచనలు
నానిట్టు లసత్య భాషణం బుచితంబే

(నన్నయ - ఆంధ్రమహా భారతం ఆదిపర్వం 100 పద్యం)

ఈ శకుంతలా తిరస్కార ఘట్టంలో దుష్యంతుడి చిత్తవృత్తి నిరూపణకు నన్నయ, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు ఇద్దరూ వాక్యాంత లఘువులనే స్వీకరించటం కనిపిస్తుంది. ఇష్టం లేనిదానిని ప్రశ్నించడం మానవుడి సహజమైన ప్రవృత్తి. ఇదే ప్రశ్నారూపంలో రెండు కంద పద్యాల్లోనూ కనిపిస్తుంది. పదాల మధ్య విరామ రాహిత్యం, చిత్తగతిలోని ఆవేశాన్ని స్ఫురింపచేస్తున్నది. వాక్య లయ దుష్యంతుడి ప్రవృత్తి నిరూపకమవుతున్నది. పద కవులయినా, పద్య కవులయినా వాక్య లయని సాధనంగా స్వీకరించే వాక్య నిర్మాణం చేసినట్టు స్పష్టమవుతుంది.

16. శ్రీవారికి నిత్య పూజలు:

శ్రీవారు స్వీకరించే పూజలు, ఆయనను ప్రసన్నం చేసుకోవటానికి జరుపబడే నిత్య పూజానుష్ఠానం కూడా నాయిక పూజలోనే అన్నమయ్య పొందుపరిచాడు.

రాగం: దేసాళం

ఇంతి వుపచార పూజ యిందే కలిగె నీకు
వంతుల జేకొని నీవు వరమియ్యవయ్యా ॥పల్లవి॥

అంగన నిన్ను జూచుటే ఆవాహనము ఆకెకు
అంగవించి నీవు మతి హత్తినదే ఆసనము
సంగతి నీపై చింతే సదా ధ్యానము సుమ్మీ
అంగపు జెక్కు చెమట లర్ఘ్యపాద్యాదులు ॥ఇంతి॥

సరుస కన్నీళ్ళే ఆచమన జలకము
అరవిరి పయ్యదయు అంగవస్త్రము
ని రతి మైకమ్మఁ దావి నీకు నిచ్చిన గంధాలు
పరగిన పులకలే పలు పూజలు ॥ఇంతి॥

దొమ్మి వూర్పు విరహాన్ని, దూపము దీపము నాయ
సొమ్ములే మై మెఱుగులు, సోలి వీఁగేవే దండాలు
నమ్మిక శ్రీ వేంకటేశ నైవేద్యమాయ మోవి
కమ్మర గాఁగిటి నవ్వే కప్పుర విడేలు ॥ఇంతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం22, పుట78, సంకీర్తన 116)

వైష్ణవ పూజానుష్ఠానం అంతా ఇందులో కనిపిస్తుంది. ఆవాహన, ఆసనం, ధ్యానం, అర్ఘ్యం, పాద్యం, జలకం, అంగవస్త్రధారణ. గంధమాల్యాది లేపనాలు, ధూపం, దీపం, దండం, నైవేద్యం, తాంబూలం విధియుక్తమైన పూజ ఈ శాస్త్రోక్తమైన పూజా విధానం అంత ఆత్మార్పణ చేసుకునే ఆమె భక్తిలోనే పర్యవసిస్తున్నాయి. శ్రీవారితో దేవి కలిసి కరిగిపోయే రీతిలో ఈ పూజానుష్ఠానం అంతా కనిపిస్తుంది.

ఆ దేవి నిన్ను చూడటమే ఆవాహన. మదిలో నిలిపినదే ఆసనము. నీ పై చింతే ధ్యానం. ఈ పూజకు విచ్చేసిన స్వామికి అర్ఘ్య పాద్యాదులు ఆమె చెక్కుల చెమటలు. ఆనంద బాష్పాలు ఆ స్వామికి ఆచమన జలకం. జలకాలార్చిన తరువాత ఆమెపై కొంగే ఆయనకు అంగ వస్త్రము. సురత గంధాలుండగా స్వామి వేరే గంధం ఇష్టపడతాడా. చెమరించిన పులకలే చిత్రవిచిత్ర పూజలు. ఆమె వేడి నిట్టూర్పులే ధూప దీపాలు. ఆమె పైని సొమ్ములే స్వామికి ఎప్పుడో ఆభరణాలయినాయి. పరవశంతో సోలి వీగేవే దండాలు. ఆమె మోవి స్వామికిష్టమైన ప్రసాదం. కౌగిలి, నవ్వును, కర్పూర విడెంగా ఆమె సమర్పిస్తే ఉపచార పూజలన్నీ వరుస క్రమంలో ప్రీతి పూర్వకంగా స్వామికి సమర్పించబడినాయి. ఇంక ఆ స్వామి భక్త సులభుడు కదా, వరాలకు లోటేముంటుంది?

ప్రతి చరణంలోని, ప్రతి పాదంలోను వాక్యం సంపూర్ణమయి గతిని నియమిస్తున్నది. వాక్యంలోని రెండు పదాల్లో మొదటి పదంలోని దీర్ఘం రెండవ పదాంతంలోని లఘువుని నియమిస్తూ నిశ్చయత్వాన్ని స్ఫురింపజేస్తున్నది. 'నిన్ను జూచుటే ఆవాహనము' అనడంలో చూపులకు స్థిరత్వాన్ని, ఆవాహనకు ఆకర్షణకు బలాన్ని మొదటి పాదాంతంలోని గురువు కల్పించింది.

ఇలాగే ప్రతి చరణంలోని ప్రతి పాదంలోను మొదటి పదం గురువయి పదం విరిగి, రెండవ పదాన్ని నియమిస్తున్నది. ఆమె సేవలు, అవస్థా భేదాలే అన్వయ క్రమంలో రతికి, ఉపచార పూజలకు ప్రతీకలుగా ఈ వాక్యలయే సూచిస్తుంది. మధుర భక్తిలోని స్థాయిని సూచిస్తుంది. ఆమె చిత్తగతిలోని భగవద్రతిని తాదాత్మ్యభావాన్ని సూచిస్తున్నది.

17. శ్రీవారి ఆయుధ సామాగ్రి:

శ్రీవారు ఏ యుద్ధానికి వెళ్ళినా ఎప్పుడూ ఆయనదే విజయం. ఆ విజయ రహస్యం లోని కీలకం అంతా ఆయన ఆయుధ సంపత్తిలోనే నిక్షిప్తం అయినట్లుగా మనకీ సంకీర్తన చెబుతుంది.

రాగం: శుద్ధ వసంతం

అలమేలు మంగ యీకె ఆనుక వద్ద నుండది
చెలరేగి కందువలు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

తరుణి దేహమే నీకకు తగు దివ్యరథము
గరుడ ధ్వజంబాపె కప్పు పయ్యెద
తురగములు రతుల దోలెడు కోరికలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥అలమేలు॥

దిండు కల పిఱుదులు తేరు బండికండ్లు
అండనే పువ్వుల గుత్తులాపె చన్నులు
కొండ వంటి శృంగారము కోపున గల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా ॥అలమేలు॥

వెలది కంఠము నీకు విజయశంఖమదిగో
నిలువెల్లా సాధనాలు నీకు నాపె
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరును గూడితిరి
పలు విజయముల నిట్టే పరగవయ్యా ॥అలమేలు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం8, పుట 54, సంకీర్తన 90)

యుద్ధ సామాగ్రిలో మూలమైనది రథం. శక్తిని చాటడానికి ప్రతీక ధ్వజం. గమనానికి అవసరమైనవి తురగాలు రథ గమనాన్ని నిరూపించేవి రథ చక్రాలు. విజయ సాధనకు అవసరమైనవి శస్త్రాస్త్రాలు, పటిమ గల ధనుస్సు విజయాన్ని దశదిశలా చాటి చెప్పేదే శంఖము. వీర రసానుకూలమైన ఈ ప్రతీకలన్నీ శృంగార రస ప్రతీకల్లో నిక్షిప్తం చేసి లయాత్మకమైన వాక్య నిర్మాణంలో రెంటి గమనాన్ని ఒకేసారి నిరూపించాడు అన్నమయ్య.

శ్రీవారిని నాయిక దేహమే రథంగా, పయ్యెదే ధ్వజంగా, కోరికలే గుఱ్ఱాలుగా, అతివ పిరుదులే రథచక్రాలుగా, కొండవంటి శృంగారాన్ని ధనుస్సుగా సంధించి, చన్నుల మన్మథ బాణాలను లక్షించి వనిత కంఠమనే విజయ శంఖాన్ని పూరించి వలపులపై విజయాన్ని అందుకో స్వామి అంటున్నాడు సఖీ రూపంలో అన్నమయ్య.

వీరి శృంగార రసభావ ప్రతీకలు రెండూ ఒకే వాక్యంలో ఇమిడి పోవడం వలన లయ రెంటి గమనాన్ని ఒకేసారి నిర్దేశిస్తున్నది. మొదటి చరణంలో శృంగార

భావ ప్రతీకని ముందు చెప్పి 'దేహమే' రథమనడంలో 'మే' అనే అక్షరం మీద ఉండే ఊనిక ద్వారా ఆ వస్తువుల ప్రాముఖ్యాన్ని అన్నమయ్య నొక్కి చెబుతున్నాడు.

రెండవ చరణంలోని 'అండనే' అనే పదం అన్నమయ్య విశిష్టార్థంలో ప్రయోగించాడు. పువ్వుల గుత్తులు మదనాస్త్రాలు, చన్నులు మదనోద్దీపకాలు, అవి 'అండనే' ఉన్నాయని వాటి సామీప్యాన్ని సూచించి జరగబోయే కొండ వంటి శృంగారాన్ని వ్యంజింప చేశాడు. బిందు పూర్వక 'డ' కారాన్ని ఈ అర్థ బోధకు సంకేతంగా ఉపయోగించాడు. 'నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా' అనే వాక్యం ద్వారా సంపూర్ణ శృంగార రసావిష్కరణం జరుగుతున్నది.

మూడవ చరణంలోని పాదాంతంలో దీర్ఘాక్షరం ధ్వని గర్భితంగా ప్రయోగించబడింది. ప్రతి పాదంలోను వీర రసాన్ని స్ఫురింప చేసే ప్రతి శృంగారం రస భావ ప్రతీక లఘువుతో అంతమయింది. పయ్యెద, కోరికలు, చన్నులు సొబగు, అదే విధంగా 'విజయశంఖము' అని అంతం చేసినా పైరీతికి భిన్నం అయ్యేది కాదు. కాని 'శంఖం' తరువాత 'అదిగో' అంటూ అవధారణార్థకంలో పాదాంతంలో గురువు ప్రయోగించబడింది. ఈ వాక్యలయలో నాయిక హృదయంలో శ్రీవారు వలపులపై సాధించే విజయం భావ చిత్రంగా రూపుదిద్దుకోవడం కనిపిస్తుంది. అవధారణార్థకంలోని లయ వలన ఆ దృశ్యం మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

శ్రీవారి ఆయుధ సంపత్తి ఈ విధంగా ప్రతిసారీ విజయం ఆయనకే కట్టబెడుతున్నది.

శ్రీవారి శృంగార కేళీ విలాసాలు, వినోదాలు, జప, తప, నిత్యానుష్ఠాన కార్యక్రమాలు అనంతంగా అన్నమయ్య సంకీర్తనల్లో చోటు చేసుకున్నాయి. ఏ నాయిక ఏ అవస్థలో ఏ చిత్తంతో ఏ ప్రవృత్తితో కొలిస్తే వారి పాత్రతకు తగ్గట్టు కరుణించే ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రస్థానం యొక్క స్వరూపం అనంతం.

అన్నమయ్య సఖీ ప్రస్థానం

6

అన్నమయ్య సఖీ ప్రస్థానం

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో సఖి చాలా ప్రముఖ స్థానమే వహిస్తుంది. నాయిక మనోగత భావాలను ఆమె గ్రహించి స్వామికి నివేదించటంలో బుద్ధి కుశలతను, సమయస్ఫూర్తిని ప్రదర్శించి శృంగార సంకీర్తనలకే వన్నె తెచ్చింది. సమయాన్ని బట్టి నాయికకు హితబోధ చేసి, ప్రియుడి గుణ గణ వర్ణన చేసి, అపార్థాలను తొలగించి ప్రియా సమాగమం చేస్తుంది. నాయిక స్వామిపై అలిగితే లోక ధర్మాన్నీ, ఉత్తమ సతీత్వాన్ని, పురుష ప్రవృత్తినీ వివరించి చెపుతుంది. పతితో ఎలా మెలిగితే అతడిని కనుసన్నల్లో ఉంచుకోవచ్చునో తెలియచెప్పే లోకజ్ఞత కలిగిన బుద్ధిశాలి సఖి. అన్నమయ్య పోషించిన సఖి నాయిక వద్ద ఎంత చనువుగా మెసలుతుందో, నాయకుడి వద్ద కూడా అంత సన్నిహితంగానూ మెసలగలుగుతుంది.

నాయిక చిత్తవృత్తినీ, బేలతనాన్నీ వర్ణించి, ఎంతటి ముకురుతనం కలిగిన నాయికనయినా బులిబుంతపు కబుర్లతో ఎలా అనుకూలవతిగా మార్చుకోవచ్చునో సోదాహరణంగా చెప్పి, నాయకుడిని సుముఖుడిగా మారుస్తుంది, నాయికా నాయకుల సమాగమానికి వేదిక సిద్ధం చేస్తుంది. ఈ సఖి అంతరంగంలో అన్నమయ్య తన హృదయాన్ని ధ్వనింపచేశాడు. అన్నమయ్య తనకు స్వామితో కల చనువును సంకీర్తనల్లో నిరూపిస్తూ, మందలింపులు, హితబోధలు, వ్యంగ్యాలు వక్రోక్తులను, కొల్లలుగా నింపి ఈ సఖిని తన హృదయానికి ప్రతిరూపంగా నిర్మించాడు.

అలంకార శాస్త్రాన్ని అనుసరించి ఈ సఖి కర్తవ్యాలను బాధ్యతలను ఈ క్రింది విధంగా విశ్లేషించడం జరుగుతున్నది.

'విశ్వాస విశ్రామ కారిణీ పార్శ్వచారిణీ సఖి. అస్యా మణ్డనోపాలమ్భ శిక్షా పరిహాస ప్రభృతీని కర్మాణి' 'రసమంజరి' 97 పుట.

నాయిక నమ్మకానికి పాత్రమయినది, నాయికతో కూడా సంచరించేది సఖి. ఈమెకు అలంకరించటం, నాయికకు అవసరమైన విద్యల్లో నేర్పును కలిగించటం వినోద పరిహాసాల్లో ముంచెత్తటం మొదలైనవి ప్రధానమైన కర్తవ్యాలు.

1. మండనం:

'మండనం' అంటే అలంకరించటమని అర్థం. సఖి కర్తవ్యాల్లో నాయికని అలంకరించటం ఒక ప్రధాన కర్తవ్యం.

రాగం: తెలుగు గా(గాం)బోది

విరహమునకు నీవు వెరవ వద్దు
గరిమ నేపొద్దూ నివే కాపులు నీకును ॥పల్లవి॥

విరహంతో వేగిపోయే నాయికను అలంకరించుకోమని ఆ అలంకరణలే ఏ కాలమూ 'కాపులుగా నిలిచేనని ప్రేరేపిస్తున్నారు సఖులు.

"కలువల బంతిని చేత ధరించి సొగసుగా నిలిస్తే, తన మేని కాంతి కని స్వామి మురిసి నిన్ను చేరగలడు. తామరలు ఉరముపై ధరించు. తన కన్నుల వంటివే కదా అని కమలలోచనుడు కరుణిస్తాడు. కనకపు సొమ్ములు ధరిస్తే పీతాంబరాల కాంతులుగా ఎంచి స్వామి తప్పక చెంత చేరతాడు. మాణిక్యాల పేరు ధరించు. కౌస్తుభమణి సామ్యంతో మనసు పడి నిన్ను మురిపిస్తాడు. ముంజేతిపై చిలుకతో పలుకు చెలీ. తానెక్కి తిరిగే పక్షిపై అనురాగంతో ప్రక్కలకి చేరగలడంటూ" చివరిగా ఆ కొండల రాయుడికి చనుగొండలు చూపి వశపరచుకోమంటున్నది సఖి.

చెంగలువ బంతి నీవు చేతఁ బట్టుకొనవే
సంగతి నాతని మేని చాయల దది
ముంగిట తామర లురమున నొత్తుకోవే
రంగుగాఁ జెలువుని నేత్రములఁ బోలునవి ॥విరహ॥

కనకపు సొమ్ములెల్లా కాయముపై నించుకోవే
ఘనుని పీతాంబరపు కాంతులఁ బోలు
పెనచి మాణికముల పేరు మెడ వేసుకోవే
కనుఁగొంటే నాతని కౌస్తుభము జాతివి ॥విరహ॥

చేవ మీద ముంజేతి చిలుకతో మాఁటాడవే
భావింప నాతఁ డెక్కే పక్షి కులము

కోవరపు నీ చనుఁగొండ లిట్టె చూపవే
యీవేళ శ్రీ వేంకటేశుఁ డేలె నిన్నును ॥విరహ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18, పుట77, సంకీర్తన 114)

విరహంతో వేగిపోయే నాయికను అలకరించుకోమని, ఆ అలంకారం ఏ కాలమూ 'కాపులుగా నిలిచేనని ప్రేరేపిస్తున్నారు సఖులు.

నాయికని అలంకరించుకోమని ప్రేరేపించటంలో ఒక తర్కాన్ని ఒక పద్ధతిని సూచిస్తున్నది సఖి. పల్లవి లోనే, అలంకారాలే ఎల్లకాలాలూ రక్షలని, వశీకరణకు సాధానాలనే అర్థంలో "నేపొద్దు నివే కాపులు నీకును" అంటూ విరహానికి భయపడవద్దని ధైర్యం చెబుతున్నది సఖి. అలంకారాలు ప్రియా వశీకరణాలనీ, అవి శాశ్వత బంధనాలనే భావ నిరూపణకు ద్విత్వాక్షరం, దానిపైని దీర్ఘాక్షరం ఊనికతో ప్రయోగించబడినాయి. పాదాంత లఘువు నాయికను, పాదాన్ని నియమిస్తున్నది. శ్రీవారికి ప్రీతి పాత్రమయిన విషయాలను తన అలంకరణలో అనుకరించమనటం, తద్వారా తప్పక స్వామి కరుణించగలడని నిశ్చయాత్మకంగా పలుకటం తర్కానికి ప్రతిరూపంగా కనిపిస్తుంది.

ప్రతి చరణంలోను మొదటి, మూడు పాదాల్లోను 'చేతబట్టుకొనవే', 'నొత్తుకోవే', 'నించుకోవే', 'మెడ వేసుకోవే', 'చూపవే' పదాల్లోని దీర్ఘాక్షరాల పైని ఊనిక ప్రేరణకు సూచకం. ప్రతి చరణంలోని రెండు నాలుగు పాదాల్లోని "మేని చాయల దది", "నేత్రముల బోలునవి", "కౌస్తుభము జాతివి", "పక్షి కులము", "డేలె నిన్నును" పదాల్లోని లఘువులు తార్కిక రూపంలో నిశ్చయాత్మకంగా స్వామి కరుణకు ప్రతిరూపాలుగా అర్థం సంపూర్ణమయి పదం విరుగుతున్నది. తద్వారా చరణంలో నాలుగు పాదాలకు సమతుల్యత భాసించి, నాయిక అలంకారాలకు, శ్రీవారి కరుణకు ప్రతీకగా కనిపిస్తుంది.

2. ఉపాలంభం:

నాయికని వేధించే మన్మథ, మలయానిల, పిక, శారిక చంద్రాదులను ఉపాలంభించి తద్వారా ఆమెకు కాస్త ఊరట కలిగించటం సఖి విధుల్లో ఒకటి. సఖి ఈ క్రింది సంకీర్తనలో మన్మథుడిని బాగా అధిక్షేపించి, నీదసలు బలమే కాదు పొమ్మన్నది.

రాగం: సామంతం

ఊరకే మరుని ఫౌఁజు లూరఁ గూటాలు
అరసితే వట్టి జూబు లవి నీకు ఎదురా ||పల్లవి||

కొలనిలో తుమ్మిదలు కొమ్మలపై కోవిలలు
బలము లింతే పో భావజునికి
నెలత నియ్యంద్దైతే నెరిఁగల తుమ్మిదలుఁ
బలుకుఁ గోవిలలునుఁ బంత మాడీఁ గదవే ||ఊరకే||

తీగలపై విరులును తియ్యని తుంట చెఱకు
చేగల యమ్ములు విల్లుఁ జిత్తజునకు
సోగల బొమ్మల విల్లుఁ జూపుల యమ్ములు నీకు
యీ గతుల నింతి నీకు నెదయవు గదవే ||ఊరకే||

యెక్కడో చందురుఁడును యెడపుల చల్లగాలి
మక్కువైన తోడు దొన మదనునికి
గక్కన శ్రీ వేంకటేశు కాఁగిటి నీకైతేను
వొక్కచో వదన చంద్రుఁడూరుపే గాలి గదే ||ఊరకే||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం24, పుట33, సంకీర్తన48)

మన్మధుడిని పరివార సమేతంగా సఖి తూర్పారబడుతున్నది. మన్మథుడికి అతగాడి సేనకు పటాటోపం ఎక్కువ, పటిమ తక్కువ. అతగాడి ప్రధాన బలగాలు 'ఏవీ'? అని విచారిస్తే కొలనిలోని తుమ్మెద, కొమ్మ పైని కోయిల. ఇంతే కదా. తుమ్మెదలు మా చెలి కురులకు, కోయిల కూజితాలు మా చెలి పలుకుల ధాటికి నిలబడగలవా ? అని నిలదీస్తున్నది సఖి.

"ఇక ఆ మరుడి శస్త్రాస్త్ర పటిమ. తీవెలపై విరులు. చేత గల అమ్ములు. ఇంతే కదా ? తియ్యని తుంట చెఱుకు అతగాడి ధనుస్సు. సోగయిన నీ కనుబొమ్మల విల్లును, చూపుల బాణాలను ఆ కుసుమాస్త్రుడు తియ్యని ఆ ధనుస్సుతో ఎదిరించగలడా?"

"ఇంక అతగాడి జతగాళ్ళ పరాక్రమాలూ అంతంత పాటివే. నింగిలో ఎక్కడో దూరంగా ఉండే జాబిల్లి. మరెక్కడ నుంచో వీచే పిల్లగాలి. శ్రీ వేంకటనాయకుని కౌగిలి చేరితే మా నాయిక వదన చంద్రుడి ముందు, ఆమె వెచ్చని ఊర్పులకు వీరిద్దరు సాటి రాగలరా" అని సఖి వెక్కిరించి వేళాకోళం చేస్తున్నది.

మన్మథుని ప్రధాన బలగాలయిన తుమ్మెదలను కోయిలలను వాటికి నెలవులతో సహా సఖులు వేళాకోళం చేస్తున్నారు. ప్రతి చరణంలోను రెండు పాదాలకు అర్థం సంపూర్ణమయి విరుపు కనిపిస్తుంది. ప్రతి రెండు పాదాలకు అర్థ స్ఫురణకు ప్రాస ప్రయోగించబడి లయ, ఊపు వినిపిస్తాయి. ప్రతి పాదం కూడా రెండు సమానభాగాలుగా విరుపుతో నిర్మించబడి ఒక సమతుల్యతని స్ఫురింపచేస్తున్నది.

ప్రతి చరణంలోను రెండు పాదాల్లో మన్మథుని బలగాలను అధిక్షేపించడం తరువాత రెండు పాదాల్లో నాయిక అందాల ముందు ఆ మరుని ఫౌజులు, వాటి బలము ఎందుకూ కొరగాదనే భావం మనకు వినిపిస్తుంది. ఈ మన్మథుని బలగాలు, అల్పమైన వాటిని మాత్రమే కట్టి బంధించగల ఊరగూటాల వంటివని సఖులు అధిక్షేపిస్తున్నారు.

ప్రతి చరణంలోను మొదటి రెండు పాదాలను విరిచి "కి" లేదా "కు" అనే విభక్తి ప్రయోగించి, విరామం కల్పించి పదాల నడకను నియమితం చేయడం జరిగింది. ఆ తరువాత పాదాల ఎత్తుగడ ఆరంభమయింది.

మొదటి చరణం రెండవ పాదంలో 'బలము లింతే వో భావజునికి' పదాల్లోని దీర్ఘాక్షరాల పైని ఊనిక మదనుడి ధిక్కార సూచకంగా ప్రయోగించబడింది. మూడవ పాదంలోని 'నియ్యందైతే పదంలోని ఊనిక వలన నాయిక అందాలకు మదనుడి బలగాలపైకల ఆధిక్యతని నిరూపిస్తున్నది.

రెండవ చరణంలో తీగలపై విరులు, చేతగల అమ్ములు; తియ్యని తుంట చెఱుకు, మన్మథుని చేవ గలిగిన విల్లు అనడంలో 'ద్విత్వ యకారం' ప్రయోగించడంలో ఏర్పడిన ఊనిక వలన "తీగ చాలా సుకుమారమైనదనీ, విల్లు మధురమూ, ఆస్వాదయోగ్యమైనదనీ- ఇవి కూడా ఒక బలమేనా" అనే ధిక్కారం వినవస్తాయి. ఇందులో క్రమాలంకారం కనిపిస్తుంది.

మూడవ చరణంలో 'ఎక్కడో ఉన్న చందురుడు, ఇటూ అటూ తిరిగే చల్లగాలి ఇతగాడి జతగాళ్ళా? అని అధిక్షేపిస్తున్నారు సఖులు.

'యెక్కడో' అనే పదంలో ద్విత్వ 'క'కారం మీద ఉండే ఊనిక 'డో' మీద పడటం వలన చంద్రునికి మనకూ ఉన్న దూరాన్ని సూచిస్తూ అక్కడివాడు ఇక్కడేం చేయగలడనే వెటకారం వినిపిస్తుంది. శ్రీవారి కౌగిలి చేరితే ఈ పిల్లగాలి ఊర్పై నాయికకు లోబడేదే కదా అని సఖి అధిక్షేపిస్తున్నది.

3. శిక్షణ:

శ్రీవారిని స్వాధీన పరచుకోవడానికి కావలసిన ఓర్పు, నేర్పు, చాకచక్యం, సమయస్ఫూర్తి, నాయికకు సమయానుకూలంగా నూరిపోయాల్సిన బాధ్యత కూడా సఖిదే. అన్నమయ్య ఈ సంకీర్తనలో సఖి ఆ బాధ్యతను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నదో గమనిస్తే ఆశ్చర్యం కలుగక మానదు.

రాగం: సామంతం

రమణుడు వీఁడివో రాతిరి యీడ నున్నాడు
సముకాన నుండవే చలము వాసీని ॥పల్లవి॥

మంతన మాడవే చాలు మనసు నీకుఁ గరఁగీ
చెంతల నేమెల్లా బుద్ధి చెప్పనేల
పంతము లాడవే చాలు పతి తోడ నదే మించి
యింతి నీకు మచ్చు మందయ్యీ నదే నేఁడు ॥రమణుడు॥

కొచ్చి చూడవే చాలు కోపము తానె పోయీని
వచ్చి వచ్చి నేము నిన్ను వద్దనేల
పచ్చిగాఁ దిట్టవే చాలు పైకొని యదే నీకు
తచ్చి వలపుల వల్లె తాళ్ళయ్యీ నిపుడు ॥రమణుడు॥

విడెమియ్యవే చాలు వేడుక తానే పుట్టీని
కూడుమని నేము నిన్నుఁ గొసరనేల

యీడుగా శ్రీ వేంకటేశు డెనసె నీకు నిదె
వాడిక రతులకు వాటమయ్యీ నికను ॥రమణుడు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం21,పుట267, సంకీర్తన 400)

శ్రీవారు అలిగి కూర్చున్నారు. నాయిక వచ్చి కాస్త కొంగు తగిలిస్తే చాలు, కరిగిపోయే వాలకం కనిపిస్తున్నది. కాని ఈమెకు ఎక్కడలేని బెట్టు. అలకల కొండలెక్కి కూచున్న వాడిని కరిగించమని మేమింత చెప్పాలా. కాస్త మాటాడు తల్లీ!! నీ చూపే ఆయనకు మచ్చుమందు. కాస్త కరుణించి చూడు. శ్రీవారి కోపం దానంతట అదే మాయమవుతుంది. మాటలే కరువా !! చివరికి పచ్చిగా తిట్టినా సరే తెరలు తొలగిపోతాయి. ఆ తిట్లే వలపుల తాళ్ళు కాగలవని సఖీ నివేదన. 'కర్పూరపు విడెమిస్తే చాలు, దానితోనే కరిగిపోతాడు కాంతుడు' అంటూ నాయిక విభునితో జత కలపటానికి బహు చక్కని శిక్షణా కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నారు సఖులు.

మొదటి చరణంలో 'మంతన మాడవే చాలు' దగ్గర పదం విరిగి, ఒక చిన్న మాటే సమస్త కార్యసిద్ధిని చేకూర్చగలదని నిరూపిస్తున్నది. పైపదంలోని దీర్ఘాక్షరం ప్రేరణకు, నిశ్చయార్థకానికి ప్రయోగించబడింది. 'మనసు నీకు గరగీ' అనడంలోని ఊనిక వలన కరిగి ప్రవహించదానికి సిద్ధంగా ఉన్న శ్రీవారి చిత్తం నిరూపితమవుతున్నది.

రెండవ చరణంలో బోధలన్నీ చేసి 'నిన్ను వద్దనేల' అనే సంబుద్ధ్యంత ప్రశ్న ద్వారా 'మేము చెప్పనక్కర్లేదు' అంటూ 'స్వామి చిత్తం నీకు తెలుసు కదా' అంటూ నాయిక అన్నీ తెలిసే ఇంత బెట్టు చేస్తున్నదని నిరూపిస్తున్నారు. ఇదే విధంగా 'పంతము లాడే', 'కొచ్చి చూడవే', 'పచ్చిగా దిట్టవే', 'విడెమియ్యవే' అనే సంబుద్ధ్యంత పదాల్లోని దీర్ఘాక్షరాలలోని ఊనికలో ప్రేరణ, ప్రార్థన, కార్యసిద్ధి కాగలదనే నిశ్చయం ధ్వనిస్తున్నాయి. 'మచ్చుమందయ్యీ, కోపము తానే పోయీని, వలపుల వల్లె తాళ్ళయ్యీ' నంటూ దీర్ఘాక్షర ప్రయోగంలోని ఊనిక ద్వారా, ప్లుత గతి ద్వారా నొక్కి చెబుతూ బెట్టు చేస్తూ కరిగి పోవడానికి సిద్ధంగా ఉన్న స్వామి చిత్తాన్ని నిరూపిస్తున్నారు సఖులు.

4. **పరిహాసం:**

సఖులు ఎవరినయినా సందర్భోచితంగా పరిహాసం చేస్తే చెల్లుతుంది. రసికులు మన్నిస్తారు. అందుకనే సఖులు ఏకంగా శ్రీవారినే పరిహాసాల్లో తేలిస్తున్నారు.

రాగం: వరాళి

అడుగు వెట్టితే నీ కాపెమీఁదాన
తొడికి కొంగు వట్టితే తోసిపోవఁ జెల్లునా ॥పల్లవి॥

నిద్దిరించే వేళ వచ్చి నీవు లేపగాఁ జెలి
గద్దించి తిట్లు తిట్టి కసరెఁ గాక
కొద్దెరిగి నీ వుండితే కోపగించునా యాపె
అద్దో నీ వింతలోన మారలుగఁగఁ జెల్లునా ॥అడుగు॥

చదురంగ మాడేవేళ జాణతనాలాడగాను
తుది నిన్నుఁ జేతఁ బట్టి తోసెఁ గాక
యెదుటనె వోరిచితే నింత సేసునా యాపె
కదిసి నీ విందుఁగా గాంతాళించఁ జెల్లునా ॥అడుగు॥

పాటలు పాడేటి వేళ పైకొని కాఁగిలించగ
తాటించి తా కొనగోరు దాఁకించెఁ గాక
యీటున శ్రీ వేంకటేశ యిందు కిట్టె కూడితివి
చీటికి మాటికి నీకు సిగ్గువడఁ జెల్లునా ॥అడుగు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట180, సంకీర్తన 269)

అడుగు పెడితే 'నాయికపైన ఆన' అంటూ ముందుకు కదలనీయకుండా శ్రీవారిని పరిహాసం చేస్తూ కాస్త వ్యంగ్యం, మరి కొంత మందలింపు కలిపిన హితబోధ చేస్తున్నారు సఖులు. "నిద్దిరించే వేళ వచ్చి నీవు లేపగా చెలి గద్దించి' తిట్టు తిట్టి కసరిందే అనుకో. అయితే మాత్రం 'కొద్దెరిగి నీ వుండితే కోపగించునా యాపె" అంటూ అది తెలుసుకోక పోగా "అద్దో నీ వింతలోన మారలుగ చెల్లునా? ఇది న్యాయమేనా? చదరంగం ఆడే వేళ జాణతనాలాడితే, 'తుది నిన్ను చేత బట్టి

త్రోసి' నంత మాత్రాన 'యెదుటనే వోరిచితె' ఆవిడ ఇంత చేసేది కాదు కదా? 'కదిసి నీ విందుకు గాంతాళించ' చెల్లునా? 'ఇదేం మంచి పద్ధతి కాదు' అంటూ చెలులు స్వామిని పరిహాసం చేస్తూ, హితబోధలు చేస్తూ మధ్యలో మందలింపులు మేళవించి కంగారు పెడుతున్నారు. ఇందులో అన్నమయ్య శ్రీవారితో నెరిపే చనువుని ఆయన చమత్కారవైభవాన్ని హాస్య సరస సంభాషణా కుశలతని మనం గుర్తించవచ్చు.

"నిద్దిరించే వేళ నీవు వచ్చి లేపగా" పదాల్లోని ద్విత్త 'ద' కార, 'చ' కారా పైని ఊనిక ద్వారా అపరాధ నిరూపణ జరుగుతున్నది. గద్దించి తిట్లు తిట్టడం సహజమేనట. ఆ భావ నిరూపణకు పాదాంతంలో లఘువు ప్రయోగించి నిశ్చయంగా 'కసరెగాక' అంటున్నారు. అది పెద్దగా పట్టించుకోవలసిన విషయమే కాదంటున్నారు. "కొద్దెరిగి నీ వుండితే కోపగించునా యాపె' అంటూ మళ్ళీ పాదాంత లఘువు ప్రయోగించి పదాన్ని విరిచి ఉపదేశిస్తున్నారు. 'కొద్ది' ఎరిగి ప్రవర్తించమంటున్నారు. దీనికి అలిగి బుంగమూతి పెట్టిన స్వామిని "మారలుగా జెల్లునా" అంటూ సంబుద్ధ్యంత ప్రశ్నతో, ఇది అలిగే వేళ కాదనీ, సాంత్వనానికి సమయమని ప్రేరేపిస్తున్నారు గడుసు సఖులు. చేతబట్టి నిన్ను తోసెగాక, కొనగోరు తగిలించె గాక అంటూ 'గాక' అనే పదం ఊనిక ద్వారా నాయిక చేష్టలన్నీ సహజాలే అని సమర్థిస్తున్నది సఖి.

దూతి:

"దూత్య వ్యాపార పారజ్ఞతా దూతీ. తస్యాః సంఘటన విరహ నివేదనా దీని కర్మాణి."(రసమంజరి - పు. 103)

నాయికా నాయకుల మధ్య సందేశాలను అందివ్వటంలో మంచి నిపుణురాలు దూతి. నాయికను నాయకుడితో కూర్చటం, విరహ నివేదనం ఈమె ముఖ్యమైన కర్తవ్యాలు.

1. సంఘటనం (కూర్పు): శ్రీవారి కోసం ఎదురుచూసి వేసారి దూతితో కబురంపితే, కూర్పుకై దూతి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్న తీరు అన్నమయ్య సంకీర్తనల్లో ఇలా వ్యక్తమవుతున్నది.

రాగం: వరాళి

విచ్చేయ రాదా వెలదిఁ కడకు నీవు
యిచ్చ నాస పడువారి నెలయించ దగునా ॥పల్లవి॥

నిలిచి నిలిచి నీకు నిక్కి యెదురు చూచీని
వలచిన సతి నీవు వచ్చేవంటా
మలసి మలసి నీ మాఁటలే ఆలకించీని
యెలమి నేమని యానతిత్తువో యనుచు ॥విచ్చేయ॥

చిమ్మి చిమ్మి నీ ఇంటికి చేతులే చాఁచీని
తెమ్మల ఆసన్న నీవు తెలుతువంటా
కుమ్మరించి కుమ్మరించి గుట్టుమాని నవ్వీని
పమ్మి నీవు తనకొంగు పట్టుదువొ యనుచు ॥విచ్చేయ॥

పూఁచి పూఁచి నీ వద్దికి పొలఁతుఁ నంపిని
యేఁచక నీ విప్పుడిట్టె యేలుదువంటా
రేఁచి రేఁచి వలపులు రేసు వాయఁ గూడితివి
దాఁచెను శ్రీ వేంకటేశ తమక మేలనుచు ॥విచ్చేయ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం20, పుట 5, సంకీర్తన 187)

ఆ నాయిక 'నిలిచి నిలిచి నిక్కి ఎదురు చూసీ అలసిపోతున్నది. 'మలసి మలసి' నీ మాటే బహు జాగ్రత్తగా వినేను స్వామీ. నీ ఇంటి దిక్కై చేయి జాచి నిలిచింది. ఆ సంజ్ఞ గ్రహించి 'నీవొస్తావేమో' అని నిలిచే కాంతను అనుగ్రహించు స్వామీ, గుట్టుమాని నవ్వి చనువిస్తున్నది. "నీవు తన కొంగు పడతావేమో" అని ఆశగా ఎదురు చేస్తున్నది. ఇంక ఆలస్యం చేయక నా చెలిని కరుణించు స్వామీ అంటూ నాయిక దీనస్థితిని వివరించి చెప్పి, ఆమె గాఢానురాగాన్ని హృదయానికి హత్తుకునేలా చెప్పి, వారిద్దరినీ ఒకరికోసం మరొకరు తహతహలాడేలా చేసి, తన ప్రజ్ఞను నిరూపించుకుంటున్నదీ దూతి.

పల్లవిలోని సంబుద్ధ్యంత దీర్ఘం 'విచ్చేయరాదా' అనడంతోనే దూతి సంఘటనానికై ప్రార్థించే తీరు స్పష్టమవుతుంది.

ప్రతి చరణంలోను నాయిక మానసిక స్థితిని, విరహ బాధను నొక్కి చెప్పడానికి 'నిలిచి నిలిచి', 'మలసి మలసి', 'చిమ్మి చిమ్మి' కుమ్మరించి కుమ్మరించి, 'పూచి పూచి', రేచి రేచి అంటూ పదాలను పునరుక్తం చేసి దూతి చెబుతున్నది. 'యెదురు చూచీని', 'ఆలకించీని', 'చేతులే చాచీని', 'నవ్వీని', 'పొలతుల నంపీని' అంటూ నాయిక చేష్టల్లోని అతిశయించిన విరహబాధ, తజ్జనిత ఆందోళనా నిరూపణలకు దీర్ఘాక్షర ప్రయోగం జరిగింది. 'నీవు వచ్చేవంటా', 'నీవు తెలుతునంటా', 'యేలుదువంటా' అంటూ రెండేసి పాదాల తరువాత పైపదాలను ప్రయోగించి, అక్కడ పదాన్ని విరిచి, వాక్య భావాన్ని పూర్తి చేసి పదానికి అర్థాన్ని నియమితం చేసి నిశ్చయ రూపంలో చెబుతున్నది సఖి.

2. విరహ నివేదనం: నాయిక విరహాన్ని స్వామికి నివేదించి ఆమె పట్ల శ్రీవారిని ప్రసన్నుడిని చేయటం దూతి కర్తవ్యం.

రాగం: దేవ గాంధారి

రమణుడ ఇంతట రారాదా
సమరతిఁ దేరీ జగడము లిఁకను ॥పల్లవి॥

కోవిల తిట్ల గొణఁగుల చేతను
తావుల దప్పెను ధైర్యములు
మాపుల చిలుకల మాట వెంగెముల
వావులు మాలెను వలపులు చెలికి ॥రమణుడ॥

కొంచెపు వాయువు కుంటె తనముల
చంచల మందెను సతి మనసూ
పంచల తుమ్మిద బలముల పొందుల
యించు కించుకే యెక్కెను చలము ॥రమణుడ॥

విరుల శరంబుల వేండ్ల వాండ్ల
మరలునుఁ దెలువులు మగువకును
యిరవుగ శ్రీ వేంకటేశ కూడితివి
సరసపు మాఁటలు సాగెను కొనకు ॥రమణుడ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం20,పుట178, సంకీర్తన 266)

స్వామి చెంత లేని సమయం చూసి మన్మథ సేన విజృంభించింది. పాపం ఆ దాడికి చెలి తట్టుకోలేకపోతున్నది. కోవిల తిట్ల చేత ధైర్యం కోల్పోయి, చిలుకల వ్యంగ్యపు మాటల చేత వావులు కోల్పోయిన నాయిక తల్లడిల్లిపోతున్నది. కొంచెపు వాయువు కొంటెతనాలకే చలించి పోయే నాయిక మనసు, పొంచి వేధించే తుమ్మెద బలగాలతో పోరుకు ఏ మాత్రం దిగలేదు.

నాయిక అవస్థను స్వామికి నివేదించి, ఆమె దీనస్థితిని ఆయన హృదయం కరిగించేలా వర్ణించి ఆయనను ప్రసన్నుడిగా సఖి మారుస్తున్నది.

విరహ నివేదనం కోసం సాగిన పద రచనలో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ప్రతి చరణంలోను మొదటి మూడు పాదాల్లో విరహబాధకు కారణాలు, రెండు నాలుగు పాదాల్లో తల్లడిల్లిన నాయిక చిత్తాన్ని నిరూపించింది దూతి. పద రచనలో కార్యకారణ సంబంధాన్ని వ్యతిరేక క్రమంలో చెప్పాడు అన్నమయ్య. ఎందుకంటే కోయిల తిట్లు, చిలుకల వ్యంగ్యాలు, వాయువు కొంటె తనాలు, తుమ్మెద బలాలు, విరుల శరాల వాడి ఎంతగా తపింప చేస్తున్నాయో స్వామికి తెలిస్తే ధైర్యం తప్పి, వావులు దూలి, చంచలమంది, చలములు పొంది మరులను పొంది, విలపించే చెలిని వెంటనే కరుణించగలడని దూతి ఉద్దేశ్యం.

నాయికకు ఇలా అనునిత్యం సహాయపడుతూ సలహాలిస్తూ సర్వకార్యాలూ సానుకూల పరిచే సఖి శ్రీవారితో కూడా చాలా సన్నిహితంగా మెలుగుతుందని ఋజువయింది. నిజానికి అన్నమయ్యే ఈ సఖి. శ్రీవారి తోడి చనువులు ఎంత రసవంతంగా అన్నమయ్య చిత్రించాడో పరిశీలిస్తే కవి హృదయం మనకి స్పష్టమవుతుంది. చిత్తవృత్తి పరంగా వివేచించి సఖి శ్రీవారితో నెరిపే చనవులను మనం విశ్లేషించి చూస్తే అన్నమయ్య అంతరంగం మధుర భక్తి స్వరూపం అవగాహన కాగలవు.

1. శ్రీవారికి ధైర్యం: ఒకసారి శ్రీవారు చాలా సిగ్గులు పడిపోతున్నారు. ఆయనకు సఖులు ధైర్యం నూరి పోస్తున్నారు.

రాగం: దేసాళం

ఇరు వంకల నీకు నిందరము నున్నారము
తెర మరఁగు నవ్వులు తెలుసుకోవయ్యా ॥పల్లవి॥

వేడుకకుఁ దోడు వచ్చి వెనుక తియ్యఁగరాదు
వాడికకుఁ జోటిచ్చి వద్దనరాదు
పాడి చెప్పేనని వచ్చి పక్షపాత మాడరాదు
తాడు పై తపసు నీవే తలఁచుకోవయ్యా ॥ఇరు॥

అట్టె తా పూట వడి అరవననఁగ రాదు
పట్టి చవిగొంటా రోత పడఁగరాదు
చుట్టరికము సేయుచు సూడు వట్టంగరాదు
చుట్టురాతినారిది విచారించుకోవయ్యా ॥ఇరు॥

సేసవెట్టి పెండ్లాడి సిగ్గులు వడగఁరాదు
బాస గెని (లి?)చిన మీఁద బద్దన రాదు
యీసు దీర శ్రీ వేంకటేశ మమ్ము నేలితివి
వేసిన ముడియ ఇది విడవకుమయ్యా ॥ఇరు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం23,పుట155, సంకీర్తన 237)

"నీకు ఇరువైపులా ఇందరం తోడున్నాము స్వామీ ! మోహమాటం వద్దు. తెర మరుగున ఉన్న తెరవ నవ్వుల కర్థం తెలుసుకో. వెనుకంజ వేయకు. వాడుకయైన వాడివి, వద్దనే పిరికితనమా స్వామీ ! పక్షపాతం తగదు. ఇందాకా వచ్చి ఇంతిని అన్యాయం చేస్తావా. వద్దకు వచ్చిన వాడివి వనితని పిలవటానికి సిగ్గుపడి 'అరవనని' అంటావా. కౌగిలించే వేళ రోత పడతావా. చుట్టరికం నెరపడానికి వచ్చి మొహం తిప్పి వెళ్ళిపోతావా. పెళ్ళి చేసుకున్న తరువాత ఇప్పుడు సిగ్గులా స్వామీ. పందెంలో గెలిచిన పడతిని వద్దనడం వివేకమా స్వామీ" అంటూ ధైర్యం చెప్పి శ్రీవారిని శృంగారానికి సఖులు సిద్ధం చేస్తున్నారు.

సంకీర్తన అంతా 'రాదు' అంటూ నిషేధ రూపంలో శ్రీవారి సిగ్గులను ముఖమాటాలనూ సఖులు వ్యతిరేకిస్తున్నారు.

ప్రతి పాదంలోను పూర్వభాగంలో శ్రీవారు శృంగారానికి సిద్ధం అవటం, ఉత్తర భాగంలో సందేహించి సిగ్గుపడటం. పాదాంతంలో 'రాదు' అంటూ స్వామి సిగ్గులను చెలులలు నిషేధిస్తున్నారు. ప్రతి పాదానికి అర్థం సంపూర్ణమయి నడక నియమితమౌతున్నది. పదాల మధ్య విరామం తగ్గి, వేగం స్ఫురించి, శ్రీవారికి ప్రేరణ ప్రోత్సాహం ధ్వనిస్తున్నాయి. 'నీవే తలచుకోవయ్య, విచారించుకోవయ్య' అనే పదాల్లోని సంబుద్ధ్యంత ప్రేరణ ద్వారా కర్తవ్య బోధ చేస్తున్నారు సఖులు. గదిలోకి పంపే నాయికకు ధైర్యం చెప్పి, సిగ్గులు పోగొట్టి రతికేళికి సిద్ధం చేయటం లోక సహజం. ఇక్కడ శ్రీవారికే ఈ ధైర్య వచనాలు చెప్పి మరో కొత్తకోణంలో మధురభక్తితో స్వామిని సేవించాడు అన్నమయ్య.

2. **శ్రీవారితో వ్యంగ్యం:** శ్రీవారికి ఎందుకో ఒకసారి చాలా కోపం వచ్చింది. పోనీ అలుక తీర్చటం కోసం నాయిక, సఖులు ఉన్నారు కదా అనుకుంటే వారి సాంత్వన పద్ధతి మరింత చిర్రెత్తించేదిగా ఉన్నది.

రాగం: మాళవిగౌళ

ఏమాయ నిందుకు నీ వెగ్గులేల పట్టేవు
కామిని నీ చెక్కు నొక్కీ కైకొనవయ్య ॥పల్లవి॥

పడఁతి నోరెత్తితేను పగడాలే రాసులయ్యీ
యెడపు నిన్నుఁ దిట్టితే నేమాయనయ్యా
కడలేని రత్నాలు గానుక వచ్చిన నీవు
తడవి బండారాన దాఁచుకోవటయ్యా ॥ఏమాయె॥

మగువ చూపుల వంక మాణిక్యాలే రాలీని
తగఁ గోపించి చూచితే తప్పటవయ్యా
సొగసి మణులు దాఁచి సొమ్ములు నీకిచ్చితేను
జిగి మేన ధరియించి చెలఁగవటయ్యా ॥ఏమాయె॥

ముంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని
యించుక గేలి సేసితే నేమాయనయ్యా

పెంచెపు శ్రీ వేంకటేశ పెండ్లి ముత్యాల సేస
వంచి కూడి చెలి మానవచ్చునటయ్యా ॥ఏమాయె॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం20,పుట112, సంకీర్తన 167)

నాయిక సరసం ఎంతలా ఉన్నా ఓర్చుకొని మెచ్చుకోవాలిట తప్ప "ఎగ్గుపట్టరాదుట" సఖుల వ్యంగ్యాలు విచిత్రంగా ఉన్నాయి. "పడతి నోరెత్తితే పగడాల రాసులు కురుస్తాయట. కడలేని రత్నాలు కానుకగా వస్తే, తిడితే మాత్రం ఏమయింది. వాటన్నింటిని భండారాన దాచుకోమంటున్నారు సఖులు. తిట్లే మాణిక్యాల మూటలుగా ఎంచి దాచుకోవాలిట. రసికతకు ఇది పరాకాష్ఠ, వ్యంగ్యానికి మచ్చు తునక.

"మగువ చూపులలో మాణిక్యాలు రాలి'తే మణులు సొమ్ములు దాచి నీకిచ్చింది కదా. కోపించి చూచితే తప్పు పడతావా స్వామీ" అనీ వేళాకోళం చేసి వ్యంగ్యాలాడుతున్నారు సఖులు.

"మా చెలి నవ్వితే మంచి ముత్యాలు రాలాయి. వాటిని పెళ్ళి ముత్యాలుగా తలంబ్రాలుగా ఎంచి సంతోషించక, ఆ నవ్వులో వ్యంగ్యం ఉంటే మాత్రం గోల చేయాలా. గోవిందా !! అది 'సరసం' " అని సద్దుకోమంటున్నారు సఖులు. కోపాలు, తిట్లు, ఎకసక్కేలు, పగడాలు, మాణిక్యాలు ముత్యాలుగా భావించాలట. ఎంతటి గడుసుదనం ! ఎంతటి వ్యంగ్యభావ పటిమ. !

పల్లవిలోనే సాంత్వనంలో వ్యంగ్యాన్ని నింపి ప్రశ్నా రూపంలో ప్రయోగించారు పడతులు.

"దిట్టితే నేమాయనయ్యా" ? 'కోపించి చూచితే తప్పటవయ్యా ? గేలి సేసితే నేమాయనయ్యా' ? అంటూ ప్రశ్నించారు చెలులు. పగడాల రాశులు, రత్నాలు మాణిక్యాలు మణులు, ముత్యాలు కురిసి నిన్ను అలరించగా 'మేన ధరియించి చెలగ'క నీ వెగ్గులేల పట్టేవు స్వామీ ? అంటూ వ్యంగ్యంగా చెలి కోప తాపాలన్నీ అలంకారాలుగా ఆనందాలను అనుభవించమని ఆనంద నిలయవాసుని వేడుకుంటున్నారు. ఈ ప్రశ్నాన్విత లయలోనే సాంత్వనం, వ్యంగ్యం వినిపిస్తున్నాయి.

3. హిత బోధ: శ్రీవారి సరసంలోనో శ్రీదేవి సేవల్లోనో ఎక్కడో కాస్త శృతిమించింది. ఇద్దరూ అలిగి కూచున్నారు. ఇద్దరికీ సఖులు హితబోధ చేస్తున్నారు.

రాగం: రామక్రియ

మీకు మీకు బుద్ధులెల్ల మేము చెప్పేమా
సాకిరి మారు బాణాలు చక్కనుండీనా ॥పల్లవి॥

అప్పటి కప్పటి మాట లాడితి రింతె కాక
యిప్పటి మారు మోములు యిఁక నేలా
కప్పుర ముండిన చోట కదువాస నేల మాను
యెప్పటికీ మాటలాడ కిట్టె వుండేరా ॥మీకు॥

వగలేక నగినగి వాడు వచ్చె నింతె కాక
యెగ సక్కెములు మీ కిఁక నేటికి
చిగిరించి రాఁగా రాఁగా చేఁగ లెక్క కేలమాను
మొగ మోగౌలిటు చూచి మొక్కకుండేరా ॥మీకు॥

పైపై రతి వేళనే పంత మాడితిరి గాక
యేపున వట్టి వొట్టులు యిఁక నేటికి
చేపట్టి కలసితివి శ్రీ వేంకటేశ యింతిని
కోపము దీరిన మీఁద కొంకి వుండేరా ॥మీకు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం16,పుట103, సంకీర్తన 153)

మీ ఇద్దరికీ బుద్ధులు మేము చెప్పేపాటివారమా. మరుడి బాణాలలో తగినంత వేడి ఉంటే మాకీ శ్రమ కలిగేనా?

ఇప్పటి దాకా మాటాడిన వారికింతలోనే మారు మోమేలా. ఎప్పటికీ ఇదే పంతమా. పస లేక, పంతం చెల్లక దిగి వచ్చాడు మారుడు. అపజయం వాడిది కాని మీది కాదు కదా. మీకీ 'యెగసక్కేలు యెందుకు? ముఖం చూస్తే మీ ఇద్దరు మురిసిపోయి కలిసి పోరా' ఎందుకీ పంతాలని సఖులు హితబోధ చేస్తున్నారు.

ఈ సంకీర్తనలో లయ శ్రీవారిని నాయికని వేడుకోవడంలో పునరుక్తి అయిన పదాల్లో కనిపిస్తుంది.

'మీకు మీకు బుద్ధులెల్ల', అప్పటికప్పటి మాట. 'నగి నగి' చిగిరించి రాగారాగా, పైపై రతి వేళనే పదాల్లోని పునరుక్తి, భావం మరింత స్పష్టంగా,

గాఢంగా వినిపించడానికి ప్రయోగించడం జరిగింది. ఈ పదాల్లోని దీర్ఘాక్షరాలు. ఊనిక వలన ఆ భావంతో బాటు బిగిసి కూర్చున్న నాయికా నాయకుల మనస్తత్వం కూడా కనిపిస్తుంది.

4. నింద: శ్రీవారు మరో కాంతతో సరసాలాడి ఇటు ఏ కాంతకు లోపం రాకుండా వినయాలు చూపుతుంటే సఖులు ఇలా నిందిస్తున్నారు.

రాగం: ముఖారి

కాదనేమా నీ వాపెఁ గాఁగిలించు కొనఁగాను
యీ దెస మమ్మింత భ్రమ ఇంచకువయ్యా ॥పల్లవి॥

అట్టె ఆపెకుఁ జుట్టమవైతే నౌదు గాక మమ్ము
వట్టి పరాకులు సేయ వలదయ్యా
చుట్టి మాటలాడ సందు చూచుకొంటేఁ గొందు గాక
దిట్టవై విడెము మమ్ముఁ దేనంపకువయ్యా ॥కాదనేమో॥

చొప్పుగా నీ వాపె దిక్కు చూచితే చూతువు గాక
కప్పురము మా కన్నుల గుప్పకువయ్యా
చిప్పిలఁ బొంద ననుపు సేసుకొంటే ఁ గొందువు గాక
విప్పుచు బచ్చడము పైఁ గప్పకు వయ్యా ॥కాదనేమో॥

పిలిచి యాపెకు సొమ్ము పెట్టితేఁ బెట్టుదు గాక
వెల చెప్పి పందేలు వేయకువయ్యా
చెలి యలమేలుమంగ శ్రీ వేంకటేశుఁడవు
ఇల మమ్ము నేలితి వెంత వాఁడవయ్యా ॥కాదనేమో॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం24,పుట282, సంకీర్తన 422)

శ్రీవారి చాటు శృంగారం బట్టబయలైంది. ఆ ఇంతి ఎవరో సఖులు పసిగట్టి ఆయనను ఇలా నిందిస్తున్నారు. "నీవామెకు చుట్టానివైతే కావచ్చు-మధ్యలో మా కన్నీళ్ళు తుడవడానికి చేసే పరాకులతో మాకు పని లేదు. సందు చూసుకొని సరసాలాడితే ఆమె ఇష్టం నీ ఇష్టం. మా మెచ్చుకు విడెం పంపవలసిన పని లేదు.

అత్రంగా ఆమె వంకే చూడాలని కోరిక ఉంటే చూసుకో. అంతే కాని మా కళ్ళల్లో కర్పూరం నింపకు. అటు సరసాలాడుతూ ఇటు మాపై పచ్చడం కప్పకు" అంటూ స్వామిని నిందిస్తున్నారు సఖులు. శ్రీవారు రెండు వైపులా లోపం రానివ్వకుండా సరసం సాగిద్దామనుకుంటే సఖులు సాగనివ్వటం లేదు. ప్రతి చర్యనీ వేయి కళ్ళతో కనిపెట్టి విశ్లేషించి విమర్శిస్తున్నారు.

పల్లవిలో "కాదనేమా పరకాంత తోడి పొందును, నీ ఇష్టం స్వామీ" అని బింకంగా అంటూ తమకి మాత్రం భ్రమలు రేకెత్తించవద్దని వేడుకుంటున్నారు చెలులు. 'పరాకులు చేయవద్దయ్యా', 'విడెము మమ్ము దేనంపకువయ్యా'. 'కప్పురము కన్నుల గుప్పకువయ్యా', 'బచ్చడము మాపై గప్పకుమయ్యా', 'వెల చెప్పి పందేలు వేయకు వయ్యా', అంటున్నారు సఖులు ఈ పదాల్లోని దీర్ఘాక్షరాల వలన ఊనిక వలన మరో కాంతతో విహరించినా అభ్యంతరం లేదంటూనే ఆ కాంత చెంత తమ తోడి సరసాలు భరించలేకపోతున్నారు. పై చర్యలను వారించడంలో సపత్నీ మాత్సర్యం, ఆ వేడుకోలులో స్వామి చర్యను వ్యతిరేకించడం కనిపిస్తాయి.

5. వక్రోక్తి: శ్రీవారితో సఖికి ఎంతైనా చనువు ఉంటుంది. ఆయన అనుగ్రహం అంతటిది కాబోలును. అందుకే వక్రోక్తులు నింపి మరీ వెటకారం చేస్తున్నారు.

రాగం: సామంతం

నగుబాటు లివిగొన్న నడపేవు గాక యీ
అగడుఁ జేతలు సేసి ఆడిక కెక్కుదురా ||పల్లవి||

మగువనే కట్టుకొంటి మంగళసూత్రముగాను
యెగ సక్కెల గొల్లెత లేమందురో
జగములో నెవ్వరైనా సతులకు ఁ బురుషులు
తగఁ గట్టుదురు గాక తాము గట్టుకొందురా ||నగుబాటు||

ఆకె పుట్టినిల్లే నీకు నాకరము సేసుకొంటి
వీకడఁ బోఁ (బొం)దైన సతులేమందురో

యేకమై తమ సతుల యిల్లు నించుకొంటగాక
యే కడా ఘనులైనవా రిల్లిటము లుందురా ॥నగుబాటు॥

అలమేలు మంగ వల్ల నన్ని సిరులూ నందితి
విల నీ కూటపు సతులేమందురో
కలవి శ్రీ వేంకటేశ కాంతల కిత్తురు గాక
అలరి సతుల సొమ్ము కాసపడఁ జూతురా ॥నగుబాటు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం20,పుట126, సంకీర్తన 188)

శ్రీవారు చేసే పనులన్నీ నగుబాటయ్యేవిట. 'అగడు చేతలు' చేసి పది మంది చేత ఎగతాళికి గురి అవుతున్నారని సఖుల పరిహాసం.

ఈ ప్రపంచంలో ఆలికి తాళి కట్టిన వారినే చూశాం కాని, ఆలినే తాళిగా కట్టుకున్నవారిని చూడలేదు. పెళ్ళి అయిన తరువాత అత్తారిల్లు వదలక దానినే స్వంత ఇల్లుగా మార్చుకున్నావా స్వామీ ! నీ ఇతర సతులంతా ఏమంటారో. గొప్పవారెవరూ ఇల్లరికం ఉండటం చూడలేదు. ఇది నీకే చెల్లింది నీ సతులంతా ఇది చూస్తే ఏమంటారో అంటున్నారు సఖులు. గుండెలో కొలువైన దేవిని 'తాళి'కి ప్రతీకగా, పాలకడలిని ఆయన అత్తారిల్లుగా నిరూపించి వక్రోక్తులతో పరిహాసాలాడుతున్నారు సఖులు.

క్రియ యొక్క వైచిత్రీ విశేషము చేత కలుగు వక్రత క్రియా వైచిత్ర్య వక్రత. ఇది అయిదు విధాలు అని కుంతకుని వక్రోక్తి జీవితం చెబుతున్నది.

కర్తురత్యంత రంగత్వం కర్త్రంతర విచిత్ర తా
సవివేషణ వైచిత్ర్య ముపచార మనోజ్ఞతా
కర్మాది సంవృత్తిః పంచ ప్రస్తుతౌచిత్య చారవః
క్రియా వైచిత్ర్య వక్రత్వ ప్రకారాస్త ఇమే స్మృతాః

(కుంతకుని వక్రోక్తి జీవితం. 2. 24, 25)

ఎక్కడ క్రియ కర్తకు అత్యంతము 'అంతరంగము' అంటే సన్నిహిత సంబంధం కలిగి సౌందర్యాపాదకం అవుతుందో అది క్రియావైచిత్ర్య వక్రత.

శ్రీ మహావిష్ణువు సౌందర్యాన్ని అతిశయింప చేస్తూ, గుండెలో కొలువయిన రాణిని ఆయనకే తాళిగా నిరూపించిన ఈ సరస హాస్య గుళిక, కర్తృరత్యంతరంగత్వమైన క్రియా వైచిత్ర్య వక్రత. కర్తని ధిక్కరిస్తున్నట్లు కనిపించినా ఇది కర్తకు స్తుతి పూర్వకమైన వక్రోక్తి గానే భావించాలి. ఇదంతా మధురభక్తిలో పర్యవసిస్తున్నది.

ప్రశ్నాన్విత వాక్యలయ మూడు చరణాల్లోనూ కనిపిస్తుంది. ప్రశ్నలోనే వ్యంగ్యం, ఆశ్చర్యం, వక్రోక్తి, చెలులు ధ్వనింపజేస్తున్నారు.

'మగువనే కట్టుకొంటి మంగళసూత్రంగాను' అనడంలో ఆ అద్భుతానికి ఆశ్చర్యాన్ని 'యెగసక్కేల గొల్లెతలేమందురో' అనడంలో వ్యంగ్యాన్ని 'తగ గట్టుదురు గాక తాము కట్టుకొందురా' అనడంలో వక్రోక్తిని అన్నమయ్య ధ్వనింపచేశాడు. మూడు భావాల ముప్పేట ఇది.

రెండవ చరణంలో కూడా 'సిరి' వల్ల అన్ని సిరులూ పొందిన నిన్ను కూటపు సతులేమంటారో అని వ్యంగ్యంగా పలుకుతున్నారు. "సొమ్ములు సతులకిస్తారు కాని' సతుల సొమ్ముకి ఆశపడే నీ వంటి వానిని చూడలేదు స్వామీ" ? అని వక్రోక్తిగా పలుకుతున్నారు సఖులు. ఆ 'సిరి'ని ఆభరణంగా హృదయంలో నిలిపిన లక్ష్మీపతిని వక్రోక్తి రూపంలో స్తుతిస్తున్నాడు అన్నమయ్య.

రెండవ చరణంలోని 'బొంద్దైన సతులేమందురో, ఘనులైన వారిల్లిటము లుందురా" ప్రశ్నల్లోని వాక్య లయలో పాల కడలి నివాసాన్ని అత్తారిల్లుగా చెబుతూ వక్రోక్తిగా స్తుతిస్తున్నారు సఖులు.

6. శ్రీవారితో చతురోక్తులు: "శ్రీదేవి గొప్పతనం ఘనమైనదా, లేక శ్రీవారే సాటిలేని మేటియా" అనే విషయం తేల్చుకోలేక పోతున్నారట సఖులు. ఈ మీమాంస వ్యక్తం చేయటంలో మాత్రం అన్నమయ్య చతురోక్తులను విసరడంలోని చాతుర్యాన్ని చూపించాడు.

రాగం: సాళంగనాట

ఎక్కువ తక్కువ లేవో యెఱంగ మిద్దరిలోన
వొక్కటై నీ వురము పై వున్నదిదె చెలియ ॥పల్లవి॥

ఆకడ జలది దచ్చి యమృత మిచ్చితి నీవు
ఆకె కైతే మోవిఁ జిందీ నమృతము
సైకపు బసిఁడి చీర సరిఁ గట్టితివి నీవు
మేకొని యీకెకైతే మేనెల్లఁ బసిడే ॥ఎక్కువ॥

నిగిడి కౌస్తుభ మాణికము గట్టితి నీవు
మగువ కైతే నోరెల్లా మాణికములే
బెగడి యాకసమెల్లాఁ బెద్ద సేసి కొలచితి
బిగిసే యీ చెలికైతేఁ బిడికెఁడు నడుమే ॥ఎక్కువ॥

పలుమారు జలధిలోఁ బలళించితివి నీవు
కలికి గుణములోనే ఘన జలధి
యెలమి శ్రీ వేంకటేశ ఇప్పుడు గూడితి గాని
జలజాక్షియైతే నిన్ను సన్నలనే కలసె ॥ఎక్కువ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం22, పుట75, సంకీర్తన 172)

"స్వామీ ! ఘనమైన వస్తువులను, ఘన కార్యాలు చేసి నువ్వు సాధించావు. మా చెలికైతే అవి స్వతస్సిద్ధాలు. ఎవరు గొప్పవారో తేల్చటమెలా" అంటున్నారు సఖులు.

"జగన్మోహినీ అవతారం ఎత్తితే కాని నీవు అమృత భాండం చేత బట్టటానికి వీలులేకపోయింది. మా చెలి అధరాలలో ఎప్పుడూ అమృతం చిందేను. పట్టు పీతాంబరాలు సంపాదించి ధరించావు స్వామీ ! మా చెలికి ప్రయత్నించవలసిన పనే లేదు మేనెల్లా పసిడే. సముద్ర మధనం జరిగాక జనించిన కౌస్తుభ మణిని నీవు ధరించావు ! మా చెలికి నోరంతా మాణిక్యాలే. కోరుకుని జలధిలో నీవు పవళించావు. మా చెలి గుణాలే ఘనమైన జలధి. నీవు మా చెలిని ఇప్పుడు కలిశావు. కాని మా చెలి కనుసన్నలతో నిన్నెప్పుడో కలిసింది. అంటూ దేవి ఆధిక్యాన్ని వర్ణించి చెబుతూ మీ ఇద్దరిలో ఘనమైన వారు ఎవరో మీకే తెలియాలి ఎక్కువ తక్కువలేవో ఎరుగము" అంటున్నారు.

ప్రతి చరణంలోను మొదటి పాదం శ్రీవారి ఘనతను రెండవ పాదంలో శ్రీవారిని మించే శ్రీదేవి తీరును చెలులు వర్ణించారు. శ్రీదేవి ఆధిక్యాన్ని నిరూపించడానికి "ఆకెకైతే" మోవి చిందీ నమృతము యీాకెకైతే మేనెల్లా పసిడే లోని దీర్ఘాక్షరంపై ఊనిక ప్రయోగించడం జరిగింది. ఈ ఊనిక వలన 'నీ గొప్పతనం అంతా నీవు శ్రమించి సాధించింది. మా చెలికవి సహజంగానే సంక్రమించాయి సుమా. కాబట్టి ఎవరు ఎక్కువో, తెలివైనవాడవైతే తెలుసుకో' మేము చెప్పమంటున్నారు సఖులు.

రెండవ చరణంలో 'నోరెల్లా మాణికములే', 'మా చెలికైతే బిడికెడు నడుమే' పదాలు, మూడవ చరణంలో 'గుణములలోనే జలధి', 'నిన్ను సన్నలనే కలిసె' పదాల్లో శ్రీదేవి ఆధిక్యాన్ని సఖులు నిరూపిస్తున్నారు. ఆ పదాల్లోని దీర్ఘాక్షరాలు, ఊనిక శ్రీదేవి ఆధిక్యాన్ని వ్యంగ్యాన్ని వ్యంజింప చేస్తున్నాయి.

7. మందలింపు: శ్రీవారు అలగటానికి కోపం తెచ్చుకోవటానికి వీల్లేదుట. చనువు కొద్దీ భార్యలు ఎగసక్కేలాడినా మరేం చేసినా మెచ్చుకోవాలి తప్ప నొచ్చుకోకూడదట. స్వామివారిని సఖులు ఇలా మందలిస్తున్నారు.

రాగం: వరాళి

చాలుఁ చాలు నూరకుండు సతులెల్లా నవ్వేరు
కేలు చాఁచి తిట్టేటి పేలరీడు గలఁడా ॥పల్లవి॥

యెగసక్కేలకుఁ జెలు లేమైనా నాడుదురు
సగటున బీరములు పచరింతురు
పొగరున నీ వందుకు బుజ్జగించవలెఁ గాక
మగువతోఁ గోపగించే మగవాఁడు గలఁడా ॥చాలు॥

కామించి రమణులు కడు సేఁతలు సేతురు
ప్రేమమున పంతములు జెరయింతురు
వేమరు నిట్ల ఇతే వేఁడు కొనవలెఁ గాక
రామలతో నలిగేటి రమణుఁడు గలఁడా ॥చాలు॥

అలవోకగా నెలఁత లన్నిటాను నవ్వుదురు
బలిమి శ్రీ వేంకటేశ పై కొందురు

చెలులతో నెగ్గులెంచే చెలువుఁడు గలఁడా ॥చాలు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం23,పుట269, సంకీర్తన 402)

చనువు కొద్దీ సతులు 'ఎగసక్కాలాడుతారు, వేళా కోళాలాడుతారు'. కొంత పొగరు చూపుతారు. బుజ్జగించి వారిని లాలించాలి కాని కోపగించే మగవాడు సృష్టిలో ఉన్నాడా? చేయి చాచి తిట్టే 'ప్రేలరీడు' ఉంటాడా. పై సాంత్వన కార్యక్రమం అమలు జరపక పోతే ఈ తిట్లన్నింటికీ గురికాక తప్పదన్నమాట.

"కామించి కాంతలు చేసే కడు చేఁతలు పంతాలకు బదులు ప్రేమతో వేడుకోవాలి కాని అలిగేటి మగవాడు ఉంటాడా? అలవోకగా నెలతలు నిన్ను చూసి నవ్వుతారు, బలిమితో పైకొంటారు. కలిసి కరుణించాలి కాని ఎగ్గులెంచే సఖుడుంటాడా" అంటూ కాస్త ఘాటుగానే మందలిస్తున్నారు. అధిక్షేపిస్తున్నారు.

పల్లవిలోనే సఖులు శ్రీవారిని పునరుక్తితో 'చాలు చాలు' అంటూ మందలింపు ప్రకటించారు. ఈ సంకీర్తన ఎత్తుగడలోనే ధిక్కార సూచకమైన ఆ పదాల్లోని ఊనిక లోనే మందలింపు వినిపిస్తుంది.

శ్రీవారి ప్రవర్తనకు సతులంతా నవ్విపోతారట. కేలుచాచి తిట్టే మగవాడు 'పేలరీడు' సృష్టిలో ఉంటాడా? అని ఆశ్చర్యపోతున్నారు. శ్రీవారి కోపాన్ని నిషేధిస్తున్నారు.

ప్రతి చరణంలోను మొదటి రెండు పాదాల్లో సతి ప్రవర్తన 'అత్యంత సహజం' అని నిరూపించడానికి పాదాంత లఘువుల్లో "లేమైనా నాడుదురు', 'బీరములు పచరింతురు' 'చెరయింతురు', 'నెలతలన్నిటాను నవ్వుదురు', 'పైకొందురు' అంటూ నిశ్చయాత్మకంగా స్థిరపరుస్తున్నారు. నీ వందుకు బుజ్జగించవలెగాక, వేడుకొనవలెగాక, గరుణించవలెగాక అంటూ స్వామి ఏం చేయాలో పాదాంతంలో 'గాక' అనే పదంతో విధ్యర్థపూర్వకంగా ఆదేశిస్తున్నారు, ఉపదేశిస్తున్నారు.

8. ఓదార్పు: సఖులు చెలి పక్షం నుండి శ్రీవారి పక్షం చేరిపోయారు. ఆయన చాటు మాటు కార్యక్రమం, చెప్పకుండా చేసుకున్న పెళ్ళిళ్ళు చెలికి

తెలిసిపోయాయిట. అయినా సఖులు బుకాయించి 'నీవేమయినా అటువంటి వాడవా?? అన్నెం పున్నెం ఎరగనివాడివి' అంటూ శ్రీవారిని ఓదారుస్తున్నారు.

రాగం: నాదరామక్రియ

కంటివిగా యెటువంటి గయ్యాళి యీపె
ఇంటికాడనే చూపి ఇచ్చీనట తాను ||పల్లవి||

యెలమి నీవట యాఁడో యింతిఁ బెండ్లాడితివట
వెలదిఁ యాడిన మాట వింటివా వోయి
అలరి నీవే మయినా నటువంటి వాఁడవా
కలవి లేనివి నీ పై గడియించీఁ దాను ||కంటివి||

మేరతో నీ వేల నేడో మెట్టె లిటుకొంటివట
చేరి యాకె కోపము చూచితివా వోయి
నేరమి నీ యందుఁ గద్దానే మెన్నఁడూ నెఱఁగము
తారు కాణించేనంటాఁ దమకించేఁదాను ||కంటివి||

విందుల నెవ్వతెకో విడెమిచ్చి వచ్చితట
చెంది యీకె గుట్టు తెలిసితివా వోయి
పొందితివి నన్ను నిట్టె పొసఁగ శ్రీ వేంకటేశ
నిందలివే యని మొక్కి నిన్ను మెచ్చీఁ దాను ||కంటివి||

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం19,పుట112, సంకీర్తన 167)

"నీవెక్కడో ఓ ఇంతిని పెళ్ళాడావట. 'అలరి నీ వేమైనా అటువంటి వాడవా', 'కలవి లేనివి నీపై' పుట్టించి చెబుతున్నదీ గయ్యాళి. ఏ పడతికో మట్టెలిచ్చి వచ్చావట. ఆమె కోపం చూచావా స్వామీ. నేరం నీ యందు ఉండటం మేమెన్నడూ ఎఱగము' ఏ స్త్రీకో విడెమిచ్చి వచ్చావట. నీ సంగతి కాదు తెలిసింది. ఆమె గుణమే బయట పడింది. నిన్ను అన్యాయంగా 'నింద' వేసిన కాంత కరుణిస్తుందిలే" అని స్వామిని సఖులు ఓదారుస్తున్నారు.

సంకీర్తన మొత్తం 'యాడో' 'నెవ్వతెకో' అనే దీర్ఘాక్షరాల పైన ఊనికని ఆశ్రయించే నిర్మించబడింది. ఈ ఊనిక వల్లననే శ్రీవారి అమాయకత్వ నిరూపణ జరుగుతున్నది. మొదటి చరణంలో 'నీవట యాడో', అటువంటి వాడవా, గడియించీ దాను పదాలు, రెండవ చరణంలో నీవేల నేడో, నీ యందు గద్దా నేమెన్నడూ నెఱగము, దమకించీ దాను; మూడవ చరణంలో విందుల నెవ్వతెకో, అంటూ దీర్ఘాక్షరాల ద్వారా సుదూరత్వాన్ని, సత్యదూరత్వాన్ని దానితోపాటు శ్రీవారి అమాయకత్వాన్ని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు జాణలైన సఖులు.

9. అధిక్షేపం: "శృంగారం తెలియనివాడివి, మా చెలిని తప్పుపడతావా. మానిని పై తప్పులేదు. చేకొన్న నాయకుడవు. నీ కడనే లోపముందంటూ" సఖులు శ్రీవారిని అధిక్షేపిస్తున్నారు.

రాగం: బౌళి

మాకా పని గాదు మానిని పై దప్పు లేదు
చేకొన్న నాయకుండవు నీ కడమే పో ॥పల్లవి॥

సిగ్గుల వెలితే కాని చేఁతల వెలితి లేదు
యెగ్గు వట్టేవు సుమ్మీ నీవీ యింతిని
దిగ్గన నాకె నిచ్చితి తేరుచ కుండితే నేఁడు
నిగ్గుల నింతటి మీఁద నీ కడమే పో ॥మాకా॥

పంతము చలమే కాని పాయము వెలితి లేదు
వంతు వాసులెంచి మోము వంచేవు సుమ్మీ
చెఁ(చెం) తల బుజము మీద చేయి వేసి కుచముల
ఇంతటఁ బట్టకుండితే యీ కడమే పో ॥మాకా॥

రాఁ పైన కడమే కాని రతుల వెలితి లేదు
కోపగించెనంటాను కొంకేవు సుమ్మీ
యేపున శ్రీ వేంకటేశ ఇంతి నిన్ను ఁ దానె కుండె ॥మాకా॥
నీ పడఁతి నెడసితే నీ కడమే పో

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం22,పుట33, సంకీర్తన 49)

మాతో జరగవలసిన పనేదీ లేదు. మానిని తప్పు అసలే లేదు, తప్పంతా 'నీ కడమే పో' అంటున్నారు సఖులు. శ్రీవారి రసికతనే అధిక్షేపిస్తున్నారు.

'సిగ్గుల వెలితి' తప్ప 'చేతల వెలితి లేదట పైగా యెగ్గు వట్టేవు తగునా"? ప్రౌఢయై ఎంతో రసికతతో చేర వచ్చి సరస శృంగారాల చేతల్లో వెలితి లేక అలరించే చెలిని ఇలా అనడం న్యాయమేనా. దిగ్గున ఆమె సరసకు రాకపోతే 'నిగ్గులు నీకుండేనా' పంతాలకు లోటే కాని, ప్రాయానికి లోటా? వంతులు పెట్టుకుని మోము వంచుకుంటావా. చెంచితల భుజాలపై చేయి వేసి కుచాలు పట్టినవాడా!! తప్పు నీదే!! నీ రసికతలో లోపమే కాని మా చెలిది కాదు ! !

రమ్యమైన నడవడియే కాని రతులకు వెలితి లేదు. 'కోపగించేనంటూ కొంకెవు' ఇది భావ్యం కాదు. సతిని ఏలుకొమ్మని అధిక్షేపిస్తున్నారు సఖులు. సఖి గొప్పతనాన్ని వ్యతిరేక రూపంలో చెబుతున్నారు.

పల్లవిలోనే 'లోపం తమలో లేదని' నిశ్చయాత్మకంగా నిరూపించటానికి లఘువులను ప్రయోగించి 'మాకా పనిగాదు, మానినిపై దప్పులేదు' అంటూ కట్టు దిట్టంగా పలికి తప్పంతా 'నీ కడమే పో' అని స్వామి పైనే తప్పంతా నెట్టేస్తున్నారు.

వెలదిలోని కలిమిని 'వెలితి. లేదంటూ' వ్యతిరేకరూపంలో సఖులు ప్రతిపాదించారు. ఉన్న ఏ వెలితి అయినా అది రసికతని, రసాస్వాదనని నిరూపించేదే కాని మరొకటి ఏదీ కాదు కదా. లోపం ఎక్కడయినా ఉందీ అంటే, అది 'నీ కడమే పో' అంటూ మూడు చరణాల్లోనూ పాదాంతంలో అధిక్షేపించేరు. ఆ పాదాంత దీర్ఘంపైని ఊనికలోనే అధిక్షేపం ధ్వనిస్తున్నది. చేతల వెలితి లేదు, రతుల వెలితి లేదు, అంటూ పాదాంత లఘువుల ద్వారా నిశ్చయాత్మకంగా నొక్కి చెబుతున్నారు సఖులు.

10. శ్రీవారితో సరసం: శ్రీవారితో సరసాలాడ గలిగే చనువు ఆ సఖులకే ఉన్నదేమో. నాయిక వారిని ఇలా మందలిస్తున్నది.

రాగం: ఆహిరి

ఆకలి గొంటివిగా అయ్యో నీ మోమెల్లా వాడె
కాఁకల నిన్నుఁ దిప్పిరి కడనున్న చెలులు ॥పల్లవి॥

ఆపె సుద్దులే చెప్పి అట్టె నిన్నుఁ బొద్దు వుచ్చి
పాప జాతి చెలులెల్లా భ్రమ ఇంచిరి
యేపున నిన్నింత సేసి యింటికి రానియ్యరైరి
పై పైఁ జలారె నిదె పట్టినట్టి బోనము ॥ఆకలి॥

చక్కదనాలు వొగడి సతి మీద దమి రేఁచి
చిక్కించిరి కట్టడి యా చెలులు నిన్ను
నెక్కొని నిన్నించుక నిద్దిరించిన నియ్యరైరి
వెక్కసాన భోగించేటి వేళ లెల్లఁ దప్పెను ॥ఆకలి॥

నవ్వుల వలపెక్కించి నలినాక్షి మోము చూపి
దవ్వులనే చెలులెల్ల దక్కించిరిగా
రవ్వగా శ్రీ వేంకటేశ రానన్నా నన్నుఁ గూడితి
వువ్విళ్ళూరఁ గెమ్మోవి వొక్కటే మారతులా ॥ఆకలి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు;సంపుటం16,పుట121, సంకీర్తన 181)

నాయిక సఖుల ఆగడాన్ని చూసి విచారిస్తున్నది. "ఏ నాయిక పైనో ప్రేమను రేకెత్తించేలా చేయటంలో స్వామిని మరీ అలసట పెట్టారే మాయదారి సఖులు" అని చింతిస్తున్నది.

స్వామి ముఖమంతా వాడిపోయింది. ఆకలికి తట్టుకోలేక నీరసించి పోయారు. ఇన్ని కథలు మురిపాలు చెప్పి, ఇంతదాకా ఇంటికి రానివ్వలేదు 'పాప జాతి చెలులు' 'నీకై సిద్ధం చేసిన భోజనం అంతా చల్లారి పోయింది కదా' అని నాయిక విచారిస్తున్నది.

"నాయిక చక్కదనాలు పొగడి సతి మీద కోరిక రేకెత్తేలా చేసి చిక్కించుకుని కదలనీక కట్టడి చేశారు కదా. కథలతో నిన్నించుకైనా 'నిద్దిరించనీయ లేదు' కదా. భోగించేటి వేళంతా తప్పి పోయింది ఎంత ఆగడం చేశారీ చెలులు" అంటూ పోతున్నది నాయిక.

"నవ్వులతో చెలిపైన వలపెక్కించి 'నలినాక్షి ముఖాన్ని అల్లంత దూరంలో చూపి' అక్కడే ఆపి, వద్దకు రానివ్వలేదు కదా. ఏ నాయిక వద్దో సరసాలన్నీ తీర్చుకునేవు చివరికి నా వంతుకు కెమ్మోవి ఒకటేనా అని" నాయిక బాధ పడుతున్నది.

సఖులు తమవంతు కర్తవ్యాన్ని చాలా సమర్థవంతంగా నిర్వహించారు. శ్రీవారికి కోర్కెను జ్వాలలా రగిల్చారు. కథలు చెప్పారు. చెలి సొగసులు ఊరించేలా చెప్పి, స్వామి తొందరపడితే సరసాలాడారు. ఊపిరి ఆడనివ్వరు. కాలు కదలనీయరు. చెలి వద్దకు పరుగు తీసేలా శృంగారం రంగరించి సరసాలతో ఆమె సౌందర్యం జుర్రుకోమని వెర్రెక్కిస్తున్నారు. జాముర్రాత్రి అవుతున్నా, భోగించే వేళ తప్పుతున్నా తప్పుకోరు. సఖుల సరసాలను ఈ సంకీర్తనలో అన్నమయ్య మనోజ్ఞంగా వర్ణించాడు. నిజానికి శ్రీవారితో ఇన్ని రకాల ఆడుకున్నది అన్నమయ్యే.

ఆశ్చర్యం, బాధ స్వామి స్థితికి ఆక్రోశం నాయిక ఆర్తిలో వినిపిస్తున్నాయి. 'ఆకలి గొంటివిగా అయ్యో' అనే పదాల్లోని ఊనికలో పైభావం ధ్వనిస్తున్నది.

సఖుల చేతలన్నిటికి నిశ్చయాత్మకాన్ని ధ్వనించే పదాంత లఘువులే అన్నమయ్య ప్రయోగించాడు. "ఆపై సుద్దులే చెప్పి, అట్టె నిన్నుఁ బొద్దు వుచ్చి, భ్రమ ఇంచిరి, చక్కదనాలు వొగడి, సతి మీద దమి రేచి చిక్కించిరి. కట్టడి యా చెలులు నిన్ను, నిద్దిరించనియ్యరైరి చెలులు." ప్రతిపాదం సగానికి విరుగుతున్నది. రెండు పాదాలకు అర్థం సంపూర్ణమయి నడక నియమితమవుతున్నది. ఈ సమతుల్యతలో, విరుపులో గతిలో నాయిక వేదన, స్వామిపై జాలి, పరసతిపై ఈర్ష్య ధ్వనిస్తున్నాయి.

11. శ్రీవారిని ప్రార్థించటం: శ్రీవారు శ్రీదేవి అలిగి కూచున్నారు. ఇద్దరినీ ప్రార్థిస్తే తప్ప పనిఅయ్యేట్టు కనిపించదు.

రాగం: భైరవి

వేఁడుకొని వేఁడుకొని వేసరితి మిద్దరిని
నేఁడు గరుణించఁడొకొ నేరుపుల మరుడు ॥పల్లవి॥

చెక్కు లెంత నొక్కినాను సేవలెంత చేసినాను
మక్కువ గలుగు దాఁకా మనసొగ్గదు
మొక్కులెన్ని మొక్కినాను ముచ్చటలెంతాడినాను
అక్కర గలుగుదాఁకా నందవు పొందికలు ॥వేడుకొని॥

సన్నలెన్ని చేసినాను చవులెన్ని వుట్టించినా
యెన్నిక లొనరుదాఁకా నింపు పుట్టదు
విన్నప మెంత సేసినా వేడుక లెంత చూపినా
కన్నుల కింపవు దాఁకా కలుగదు ప్రియము ॥వేడుకొని॥

కతలెన్ని చెప్పినాను కప్పురమెంతిచ్చినాను
రతి సమకొను దాఁకా రాఁపు మానదు
ఇతవై శ్రీ వేంకటేశు c డింతియును నెనసిరి
పతి వచ్చునందాఁకాఁ దప్పవు పంతములు ॥వేడుకొని॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం18,పుట315, సంకీర్తన471)

మీ ఇద్దరినీ వేడుకొని వేడుకొని వేసారి పోయాము. మీరు కాకపోయినా మన్మధుడైనా కరుణించడా. 'చెక్కులు నొక్కినా', 'సేవలెంత చేసినా', 'మీకు మక్కువ గలిగే దాకా' మన సొగ్గదు కదా. మేము మొక్కులు మొక్కినా, ముచ్చటలెంతాడినా, మీ కిద్దరికీ ఒకరికి మరొకరి అక్కర కలిగే దాకా 'పొందికలు కలుగవు కదా. సంజ్ఞలు చేసినా వేడుకలు పుట్టించినా కోరిక పుట్టేదాకా కరుణించరు కదా. విన్నపాలు చేసినా, వేడుకలు పుట్టించినా మీ కన్నులకు ప్రియాలు ఇంపు కావుకదా. 'కతలు సెప్పినా' కప్పురమిచ్చినా రతికి సమ్మతి చూపరు. 'పంతాలు మాని, మమ్మల్ని కరుణించి మీ ఇద్దరు కలిసి కరిగి పొండి స్వామీ' అని సఖులు ఇద్దరినీ ప్రార్థిస్తున్నారు.

పద క్రమంలో గురు లఘువుల అమరికలో సఖుల దైన్యం వినిపిస్తుంది. ప్రతి చరణంలోను మొదటి పాదాంతంలో ఆర్తికి దీర్ఘాక్షరంపైని ఊనిక, రెండవ పాదాంతంలోని లఘువు శ్రీవారు, శ్రీదేవుల మంకుపట్టును సూచిస్తున్నది. రెండు పాదాలకు పదం విరిగి సమతుల్యత భాసిస్తున్నది. దీని వలన అర్థస్ఫురణ కలుగుతున్నది.

వేడుకొని సేవలు చేసి సఖులు ఎంతో అలిసిపోయారట. చెక్కులెంత నొక్కినాను, సేవలెంత సేసినా, మొక్కులెన్ని మొక్కినా, ముచ్చట లెంతాడినా, సన్నలెన్ని చేసినా, చవులెంత పుట్టించినా, విన్నపమెంత చేసినా, వేడుక లెంత చూపినా, కతలెన్ని చెప్పినా, కప్పురమెంత ఇచ్చినా వారిద్దరూ అక్కర కలిగేదాకా, కన్నుల కింపయ్యే దాకా, రతి సమకొనేదాకా కరిగేటట్లు కనిపించలేదు, అని సఖులు

వేసారి పోతున్నారు. 'ఎన్ని ఎంత' అనే పదాల పునరుక్తులు, చేతల పునరుక్తులకు కొరవడిన మాటలకు వారి దైన్యానికి ప్రతీకలుగా కనిపిస్తున్నాయి.

12. శ్రీవారు - ప్రకృతి ధర్మ వివరణ: స్వామీ నీ ప్రకృతిని బట్టే సమస్త ప్రపంచం నడుస్తున్నది. నీవు ఒకలా, ప్రపంచం మరొకలా నడుచుకోదు కదా అంటూ వేదాంతాన్ని, భగవత్స్వరూపాన్ని సఖులు ఇలా వివరిస్తున్నారు.

రాగం: ముఖారి

నీ యందు కడమా నిందు దొరవు నీవు యీ
నాయము లోకపు నడవడే కదరా ॥పల్లవి॥

సగము చీఁకటియు సగము వెలుంగును
జిగి యొక దినమునఁ జెలగీఁ నటా
నిగిడి నీ గుణములు నిజమును కల్లయు
వొగి నీకుఁ గలుగు టుచితమే కదరా ॥నీ యందు॥

చేఁదు కాఁకరను చెరకునఁ దీపును
పోదితో నిట్టే పొడమీనటా
సేదల మతి నొలసియు నొల్లమియును
యీ దెస నీకిది ఇటు దగుఁ గదరా ॥నీ యందు॥

శ్రీ వేంకటేశ్వర చిగురును చేఁగ యు
వో వల నొక మాన నుండీనటా
నీ వల వినయము నిటు రాజసముఁ
దావాయ నీ రతిఁ దగుఁ దగుఁ బదరా ॥నీ యందు॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం27,పుట312, సంకీర్తన 468)

ఈ సఖుల పలుకుల్లో వేదాంతం. పరిహాసం రెండూ తొంగి చూస్తున్నాయి. ఈ ప్రపంచంలో చీకటి వెలుగులు ఒకే దినంలో సగపాలుగా కనిపిస్తున్నాయి. ఇది సహజమే కదా. నీ నడవడిక సగం నిజం. సగం అబద్ధం, 'నిగిడి నీ గుణములు నిజము కల్ల' నిన్ను బట్టే ప్రకృతి ధర్మం నడుస్తుంది స్వామీ అంటున్నారు సఖులు.

ఈ సృష్టిలో చేదు కాకరలోనూ, తీపిని చెరుకులోనూ ఏర్పాటు చేశావు. కొన్నిట తీపి, కొన్నిట చేదు. ఇదే సృష్టి న్యాయమా? నిజమే. కొందరిని కాపాడుతావు. మరికొందరిని శిక్షిస్తావు. పాత్రతని బట్టే కదా మా ప్రాప్తం, నీవు పాలించే పద్ధతి, అర్హతని బట్టే కదా అవకాశము.

సృష్టి ధర్మాన్నీ, శ్రీవారి నిజతత్వాన్నీ విప్పి చెప్పిన అపురూపమైన సంకీర్తన ఇది.

ప్రతి చరణంలోనూ మొదటి రెండు పాదాల్లో లోక ధర్మాన్నీ, మూడవ పాదంలో స్వామి గుణాన్ని నిరూపించి, నాల్గవ పాదంలో సమన్వయం చేయటం కనిపిస్తుంది.

ప్రతి చరణంలోను రెండవ పాదాంతం లోని దీర్ఘాలు "జెలగీనటా, పొదమీనటా, నుండీనటా" అంటూ సృష్టి ధర్మంలోని విచిత్రాన్ని నొక్కి చెబుతున్నాయి. ప్రతి చరణంలోని 'నాల్గవ పాదాంతంలోని దీర్ఘాక్షరాల పైని ఊనిక' 'ఉచితమే కదరా, ఇది దగుగదరా' అనే పదాల్లో ప్రయోగించబడి శ్రీవారి గుణాన్నీ అనుసరించే లోక ధర్మం నడుస్తుందని సమర్థిస్తున్నది.

ప్రతి రెండు పాదాలకు అర్థం సంపూర్ణమయి పదం విరిగి నడక నియమితమై భావంలో సమతుల్యత భాసిస్తున్నది. సృష్టి ధర్మాన్ని రెండు పాదాల్లో చెప్పి, పాదాంతంలో దీర్ఘం ప్రయోగించి, కొంత విరామం కల్పించి దాని ద్వారా హేతువును ఊహలో ధ్వనింప చేస్తూ సమర్థించారు.

13. శ్రీవారితో వినోదం: శ్రీవారితో సరాగాలు, వినోద కార్యక్రమం నడుస్తున్నది. రమణి అందచందాలు తీరికగా స్వామి చూసుకుని మురిసిపోతున్నాడు. 'నెరజాణవు', 'నేరుపరివి' రమణి 'తెఱగు' పసి గట్టకలవా అని పొడుపు కథలు పొడుస్తున్నారు సఖులు

రాగం: దేసాళం

నేరుపరి వన్నిటాను నెరజాణవు
యీ రమణి తెఱఁగు నీ వెఱుఁగు కోవయ్యా ॥పల్లవి॥

కలువలు పైఁ జల్లె కమలము లంది ఇచ్చె
ములు వాది జాజులు మోపు గట్టె
చెలమ లూటకుఁ బెట్టె చింతల చిగురుఁగోసె
చెలియ భావము నీవు చిత్తగించవయ్యా ॥నేరుపరి॥

వెన్నెలల ముగ్గువెట్టె విరుగాలి తూరుపెత్తె
పన్నుకొని నిమ్మపండ్లు పట్టెఁ గానుక
చిన్ని తుమ్మెదల రేఁచె చిలుకలఁ ఒలికించె
కన్నె చందములు నీవు కనుగొనవయ్యా ॥నేరుపరి॥

తేనెలు పెరల దించె తీగెలను వల్లె వేసె
అనుకొని చంద్రకళ లంగడిఁ దోసె
పూని శ్రీ వేంకటేశుఁడ పొంచి నీ పై సేసవెట్టే
మానిని నేలితివి మఱఁగు లేటిఁవయ్యా ॥నేరుపరి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం23, పుట43, సంకీర్తన 63)

అతివ అందాలన్నీ శ్రీవారికి కానుక పెడుతున్నది. రసికుడవైతే రమణి అందాలన్నీ వేరువేరుగా తెలుసుకోమంటున్నారు సఖులు. ప్రకృతి అందాలన్నీ రమణిలోనే వెల్లి విరిశాయి. స్వామి ఈ చిక్కు విప్పడమే పెద్ద వినోదం.

నాయిక చేతల్లో వ్యంగ్యం, వినోదం, ఆహ్వానం కనిపిస్తున్నాయి. ఈ భావం ధ్వనించడానికి ఆంగిక విన్యాసం, సఖుల పరిహాసాలు ప్రయోగించబడినాయి. పదాల్లోని లఘువుల అమరిక, ఆంగిక విన్యాసం సూచించే పదాల కూర్పు ప్రధానంగా వాక్య రచనలో కనిపిస్తాయి. పై జల్లె, అంది ఇచ్చె, మోపు గట్టె, ఊటకు బెట్టె, చిగురు కోసె, ముగ్గు వెట్టె, తూరుపైతే, గానుక రేచె, పరికించె, దించె, వల్లె వేసె, అంగడిదోసె అంటూ వివిధ భంగిమల్లో నాయిక రత్యాహ్వానాన్ని ప్రదర్శించింది. 'చెలియ భావము చిత్తగించవయ్యా, నీవు కనుగొనవయ్యా, మఱుగులేటికయ్యా' అంటూ ఆ ప్రశ్నల్లోని వాక్య లయలో వినోదాన్ని కొల్లలుగా గుప్పించారు చెలులు.

"కలువలు పైన జల్లి కన్నులు నీవే సుమా" అన్నది నాయిక. కమలము నందించి, కమల ముఖిని గ్రహించమని కోరిక వ్యక్తం చేసింది నాయిక. చెలమలూటకు బెట్టి శ్రీవారి తలపోతలో ప్రతి అంగం చెమరించిందని పులకించిందని పరవశించిపోతున్నది. చిగురులు కోసి చిగురు వంటి యవ్వనాన్ని అందుకోమంటున్నదా అతివ. వెన్నెలల ముగ్గు పెట్టి, 'ముగ్గు'లోకి రమ్మని తాను సిద్ధమే అని సూచిస్తున్నది. నిమ్మ పండ్లు చేతికిచ్చి తన చన్నులను చేత పట్టమని అంటున్నదా చెలియ. తుమ్మెదలను, చిలుకలను, రెచ్చగొట్టి తన కురుల సొగసులకు, పలుకుల తళుకులకు అవి సాటిరావని సూచిస్తున్నది.

తేనెల సోనలు చూపి అధరామృతం అందుకోమంటున్నది నాయిక. తీగలను వల్లె వేసి తనను కూడా శృతి చేయమని 'కళలు చూపి' చెలి అందాలను విందు చేస్తున్నది. ఈ మధురమైన సంజ్ఞలు దేన్ని సూచిస్తున్నాయో తెలుసుకోమని సఖులు స్వామితో వినోదిస్తున్నారు.

14. శ్రీవారిని స్తుతి: శ్రీవారితో శ్రీదేవి కలిస్తే విపరీతాలు సంభవించాయని సఖులు ఆశ్చర్యపోతూ తమ సంభ్రమాన్ని ఇలా వ్యక్తం చేస్తున్నారు.

రాగం: నాగ గాంధారి

విపరీతము లివి వినరాదు
వుపమ లెల్ల మీ వొద్దనె కలిగె ॥పల్లవి॥

వువిద వదన చంద్రోదయ వేళను
రవి యగు సూర్యప్రభ నీవేcగగ
యివల నవల మీ యిద్దరి వలననే
దినమును రాతిరి దెలియcగc గలిగె ॥విపరీతము॥

అంగన తురుము మహర్ని(హాని) శివేళను
రంగగు సూర్యప్రభ నీవేcగcగ
సంగడి వెలుcగును సరిc జీcకటియును
చెంగట మీ యందే చెప్పcగc గలిగె ॥విపరీతము॥

కాంత మోవి చుక్కల (లు) నిండువేళ
రంతుల సూర్యప్రభ నీవేఁగఁగ
యింతట శ్రీ వేంకటేశ్వర మీ యందే
కాంతులుఁ గళలునుఁ గలయుట గలిగె ॥విపరీతము॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం24,పుట132, సంకీర్తన 196)

శ్రీవారు శ్రీదేవిని కలిస్తే ఈ ప్రకృతిలో వింతలు కలుగుతాయని సఖుల అలంకార ధ్వని వచనాలివి. పగటి వేళనే రాత్రింబవళ్ళుగా, రాత్రి వేళనే వెలుగు చీకటులు, చుక్కలు మొలచినప్పుడే మంచి ప్రకాశము కళలు కలిగినట్లు అలంకార శాస్త్రంతో సమన్వయించి అన్నమయ్య వర్ణించాడు. నాయికా వదన చంద్రోదయంతో సూర్యప్రభ వంటి స్వామి కలియగా వారిద్దరి వలననే రాతిరి, పగలు కలిగాయట. చంద్రోదయం వలన రాతిరి, సూర్యప్రభ వలన పగలు. చంద్రుడికి క్షీణ దశ వృద్ధి దశ రెండు ఉన్నాయి. సూర్యుడికి ఎప్పుడూ ఒకటే కాంతి.

స్వామిని శాశ్వత కాంతి ప్రవాహంగా, నాయికా వదన చంద్రుడు ఉదయ చంద్రుడుగా వర్ణించడం జరిగింది. కాంత కురులు అనే అర్ధరాత్రి చీకటి వంటి సమయంలో స్వామి అనే సూర్యప్రభ కలియగా సూర్యప్రభ వలన వెలుగు, మహానిశి వలన చీకటి కలిగినట్లుగా వర్ణించబడినాయి. కామిని పెదవిపై చుక్కలు (అమృత బిందువులు) నిండేటప్పుడు స్వామి అనే సూర్యప్రభ కలియగా, సూర్యప్రభ వలన కాంతులు, మోవిపై అమృత బిందువుల వలన కళలు కలిగినట్లుగా వర్ణించబడింది. అత్యంత విలక్షణమైన ధ్వని పూర్వక స్తుతి నిండిన సంకీర్తన ఇది.

ప్రతి చరణంలోను మొదటి పాదంలో శ్రీదేవిని రెండవ పాదంలో శ్రీవారి సౌందర్యాన్ని వర్ణించి, సృష్టి ధర్మాన్ని మూడవ పాదంలోను సమన్వయాన్ని నాల్గవ పాదంలోను వర్ణించడం జరిగింది.

ప్రతి పాదం సగానికి విరిగి పదాల నడకలోని అందం తాత్పర్యంలోని అందాన్ని నిరూపిస్తున్నది. 'మీ వొద్దనె గలిగె', 'మీ ఇద్దరి వలననే' మీ యందే చెప్పఁగఁ గలిగె', 'శ్రీ వేంకటేశ్వర మీ యందే కాంతులును గళలును గలయుట గలిగె 'పదాల్లోని దీర్ఘాక్షరాల పైని ఊనిక, ప్రాస, రెండు పాదాల తరువాత పాటించిన

విరామం వలన హేతు నిరూపణకు వ్యవధి భాసిస్తున్నాయి. తద్వారా సృష్టి క్రమాన్ని భగవత్సౌందర్యాన్ని నిరూపించాడు అన్నమయ్య. పల్లవిలోనే' ఇవి ఎక్కడా చూడమంటూ' పాదాంతంలో లఘువును వ్యతిరేక రూపంలో 'విపరీతములివి వినరాదు' అంటూ ఒక అద్భుత దృశ్యాన్ని మన కన్నుల ముందర చిత్రించాడు అన్నమయ్య.

ఈ విధంగా సఖులు శ్రీవారితో అనేక విధాల కలహించి, కబుర్లతో మత్తెక్కించి, లాలించి, సరసాలాడి, ప్రార్థించి స్వామి మన్ననలను పొందారు. వారి సరసాలు హిత వచనాలు, ప్రార్థనలు హితబోధనలు, ఉపదేశాలు, వ్యంగ్యాలు, ధ్వనులు అలంకారాలు బహు విధాలైన వాక్యలయల్లో అభివ్యక్తమయినాయి. ఈ అదృష్టానికి నోచుకున్నవారు ఆ సఖులవునో కాదో మనకు తెలియదు కాని ఈ సాన్నిహిత్యం స్వామితో సంపూర్ణంగా పొంది ప్రపంచానికందించినవాడు అన్నమయ్య.



7

వాక్యలయ-భాషాశాస్త్ర రీత్యా పరిశీలన

కవి అనుభూతిని వ్యక్తం చేసే సమయంలో అతని సంస్కారం, చిత్తవృత్తి, ప్రవృత్తి లయాన్వితంగానే ప్రకటించ బడుతాయి. వాల్మీకి 'మా నిషాద' శ్లోకం దీనికి ఒక గొప్ప ఉదాహృతి. వక్త యొక్క ఉద్వేగాన్ని అనుసరించి గతి, ఆవేశాన్ని అనుసరించి లయ, వాక్య నిర్మాణ సమయంలో తమ ప్రభావాన్ని చూపుతాయి. నిజానికి ఈ లయ వాక్య నిర్మాణాన్ని శాసిస్తుంది. వక్త అనుభూతిని, ఉద్వేగాన్ని అభివ్యక్తీకరించటానికి నిజానికి భాషకున్న పరిధే చాలా చిన్నది. అలాంటిది ఒక చిన్న వాక్యం ఎట్టి పరిస్థితిలోను అతని హృదయానికి అద్దం పట్టలేదు. కేవలం ఆ వాక్యంలోని లయ వల్లనే మనకు అతని ప్రవృత్తిని, గాఢమైన అనుభూతిని అవగాహన చేసుకొనే అవకాశం కలుగుతుంది.

వాక్యంలో విశేషాలు పదక్రమాన్ని అనుసరించి ఉంటాయి. ప్రపంచంలోని భాషలను సకర్మక వాక్యంలో పదక్రమాన్ని అనుసరించి మూడు ప్రధాన వర్గాలుగా విభజించారు. 1. క్రియాది 2. క్రియ మధ్యమం 3. క్రియాంతం ద్రావిడ భాషలన్నీ క్రియాంత భాషలు.

ఈ క్రియాంత భాషల్లో వీటిలో నామ విశేషణాలు నామానికి పూర్వం, క్రియా విశేషణాలు క్రియకు పూర్వం వస్తాయి. కారకాల్ని సూచించే విభక్తి ప్రత్యయాలు, ప్రత్యయ తుల్య పదాలు నామ పదం తరువాతనే వస్తాయి. ద్రావిడ భాషల్లో ముఖ్యంగా తెలుగు భాషా పదక్రమం ఇలా ఉంటుంది.

"అముఖ్య కర్మ ముఖ్య కర్మకు పూర్వమే వుంటుంది. ముఖ్య కర్మ ప్రశ్నార్థక శబ్దాలు వచ్చినపుడు తప్ప ఎప్పుడూ క్రియను అంటి పెట్టుకునే ఉంటుంది. ప్రశ్నార్థక పదాలు క్రియకు ఎప్పుడూ సన్నిహితంగా ఉంటాయి. ఉపవాక్యాలు ప్రధాన వాక్యానికి పూర్వమే ఉంటాయి. అనుకృతాంశం అనుకర్త వాక్యానికి పూర్వమే ఉంటుంది. సంఖ్యా వాచక పదాలు, ఇతర పరిమాణార్థక పదాలు నామ పదానికి పూర్వ పర స్థానాల్లో రెండిట్లోనూ రాగలవు. 'ఆమెకు చాలా చీరలున్నాయి', ఆమెకు చీరలు

చాలా ఉన్నాయి. క్రమ వ్యత్యయం ప్రాధాన్య వివక్షతను అవలంబించే ప్రధానమైన పద్ధతి. క్రియకు దగ్గరగా జరిగే వాటికి ప్రాధాన్యం హెచ్చు. క్రియను నామ్నీకరించి, ప్రాధాన్యం చెప్పదలచుకున్న వాటిని ఆఖ్యాతృస్థానానికి జరపటం కూడా ఒక పద్ధతి. సమీకరణ వాక్యాలలో కేవలం వ్యత్యయమే ప్రాధాన్యాన్ని బోధిస్తుంది. వ్యవహృతాంశం మీద వక్త అభిప్రాయాన్ని సూచించే అటాది శబ్దాలు తెలుగులో ఉన్నాయి. ఇవి సాధారణంగా వాక్యాంతంలో వచ్చినా ప్రాధాన్య వివక్షలో వాక్యంలో ఏ పదానికయినా తగిలించవచ్చు. అప్పుడు కూడా వికల్పంగా పదక్రమ వ్యత్యయం జరుగుతుంది."

భాషా స్వరూపం అవగతం చేసుకున్న కవి తాను చెప్పదలచుకున్న భావం వెంటనే పాఠకుడికి అర్థ బోధకం కాగల క్రమంలో వాక్య నిర్మాణం చేస్తాడు. అంటే వాక్య నిర్మాణాన్ని పరిశీలిస్తే నామ వాచక విశేషణ క్రియాది తదితర భాగాల్లో వక్త దేనికి ప్రాధాన్యం ఇస్తాడో ఆ ప్రాధాన్యాన్ని అనుసరించే పద నిర్మాణ క్రమం సృష్టించబడుతున్నదనే విషయం స్పష్టమవుతుంది.

ఉదాహరణ:

1. నాన్నగారు నిన్ననే కాశీ నించి పట్టు చీర తెచ్చారు.
2. కాశీ నించి నాన్నగారు నిన్ననే పట్టుచీర తెచ్చారు.
3. నిన్ననే కాశీ నించి నాన్నగారు పట్టు చీర తెచ్చారు.

ఈ వాక్యాలన్నింటిలో క్రియ ఒక్కటే అయినా క్రియను క్రియేతర శబ్దాలను ఆఖ్యాతృస్థానానికి జరపడం గమనార్హం. అప్పుడు అలా జరిపిన పదం విధేయమవుతుంది. మిగతా వాక్య భాగమంతా ఉద్దేశ్యమవుతుంది. "ఈ ప్రక్రియను ప్రాధాన్య వివక్షామూలక నామ్నీకరణం అనవచ్చు".[1]

విధేయమైన పదం లయను సూచిస్తుంది. వాస్తవానికి వాక్యం లోని మిగిలిన పదాల మీద వక్తకీ ఆసక్తి ఉండదు, శ్రోతకీ ప్రమేయం లేదు. ఈ విధంగా పద నిర్మాణాన్ని పరిశీలించినటప్పుడే వాక్యలయ స్పష్టం అవుతుంది.

అన్నమయ్య వాక్య రచన:

అన్నమయ్య వాక్య నిర్మాణంలో రకరకాల పద్ధతులు అవలంభించాడు. వాక్యాల మధ్య భిన్న సంబంధాలను పాటకో తీరుగా ఏర్పరచినట్లు కనిపిస్తుంది.

రాగం: ముఖారి

కల గన్న చోటికిని గంప యెత్తిన యట్లు
అలవు మీఱిన దెట్లనమ్మా ॥పల్లవి॥

ఎలయింపుఁ గడకంట నెన్నఁడో వొకనాఁడు
చెలగి తనునతడు చూచినవాడట
పోలిలి యది దలచి యిప్పుడు మదన వేదనల
నలసీనిక నెట్లనమ్మా ॥కల॥

ఎఱుకయును మఱపుగా నేటికో వొకనాడు
కెఱలి తను నొవ్వ బలికిన వాడట
తఱినదియె చెలి యిపుడు దలచి పరితాపాగ్ని
నఱగీనిక నెట్లనమ్మా ॥కల॥

ఇయ్య కోలుగ గలని యెప్పుడే యిది నేడు
నెయ్యమున చెలి లోన నెలకొన్ననట
తియ్యముల నటకాడు తిరువేంకటేశ్వరుడు
అయ్యో యిక నెట్లనమ్మా ॥కల॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం5, పుట44, సంకీర్తన 64)

పల్లవి ఖండగతి ఛందస్సును సంబుద్ధ్యంత సంప్రశ్నను ప్రవేశపెట్టింది. ఇవి అన్ని చరణాల్లోనూ సమంగా పాటించబడినాయి. మేర తీరిన తాపం కూడా పల్లవిలో సూచించబడింది. చరణాల్లో విస్తరించబడింది.

పాదాల్లో రక రకాల పద్ధతుల్లో రూప సమత్వం అన్నమయ్య పాటించాడు. ప్రతి చరణంలోను మొదటి పాదాంత శబ్దం కాల బోధకం. రెండో పాదాంతంలో కాలార్థక శబ్దాంతమైన భూతం. కాల బోధక క్రియలు, నాలుగో పాదాంతం ఇంతకు ముందు చెప్పినట్లుగా సంబుద్ధ్యంత సంప్రశ్నం. ఇవన్నీ కలిపి పాటను వివిధాంశాల్లో సమత్వమున్న ఏక రూపికగా చేస్తున్నాయి. ఇవి గాక ఉన్న మూడు చరణాల్లోనూ మొదటి రెండింట అధిక సమత్వం. ఆఖరి చరణంలో భిన్నత్వం గమనించదగినవి.

మొదటి రెండు చరణాలూ 'ఎ' అనే అచ్చుతో మొదలయితే చివరి చరణం అదే జాతికి చెందిన 'ఇ' అనే అచ్చుతో ప్రారంభం అయింది. మొదటి రెండు చరణాల మొదటి పాదాంత కాల బోధక శబ్దం 'వొకనాడు' అయితే చివరి చరణానికి పాదాంత శబ్దం నేడు. మొదటి రెండు చరణాల ద్వితీయ పాదాంతాల భూత కాలిక క్రియలు 'చూచిన వాడట', పలికిన వాడట అనేవి క్రియాజన్య విశేషణం మీద తచ్ఛబ్దవకారం. ప్రతి పాటకు ప్రారంభం ఉన్నట్లే ముగింపు ఉంటుంది. వాటి ప్రారంభం పల్లవితో అవుతుంది. వేరు ప్రాసతో పాద సంఖ్యలో చరణాల కన్నా పల్లవి భిన్నంగా ఉంటుంది మిగతా చరణాల మొత్తంలో సమత్వం మళ్ళీ మొదటి రెండు చరణాల్లో అధిక సమత్వం. ముగింపులో భిన్నత్వం. ఇది కీర్తనల నిర్మాణంలో ద్వారా కానీ, శబ్దాల ద్వారా కానీ, వాక్యాల ద్వారా కానీ వీటన్నింటి ద్వారా కానీ సాధించబడుతుంది.

అన్నమయ్య వాక్య నిర్మాణ రూపాలు - వాక్యలయ:

రసవంతమైన వాక్య రచనలో అన్నమయ్య అందె వేసిన చేయి. ఒక సంకీర్తనలోని వాక్య నిర్మాణానికి మరో సంకీర్తనలోని వాక్య నిర్మాణానికి మరో సంకీర్తనలోని వాక్య నిర్మాణానికి ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఉద్దిష్టార్థ బోధనకు విశేషణాలను, క్రియలను పదాదిన పదమధ్యమంలోను, చిత్ర విచిత్ర గతుల్లో ప్రయోగించి వాక్య రచన చేశాడు.

1. చేదర్థకం: ధాతువుకు 'తే' అనే ప్రత్యయం చేరిస్తే చేదర్థక రూపం ఏర్పడుతుంది. ప్రధాన వాక్యంలో వ్యాపారం ఉపవాక్యాల వ్యాపారాల మీద ఆధారపడ్డట్టుగా ఇందులో భావించటం జరుగుతున్నది.

రాగం: మేచబౌళి

వట్టి విచారము లేల వాదు లడువఁగనేల
రట్టడి పతిని చెలులిట్టె రమ్మనరే ॥పల్లవి॥

ననిచినఁ గాని మరి నవ్వురాదు
పెనఁగు లాడినఁగాని ప్రియము లేదు
తనిసిన గాని సంతసము గాదు
చెనకినప్పుడు గాని సిగ్గు విడదు ॥వట్టి॥

బలిమి చిసినఁగాని పంతము రాదు
కలసినఁగాని లోలో కాఁక దేరదు
తలఁచినఁగాని యట్టె తమి రేఁగదు
వలచినఁగాని గర్వము నిండుకొనదు ॥వట్టి॥

సరస మాడినఁగాని చవి వుట్టదు
యెరవు లేకున్నఁగాని యింపు గాదు
ఇరవై శ్రీ వేంకటేశుఁ డెనసె నన్నుఁ దానె
సరవితో నున్నఁగాని ముచ్చట లెల్లా బాయవు ॥వట్టి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు;సంపుటం26, పుట155, సంకీర్తన 220)

ననిచితే కాని నవ్వు రాదు. పెనుగులాడితే కాని ప్రియము లేదు. తనిసితే కాని సంతసము కాదు. చెనకితే కాని సిగ్గు విడవదు. బలిమి చేస్తే కాని పంతము రాదు. కలసితే కాని లోలో కాక రేగదు. తలచితే కాని తమి రేగదు. వలచితే కాని గర్వం నిండుకోదు.

ఈ వాక్యాలన్నింటిలోను పదాదిన క్రియ కనిపిస్తుంది. కర్త ఈ వాక్యాల్లో లోపించినా కర్మ ద్యోతకం అవుతూనే ఉన్నది. లయ మనకు నాయిక ఆంగిక విన్యాసంలో కనిపిస్తుంది. నవ్వు, సిగ్గు, పంతము, కాక తమి ఇవన్నీ నాయిక కోరికను వ్యక్తం చేస్తున్నాయి. పైవన్నీ కలగాలంటే ఒక్కొక్క దానికి ఒక్కొక్క క్రియా వ్యాపారాన్ని బోధించింది. నాయిక మనసులో ఇవన్నీ జరిగితే కాని ముచ్చట్లు తీరవు అనే బాధ ఉన్నది. పదాదిన క్రియ ఉపయోగించడం ద్వారా దానికి చేదర్థకాన్ని చేర్చడం ద్వారా ఆ క్రియ జరగవలసిన తొందరని నాయిక సూచిస్తున్నది. ఆ సూచన ఆమె నవ్వులో సిగ్గులో వ్యక్తం అవుతున్నది. చిత్తవృత్తిలోని లయను అనుసరించే వాక్యనిర్మాణం జరుగుతుందనే భావన ననుసరించే ఈ వాక్యంలోని పదాదిన క్రియ, చేదర్థకాలు వాక్యలయని నిరూపించే పద్ధతిని అనుశీలించటం జరిగింది.

2. నిశ్చయార్థకం: నిశ్చయార్థక వాక్యాలన్నింటికీ వ్యతిరేక వాక్యాలుంటాయి. క్రియ సహిత వాక్యాల్లో వ్యతిరేక క్రియా ప్రయోగం వలన వ్యతిరేక

వాక్యాలు ఏర్పడుతాయి. ఆ క్రియా రూపాలు కాలభేదాలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అన్నంత క్రియారూపం మీద 'లేదు' అనే శబ్దాన్ని ప్రయోగిస్తే భూతకాలక వ్యతిరేక క్రియలు. అటమంత భావార్థక రూపాల మీద 'లేదు' అనే శబ్దాన్ని ప్రయోగిస్తే వర్తమాన వ్యతిరేక క్రియా రూపాలు ఏర్పడుతాయి. ఈ రెండు రూపాల్లోను కర్తృ బోధను సూచించే క్రియా విభక్తులుండవు. అంటే అన్ని పురుషలలోను ఒకే రూపం నిశ్చలంగా ఉంటుంది. 'లేదు' అనే శబ్దం క్రియా సహిత వాక్యాలతో ఏర్పడ్డ ప్రశ్నలకు వ్యతిరేకంలో ఇచ్చే సమాధానాలన్నింటికి వాక్యాదిని అవ్యయంగా ఉపయోగించవచ్చు. లేదు శబ్దంలో 'లే' 'ఉండు' ధాతువుకు భూతకాల వ్యతిరేకంలో వచ్చే ఆదేశరూపం. 'దు' అమహద్విభక్తి. అయినా ఈ పైన చెప్పిన ప్రయోగాల్లో లేదు అవ్యయంగానే ఉపయుక్తం అవుతుంది. వ్యతిరేక భవిష్యత్క్రియ అన్నంత క్రియా రూపం మీద క్రియా విభక్తులను చేర్చటం వలన ఏర్పడుతుంది.[2]

నిశ్చయార్థకంలో 'లేదు'ను అన్నమయ్య ఎంత మనోజ్ఞంగా ఉపయోగించుకున్నాడో పరిశీలిస్తే ఆశ్చర్యపోక తప్పదు.

రాగం: సామంతం

వలచిన దాని కెందు వాదు చెల్లదు
బలువులే చూపవయ్య బాసదప్ప దిఁకను ॥పల్లవి॥

వేడుకకు వెల లేదు వెన్నెల కెంగిలి లేదు
ఆడిక నీ చెఁతలకు నడ్డము లేదు
వీడె మందవయ్య నీ విద్య లెల్ల లోఁగొంటి
వోడ కిట్టె నవ్వవయ్య వొరయ నిన్నిఁ కను ॥వలచిన॥

మరునికి వేళ లేదు మాయలకు గురి లేదు
వరుస నీ కూటాలకు వావి లేదు
సరుగ మో విందవయ్య చనవెల్ల ఁజేకొంటి
తెర లోనికి రావయ్య తెగ నీకు నిఁకను ॥వలచిన॥

చిగురుకు చేఁగ లేదు సిగ్గులకు తప్పులేదు
తగు నీ యాసోదానకు తనివి లేదు

నిగిడి శ్రీ వేంకటేశ నీవు నేనూఁ గూడితిమి
మొగమెత్తి చూడవయ్య మొక్కే నేనికఁను ॥వలచిన॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు; సంపుటం 21, పుట 5, సంకీర్తన 7)

ఈ సంకీర్తనలో ప్రతి వాక్యంలోని 'లేదు' ఒక నిశ్చయత్వాన్ని సూచిస్తున్నది. వేడుకకు వెల లేదు. వెన్నెల కెంగిలి లేదు. ఆయన చేతలకు అడ్డము లేదు. మరునికి వేళ లేదు. మాయలకు గురి లేదు. ఆయన కూటాలకు వావి లేదు. చిగురుకు చేగ లేదు. సిగ్గులకు తప్పు లేదు. ఆయన శోధనకు తనివి లేదు.

ఈ వాక్యాలన్నింటిలో ఏకభావం నిశ్చయత్వం 'వలచిన దానికి వాదు చెల్లదు'. అంటూ వీటిలో దేనిలోను వాదించడానికి వీలు లేదు. అన్నింటినీ కలిపి ఒక ఏకత్వాన్ని కూడా అన్నమయ్య సాధించాడు. ప్రతి ఒకదానిలోనూ వైవిధ్యం కూడా ఉన్నది. ఈ వాక్యాల్లో ఆమె హృదయంలో స్వామి పట్ల నిశ్చయత్వం స్పష్టంగా కనిపిస్తుంది. 'లేదు' అనే వ్యతిరేక క్రియా ప్రయోగం ద్వారా ఈ నిశ్చయాన్ని స్ఫురింపచేశాడు అన్నమయ్య. ఇందులో కర్తృ బోధను సూచించే క్రియారూపాలు లేవు. అయినా కాంత మనస్సుకు ఈ వాక్యాలు అద్దం పడతాయి. లేదు అనే ఈ శబ్దంలో ఆమె చిత్తవృత్తి దానిని నిరూపించే వాక్యలయ రెండూ కనిపిస్తాయి.

3. తృప్త్యర్థకం: తృప్తిని అభివ్యక్తీకరించటంలో అన్నమయ్య అసామాన్య మైన పద్ధతిని ఎన్నుకున్నాడు. కోరిక తీరితేనే తృప్తిని ప్రకటిస్తుంది లోకం. కాని కోరిక తీరక పోయినా ఈ నాయిక తృప్తిని ప్రకటిస్తున్నది.

రాగం: కేదారగౌళ

కూరిమి గల్గితే జాలు కోపించినా మేలు వో
అరయ నో రమణుడ అంతాను మేలువో ॥పల్లవి॥

మనసున నీవు నన్ను మఱవకున్నా జాలు
యెనలేపో నీ వేడ నున్నా వియ్యకోసి !
ననువు వలపు నీవు నాపై జల్లితే చాలు
వెనక నీవేమన్నా వేడుక వే వో ॥కూరిమి॥

పాయము నీ మేనిమీద పచ్చిగా నుండిత జాలు
రాయడి విరహమైన రాజ్య పదవి
యే యెడ నీ చూపొక మాటిటు పై బారితే చాలు
నాయములు దప్పి నీవు నడిచినా మేలువో ॥కూరిమి॥

పానుపు పై కూడి నాకు పంతమిచ్చితే చాలు
కానని కన్నుల నీ బింకాలు మేలెపో
అనిన శ్రీ వేంకటేశ అంతలో నన్నేలితివి
కోనల నీ కొనగోరి గుఱుతులు మేలువో ॥కూరిమి॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు; సంపుటం26, పుట63, సంకీర్తన 23)

చేదర్థకం అప్యర్థకం రెండూ అన్నమయ్య ప్రతి వాక్యం లోనూ ఉపయోగించాడు.

"కూరిమి కలిగితే చాలు, కోపించినా మేలు. మనసున నీవు మరవకపోతే చాలు, నీవెక్కడ ఉన్నా సంతోషమే. నాపై వలపు జల్లితే చాలు, నా వెనుక నీవే మన్నా వేడుకే. నీ ప్రాయం పచ్చిగా ఉంటే చాలు, నీ విరహమైన నాకు అది రాజ్య పదవి. నీ చూపు నాపై పడితే చాలు. నీవు న్యాయం తప్పి నడిచినా నాకది మేలే" అంటున్నదా నాయిక.

మొదటి పదంలో చేదర్థకం 'తే' శబ్దం ద్వారాను, రెండవ పదంలో అప్యర్థకం 'అయినా' ద్వారాను ప్రయుక్తం అయినాయి.

మనసు మాట భిన్నార్థాలను వ్యక్తం చేసినా ఆనందమే అంటున్నదా నాయిక. "ఏ కొద్దిగా అయినా అతని ఆదరణ చాలు అదే నాకు తృప్తి రాజ్యపదవి" అంటున్నదామె. ఈ చిత్త నిరూపణకు ఈ చేదర్థక, అప్యర్థకాలు తోడ్పడతాయి. వాక్యాంతర్గత లయని నిరూపిస్తాయి.

ఇలా ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చును. ఉద్దిష్టార్థ బోధనకు వక్త చిత్తవృత్తిని అనుసరించి హృదయగతిని ఆశ్రయించి వాక్య నిర్మాణం యొక్క అమరిక

ఏర్పడుతుందని ప్రస్తుత లక్ష్య నిరూపణ. ఈ వాక్య నిర్మాణంలోని లయ ద్వారా వక్త సంస్కారం చిత్తవృత్తి నిరూపించే అవకాశం ఏర్పడుతుందని కూడా అనుశీలించటం జరిగింది.

పాదసూచికలు:

1. తెలుగు వాక్యం : శ్రీ చేకూరి రామారావు
2. తెలుగు వాక్యం : శ్రీ చేకూరి రామారావు

8

ఉపసంహారం

భగవత్స్వరూపాన్ని నిత్యమూ సంభావిస్తూ ఆయనను చెలికాడుగా, ప్రియుడుగా, శిశువుగా అనేక రూపాల్లో ఊహించుకుని అనంతమైన భక్తి మార్గాల్లో కొలుస్తూ మానవుడు తరిస్తున్నాడు. ఈ ఆరాధనా మార్గంలో మానవ జీవిత వైవిధ్యం. ప్రవృత్తుల వైలక్షణ్యం, సంస్కారాల భిన్నత్వం వ్యక్తం అవుతుంటాయి. ఈ గ్రంథంలో ఇంత వరకు అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో ఈ వైచిత్రి ఎంత విశిష్టంగా అభివ్యక్తం అవుతున్నదో వివరించే ప్రయత్నం చేయడం జరిగింది.

అన్నమయ్య సంకీర్తనలు పరిశోధిస్తుంటే పలుకుబళ్ళు, పదబంధాలు, జాతీయాలు, సామెతలు లోకోక్తులు చిందులు వేస్తూ కనిపిస్తాయి. భాషా పరమైన ఎన్నో అంశాలు, అత్యంత ఆసక్తిని రేకెత్తించే విషయాలు ఇంచులో చేర్చుదామని ఆశపడినా గ్రంధ విస్తరణభీతితో వక్త చిత్తవృత్తిని అద్దం పట్టే పదంలోని ప్రాధాన్యత, వాక్య నిర్మాణక్రమం. భాషాశాస్త్ర సహకారం స్వల్పంగా పరిశీలించి వదలివేశాను. అన్నమయ్య సంకీర్తన సుధా జలధిలో ఒక్కొ బిందువు అందించిన రసానందానికి బ్రహ్మానందానికి పులకరించి పోయాను. రస నిరూపక వృత్తులను ఈ సంకీర్తనల్లో విశ్లేషిస్తున్నప్పుడు అన్నమయ్య అలంకారాలు రమ్యంగా దర్శనమిస్తుంటే, కొంత చింతిస్తూనే వాటిని కూలంకషంగా వివరించడం సందర్భశుద్ధి కాదనే అభిప్రాయంతో వదలి వేయడం జరిగింది.

అన్నమయ్య లోకజ్ఞత, ధర్మమర్మజ్ఞత, తత్త్వనీతి పారంగత, మధురభక్తి తత్పరతలు సంకీర్తనల్లో కొల్లలుగా కనిపించి అనంత కోటి భక్తి భావ కుసుమాలై, వెలుగుల వెల్లువలై నన్ను ముంచెత్తాయి. ఇందులో ఒక్కొక్క అంశం ఒక పరిశోధనకు సరిపడినంతగా కనిపించడంతో ఒక నిట్టూర్పు విడిచాను.

నేను పరిశోధనకు స్వీకరించిన ప్రతి సంకీర్తనలోను అన్నమయ్య వర్ణించిన భగవంతుని లీలా వినోదాలను మానవుడి మహాప్రస్థానంలో అభివ్యక్తం అయ్యే అవస్థా భేదాలను, ఆతడి చిత్త వృత్తులను, ప్రవృత్తులను దర్శించే ప్రయత్నం చేశాను. ఈ పరిశోధనా ఫలం కృష్ణార్పణమస్తు - ఈ పరిశోధనా రూపక తపస్సే నన్ను ఆ శ్రీ చరణాలకు చేరుస్తున్నది.

ఇది గాక సౌభాగ్య మిదిగాక తపము మరి
యిది గాక వైభవంబిక నొకటి కలదా

అనుబంధం-1

అన్నమాచార్యుల సంకీర్తనలు - రాగి రేకుల వివరాలు

అధ్యాత్మ సంకీర్తనలు

రేకుల వరుస (వందల్లో)	ఉన్న రేకులు	విశేషాలు
1-100	83	51-60 దాక 71-77 దాక 17 రేకులు లేవు.
101-200	100	-
210-300	99	216వ సంఖ్య రేకులేదు.
301-400	91	392 నుంచి 400 దాకా 9 రేకులు లేవు.

శృంగార సంకీర్తనలు

1-100	94	94-100 6 రేకులు
101-200	100	- లేవు.
201-300	100	- -
301-400	100	- -
401-500	90	451 నుంచి 460 దాక 10 రేకులు లేవు.
5101-600	90	521 నుంచి 530 దాకా 10 రేకులు లేవు.
601-700	100	- -
701-800	99	706వ సంఖ్య రేకు లేదు.

రేకుల వరుస (వందల్లో)	ఉన్న రేకులు	విశేషాలు
801-900	99	889వ సంఖ్య రేకు లేదు.
901-1000	98	912, 915 సంఖ్య గల రెండు రేకులు లేవు
1001-1100	100	- -
1101-1200	89	1105, 1151 నుండి 1160 దాకా 11 రేకులు లేవు
1201-1300	90	1271-1280 వరకు 10 రేకులు లేవు.
1300-1400	100	- -
1401-1500	100	- -
1501-1600	80	1521 నుండి 1530 దాక 1581 నుండి 1590దాకలేవు
1601-1700	100	- -
1701-1800	100	- -
1801-1900	100	- -
1901-2000	90	1911 నుంచి 1920 దాక 10 రేకులు లేవు.
2001-2100	2	2001-2002 సంఖ్య రేకులు లేవు

గమనిక: 1989 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన అన్నమయ్య సంకీర్తనలను పరిశోధనకు స్వీకరించడం జరిగింది. కాని పాఠకుల సౌకర్యార్థం ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు ప్రచురించిన 29 సంపుటాల సంఖ్యలను వ్రాయడం జరిగింది.

అనుబంధం-2

ప్రస్తుత పరిశోధనకు అనుశీలించిన అన్నమయ్య శృంగార సంకీర్తనలు

సంఖ్య	లభ్యం అవుతన్న సంఖ్య	సంపుటం	ముద్ర
1-100	94	12	1956
101-200	100	13	1960
201-300	100	14,15	1961
301-400	100	17	1963
401-500	90	18	1964
501-600	90	19	1965
601-700	100	20	1971
701-800	99	22	1975
801-900	100	24	1977
901-1000	98	25	1977
1001-1100	100	26	1975
1101-1200	89	27	1979
1201-1300	90	28	1980
1301-1400	100	29	1980
1401-1500	100	30	1983
1501-1600	80	31	1984

గమనిక: అన్నమయ్య శృంగార సంకీర్తనలు దాదాపు 12 వేల పైచిలుకు దొరుకుతున్నాయి. వాటిలో ఇప్పటి వరకు 16 వందలు రేకులపైని సంకీర్తనలు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పరిష్కరించబడి ముద్రించబడినాయి. వాటిలోని సంకీర్తనలని ఈ సిద్ధాంత వ్యాసానికి ఉదాహరణలుగా స్వీకరించడం జరిగింది.

Bibiliography

1. అన్నమయ్య డా॥ ముట్నూరి సంగమేశం
2. అన్నమాచార్యుల అధ్యాత్మ శృంగార సంకీర్తనలు స్వర కల్పన, డా॥ మంచాళ జగన్నాధరావు సం. I, II, & III
3. అన్నమయ్య పద కవితల్లో రామకథ. జె. బాలసుబ్రహ్మణ్యం
4. అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు డా॥ పొన్నా లీలావతమ్మ
5. అన్నమాచార్యుల సాహితీ కౌముది: డి. ముట్కూరి సంగమేశం
6. అన్నమయ్య - త్యాగయ్య: డా॥ కె. సర్వోత్తమన్
7. ఆంధ్రుల సంగీత కళ : డా॥ మంచాళ జగన్నాధరావు
8. ఆంధ్ర సారస్వత పరిషత్తు రజతోత్సవ సంచిక
9. అన్నమయ్య హనుమత్యంకీర్తనలు: డా॥ కె. సర్వోత్తమన్
10. ఆంధ్ర మహాభారతము ఛందఃశ్శిల్పము: డా॥ పాటిబంద మాధవశర్మ
11. ఆంధ్ర వాగ్గేయ కార చరిత్రం: డా॥ బాలాంత్రపు రజనీకాంతారావు
12. తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉత్సవ విశేషాలు: డా॥ చిట్రాజు గోవిందరావు
13. తాళ్ళపాక కవులు: పెనుమాదు వెంకటశేషయ్య
14. తాళ్ళపాక కవుల పద కవితలు-భాషా ప్రయోగ విశేషాలు: డా॥ వేటూరి ఆనందమూర్తి
15. తాళ్ళపాక కవులు - వివిధ సాహితీ ప్రక్రియలు
16. తాళ్ళపాక కవుల సాహిత్య సేవ: డా॥ ఎ. విద్యావతి
17. తాళ్ళపాక వారి పలుకుబళ్ళు: రామలక్ష్మి ఆరుద్ర
18. త్యాగరాజ స్వామి భక్తి కవితా వైభవం: ఆకెళ్ళ అచ్యుతరామం
19. తెలుగులో తొలి సమాజ కవులు: డా॥ వేటూరి ఆనందమూర్తి
20. తెలుగులో పద కవిత: డా॥ ఎస్. గంగప్ప
21. తెలుగు వాక్యం : డా॥ చేకూరి రామారావు
22. తొలి సంకీర్తన కవులు: డా॥ వేటూరి ఆనందమూర్తి
23. నాట్యశాస్త్రం: డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు
24. పద కవితా పితామహుని సంకీర్తనల శృంగారం: డా॥ జి. రమేష్‌కుమార్
25. మను చరిత్ర : సాహిత్య అకాడమి
26. బసవ పురాణం: సాహిత్య అకాడమి

27. రస మంజరి వ్యాఖ్య వేదం వెంకటరాయశాస్త్రి
28. రామదాసు కీర్తనల్లో స్వరలయల విన్యాసం, సాహిత్య రసపోషణ, ఎ. నాగరంజని, ఎమ్.ఫిల్.కై సిద్ధాంత వ్యాసం అముద్రితం.
29. వాత్సాయనుడి కామసూత్రాలు పరిష్కర్త పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
30. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం : సాహిత్య అకాడమి
31. శ్రీమదాంధ్ర మహాభారతం : ఉస్మానియా విశ్వ విద్యాలయం
32. శ్రీ మహాభాగవతం : సాహిత్య అకాడమి
33. శృంగార శాకుంతలం : సాహిత్య అకాడమి
34. సమగ్ర ఆంధ్ర సాహిత్యం : ఆరుద్ర
35. సంగీత రత్నాకరం : శార్ఙ్గదేవుడు
36. సింహావలోకనం : డా॥ వేటూరి ప్రభాకరశాస్త్రి
37. క్షేత్రయ్య పదాలు : సంపాదకులు విస్సా అప్పారావు